## అంగులూరి అంజనీదేవి



# ఈ దారి మనసైనది

# ఈ దారి మనసైనది...

జీవితం అదృష్టంతో నిండిన అమృతపు గిన్నె.

అత్యల్ప విషయాలతో కూడిన అద్భుతమైన మూట.

అప్పుడప్పుడు ఖాళీ అయి.... వెంటనే నవజీవనంతో నిండిపోయే నాజూకైన పాత్ర. ఇంకా చెప్పాలంటే అదొకస్థితి. ఒక పని .... ఒక నిద్ర ... కొంచెం ప్రేమ. అంతే ... అదే జీవితం... ఎక్కడ జీవితం వుంటుందో అక్కడ ప్రేమ వుంటుంది.

జీవిత మంతా ప్రేమతో గడపాలని.... ప్రేమించబడ్తూ బ్రతకాలని... ఈ భూ మండలంలో ఎవరికి దొరకనంత ప్రేమ తనకే దక్కాలని మన్విత ఆకాంక్ష.

రెడ్ కారులో వచ్చే దుంప్లూ కాని, మారుతిలో వచ్చే బన్నీ, సన్నీ, విక్కీ, రెండు జడల టింకూ - ఒక్కరేమిటి... తనతో ఎల్.కే.జి. నుండి ఎవరెవరు కలిసి చదువుతున్నారో... వాళ్లంతా వాళ్ల తల్లుల ప్రేమను అమృతంలా తాగుతున్నారు మిగిలింది ఒలకబోస్తున్నారు.

ఎప్పుడైనా ఒక పక్షి తన నోటితో మేతను తెచ్చి... పిల్ల పక్షుల నోట్లో పెట్టే సీనరీస్‌ని చూస్తూ గడపటం ఇంట్రస్ట్ మన్వితకి. తన ఫ్రెండ్స్‌కాని, ఆ పక్షి పిల్లలు కాని ఆస్వాదించే ప్రేమకన్నా ఇంకా ఎక్కువ ప్రేమ కావాలి మన్వితకి, ముఖ్యంగా అమ్మ ప్రేమ.... నాన్న ప్రేమ... తమ్ముని ప్రేమ... నానమ్మ ప్రేమ. ఈ ప్రేమను ఫెన్సింగ్‌లా తనచుట్టూ రౌండప్ చేసుకొని అందులో తనో స్టాచ్యూలా వుండి పోవాలి. ఆ తర్వాతే అన్ని... కానీ జరిగిందేమిటి?

* * * * *

విజయవాడ ఎన్.టి.ఆర్. యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్‌లో ఎం.బి.బి.యస్ అడ్మిషన్స్ జరుగుతున్నాయి.

అమ్మా, నాన్న ఇద్దరు కలిసి... కాలేజి అడ్మిషన్ కోసం తనని తీసికెళ్తారని ఆశపడ్డ మన్వితకి, తనతోపాటుగా అడ్మిషన్ కోసం వచ్చిన అనురాగ్, వాళ్లమ్మ ప్రియభాందవి 'తోడుగా' అయ్యారు.

దురదృష్టానికి తను తోడా? నిరాశగా వుంది మన్వితకి....

అడ్మిషన్స్ జరుగుతున్నాయి.

నెంబర్ల ప్రకారం వరుసగా....

అనుకోకుండా... అనురాగ్ కళ్లు ఒక అందమైన కళ్లతో మాట్లాడుతున్నాయి..... ఏదో గొంతు దాటని భావం కళ్లతో చెబుతున్నట్టు.... కళ్లు తన భాష అయితే చూపు తన మాటలవుతున్నాయి... ఆ భాష ఎవరకి అర్థం కాదు. అలాంటి భావమే వాళ్ల మనసులోనూ పుడితే తప్పు!! అలా పుట్టినప్పుడు 'ప్రేమ' అనేది ఇద్దరి మధ్యన ఒకే చూపులో... ఒకే టైంలో... పుట్టే కెమికల్ రియాక్షన్ అవుతుంది. 'నీ ఊపిరే నా ప్రాణం.' అనే స్థాయికి



చేరుతుంది. ఉలి అలికిడికి రాయి మెత్తబడ్డట్లు మనసు మెత్తబడ్తుంది. కనుబొమల ముడివిడిపోయి బిగుసుకున్న పెదవులు ఎర్ర గులాబీల్లా వికసిస్తాయి.

అనురాగ్ రెప్పవేయకుండా చూస్తుంటే ఆమె రక్తం పై నుండి జారే బంతిలా పరిగెత్తుతోంది. అతను ఆగి ఆగి నవ్వుతుంటే ఆమె గుండె వింతగా అదురుతోంది.

అడ్మిషన్స్ పూర్తయ్యాయి.

వాళ్లకి-వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో సీటు వచ్చింది.

స్టూడెంట్స్ అందరికి పలానా రోజు కాలేజి స్టార్ట్ అవుతుందని... ఆరోజు డెమాన్ స్ట్రేషన్ క్లాసుకి ఉదయం 9 గంటలకి అటెండ్ అవ్వాలని అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ వాళ్లు చెప్పారు.

అప్పుడు గాని ఆ అందమైన కళ్లు అనురాగ్ కళ్లని విడిపోలేదు.

తర్వాత అనురాగ్, అతని తల్లి ప్రియభాందవి, మన్విత హోటల్ అశోకాలో లంచ్ చేసి వరంగల్ బయలు దేరారు.

ట్రైన్‌లో కూర్చుని వున్న మన్విత మనసులో ఏదో అలజడి, ఓదార్చలేని భాధ... తనతో పాటు అడ్మిషన్ కొచ్చిన స్టూడెంట్స్ అందరు వాళ్ల పేరెంట్స్‌తో వచ్చారు. తను మాత్రమే ఒంటరిగా వచ్చింది. అమ్మా, నాన్నా వుండి కూడా ఈ ప్రేమరాహిత్యాన్ని తట్టుకోలేక పోతోంది.

అనురాగ్ తన ద్యాసలో తను వున్నాడు. అతని కళ్లు కొత్తగా నేర్చుకున్న భాషకు ఇంకా పదును పెడ్తున్నాడు. కాలేజీ ఎప్పుడు స్టార్ట్ అవుతుందా అని ఎదురు చూస్తు... ఆ అందమైన కనుదోయిగల ఆ అమ్మాయి కోరికల కోటలోకి ప్రవేశించి.... తనని తను గెలుచుకోవాలని... ఎదురుగా వున్న మన్వితను అతను పట్టించుకోవటం లేదు. ఇంతసేపు అతను చూసింది మన్వితను కాదు.

* * * * *

ఆ రోజు రానే వచ్చింది. కె.ఎమ్.సి.లో....

అనాటమి లెక్చరర్ హాల్లో జరుగుతున్న డెమాన్‌స్ట్రేషన్ క్లాసుకి మన్విత, అనురాగ్, ప్రియభాంధవి అటెండ్ అయ్యారు.

ఆల్ డిపార్ట్‌మెంట్ హెచ్.ఒ.డి.లు వచ్చి వాళ్ల వాళ్ల సబ్జెక్ట్‌కి సంబంధించిన ఇంట్రడక్షన్ క్లాస్ తీసుకున్నారు.

స్టూడెంట్స్ – రోల్ నెంబర్ వైజ్ గా ఒక్కొక్కరు వాళ్ల వాళ్ల ఇంట్రడక్షన్ ఇచ్చుకున్నారు.

అప్పుడు అనురాగ్‌కి ఆ అందమైన కళ్ల అమ్మాయి పేరు, వివరాలు అడక్కుండానే తెలిశాయి. పేరు దీక్షిత.

నెక్స్ట్‌డే... టైం టేబుల్ ప్రకారం క్లాసులు మొదలయ్యాయి.

ఉదయం థియరీ క్లాసెస్... మధ్యాహ్నం ల్యాబ్స్.

ర్యాగింగ్ ఫియర్ ఎక్కువైంది.

కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రోజుకు పదిసార్లు పెట్రోలియం జీపు వస్తున్నా.... సీనియర్స్ జూనియర్స్ లాగే వచ్చి పరిచయం చేసుకొని ర్యాగింగ్ చేస్తుంటే... మన్విత, దీక్షిత, మిగిలిన అమ్మాయిలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొన్నట్లు భయపడ్డారు.

మన్విత, దీక్షిత, మిగతా అమ్మాయిల్లో కొంత మంది కాలేజి క్యాంపస్‌లో వుండే లేడిస్ హాస్టల్లో వుంటున్నారు.

ర్యాగింగ్ ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న మన్విత ర్యాగింగ్‌కి భయపడలేదు. ర్యాగింగ్ జరుగుతున్నప్పుడు అది తనలో వుండే టాలెంట్‌ని బయటకి తీస్తున్నట్లు భావించింది. తనలో తనకి తెలియని 'తనని' బయటకు తీస్తున్నట్లు అనుకున్నది. అందరితో అదే విషయం చెప్పింది. అదివిని కొంత మందికి ర్యాగింగ్ పట్ల పాజిటివ్ థింకింగ్ కలిగింది.

దీక్షిత మాత్రం ర్యాగింగ్‌కి భయపడింది క్లాసులోకి వెళ్తున్నప్పుడు కానీ క్లాసులోంచి వస్తున్నప్పుడు కానీ తను వాళ్లకి ఎక్కడ దొరుకుతానో అని తప్పించుకు తిరగాలని చూస్తోంది. ఆ టైం లో ఫ్రెండ్స్ ధైర్యం చెప్పారు



అయినా ఆమెలో అభయం ఎక్కువై బెలూన్ పగిలినా బాంబు అనుకునే స్థాయికి చేరుకుంది.

తల్లిదండ్రులు గుర్తు రావటంతో... హోంసిక్ ఎక్కువై ఇంటికెళ్లింది.

దీక్షిత ఇంటికెళ్లటంతో అనురాగ్ వెలితిగా ఫీలయ్యాడు.

కొన్ని రోజులు గడవగానే.... ఫ్రెషర్స్ పార్టీ ప్రిపరేషన్ మొదలైంది. దీక్షిత ఊరి నుండి వచ్చింది.

సీనియర్స్ వచ్చి... క్లాసులో ఎనౌన్స్ చేసి.... ఎవరెవరికి ఎలాంటి కల్చరల్ యాక్టివిటీస్ వున్నాయో పేర్లు ఇమ్మని అడిగారు.

ఐదు రోజులు గడిచాక ఫ్రెషర్స్‌డేని ఆడిటోరియంలో అరేంజ్ చేశారు.

ప్రిన్సిపాల్ గారు, హాస్పిటల్ సూపరిన్‌డెంట్, కాలేజి స్టాఫ్, సీనియర్స్ అబ్బాయిలు, అమ్మాయిలు ఆ పార్టీకి అటెండ్ అయ్యారు.

సీనియర్స్ చెప్పినట్లే జూనియర్స్ ఎప్రాన్‌లు వేసుకొని వచ్చారు. నెంబర్ వైజ్‌గా అరేంజ్ చేసిన చైర్స్‌లో కూర్చున్నారు.

వాళ్ల నేమ్‌లో వున్న మొదటి అక్షరం ప్రకారం నెంబర్లు వెయ్యడంతో అనురాగ్, దీక్షితల చెయిర్స్ పక్క పక్కన వచ్చాయి. మన్విత మధ్యలో కూర్చుంది.

సరస్వతిదేవి సాంగ్‌తో ప్రోగ్రాం మొదలైంది.

ముందుగా... హిప్పోక్రటిక్ ఓట్ (Hippocratic Oath) చేయించారు.

ఆ తర్వాత అంతా సరదా... సరదా...

ఫస్టియర్ అబ్బాయిలైతే అమ్మాయిల్లాగా చీరలు కట్టి జోవియల్‌గా, అద్భుతంగా డాన్స్ చెయ్యటం. అక్కడ విశేష ఆకర్షణ అయ్యింది.

సీనియర్స్... జూనియర్స్ అబ్బాయిలను స్టేజి మీదకు పంపించి, అమ్మాయిలు పాడుతున్నప్పుడు మైక్ గుంజుకొని రమ్మని చెప్పటం... ఆ పాటల్ని వినలేని వాళ్లలా బెల్టుని మెడకి ఉరిలా వేసుకొని యాక్షన్ చెయ్యటం... ఆ అమ్మాయిలు డాన్స్ చేస్తున్నప్పుడు ఇంకొంతమంది అబ్బాయిల్ని పంపించి పిల్లి మొగ్గలు వెయ్యమనటం... చేశారు.

అదే విధంగా జూనియర్స్‌లో నచ్చిన అమ్మాయిల్ని... కొంతమంది సీనియర్స్ స్టేజి మీద ప్రపోజ్ చెయ్యటం... వాళ్లు 'నో' అన్నట్లుగా ఫేస్ పెట్టడంతో క్రింద వున్న సీనియర్స్ 'ఒప్పుకో... ఒప్పుకో ' అంటూ ఒకేసారి గోల చేసి అరవటం చేశారు.

ఆ తర్వాత 'ఐడింటి' కార్డు జూనియర్స్‌కి సీనియర్స్ ఇవ్వటంతో ఫ్రెషర్స్‌డే ఒక సంబరంగా ముగిసిపోయింది.

నెల రోజుల తర్వాత....

జూనియర్స్ అంతా కలిసి హోటల్ అశోక కాన్ఫెరెన్స్ హాల్లో గెట్ టు గెదర్ పెట్టుకున్నారు.

అక్కడ వాళ్లంతా ఒకరికి ఒకరు ఇంట్రడక్షన్ ఇచ్చుకున్నారు. పాటలు, డాన్స్, జోక్స్ ఇలా ఎవరెవరి టాలెంట్స్‌ని వాళ్లు బయటపెట్టి.... అక్కడే డిన్నర్ ముగించుకొని...

వాళ్ల బ్యాచ్‌కి ఒక పేరు పెట్టుకున్నారు.

వాళ్లకి... ఫస్టియర్లో అనాటమి, ఫిజియాలజి, బయోకెమిస్ట్రీ వున్నాయి. శ్రద్ధగా, సీరియస్‌గా చదువుతున్నారు.

దీక్షితకి దగ్గరకావాలని చూస్తున్న అనురాగ్‌కి.... డిసెక్షన్ హాల్లో ఆమెతో మాట్లాడే అవకాశం కలిగింది.

ఇద్దరు కలిసి డిసెక్షన్ చేసేవాళ్లు...

అంతే కాకుండా ఎగ్జామ్స్‌కి ముందు నోట్స్ ఇవ్వటం, మెటీరియల్ ఇవ్వటం, ఎగ్జామ్స్ టైంలో స్ట్రెస్ లేకుండా సైకలాజికల్‌గా సపోర్ట్ ఇవ్వటం చేస్తున్నాడు. అంతకన్నా ఇంకేం లేదు.

కారణం... దీక్షిత మౌనమే!!

అయినా... అప్పుడప్పుడు అనురాగ్ తనని తను కంట్రోల్ చేసుకోలేని మానసిక స్థితిలోకి వెళ్తున్నాడు. తన ఆలోచనలని ఆమెతో పంచుకోవాలని, సమయం కోసం ఎదురు చూస్తున్నాడు.

ఒకప్పుడు ర్యాగింగ్ చేసిన సీనియర్స్ ఎగ్జామ్స్ టైంలో ఫస్టియర్స్‌కి బాగా హెల్ప్ చేశారు. అన్నం తినిపించటం, స్నానానికి నీళ్లు పెట్టడం లాంటివి కూడా చేశారు. ఫస్టియర్లో అందరు పాసయ్యారు.

* * * * *



సెకండియర్లో...

సుప్రభాత వేళ...

మహా సముద్రంలో... కెరటాలు పైకి లేచి తీరాన్ని తాకుతుంటే మంచులో తడిసిన ప్రకృతి - ప్రపంచాన్ని వణికిస్తోంది.

ఏపుగా పెరిగి కాస్త పక్కకి వంగిన గులాబి చెట్టు కొమ్మ కిటికీ గ్రిల్‌ని తాకి తన ఉనికిని చాటు తుంటే, దాని పూల పరిమళం పరిసరాలను తాదాత్మ్యంలో ముంచుతోంది. ఆనిశ్శబ్దంలో... ఆకులపై నిలిచిన మంచుబిందువులు కదిలితే క్రింద పడేలా వున్నాయి.

నీటి చుక్క ముత్యం చిప్పలో పడితే ముత్యమవుతుంది

సముద్రంలో పడితే ఉప్పునీరు అవుతుంది.

కనురెప్పల క్రింద జారితే కన్నీరవుతుంది.

మరి గుండె క్రింద చేరితే...

దీక్షిత తన మొబైల్‌కి మెసేజ్ వచ్చిన శబ్దానికి రోజు లాగే తన హృదయంలో తరంగిణి కదిలినట్లై....

కళ్లు విప్పింది...

వెంటనే తన రెండు అర చేతుల్ని కళ్ల కెదురుగా పెట్టుకొని 'కరాగ్రే వసతే లక్ష్మి, కర మధ్యే సరస్వతి, కర మూలే స్థితే గౌరి' అని మనసులో అనుకుంటూ అరచేతుల్ని కళ్లకి అద్దుకొని...

కుడి చేతిని పిల్లో కిందకి పోనిచ్చి, మొబైల్ తీసి మెసేజ్ చూసుకొంది.

"కుహూ, కుహూ రాగాల కోకిలమ్మను కోరాను. నా చెలికి నీ కమ్మని స్వరంతో సుప్రభాతాన్ని అందించమని... తిరిగొచ్చి షి ఈజ్ స్టిల్ స్లీపింగ్ అంది." అని పంపిన అనురాగ్ మెసేజ్ చూడగానే కప్పుకున్న బ్లాంకెట్‌ను పూర్తిగా తొలిగించి బెడ్‌దిగింది.

మనసులో ఫీలింగ్ వుంటే తప్పకుండా అది అవతలవారికి చేరుతుందంటారు. తనింకా నిద్రలేవకపోవటం అతనికి తెలిసింది కూడా అలాంటి ఫీలింగ్ ద్వారానే... ప్రతి అద్భుతం ఫీలింగ్ ద్వారానే పుడుతుంది కాబోలు.

మనసుకి స్పందన, శరీరం మీద శ్రద్ధ, ఒక మనిషి గురించి ఆలోచనలు, ప్రతిక్షణం అద్భుతంగా అన్పించటం... ఇదంతా తనలో అతని ద్వారానే జరుగుతోంది.... తను పుట్టాక ఎన్నో రకాలుగా తన మనసు స్పందించింది. కానీ... ఆ స్పందనలో ఇలాంటి అనుభూతి లేదు.

అతను పంపే ప్రతి మెసేజ్ ఆర్ధ్రత నిండిన భావంలా, వెన్నెల అల్లిన మువ్వల సవ్వడిలా, మౌన రాగరంజనిలా చెవులకి సోకి హృదయమంతా అమృతం నింపిన అనుభవం కలుగుతుంది.

'నువ్వు పోగొట్టు కునే ఏ క్షణం నీకు తిరిగి రాదు దీక్షా! ప్రకృతికే ప్రకృతిలా, రససిద్ధి పొందిన కళాకృతిలా వున్న నీరూపం నా మదిని మంచువర్షంలా తడిపేస్తుంటే, నీ మౌనమేమో నీకూ, నాకూ మధ్య నిశ్శబ్ద అగాదాలను సృష్టిస్తోంది. నువ్వలా వుంటే నా చుట్టూ వున్న వెన్నెల నన్ను వెక్కిరిస్తోంది. కిటికీ అవతల సంపంగి అవహేళన చేస్తోంది. నీ కిది ధర్మమా?" అంటూ ఒక రోజు అతను పంపిన మెసేజ్ చదివి ఏంచేయాలో తోచలేదు .

ఒకటి... రెండు... ఐదు.... పది... ఇలా ఎన్ని నిముషాలు గడిచినా డ్రస్సింగ్ టేబుల్ ముందు అలాగే నిలబడివున్నది. మనుసులో... భావాల వుధృతానికి తట్టుకోలేని యుద్ధం జరుగుతుంటే ఆ యుద్దానికి మనసును సంసిద్ధం చేసుకోలేక పోతోంది.

ఎవరైన మన ప్రమేయం లేకుండా బలవంతంగా మన మది తలుపుల్ని తోసుకొని తలపుల్లోకి జొరబడి అతి సున్నిత మైన సూక్ష్మమైన కదలిక పుట్టించి... ఉరకలు వేసే ఉత్సాహం అంబరాన్ని తాకే ఆనందం అందిస్తుంటే...! మాటల కందని మధుర భావాల స్రవంతిలో తడిసిపోతూ భరించలేని, సహించలేని ఉద్వేగాన్ని తట్టుకుంటూ తను ఎన్నో యుగాలుగా ఎదురు చూస్తున్న వ్యక్తి ఇతనే అని తెలిసినా...! అతని కళ్లలోకి చూస్తున్నప్పుడు కలిగే అనిర్వచనీయమైన భావాన్ని చంపుకుంటూ... ఇలా మౌనంగా వుండాలంటే ఎంత కష్టమో దీక్షితకి అనుభవంలోకి వచ్చింది.



అతను కన్పించిన ప్రతిసారి 'నువ్వు నాకు ఎన్నో ఏళ్ల పరిచయం' అన్నట్లు తన మనసులోతుల్లోకి చూస్తుంటే ముభావంగా, అభావంగా ఇంకా ఎన్నాళ్లిలా తప్పుకు తిరగాలి? అన్నదే ఆమె ఆలోచన.

ప్రొఫెసర్లు గమనిస్తున్నా, స్టూడెంట్స్ తిరుగుతున్నా, అతను తనవైపే చూస్తున్న భావన కలిగినప్పుడు కూసింత ఇబ్బందిగా, కాసింత విభ్రమగా, మరి కాస్త పులకింతగా మనసు తొలకరి మొలకలా మారుతోంది. ఎంతవద్దనుకున్నా... దీక్షిత మనసులో అలలగాలి సవ్వడిలా అలా అలా అనంతంగా అనురాగ్ రూపం మెదులుతుంటే... చక, చక రెడీ అయి ..ఎప్రాన్ వేసుకొని, స్టెతస్కోప్ పట్టుకొని హాస్టల్ నుండి బయట కొచ్చి, కాలేజిలో అడుగు పెట్టింది.

ఆమె అలా అడుగు పెట్టగానే – కాకతీయ మెడికల్ కాలేజి ప్రాంగణం తొలిపొద్దులా మెరిసినట్లైంది అనురాగ్‌కి.

అమెను అలా చూస్తుంటే... ఎన్నో ఏళ్లగా పారేసుకున్నా జ్ఞాపకంలా... నడచివస్తున్న నగిషీలు చెక్కిన శిల్పంలా ఎప్పటికప్పుడు కొత్తగా అన్పిస్తూ 'హాయ్' అన్నాడు .

దీక్షిత కూడా 'హాయ్' చెప్పి ల్యాబ్ వైపు నడిచింది.

అలానడుస్తున్న దీక్షితకి తన సొంత ఊరైన పాకాలకి దగ్గర్లో వున్న అశోక్ నగర్ గుర్తొచ్చింది.

అది గుర్తురాగానే ఆమె చిన్ననాటి జ్ఞాపకాలు తీగల్లా సాగి ఆమె కళ్ల ముందు మెదిలాయి...

ఆమెను – ఆమె తండ్రి సోమన్న పాకాల నుండి అశోక్ నగర్ తీసికెళ్లి ప్రభుత్వ బాలికల వసతి గృహంలో చేర్పించి దానికి రెండు కిలో మీటర్ల దూరంలో వుండే స్కూల్లో వదిలాడు. అందులో సీటు రావటానికి అతను చాలా కష్టపడ్డాడు. అప్పుడు ఆమె ఫిఫ్త్ క్లాస్ .

నడవటం ఈజీయే కాని ఒంటరిగా నడవటం కష్టంగా వుంటుందన్న ఉద్దేశ్యంతో తనతోటి పిల్లలు రెడి అయ్యేంత వరకు ఆగివాళ్లతో కలిసి నడుచుకుంటూ వెళ్లమన్నాడు తండ్రి. దారిలో ఎక్కడా ఆగొద్దన్నాడు. దారి

చూసి నడవమన్నాడు. చీకటి పడకముందే హాస్టల్‌కి చేరుకోమన్నాడు. తలవంచుకొని నడిస్తే వాహనాలు గుద్దేస్తాయన్నాడు. తోటి పిల్లలతో కలిసి మెలిసి స్నేహంగా వుండమన్నాడు.

'సరే' అని దీక్షిత తల వూపినప్పుడు తెల్ల రిబ్బన్లతో పైకి కట్టిన రెండు జడలు మడిచిన నల్ల తాచులా కదిలాయి.

సోమన్న- కూతుర్ని వదిలిపోవాలంటే..... పోలేక కళ్లనీళ్ల పెట్టుకున్నాడు. తండ్రి కన్నీళ్లు చూడగానే ఇంటి దగ్గర వున్న తల్లి గుర్తొచ్చింది దీక్షితకి. ప్రొద్దున బస్ ఎక్కించటానికి తనను భుజాల మీద ఎక్కించుకొని వస్తున్న తండ్రి పక్కన నడుస్తూ తన కాళ్లను పట్టుకొని నిమురుతూనే బస్ వరకు వచ్చి సాగనంపి వెళ్ళింది. తన తల్లి,దండ్రులకి తనంటే ఎంత ప్రాణం!

"పసి బిడ్డను తీసికెళ్ళి బయట ఊర్లో వుంచి చదివించక పోతేనేం రామలక్ష్మీ? ఏదో ఇంటి పట్టున వుండి చదివిన ఆ నాలుగు తరగతులు చాలవా? ఇంకా చదివి ఉద్యోగాలు చేసి ఊర్లేమైనా ఏలాలా? చక్కగా ఇంటిపని, వంటపని పొలం పని నేర్చుకొని ఆ తర్వాత ఓ అయ్య చేతిలో పెడితే సరిపోయేదిగా" అంటూ చుట్టు పక్కల వాళ్లు అనే మాటల్ని తల్లి ఏ మాత్రం లక్ష్య పెట్టలేదు.

"ఇప్పుడేదో చిన్న చదువేకదా అని చదివిస్తున్నావులే సోమన్నా! రేప్పొద్దున వాళ్లకి చదువుమీద మమకారం పెరిగి పెద్ద చదువులు చదువుతామంటే నీ గతేమవుతుంది? నీ తలకు నువ్వే కొరివి పెట్టుకున్నట్లు కాదా? నా మాటవిని నీ బిడ్డను నాలుగోతరగతిలోనే చదువు మాన్పించి ఇంట్లో పెట్టుకో. నువ్వలా చూస్తుండగానే పొలం పనులకి అక్కరకొస్తుంది. ఎన్ని రోజులు అని ఒక్కడివి కష్టపడ్తావు .కొడుకును ఎలాగూ చదువుకోసమే వదిలి పెట్టావు. అంతవరకు చాలనుకో". అన్నారు తనతో కలిసి పొలం పనులు చేసే మిత్రులు.

సోమన్న వినలేదు. అక్షర జ్ఞానం గొప్పది. చదువుకుంటే తన కూతురు ధైర్యంగా బ్రతకగలుగుతుంది. సమస్యలు ఎదురైప్పుడు మంచి నిర్ణయాలు తీసుకునే విధంగా అలోచించగలగుతుంది.



చదువు అనేది ఎల్లప్పుడు ఆరని దీపంలా తోడుంటుంది. దొంగలు పట్టుకెళ్లలేని సంపద చదువు ఒక్కటే. చదువులేని వాళ్ల జీవితం తెడ్డులేని పడవ. అందుకు ఉదాహరణ తన జీవితమేనని నమ్మిన సోమన్న దృష్టంతా దీక్షిత చదువుమీదనే నిలిచింది. కానీ చేతిలో తగినంత డబ్బులేదు. దీక్షితను ప్రభుత్వ బాలికల వసతి గృహంలో చేర్పించటానికి కారణం కూడా అదే.

స్కూలు నుండి తనుండే హాస్టల్‌కి రోజూ రెండు కిలో మీటర్లు నడిచి రావటం, పోవడం... స్కూలు నుండి వచ్చాక బోరింగ్ పంపు క్రింద కూర్చుని బట్టలు ఉతుక్కోవడం దీక్షితకి కష్టంగా వుంది.

ప్రభుత్వం సరైన సరుకుల్ని ప్రొవైడ్ చేసినా, ఆ సరుకులు మధ్యవర్తులు చేతులు మారడంతో ఒక్క రోజు కూడా ఆ తిండి తినలేకపోతోంది. వర్కర్స్ నిర్లక్ష్యం వల్ల అన్నంలో, కూరగాయల ముక్కల్లో పురుగులొస్తూ, ఏ కూర చూసినా నీళ్ళలా అన్పిస్తూ, పెట్టుకున్న అన్నం మొత్తం వదిలేస్తోంది.

పేద విద్యార్థులైన వాళ్ళకి ప్రభుత్వం నెల నెలా ఇవ్వాల్సిన సోపుల్ని, బట్టల్ని యివ్వకుండా ప్రతిరోజు ఇవ్వాల్సిన పాలు, బిస్కెట్స్ యివ్వకుండా పిల్లల్ని దోచుకుంటున్నారు.

'క్యూ' పద్ధతి పాటించకుండా బాత్‌రూంల దగ్గర, నీళ్ల దగ్గర, తిండి తినే దగ్గర, ప్రతి రోజు గొడవ. కొంత మంది లీడర్లను నియమించినా వాళ్ళు పట్టించుకునేవాళ్ళు కాదు. ఇంకా పిల్లలు చెప్పుకోలేని ఇబ్బందులు కూడా కొన్ని వున్నాయి.

హాస్టల్ నీట్‌గా వుండేది కాదు. కలెక్టర్ లాంటి పెద్ద పెద్ద వాళ్ళు వచ్చినప్పుడు నీట్‌గా వుంచేవాళ్ళు. తినటానికి కూడా అన్ని పెట్టేవాళ్లు. వాళ్లు వెళ్లేంత వరకు ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకున్న వాళ్లలా అటెన్షన్‌లో వుండే ఆ వార్డెన్‌లను, వర్కర్స్‌ను చూస్తుంటే వింతమృల్లా అన్పిస్తుంటారు.

స్కూల్ నుండి నడుచుకుంటూ వస్తుంటే దీక్షిత కాలి చెప్పుతెగింది. దారిలో కొంత దూరం మట్టి రోడ్డు అయినందువల్ల ఎండకి మట్టి వేడిక్కి కాళ్లకి అంటుకుంటూ భగభగమండుతుంటే వచ్చే ఏడుపును ఆపుకుంటోంది.

మండుతున్నా ఓర్చుకొని నడిచింది. కొంత దూరం వెళ్లాక ఓర్చుకోలేక ఆ లేత బుగ్గలపై జారిన కన్నీటిపాయను నెమ్మదిగా తుడుచుకొంది దీక్షిత.

వాళ్ల ఊరిలో ఒకమ్మాయి తల్లి పురుడు పోసుకుంటూ హాస్పిటల్ వసతి లేక అదే ఊరిలో చనిపోవడం భయం కల్గించి ఆ రాత్రంతా నిద్రపోకుండా మేల్కొంది దీక్షిత. మరుసటిరోజు యింకో అమ్మాయి తండ్రికి, పొలంలో పురుగుకుట్టి సిటీలో వుండే హాస్పిటల్‌కి తీసికెళ్లే లోపలే చనిపోయాడని తెలిసి అందరు ఏడుస్తుంటే తనుకూడా ఏడుస్తూ కూర్చుంది.

ఇలా ఎప్పుడూ ఏదో ఒక సంఘటన దీక్షిత మనసుని కలచివేస్తుంటే తల్లిదండ్రులకి చెప్పుకోవాలనిపించినా చెప్పుకోలేకపోతోంది. ప్రొద్దున లేచినప్పటినుండి పొలంలో పనులు చేసుకుంటూ రెక్కాడితేనే డొక్కాడదన్నట్టుగా వుండే వాళ్లకి తన బాధల్ని చెప్పియింకా బాధ పెట్ట కూడదని గట్టిగా నిర్ణయించుకొంది.

ఈ మధ్యనైతే ఎప్పుడు చూసినా దీక్షిత కడుపులో పేగులు అర్థాకలితో సన్నగా అరవటం ఎక్కువైంది. తినగలిగిన వయసులో సరైన తిండి లేకపోతే అలాగే వుంటుందని ఒకమ్మాయి తల్లి తన బిడ్డను కావలించుకొని కళ్లు తుడుచుకోవడం చూసిన తర్వాత 'ఇది ఆకలి బాధ' అని అర్థమైంది దీక్షితకి. ఆ హాస్టల్లో పిల్లలు వార్డెన్ ముందుకెళ్లి వాదించినా, ఎదురించినా, ఏడ్చినా అది అరణ్య రోదనే.

ఈ బాధలతో పాటు, హోంసిక్ కూడా తోడై దీక్షిత చదువు సరిగ్గా సాగలేదు. అలాగే... ఎయిత్ క్లాస్ వరకు చదివింది.

ఎయిత్ క్లాస్ అయిన తర్వాత 'సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్'లో ఒక వేకెన్సీ వున్నట్లు స్కూల్ టీచర్ దానికి సంబందించిన పేపరు ఇచ్చింది తన కళ్లను మరింత పెద్దవి చేసి మళ్లీ, మళ్లీ చూసింది దీక్షిత. ఇన్ని రోజులు తనుపడ్తున్న కష్టాల నుండి విముక్తి కోసం ఎదురు చూస్తున్న ఆమెకి ఇది మంచి అవకాశమనిపించింది. ఆ పేపర్ని అలాగే గుండెలకి హత్తుకొంది. ఆ సీటు తనకి వచ్చినట్లే ఊహించుకొంది. ఆమెలో ఇప్పుడు ఆశ తప్ప నిరాశలేదు. ఎలాగైనా కష్టపడి సీటు సంపాయించాలన్న తపన తప్ప యింకో ఆలోచనలేదు.



కష్టపడి చదివి ఎంట్రన్స్ ఎగ్జామ్ రోజు తన అన్నయ్య మహధీర్‌ను తోడుగా తీసికెళ్లి ఎగ్జామ్ రాసి వచ్చింది.

నయింత్ క్లాస్ ఎంట్రన్స్‌లో... దీక్షితకి మహబూబబాద్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్లో సీటొచ్చినట్లు ఇంటికి లెటరొచ్చింది.

ఆ లెటర్ని తీసుకొని మహధీర్‌ని వెంట బెట్టుకొని జాయినింగ్ కోసం స్కూల్ కెళ్ళింది దీక్షిత.

అక్కడ... బయట బ్రోకర్లు లంచంతీసుకొని, ఆ సీటుని వేరేవాళ్లకి యిద్దామన్నట్లుగా ప్రయత్నాలు జరగడంతో...

నోట మాటరాని దానిలా దిగ్భ్రాంతి చెందింది దీక్షిత.

చెల్లెలి వైపు నిస్సహాయంగా చూస్తూ – అటు, ఇటు తిరగడం తప్ప ఏమీ చెయ్యలేక పోతున్నాడు మహధీర్.

మనస్సుకి మాటలకి వైరుధ్యం ఏర్పడి చచ్చిపోయిన వ్యక్తిత్వంతో చెలరేగిపోతూ, వాళ్లు చెప్పిందే వేదంలా వుండడంతో నిజం ప్రయాణం చేసేలోపలే అబద్ధం ప్రపంచమంతా తిరిగినట్లుంది అక్కడి వాతావరణం.

'ఇలా జరిగిందేం అన్నయ్యా? ఇప్పుడెలా'? అంది దీక్షిత. మధ్యవర్తులు లోలోపల చేసే ఆ కంత్రీ రాజకీయాలను ఆ పసి గుండెలు తట్టుకోలేకపోతున్నాయి.

మాటలు రాని వాడిలా చెల్లినే చూస్తున్న మహధీర్ కి మతి పోతోంది. తనే స్వయంగా చెల్లిని తీసుకొచ్చి ఎగ్జామ్ రాయించాడు. ఎగ్జామ్ రాసేంతవరకు బయటేవున్నాడు. 'ఆ రోజు ఆమె ఎగ్జామ్ రాయలేదని., మీరు తెచ్చిన లెటరు చెల్లదని... ఎక్కడి నుండి వచ్చారో అక్కడికే వెళ్లమని' వాళ్లు అంటుంటే తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో చెప్పినా ఎవరు ఆదుకుంటారో తెలియడంలేదు.

జారిపడ్డవాళ్ళు – వాళ్లను వాళ్లే లేపుకోవాలి. లేచి తిరిగి నడిస్తేనే గమ్యం దొరుకుతుంది. భవిష్యత్తులోని విపత్తును వూహించలేకపోయినా ఈ సీటు మాత్రం తప్పకుండా తనదే అన్న నమ్మకం ఆమెలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఎవరికైనా ఆత్మ విశ్వాసం తిరుగులేని ఆయుధం. అది వుంటే

అధిరోహించనిఎత్తులు లేవు. ఆమెలోని ఆత్మ విశ్వాసమే ఆమెకు అద్భుతమైన శక్తిని యిచ్చింది. అశోక్ నగర్ వెళ్లి వాళ్ల టీచర్ సహాయంతో...

ఎంట్రన్స్ ఎగ్జామ్‌రోజు ఇన్విజిలేటర్‌గా వచ్చిన లెక్చరర్స్‌ని ఆ స్కూల్లో అటెండర్స్‌ని గుర్తు పట్టి. ఇంకా ఆరోజు పరిచయమైన తమ సీనియర్స్ అయిన టెన్త్ క్లాస్ పిల్లల్ని ప్రిన్సిపల్ దగ్గరికి తీసికెళ్లి ఆ రోజు తను ఎగ్జామ్ రాసినట్లు ప్రూవ్ చేసుకొంది. ఆధారాలు బలంగా వుండడంతో ప్రిన్సిపాల్ దీక్షితను తమ స్కూల్ అండ్ రెసిడెన్సియల్‌లో జాయిన్ చేసుకున్నాడు.

ట్రంక్ బాక్స్, నోట్ బుక్స్, స్కూల్ డ్రస్, పి.ఇ.టి డ్రస్  షూస్, సాక్స్ యిచ్చి క్లాసుకెళ్లి కూర్చోమన్నారు.

ఇప్పుడు స్కూల్ & రెసిడెన్స్ ఒకే చోట వున్నందువల్ల ఇన్నిరోజులు వున్న ఇబ్బందులేం అక్కడలేవు దీక్షితకి. తన తండ్రి మాటల్ని ఆశయంగా, ఆదర్శంగా తీసుకొని ఒక ఆశయం వైపున నడవాలని దృఢసంకల్పం తీసుకొంది. ముందుగా తను ఏ లక్ష్యాన్ని నిర్దేశించుకోక పోయినా తన చుట్టూ వున్న పరిసరాలు ఆ లక్ష్యాన్ని నిర్దేశించి పెట్టాయి. దానికి ఉపాధ్యాయులు సహాయం పూర్తిగా తోడైంది.

టెన్త్ క్లాసులో ఆ స్కూల్లో దీక్షిత ఫస్ట్ వచ్చింది. మార్కులు 570 వచ్చాయి. ఆమె తల్లి దండ్రులు సంతోషించారు. అందరి తల్లిదండ్రులు కోరుకున్నట్టే దీక్షిత తల్లిదండ్రులు కూడా ఆమె డాక్టర్ కావాలని, ఇంజనీర్ కావాలని లోలోన ఆశపడ్తూ ఒకరోజు ఆమెతో చెప్పారు. ఆమెను కూడా అవే ఆలోచనలు చూట్టు ముట్టాయి.

సొంత ఊరైనా పాకాల అంటే దీక్షితకి ప్రాణం. వేసవి సెలవుల్లో పాకాల వెళ్లి ఇంటి దగ్గరున్న దీక్షితకి రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి.

చెరువుకి దగ్గర్లో వుండే ఆ ఊరు అక్కడక్కడ పచ్చని చెట్లతో చిన్న చిన్న డాబా ఇళ్ళతో పూరి గుడిసెలతో నిండుగా పూలు పెట్టుకొని వయ్యారంగా నిలబడివున్న సౌందర్యవతిలా వుంటుంది.

ఆ ఊరిలో వాళ్ల ఇల్లు పర్ణశాలను తలపించేలా వుంటుంది. ఆ ఇంటి చుట్టూ కందికంపతో దడికట్టి ఆ దడిపక్కన సొరపాదులు, బీరపాదులు



తీగలుసాగి అల్లుకొని వుండటం విశేష ఆకర్షణగా వుంటుంది. ఎత్తుగా పెరిగిన బంతిపూల మొక్కలు రకరకాలు పూలు పూసి దారిన పోయేవాళ్లను పిలుస్తునట్లే వుంటాయి. ఇంటిపైకి ఎక్కిన గుమ్మడి చెట్లు విరగ కాసి 'నేను మీకు కావాలా?' అన్నట్లు చూస్తుంటాయి. బావి పక్కన కొబ్బరి చెట్లు, అరటి చెట్లు లోపలికివస్తున్న వాళ్లని ఆహ్వానిస్తున్నట్లే వుంటాయి.

ఇంటి ముందున్న మట్టి అరుగుల్ని అలికి, కళ్లాపి చల్లి,పచ్చని ముంగిట్లో బియ్యం పిండితో ముగ్గులు పెట్టడంతో ఆ పరిసరాలు కమ్మటి వాసన వస్తు ఇంకాసేపు అక్కడే నిలబడాలని పిస్తుంది.

ఆ ఇల్లు అలాంటి శోభను సంతరించకోవటానికి ప్రొద్దున లేచి తల్లి ఎంతో ఉత్సాహంగా చేసే పనులే కారణం.

ప్రొద్దునే లేచి అలా ఒకదాని వెంట ఒకటిగా తల్లి చేసుకుపోతున్న ఆ పనుల్ని చూసి, చూసి క్రమ శిక్షణ నేర్చుకొంది దీక్షిత. బద్ధకమనేది ఆయింటి వాతావరణంలో ఎక్కడా కన్పించదు. తండ్రి కూడా రాత్రి నిద్రపోయేముందు - ఆ రోజు చేసిన పనులన్నీ ఒకసారి తలచుకొని మరుసటిరోజు ఆ పొరపాట్లు లేకుండా చూసుకోమని చెప్తుంటాడు. వాళ్లిద్దరే ఆమె మొదటి గురువులు.

తల్లి వెంట తనుకూడా పొలం వెళ్లాలని ఎప్పటిలా తల్లి దండ్రితో పాటు తనకి అన్నయ్యకి కూడా టిఫిన్‌లో అన్నం పెట్టి అది పట్టుకొని బయలుదేరబోయింది.

'మాతో అన్నయ్య వస్తాడు. నువ్వు యింట్లోనే వుండు దీక్షా! ఇక ముందు నీ చేతులు కొడవళ్లని, కలుపు మొక్కలను పట్టుకోకూడదు. పుస్తకలనే పట్టుకోవాలి. మాలాగ ఎండకి, గాలికి తిరక్కూడదు. నీడపట్టునే వుండాలి' అంటూ దీక్షిత తలనిమిరింది తల్లి.

తమకోసం రెక్కలు ముక్కల్ని చేసుకుంటున్న తల్లిదండ్రులకి పొలం పనుల్లో కాస్త ఆసరాగా వుండాలన్నదే ఆమె ఆలోచన.

"ఆర్మీలో వుండే మీ మామయ్య ఇక్కడ కొంత పొలాన్ని కొని మనల్ని సాగుచేసుకోమని చెప్పినప్పటి నుండి మన పరిస్థితి బాగానే వుంది దీక్షా!

నువ్వు మా గురించేం ఆలోచించకు". అన్నాడు తండ్రి ఆమెను అర్థం చేసుకున్నట్లుగా.

'సరే' అని తలవూపి ఆ రోజు నుండి వేసవి సెలవులు అయిపోయేంత వరకు ఇంట్లోనే కూర్చుని ఆ ఊరిలో వున్న చిన్నపిల్లలకి ట్యూషన్ చెప్పి చదువంటే వాళ్లకి యింకా ఇంట్రస్ట్ కలిగేలా చేసింది.

ఇంటర్లో ఎం.పి.సి తీసుకోవాలా? బై.పి.సి తీసుకోవాలా అని సందిగ్ధంలో పడింది. అనుభవజ్ఞుల సూచనలమేరకు, తనకి కూడా ఇంట్రస్ట్ వున్నందువల్ల ఎం.పి.సి తీసుకోవాలని నిర్ణయించుకొని...

హన్మకొండ సోషల్ వెల్ఫేర్ స్కూల్ అండ్ కాలేజిలో ఎం.పి.సి గ్రూప్ తీసుకొని ఇంటర్లో జాయిన్ అయింది.

ఇప్పుడామె మనసు కొత్తగా రెక్కలొచ్చిన విహంగమే అయింది. కానీ అంతవరకు అక్కడున్న అనుభవజ్ఞులైన లెక్చరర్స్ ఆ సంవత్సరమే ట్రాన్స్ఫర్ అయ్యారని, అదీ–మహబూబాబాద్లో వుండే తన పాత కాలేజికేనని తెలిసి నివ్వెరపోయింది. వెంటనే తన సీనియర్ అమ్మాయి మహతి సూచనల మేరకు తిరిగి తను మహబూబాబాద్కి వెళ్ళింది. కానీ ఆ కాలేజిలో ఎం.పి.సి.లో వేకెన్సీ లేక పోవడంతో అక్కడున్న ప్రిన్సిపాల్, లెక్చరర్స్ ఆమెను అదే కాలేజిలో వుంచుకోవాలన్న ఉద్దేశ్యంతో ఎం.పి.సి గ్రూప్ నుండి బై.పి.సి గ్రూప్ లోకి మార్చారు.

గ్రూప్ మారటంతో దీక్షితకి అగమ్యగోచరంగా అయ్యింది. తను వెనకబడ్డ క్లాసులు గెటన్ అయింది. అలాగే ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ కూడా లెక్చరర్స్ సహాయంతో క్లాసులో ముందు నిలిచింది.

ఆమె తండ్రి ఎప్పుడు చూసినా ఆయన పడ్డ కష్టాల గురించే చెప్పటం వల్ల, ఆస్తికూడా లేనందువల్ల, ఇంటర్ మీడియట్ అయిన తర్వాత డబ్బులు బాగా ఖర్చవుతాయని లోలోన భయపడ్తున్నా కూడా ఆమె డాక్టర్ని కావాలన్న యాంబిషన్తో అందరూ నిద్రపోయినా రాత్రులు ఒంటరిగా కూర్చుని చదువుతుంటే ఆమె పట్టుదల చూసి ఫిజిక్స్ లెక్చరర్ మల్లారెడ్డి ఆమెకు కావలసిన ఎంసెట్ మెటీరియల్ ఇచ్చి ప్రోత్సహించాడు.



ఇంటర్ ఫస్టియర్ లో 440కి గాను 420 మార్కులు తెచ్చుకొని ఆ కాలేజి ఫస్ట్ వచ్చింది. మిగతా మార్కులు తెలుగు మీడియం అవటం వల్ల లాంగ్వేజ్లో పోయాయి.

సమ్మర్ హాలిడేస్ అయ్యాక....

ఇంటర్ సెకండియర్ స్టార్ట్ అయింది.

దీక్షిత చదువులో ముందు వుండడంతో... ప్రిన్సిపాల్ ఆమెకు మెస్ లీడర్గా బాధ్యతల్ని అప్పగించారు.

మెస్లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్, ఈవినింగ్ స్నాక్స్ రాత్రికి డిన్నర్. ఇది షెడ్యూల్.

దీక్షిత పిల్లల్ని క్యూలో నిలబెట్టి క్రమ శిక్షణగా వుండేలా చూస్తూ, తినేటప్పుడు భోజనం క్రింద పడకుండా నీట్నెస్ పాటించేలా చూస్తూ మెస్లో క్వాలిటీ వుండేలా జాగ్రత్త పడేది.

మెస్లో ఏది తగ్గినా పిల్లలు అడగటం... తను వెళ్లి వార్డన్తో గొడవ పడడం... లెక్చరర్స్కి కంప్లైంట్స్ యివ్వటం.... ఇలాంటి వ్యవహారాలు ఎక్కువై చదువులో వెనక బడి పోయింది. దీక్షిత.

మల్లారెడ్డి సార్ ఒక రోజు దీక్షితను పిలిచి...

"ఎందుకిలా జరుగుతోంది? చదువులో ఎందుకు వెనకబడి పోతున్నావ్? నీ ఆశయమేంటి? నీ లక్ష్యం ఏంటి? నువ్వు ఎటువెపు వెళు్తన్నావ్? అని ఆమెను మోటివేట్ చెయ్యడంతో ఆమె రియలైజ్ అయి ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్లి మెస్ బాధ్యతలు చెయ్యనని చెప్పింది.

అప్పుడా ప్రిన్సిపాల్ ఆమె మాటల్ని ఆమోదించి వెంటనే ఆమెను ఆ బాధ్యతల నుండి తొలగించారు.

* * * * *

రోజులు గడుస్తున్నాయి.

ఎగ్జామ్స్ నోటిఫికేషన్ రావడంతో చదువుతో కుస్తీ పడింది దీక్షిత. చదువు తప్ప ఆమెకు యింకేం గుర్తు రావడం లేదు. చదువే ఆశ, చదువే శ్వాస అయింది.

ఎగ్జామ్స్ రాసే సెంటర్ వేరే కాలేజీలో పడింది ఆమె దగ్గర డబ్బు లేక పోవడం గమనించి ఆటో చార్జీలకి మల్లారెడ్డి సార్ ఇచ్చి పంపారు.

ఎగ్జామ్స్ అన్నీ బాగా రాసింది దీక్షిత.

ఎగ్జామ్స్ రాయడం పూర్తి కాగానే అంతటితో ఆ కాలేజీకి తనకి బందం తెగి పోయినట్లు అన్పించి, బాధపడి అక్కడున్న లెక్చరర్స్‌ని పలకరించి, ప్రిన్సిపాల్ బ్లెసింగ్స్ తీసుకొని, చివర్లో ఫిజిక్స్ లెక్చరర్ మల్లా రెడ్డిని కలవటానికి ఆయన ఇంటికి వెళ్లింది.

ఆయన ఆ రోజు పేపర్ అడ్వటయిజ్‌మెంట్ చూపిస్తూ

'ఇందులో షార్ట్ టర్మ్ ఎంసెట్ కోచింగ్ ప్రభుత్వం కల్పిస్తున్నట్లు సమాచారం వుంది. ఒకసారి చూడు' అంటూ దీక్షితతో అన్నాడు.

దీక్షిత ఆ పేపర్ని చేతిలోకి తీసుకొని చూసింది. ఆ అడ్వటయిజ్ మెంట్ ఆమెలో డాక్టర్ని కావాలని వున్న కోరికకు జీవం పోసింది.

మల్లారెడ్డి లెక్చరర్ సహాయంతో ఎంసెట్ కోచింగ్‌కి అప్లై చేసింది. దానికి సంబందించిన మిగతా బాధ్యతల్ని ఆ లెక్చరర్‌కే అప్పజెప్పి పాకాల వెళ్లింది.

ఒక వేళ తనకి ఎం.సెట్‌లో మంచి ర్యాంక్ రాకపోతే అన్న ఆలోచనతో... వేదనతో...

"నాకు కార్పొరేట్ కాలేజీలో కోచింగ్ యిప్పించండి నాన్నా" అంది తండ్రితో దీక్షిత.

సోమన్న అప్పుడే పొలం నుండి వచ్చి, స్నానం చేసి ఆరు బయట చీకట్లో పడుకొని... పొలంపైరునంతా పురుగు తినేస్తుంది. మందులకి డబ్బు లెలా? ఈ ఒక్కసారికి సర్పంచి గారిని అడిగితే... అని ఆలోచిస్తున్నాడు.

దీక్షిత మళ్లీ అడగడంతో బాధగా చూశాడు. కూతురి కోరిక వినగానే ప్రపంచమంతా ఎండిపోయి ఒక్క నీటి చుక్క కూడా దొరకనట్లు నాలుక పిడచకట్టుకుపోయింది సోమన్నకు.

ఎంత ఆశగా పొలంలో పైరు పెట్టుకున్నాడో అంతే ఆశతో కూతుర్ని చదివించుకోవాలని కూడా వుంది. కానీ పురుగుపట్టక ముందు భూదేవికి



పసుపురాసినట్లున్న తన చేను ఈ రోజు కళ్లనీళ్లు తెప్పిస్తుంటే కూతురి కోరిక ఆకాశంలో పుష్పమై కన్పిస్తోంది.

కన్న బిడ్డల్ని చదివించుకోవాలని, వాళ్లు అభివృద్ధిలోకి వస్తే 'నేను నీరు పోసి పెంచిన చెట్టు ఫలాలేకదా ఇవి ' అని మురిసి పోతూ గర్వపడాలని ఎవరికైనా వుంటుంది. కానీ తనపరిస్థితి అలా లేదు.

ఇప్పుడు తనెంత నిస్సహాయ స్థితిలో వున్నాడో ఎవరికీ అర్థం కాదు. తన బాధ, తనలో కలిగే ఆందోళన.... ఎవరూ అర్థం చేసుకోరు. దనవంతుడికి చీమకుట్టినా సిటీ అంతా తెలుస్తుంది. మరి తన లాంటి వాడిని పాముకాటేసినా ఎవరూ పట్టించుకోరు అని మనసులో అనుకుంటూ...

'అసలే డబ్బుకి ఇబ్బందిగా వుంది దీక్షా' నిన్ను ఆ కాలేజీలో చేర్పించడం కుదరదు. నీ చదువుకి ఏ ర్యాంకు వస్తే దానికి తగిన కోర్స్‌లోనే జాయిన్ అవ్వు . అంత కన్నా ఎక్కువగా ఆలోచించకు.' అన్నాడు సోమన్న అలా అంటున్నప్పుడు 'అయ్యో! నా బిడ్డ అడిగిన చదువు చదివించుకోలేక పోతున్నానే' అన్న బాధతో అతని గొంతు బొంగురుపోయింది.

ఇన్నాళ్లూ ఏ ఖర్చూ లేకుండానే చదివింది. ఒక్కరోజు కూడా' అది కావాలి, ఇది కావాలి' అని అడగలేదు. ముఖ్యంగా డబ్బు తను ఇస్తేనే తప్ప ఒక్కసారి కూడా చేయిచాపి అడగలేదు. ఇలాంటి కూతురు పుట్టాలంటే ఎన్ని జన్మలు పుణ్యం చేసుకోవాలి.

'బాధ పడ్తున్నావా నాన్నా' అంటున్న దీక్షితకి ఆ చీకట్లో తండ్రి ముఖంలో భావాలు కన్పించటంలేదు.

ఎక్కడో మెరుపు మెరిసినట్టు ఆ మెరుపులో తళుక్కుమన్న కూతురి ముఖాన్ని చూసిన సోమన్నకి ఏడుపు వచ్చేలా వుంది.

తనెంతో తెలివైనదని ప్రతి విషయాన్ని తనతో చెప్పుకుంటూ, ఎంతో ఉత్సాహంగా పనులు తప్ప మరోధ్యాస లేని తన తండ్రి ఇప్పుడింత నిరాశగా, నిర్లిప్తంగా, నిశ్శబ్దంగా వుండటం దీక్షితకి బాధగా వుంది. జీవితం ఆటు, పోట్ల మయం అందులో సుఖ, దు:ఖాలు, లాభ, నష్టాలు, గెలుపు, ఓటములు సహజం పుట్టడం, పెరగడం, కోరినది లభించకపోవడం కూడా సహజమే.

బాధలేకుండా జీవితమే లేదు. జీవితమంటేనే ఏడ్పు కన్నీరు, చిరునవ్వులు. జీవితమెప్పుడూ కన్నుల పండుగ కాదు. చక్కని విందూ కాదు. అదొకస్థితి.

"బాధపడకు నాన్నా!" అంటూ అక్కడే నిలబడితే తండ్రి యింకా బాధపడ్తాడని లోపల కెళ్లింది దీక్షిత. సమస్యలు మనిషిని వయసుకి మించి ఎదిగేలా చేస్తాయి. పదిరోజులు గడిచాక...

ఫిజిక్స్ లెక్చరర్ మల్లారెడ్డి దీక్షితకి షార్ట్‌టర్మ్ కోచింగ్‌కి సీటువచ్చినట్లు ఉత్తరం ద్వారా తెలిపాడు.

ఆమెకు ఏదైనా ఇబ్బంది అన్పించినప్పుడు తనకి కాల్ చెయ్యమని తన మొబైల్ నెంబర్ యిచ్చాడు. ఆమె సీటు పొందిన కాలేజిలోని తన మిత్రుని నెంబరు కూడా యిచ్చాడు.

అన్ని దానాల కన్న విద్యాదానం గొప్పది. అన్నంపెడితే అప్పటికప్పుడే. విద్య చెబితే బ్రతికి వున్నంత కాలమూ తృప్తే. ఆ తృప్తిని కోరుకునే మల్లారెడ్డికి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకొంది దీక్షిత.

అందరితో వెళ్లాలనుకొంది కానీ డబ్బులు లేక మహధీర్ అన్నయ్యను మాత్రమే తీసుకెళ్లింది.

ఆ కోచింగ్ కాలేజి భద్రాచలం దగ్గర కృష్ణాసాగర్ అనే వూరిలో వుంది. అది ట్రైబల్ ఏరియా ఆ ఏరియా ఎక్కడుందో ఆమెకు తెలియదు. ఆమె లక్ష్యం మాత్రమే ఆమె కళ్లకి కనిపిస్తోంది.

ఆమె తల్లి దండ్రుల ఆశీస్సులతో, మల్లారెడ్డిసార్ సహాయంతో మణుగూరు పాసింజర్ ట్రైనెక్కింది. కొత్తగూడెంలో ట్రైన్ దిగి బస్సెక్కి పాల్వంచలో దిగి, ఆటో ఎక్కి కిన్నెరసాని వైపు వెళ్ళింది. అప్పటికే చీకటిపడింది.

అక్కడికి చేరిన తర్వాత కోచింగ్ అక్కడ కాదని తెలియగానే కంగారుపడింది. ఏం చేయాలో తోచలేదు. ఆ రాత్రికి బయట ఎక్కడైనా వుందామనుకున్నారు. కానీ లాడ్జీలకి డబ్బులు పెట్టలేక వెంటనే మల్లారెడ్డి సార్‌కి కాల్ చేసింది. ఆయన వెంటనే అక్కడున్న హాస్టల్ వాళ్లకి ఫోన్ చేసి ఆమె గురించి చెప్పి ఆమెకు ఆ రాత్రి అకామిడేషన్ ఇమ్మని రికమెండేషన్ చేయ్యడంతో ఆ రాత్రి ఆమె అక్కడే వుండి పోయింది.



ఎప్పుడో మధ్యాహ్నం తిన్న తిండితో, చుట్టూ ఏమీ దొరక్క పోవడంతో రాత్రంతా ఆకలి పేగుల్ని కొరికేస్తుంటే అలాగే పడుకొంది. కానీ ఆమెను తన ధృఢసంకల్పమే ఆ రాత్రి అక్కడ వుండేలా చేసింది.

ఉదయాన్నే క్రిష్ణాసాగర్ అడ్రస్ తెలుసుకొని అక్కడికి బయలుదేరింది. మల్లారెడ్డిసార్ మిత్రుని సహాయంతో కోచింగ్ కాలేజిలో అడ్మిషన్ తీసుకొంది.

అది ట్రైబల్ ఏరియా అయినందువల్ల, ఎండాకాలం కావటం వల్ల ఎండలు విలయతాండవం చేస్తున్నాయి. అంతేకాక వాటర్ సరిగ్గా లేక పోవడం రాత్రి టైమ్‌లో హాస్టల్ లో కరెంట్ సప్లై లేక పోవడం... ఇబ్బందిగా మారి డే టైంలో మాత్రమే చదువుకోవడానికి వీలుగా వుండేది.

వాళ్ల కాలేజి నుండి ఇంకో అమ్మాయి అక్కడికి రావటంతో దీక్షితకి చిన్న పాటి కాన్ఫిడెన్స్ వచ్చింది.

కాని ఆ హాస్టల్ పరిస్థితులు ఆమెకు అనుకూలించలేదు. వెంటనే వాళ్ల అన్నయ్య కు ఫోన్ చేసింది.

ఆదే రోజు బయలు దేరి ఆ రాత్రికి హాస్టల్‌కు చేరుకున్నాడు మహధీర్

"కష్టపడకుండా దేన్నీ సాదించలేవు దీక్షా!ఈ నెలరోజులు నీది కాదన్నట్లుగా కష్టపడు. రేపొచ్చే ఫలితాన్ని చూసుకొని ఇప్పుడు నువ్వు పడ్డ కష్టం గుర్తొచ్చి గర్వపడాలి." అంటూ మహధీర్ ఆమెని మోటివేట్ చేశాడు.

ఆ నెల రోజులు తన క్లాస్‌మేట్, తనూ కలిసి గ్రూప్ డిస్కర్షన్ చేస్తూ వీది. లైట్ల క్రింద కూర్చొని చదువుకుంటూ ఓవర్ టైమ్ స్పెండ్ చేశారు.

చదువు విషయం ఎలా వున్నా బోజనానికి, వాటర్‌కి ఇబ్బందిగా అన్పించి వేదన ఎక్కువై ఎగ్జామ్‌కి ఆరు రోజుల ముందు హన్మకొండలో జులైవాడలో వుండే వాళ్ల అన్నయ్య రూంకి వచ్చింది దీక్షిత.

మే 4న కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంసెట్ ఎగ్జామ్ రాసింది.

ఆ ఎగ్జామ్ రాస్తున్నంతసేపు ఆదే కాలేజిలో తనకి సీటు రావాలన్న కోరిక, వస్తుందన్న కాన్ఫిడెన్స్ ఆమె అనువణువులో వ్యాపించాయి తొందర, ఆతృతా లేకుండా స్థిరమైన తృప్తితో, ఆత్మ విశ్వాసంతో రాసింది.

సాధించాలన్న తపన వుంటే సాధించలేనిది ఏదీ లేదు. అలాగే ధైర్యాన్ని కోల్పోతే ఇక కోల్పోటానికి కూడా ఏమీ మిగలదు.

దీక్షిత ధైర్య శాలి.

నెల రోజుల తర్వాత...

ఎంసెట్ ఫలితాలు వెలువడినాయి.

దీక్షితకి ఎనిమిది వేలల్లో ర్యాంక్ వచ్చింది.

ఆ ర్యాంక్ ఆమెను ఏదో ఒక కోర్స్‌లో సీటు వస్తుందని సంతోషపరచినా తన ఆశయాన్ని మాత్రం నిరుత్సాహపరిచింది.

'అన్నయ్యా! నేను తప్పకుండా డాక్టర్ని కావాలి. ఈ సారి కష్టపడి ర్యాంక్ తెచ్చుకుంటాను. నాకు లాంగ్ టర్మ్ కోచింగ్ ఇప్పించండి అంది మహధీర్‌తో. చెల్లి అభిలాష పై నీళ్లు చల్లలేక...

"చెల్లిని భూమి అమ్మి అయినా కార్పొరేట్ కాలేజిలో కోచింగ్ యిప్పిద్దాం నాన్నా" అని మహధీర్ అనగానే సోమన్న 'సరే' అన్నాడు.

శ్రీ చైతన్య కాలేజిలో స్క్రీనింగ్ టెస్ట్ వుందని పేపర్లో సమాచారం చదివి. రాయటానికి అన్నయ్యను తీసుకొని విజయవాడ వెళ్ళింది. దీక్షిత.

స్క్రీనింగ్ టెస్ట్ రాశాక మంచి మార్కులు రావడంతో పదివేల రూపాయలు తగ్గించి ఇంటెన్సిల్ కోచింగ్‌కి అడ్మిషన్ యిచ్చారు.

విజయవాడ శ్రీ చైతన్య కాలేజిలో మయూర్ భవన్ క్యాంపస్‌లో దీక్షితని అలాట్ చేశారు.

అక్కడ ఉదయాన్నే ఐదు గంటలకి నిద్రలేచి కాలకృత్యాలు అయ్యాక ఆరుగంటలకే తరగతులు మొదలవుతాయి. ఏనిమిది గంటలకి టిఫిన్ పన్నెండున్నర వరకు క్లాసులు పన్నెండున్నర తర్వాత ఫ్రీ టైం రిలాక్స్ అయ్యాక రెండు ముప్పైకి స్టడీ అవర్స్ మొదలు. ఈవినింగ్ ఐదుకి స్నాక్స్ మళ్లీ రెండుగంటలు స్టడీ అవర్స్. ఏనిమిదికి డిన్నర్. తర్వాత ఏనిమిది నుండి పదకొండువరకు నైట్ స్టడీ అవర్స్.

దీక్షిత ఓవర్ టైం చేసి నైట్ పన్నెండు వరకు చదివేది. క్లాసులో తన కష్టానికి ఫలితంగా టాప్ టెన్‌లో వుండేది. వాళ్ల క్యాంపస్ ఇన్ చార్జి ఆమెను



పిలిచి 'ఇలాగే కష్టపడి చదివితే గమ్యాన్ని చేరకోగలవు' అని మోటివేట్ చేశాడు.

శ్రీ చైతన్యలో వచ్చే ప్రతి లెక్చరర్ ఏదో ఒక విధంగా ఆమెను మోటివేట్ చేస్తు ఆమె ఆలోచనలను పక్క దారి పట్టకుండా ఆమెను తన ఆశయం వైపు సాగేటట్లు చేశారు.

ఆ ఒక్క సంవత్సరం వ్యవధిలో ప్రతి మూడు నెలలకి ఒక సారి క్యాంపస్ డైరెక్టర్ డా॥ బి.యస్.రావ్ అండ్ ఝాన్సీ లక్ష్మిబాయి క్యాంపస్ విద్యార్థులను చక్కగా మోటివేట్ చేసేవాళ్లు.

కొన్ని రోజుల తర్వాత డిశంబర్‌లో ఎంసెట్ ఎగ్జామ్ నోటిఫికేషన్ పడింది.

ఆ ఎగ్జామ్ బాగా రాసింది దీక్షిత.

దీక్షితకి ఆ ఎగ్జామ్‌లో... ఒక వెయ్యి నాలుగు వందల పన్నెండు ర్యాంక్ వచ్చింది.

2007 మేలో జరిగిన కౌన్సిలింగ్‌లో ఆమెకు కాకతీయ మెడికల్ కాలేజీలో సీటొచ్చింది.

ఆ కాలేజిలోనే... మైక్రో బయోలజిల్యాబ్ వైపు వెళ్తున్న దీక్షిత... అనురాగ్ 'హాయ్' అనగానే గతంలోకి వెళ్లి సంజన 'హాయ్' అనటంతో గతంలోంచి బయటపడి తను కూడా 'హాయ్' అంది దీక్షిత.

ఇద్దరు ఒకేసారి ఆ ల్యాబ్‌లోకి వెళ్లారు

ల్యాబ్‌లో అప్పటికే ల్యాబ్ టెక్నిషియన్స్... మైక్రో స్కోప్స్‌ని స్లైడ్స్‌ని రెడీ చేసి వుంచారు.

ప్రొఫెసర్ మేడం గారొచ్చి ఆ రోజు గ్రామ్ స్టెయినింగ్ మెథడ్ గురించి చెప్పారు.

దీక్షిత, అనురాగ్ తోటి స్టూడెంట్స్ వారి, వారి మైక్రో స్కోప్స్ తీసుకొని స్లైడ్‌ను ఫోకస్ చేసే పనిలో నిమగ్నమయ్యారు.

అనురాగ్ మాత్రం దీక్షిత పక్కన నిలబడి మైక్రోస్కోప్‌ని చేతిలోకి తీసికొని...

'స్లైడ్‌ని ఇలా ఫోకస్ చెయ్యాలి' అంటూ ఒక స్లైడ్‌ని ఫోకస్ చే చూపిస్తున్నాడు.

మన్విత దృష్టి అనురాగ్ మీద నుండి దీక్షిత మీదకి సాగి అక్క ఆగిపోయింది.

అనురాగ్ పక్కన దీక్షితను ఎప్పుడు చూసిన చేస్తున్న పని చేయలేక.. వస్తున్న ఆలోచనలను ఆపలేకపోతోంది.

ఆ ఆలోచనలు ఎంత వద్దనుకున్నా మన్విత మనసు మైదానంలో నుండి లోపలికి దూసుకువచ్చి, మనసుని అతలాకుతలం చేస్తున్నాయి ఆలోచనగా తన దృష్టిని ఒక చోటనిలిపి, జ్ఞాపకాల దొంతరలోకి వెళ్లింది వెంటనే మన్విత కళ్ల ముందు ఆమె గతం మెదిలింది.

మన్విత తండ్రి స్కూల్ టీచర్.

ఆయన ప్రస్తుతం బమ్మెర అనే ఊరిలో పని చేస్తూ ప్రతిరోజు బస్‌లో వెళ్లి వస్తుంటాడు. బమ్మెర అనే ఊరికో ప్రత్యేకత వుంది.

ఆ ప్రత్యేకత మహాకవి పోతన ఆ ఊరిలో జన్మించడమే. పోతనపై అభిమానం వున్నవాళ్లు ఆ గ్రామం వెళ్లి ఆయన మూలాలను దర్శించుకొని వస్తుంటారు. విశ్వనాద్ కూడా పోతన కవి పట్ల వున్న మక్కువ తోనే ఆ ఊరిలో టీచర్ జాబ్ చేస్తున్నట్లు అప్పుడప్పుడు చెబుతుంటాడు. ఆయన స్కూల్లో చిన్న పిల్లలకి పాఠాలు చెప్పి వచ్చాక... ఇంకెవరితో మాట్లాడ ఓపిక లేనట్లు మౌనంగా వుంటాడు ఆయన మౌనాన్ని చూసి మితభాషిలా భావిస్తారు.

మన్విత తల్లి కృష్ణవేణి... నానమ్మ వర్ధనమ్మ .

వీళ్లిద్దరు ఎప్పుడు చూసినా సూటిపోటి మాటలతో క్షణం తీరిక లేనట్లు గొడవ పెట్టుకుంటూ, మూతికి, ముక్కుకి పక్షవాతం వచ్చినట్లు అటు, ఇటు విచిత్రంగా తిప్పుకుంటూ తిరుగుతుంటారు. ఆ ఇంట్లో మన్విత అనే అమ్మాయి ఒకతి వుందని పట్టించుకోరు.

విశ్వనాథ్ ఇంట్లో వుంటే మాత్రం తల్లి గాని, నానమ్మ గాని మాట్లాడుకోరు, పోట్లాడుకోరు. మూగ సైగలతో పని చేసుకుంటూ మూగ



బొమ్మల్లా తిరుగుతుంటారు. వాళ్ల నటన చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. తండ్రి ఎటూ వెళ్లకుండా ఇంట్లోనే వుంటే బావుండని మన్విత అనుకోని రోజులేదు.

బద్ధ శత్రువుల్లా ఒకే యింట్లో వుంటూ అత్తా, కోడళ్ల అనుబంధానికి అర్థం చెరిపేస్తున్న వాళ్లను చూస్తుంటే నవ్వాలో, ఏడ్వాలో తెలియడం లేదు మన్వితకి.

ఒక్కోసారి గట్టిగా అరిచి వాళ్లిద్దర్ని కంట్రోల్‌లో పెట్టాలన్నంత కోపం వస్తుంది. ఇంకా వినకపోతే నాలుగు తన్నులు తన్ని ఓమూలన కూర్చోబెట్టాలన్నంత అవేశం కూడా వస్తుంది కానీ... ఒక వైపు తల్లి ఇంకోవైపు నానమ్మ కావటంతో తను అనుకున్న పని చేయలేకపోతోంది. అలాగని వాళ్లను సమర్థించలేక పోతుంది.

ఇంట్లో వున్నంత సేపు అంతర్మదనం...

ఎప్పుడెప్పుడు బయటకెళ్దామా అన్న కుతూహలం.

బయట కెళ్తే కాళ్లు విరగ్గొడతానని తల్లి బెదిరింపు

ఒక వేళ ఎదిరించి వెళ్తే...

'నీ మనవరాలికి నీ పోలికలు మాత్రమే వచ్చాయనుకున్నా. నీ బుద్ధులు కూడా ఏడ్చి చచ్చాయి. ఆ రోజుల్లో నువ్వుకూడా ఇలాగే బయట తిరుగుళ్లు తిరిగే దానివా? దగ్గర కూర్చోబెట్టుకొని భయం చెప్పు దానికి. నాకు కోపం వస్తే చంపేస్తా... ముఖ్యంగా మొగ పిల్లలతో ఆటలు నాకు నచ్చవు" అంటూ వర్ధనమ్మ మీదకి పోతుంది.

"మగ పిల్లలతో ఆటలనేవి మా రోజుల్లో, మీ రోజుల్లో, ఈ రోజుల్లో- ఏ రోజుల్లో అయినా వుంటాయి. చిన్నప్పుడు మగ పిల్లల్తో తెగ ఆడిన వాళ్లు కూడా పెద్దయ్యాక వాళ్ల పిల్లల్ని ఆడనివ్వరు. ఆంక్షలు పెడ్తారు. అలా ఆడితే మంచి తల్లి క్రింద లెక్క.. తల్లి భయంగా పెంచుతుందని లోకం కూడా అనుకోవలి కదా? ఏ టైంలో ఏది చెయ్యాలో అది చెయ్యడం ధర్మం. ఇప్పుడు నా ధర్మం" అంటూ వర్ధనమ్మ ఇంకా ఏదో అనబోతుంటే.

"ఇచ్చిన లెక్చరు చాలు దాని సాక్సులు ఎక్కడున్నాయో వెతికి యివ్వండి!" అంటూ కిచెన్ లోకి వెళ్లి ఒక గిన్నె తీయబోయి ఇంకో గిన్నె తీస్తూ వున్న గిన్నెలన్నీ క్రింద పడేసింది కృష్ణవేణి.

ఆ చప్పుడుకి ఒక్క క్షణం చెవులు మూసుకుని...

"నేను వెతుక్కుంటాను మమ్మీ! నానమ్మకి ఎందుకు పనులు చెప్తావు? నీ కింకేం పనిలేదా? ఎప్పుడు చూసినా నానమ్మని ఏదో ఒకటి అనందే నీకు పనిచేసే మూడ్ రాదా? నువ్వు ప్రశాంతంగా వుండవు. మమ్మల్ని ప్రశాంతంగా వుంచవు. ఛ... ఛ.... ఇంట్లో వుండాలంటేనే కంపరంగా వుంది" అంది చక చక బుక్స్ బ్యాగ్‌లో పెట్టుకుంటూ.

"గుడ్డు బోయి పిల్ల వెక్కిరించడం అంటే ఇదే ఎక్కడికి పోతాయి బుద్ధులు. ఏ నక్షత్రాన నా కడుపున పడ్డావో కాని, నన్ను ఏదో ఒకటి అనకుండా వున్నావా? ఒక్క రోజన్నా నా మాట విన్నావా? నా పెళ్లైన కొత్తలో నీ మేనత్త కూడా ఇంతే! ఎప్పుడు చూసినా నా వెంట పడి నన్ను వేపుకు తినేది". అంటూ తన ఆడపడుచుని గుర్తు చేసుకుంటూ గొణగడం మొదలు పెట్టింది కృష్ణవేణి.

తల్లి మాటలు వింటూ... సాక్సులు తొడుక్కొని, షూస్ వేసుకొని, గబ గబ బ్యాగ్‌ను భుజాలకు తగిలించుకొని పరిగెత్తుతున్నట్టే స్కూల్‌కి వెళ్తుంటే..

"అయ్యో.... అయ్యో తిని వెళ్లవే. లంచ్ బాక్స్ తీసికెళ్లవా? ఇప్పుడు తినకా, మధ్యాహ్నం తినక ఎలావుంటావే ." అంటూ వీధి మలుపు తిరిగే దాక వెంటబడ్డ తల్లి వైపు చూడాలన్నా చిరాకు వేసి అలాగే స్కూల్ వైపు నడిచింది

వరంగల్ పబ్లిక్ స్కూల్ దగ్గరికి వెళ్ళగానే...

స్కూల్ పిల్లల్ని వదిలే ఆటోలు, కార్లు, స్కూటర్లు , పిల్లల్ని స్కూలుకి నడిపించుకుంటూ వచ్చే పెద్ద వాళ్ళు కిటకిట లాడుతున్నారు.



అందర్ని తప్పించుకుంటూ నడవటం రోజు అలవాటైన దానిలా...

భుజాలకున్న బ్యాగును సరిచేసుకుంటూ స్కూల్ లోపలికి అడుగుపెడ్తుంటే నీరసంగా అన్పించి టిఫిన్ తిన లేదన్న విషయం గుర్తొచ్చింది.

అసెంబ్లి మొదలవటంతో....

ప్రేయర్‌కి సంబంధించిన లైన్స్ ఫాం అయ్యాయి. డ్రమ్స్ సౌండ్ లయబద్ధంగా విన్పిస్తుంటే పిల్లలంతా ఎక్సైజ్‌లు చేశారు. యూనిఫాంలో వున్న ఆ పిల్లలు నీ రెండలో మెరిసిపోతున్నారు.

తరువాత పిల్లలతో గ్రేట్ మెన్స్ గురించి పబ్లిక్ స్పీచ్ ఇప్పించారు.

అనురాగ్ చాల చక్కగా స్పీచ్ ఇచ్చాడు.

ఎక్స్‌టర్నల్ కాంపిటీషన్ కోసం వెళ్లి ప్రైజులు తెచ్చుకున్న పిల్లలకి మిగాతా పిల్లలకి తెలియటం కోసం ఎనౌన్స్ చేసి ప్రైజులు ఇచ్చారు.

ఆ ప్రైజుల్లో ఎక్కువ అనురాగ్ కి వచ్చాయి.

వందేమాతరం... అయ్యాక ప్లెడ్జ్ జరిగించి.

ప్లెడ్జ్ అయ్యాక...

మన్విత స్పృహ తప్పి క్రింది పడింది.

ఆమె వెనకాలే వున్న అనురాగ్ అమెను తన చేతులతో లేపి స్టేజి మీద కూర్చోబెట్టాడు మన్విత కూర్చోలేక అలాగే ఒరిగి పడుకొంది. ఆమెకు కళ్లు తిరుగుతున్నాయి.

మిగతా పిల్లలు భయంతో బిక్కు బిక్కు మంటూ నిలబడ్డా అనురాగ్‌కి ఏంచేయాలో తోచక ఒక్క క్షణం కంగారుగా చూసి, వెంటనే తన వాటర్ బాటిల్ తెచ్చి మూత తీసి, కొన్ని నీళ్లను తన చేతిలోకి ఒంపుకొని ముఖం మీద చల్లాడు.

నీళ్లు ముఖం మీద పడగానే ఉలిక్కి పడ్డట్లు కనురెప్పల్ని ముడుచుకొని తర్వాత కళ్లు విప్పి అనురాగ్‌ని చూసింది.

స్కూల్ టీచర్ హడావిడిగా వాళ్ల దగ్గరకి వచ్చి 'ఏమైంది'? అంటూ మన్వితను పట్టుకొని, చేయిపట్టుకొని, చూసింది.

అప్పటి వరకు ఆత్రంగా మన్వితనే చూస్తున్న పిల్లలంతా టీచర్ రాగానే ఎవరి క్లాసులోకి వాళ్లు వెళ్లిపోయారు.

"కొద్ది సేపు రిలాక్స్ అవ్వు. తగ్గిపోతుంది." అంటూ క్లాసులోకి వెళ్లిపోయింది టీచర్.

అనురాగ్ మాత్రం అక్కడేవున్నాడు.

"ఇప్పుడెలావుంది?" అన్నాడు.

ఆకలిగా వుండటంతో కడుపును చేత్తో నొక్కుకుంటూ 'ఇట్స్ ఓ.కె' అంటూ లేచి క్లాసులోకి నడవబోతూ మళ్లీ అలాగే కూర్చుంది.

అనురాగ్ వెళ్లి.... తన స్నాక్స్ బాక్స్ తెచ్చి అందులోంచి బిస్కెట్స్ తీసి మన్వితకు తినిపించాడు.

వద్దనకుండా తిన్నది మన్విత.

తింటున్నంత సేపు తల్లి, నానమ్మ మాటలే గుర్తొస్తూ కళ్లు చెమర్చాయి.

'ఏం కాదు భయపడకు' అంటున్న అనురాగ్ వైపు చూస్తూ వాటర్ బాటిల్ చేతిలోకి తీసికొని మూత తీస్తూ తల వంచుకొంది.

"వాటర్ తాగు. క్లాసులోకి వెళ్దాం". అన్నాడు అనుగాగ్ .

వాటర్ తాగి అతని వెంట క్లాసులోకి వెళ్లింది మన్విత.

అనురాగ్, మన్విత టెన్త్ క్లాసు చదువుతున్నారు.

ఒకే క్లాసు అయినా వాళ్లిద్దరి మధ్యన చెప్పుకోతగిన పరిచయం లేదు. క్లాసులో ఆచివరన ఒకరు కూర్చుంటే ఈ చివరన ఒకరు కూర్చుంటారు. అతను వేసే జోకులకి, చేసే పనులకి క్లాసులో అందరు నవ్వుతున్నా, ఆమెకి ఇంటి దగ్గర విషయాలే గుర్తొస్తూ అందరిలా ఎంజాయ్ చెయ్యలేక మూడీగా వుంటుంది ఆమెను ఎవరూ కదిలించరు. ఎవరి ధ్యాసలో వాళ్లు హ్యాపిగా మూవ్ అవుతూవుంటారు.

లంచ్ టైంలో ఫ్రెండ్ బ్రతిమాలటంతో ఆమె బాక్స్‌లో వున్న అన్నం షేర్ చేసుకొని తిన్నది మన్విత.

ఈవినింగ్ గ్రౌండ్‌లో అందరు ఆడుతున్నా మన్విత వెళ్లలేదు. క్లాస్ రూంలో అలాగే కూర్చుంది.



స్కూల్ బెల్ కొట్టగానే ఆలోచిస్తూ అడుగెయ్యడంతో-బెంచీ తట్టుకొని క్రింద పడింది మన్విత.

అప్పుడు కూడా అనురాగ్ అమెను లేపటం యాదృశ్చికంగానే జరిగింది.

మన్విత మోచేయి, మోకాళ్లు కొట్టుకొని ముఖ్యంగా గడ్డం చిట్లి రక్తం కారుతుంటే మోచేతిని , గడ్డాన్ని అతనే కర్చీఫ్‌తో తుడిచాడు.

"ఏంటి! ఈరోజు పడిపోవటమే పనిగా పెట్టుకున్నావా!" అంటూ తన బెంచిమేట్ అంటుంటే...

కన్నీళ్లు తుడుచు కుంటూ మోచేతిని ముఖానికి దగ్గరగా పెట్టుకొని దెబ్బ వైపు చూసుకుంటూ 'ఉఫ్, ఉఫ్' అనుకొంది మన్విత.

పిల్లలంతా పుస్తకాలున్న బ్యాగుల్ని, వాటర్ బాటిల్‌ని భుజాలకి తగిలించుకొని, ఒక చేత్తో లంచ్ బాక్స్ వున్న చిన్న సైజు ప్లాస్టిక్ బుట్టని పట్టుకొని ఆటోలవైపు, కార్లవైపు పరుగులు తీస్తుంటే...

మన్వితకి నడవాలంటే కష్టంగా అన్పిస్తోంది. ఆమె ఇబ్బందిని గమనించి....

"మా కారులో వెళ్దాంరా మన్వితా! మీ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను" అన్నాడు అనురాగ్.

ఈలోపలే అనురాగ్ బ్యాగ్‌ను తీసుకొని, కారులో పెట్టాడు డ్రైవర్.

మన్వితకి నడుస్తుంటే మోకాళ్లు చురుక్కుమంటూ మంటగా వుంది.

అనురాగ్ చెప్పిన మాట వినటమే బెటర్ అనుకొంది.

మారు మాట్లాడకుండా కారెక్కింది.

అనురాగ్ మన్విత వెనక సీట్లో కూర్చున్నారు.

రోడ్డువైపు చూస్తున్న అనురాగ్‌ని చూస్తూ....

"అనురాగ్! మీ ఇల్లెక్కడ?" అంది మన్విత .

"ఇదే మా ఇల్లు" అని అనురాగ్ అంటుండగానే...

కారు ఆగింది.

"నేను మీ ఇంటికి రావొచ్చా?" అంది వెంటనే అతను కారు దిగబోతుండగా.

"నేను కూడా అదే చెబుదామనుకుంటున్నా... రా మన్విత" అంటూ క్రిందకి దిగగానే కారు డోర్ పట్టుకొని పిలిచాడు.

దిగింది మన్విత .

మన్వితకి అప్పుడే ఇంటికి వెళ్లాలని లేదు. ఇల్లు గుర్తొస్తేనే ఒక విధమైన దడ. వెళ్లకుంటే తల్లి వూరుకోదు. ఎదురుచూస్తుంది.

"ఎదిగిన పిల్ల ఇంటికి రాకుంటే ఏమీ పట్టనట్టు కూర్చుంటారేం? మీ కూతుళ్లను కూడా అప్పట్లో ఇలాగే వదిలేశారా?" అంటూ నానమ్మను కేకలేస్తుంది.

నానమ్మను చూస్తుంటే ఎద్దు పుండు గుర్తొస్తూ - తల్లి మాటలు కాకి ముక్కులా అన్పిస్తాయి ఎంత బిజీగా వున్నా మాటల్తో పొడిచే పని మాత్రం కరక్ట్‌గా చేస్తుంది.

"మమ్మీ! ఈ అమ్మాయి నా క్లాస్‌మేట్ . పేరు మన్విత!" అని వెంటనే మన్విత వైపు చూస్తూ

"మన్వితా! మా మమ్మీ, వాగ్దేవి కాలేజీలో బోటనీ లెక్చరర్"అన్నాడు అనురాగ్.

క్రీం కలర్ గద్వాల్ చీరలో మల్లెపూవు సున్నితత్వం, పారిజాతసౌరభం కలగలిపినట్లున్న ఆమెను చూడగానే....

"నమస్తే! ఆంటీ!" అంది మన్విత ఆమె ముఖంలోకి అలాగే చూస్తూ... మన్వితను చిరునవ్వుతో చూస్తూ.

మోచేతికి, గడ్డానికి వున్న దెబ్బల్ని చూడగానే ఆమె నవ్వు మాయమై...

"అయ్యో! ఈ దెబ్బ లేంటి? ఏం జరిగింది?" అంటూ మన్విత చేతిని తన చేతిలోకి తీసుకొంది.

అప్పటికప్పుడే ఆ గాయాన్ని క్లీన్ చేసి ప్లాస్టర్ వేసింది ప్రియభాందవి.

అనురాగ్, మన్విత ప్రెషప్ అయ్యాక....

వాళ్లిద్దరూ తినటానికి వేడి, వేడిగా ఉప్మా, పెసరట్టు పెట్టి, పాలు ఇచ్చింది.



ప్రియభాందవి ఆప్యాయతకి మన్విత కరిగిపోతూ మాటలు కరువైన మూగశ్రోతలా ఆ ఇంటి వాతావరణాన్ని మనసులో రికార్డు చేసుకుంటొంది. పాలు తాగాక....

"రా! మన్వితా! నా గది చూద్దువు గాని" అన్నాడు అనురాగ్ రీసెంట్‌గా తండ్రి తనకి కొనిచ్చిన వీడియోగేమ్ చూపించాలన్న ఉద్దేశంతో...

"నేను వెళ్లాలి". అని నోటి వరకు వచ్చినా అనురాగ్ గది చూసి వెళ్లాలన్న కుతూహలంతో, ప్రియభాందవి కూడా చూడమనటంతో అతని గదిలోకి వెళ్లింది.

ఆ గది సింపుల్ గా, ప్రశాంతంగా వుంది.

చదువుకునే పుస్తకాలతో పాటు, వీడియోగేమ్స్, బెడ్‌కి దగ్గర్లో రెండు టెడ్డీ బేర్ బొమ్మలు స్పష్టంగా కన్పిస్తున్నాయి.

సెల్ఫ్‌లో రకరకాల పెన్నులు, పెన్సిళ్లు, కంపాస్ బాక్సులు, స్నాక్స్ బాక్స్‌లు, స్కూల్ బ్యాగ్‌లు, స్కూల్ డ్రస్‌లు, వాటి పక్కన బెల్ట్‌లు, బాడ్జీలు వున్నాయి.

మన్విత కళ్లు పెద్దవి చేసి ఆ రూంలో ప్రతి వస్తువును కుతూహలంగా చూసింది.

ఎందుకో తెలియదుకాని, అనురాగ్‌ని ఇప్పుడే కొత్తగా చూస్తున్నట్లు ఇన్ని రోజులు అనురాగ్ అనే అబ్బాయి తనకి తెలియనట్లు... తెలిశాక ఇదో అద్భుత ప్రపంచం అన్నట్లు.... ఈ ప్రపంచాన్ని ఇన్ని రోజులు మిస్ అయినట్లు ఫీలయింది. ఆ ఫీలింగ్ లో....

రంగురంగుల ఇంద్రధనస్సును దగ్గరగా వెళ్లి చూసినట్లు ఆమె కళ్లు మెరుస్తున్నాయి. ఇంకా బాల్యం తాలుకు తియ్యదనాన్ని వదిలి పెట్టలేని స్థితి ఆమెది. ఇప్పుడిప్పుడే వస్తున్న యవ్వనం ఆమె శరీరంలో కన్పిస్తున్నా... మనసు మాత్రం యింకా బాల్యాన్ని వీడలేదు. అందుకే ప్రతిది అందంగా, ఆహ్లాదంగా అన్పిస్తోంది. ఒక్క తన ఇల్లు తప్ప.

"బై అనురాగ్! వెళ్లొస్తా ఆంటీ!" అంది మన్విత .

"అప్పుడప్పుడు వస్తుండు మన్వితా!" అంది ప్రియభాందవి.

అప్పుడప్పుడు కాదు. ఎప్పుడు రావాలనిపించేలా వుందా ఇల్లు. వాళ్ల అభిమానం.

కారులోంచి దిగుతున్న కూతుర్ని చూసి ముఖం చిట్లించి చూసింది కృష్ణవేణి.

మన్వితను దింపి కారెళ్లి పోయింది.

మన్విత లోపలికి రాకముందే...

"ఎవరిదే ఆ కారు?" అంది కృష్ణవేణి, ఆ గొంతులో ఏ మాత్రం మృధుత్వం లేదు. ఒక డబ్బాలో రాళ్లేసి కొట్టినట్లేవుంది.

అంత వరకు వున్న ప్రసన్నత మాయమై, స్వర్గంలోంచి నరకంలోకి వచ్చినట్లనిపించింది మన్వితకి.

"నా ఫ్రెండ్ అనురాగ్‌ది". అంది మన్విత.

ఫ్రెండ్ అన్న పదం కృష్ణవేణి మనసుని అంకుశమై పొడిచినట్లు...

మన్విత చెంప చెళ్లుమంది.

"కార్లుండే ఫ్రెండ్సెందుకే నీకు? శక్తికి తగ్గ మాటలు, స్థాయికి తగ్గ స్నేహాలేనా నీవి? ఒళ్లు చీరేస్తాను యింకెప్పుడెనా కార్లో వస్తే." అంది.

గడ్డం దగ్గర నొప్పనిపిస్తే, తల్లి ముఖంలోకి చూస్తూనే చేత్తో మెల్లగా తడుముకుంది.

ఈ ప్లాస్టరేంటని గాని, ఈ దెబ్బ లేంటనిగాని అడగని తల్లిలో ఇంతకన్నా ఎక్కువగా ఆశించినా ఫలితం వుండదని... ఏడ్చినా వేస్ట్ అని, తల విదిలించి బ్యాగ్ ని విసురుగా బెడ్ పైకి విసిరేసి, రెండు చేతుల్ని గడ్డం క్రింది పెట్టుకొని సైలెంట్‌గా కూర్చుంది.

"మాట్లాడవేం?" అంటూ గద్దిస్తున్న తల్లి వైపు నెమ్మదిగా చూస్తు.

"ఏం మాట్లాడాలి? నీ మాటల్లో ఏముందని మాట్లాడాలి? నేను అనురాగ్‌తో వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు వాళ్ల మమ్మీ నీలాగ మాట్లాడలేదు. టిఫిన్ పెట్టి, పాలు ఇచ్చింది. దెబ్బ తగిలిందని చూసి ప్లాస్టర్ వేసింది. మరి నువ్వు? అలాంటిదేం చెయ్యలేదు. అవమానించినట్లు మాట్లాడుతున్నావు." అంది మన్విత .



వాళ్లిద్దరి మాటల్లో తల దూర్చితే తనకే గతి పడ్తుందో ముందే తెలిసిన దానిలా ఒక్క పక్కకి వుంది వర్థనమ్మ.

"ఆ ముసల్ది కూడా నీలాగే ఇంట్లో వాళ్లని ఈసడించి, బయట వాళ్లని ఆకాశానికి ఎత్తేస్తుంది .ఎక్కడికి పోతాయి బుద్దులు." అంటూ అక్కడ నుండి వెళ్లి పోయింది.

... తండ్రిని చూడగానే ప్రాణం లేచివచ్చినట్లైంది మన్వితకి అయన దగ్గరకి వెళ్లి కూర్చుంది.

ఉదయం స్కూల్లో తను పడిపోయిన దగ్గర నుండి ఇప్పటి వరకు ఏం జరిగిందో తండ్రితో చెప్పింది. అనురాగ్ వాళ్ల మమ్మీ బాటనీ లెక్చరర్ అని కూడా చెప్పింది.

... మౌనంగా విని, కూతురివైపు జాలిగా చూశాడు విశ్వనాద్

కొద్ది రోజులు గడిచాక...

"ప్రియా ఆంటీ చాలా మంచిది నాన్నా! అప్పుడప్పుడు నన్ను రమ్మని చెప్పింది. వెళ్తే మమ్మీ తిడుతుందని భయం. వాళ్లింటికెళ్లి అనురాగ్‌తో కలిసి చదువుకుంటాను నాన్నా! మమ్మీని తిట్టొద్దని చెప్పండి! ప్లీజ్!" అంది మన్విత.

మన్వితను అర్థం చేసుకున్నాడు విశ్వనాథ్.

తనెప్పుడో ప్రొద్దున స్కూల్‌కి వెళ్తే రాత్రికి వస్తాడు. పిల్లలు ఎదుగుతున్న కొద్ది ప్రపంచం తెలియాలి. జ్ఞానం విస్తరించాలి. అప్పుడప్పుడు ప్రియభాందవి మేడమ్ లాంటి వాళ్ల నీడ సోకితే తన బిడ్డ బాగుపడ్తుందన్న నమ్మకం కలిగి...

"సరేనమ్మా! మీ మమ్మీతో నిన్నేమీ అనొద్దని చెబుతాను. నువ్వు మాత్రం వాళ్లింటికి వెళ్లి త్వరగా వచ్చెయ్యాలి. ఆడపిల్లవు కదా! ఎవరిళ్లలోనైనా ఎక్కువసేపు వుండకూడదు." అన్నాడు విశ్వనాద్ .

ప్రతి దానికి ఆడ పిల్లవు కదా! అంటారెందుకు? ఆడపిల్లలు అబ్బాయిలతో ఆడకూడదు. ఎవరిళ్లలోనైనా ఎక్కువసేపు వుండ కూడదు... మరిలా చేసేవాళ్లంతా చెడిపోయినట్లైతే...చెడిపోని వాళ్లు ఎంత మంది?

ఆడపిల్లతిరిగినా చెడిపోదు. తిరక్కపోయినా చెడిపోదు అని వీళ్లకి ఎవరు చెబుతారు?

ఆ రోజు నుండి మన్విత అప్పుడప్పుడు అనురాగ్ వాళ్ల ఇంటికి వెళ్లి అక్కడ కొద్ది సేపు కంబైన్డ్ స్టడీ చేసి ఇంటికి వస్తుంది.

తండ్రి చెప్పినప్పటినుండి తల్లి ఏమీ అనటం లేదు కాని తను అనురాగ్ వాళ్ల యింటికి వెళ్లటం తల్లికి ఏమాత్రం ఇష్టం లేదని మన్వితకు తెలుసు.

ప్రియబాంధవి అనురాగ్‌తో పాటు మన్వితను కూడా కూర్చోబెట్టి చదివిస్తుంది.

చదివించేముందు...

ఎలా చదవాలో, ఎప్పుడు చదవాలో, ఎందుకు చదవాలో చెప్తుంది. ముఖ్యంగా చదువంటే కష్టం కాదని, ఇష్టమని చెప్తుంది.

క్లాసు పుస్తకాలు చదవటం అయ్యాక....

ఎంతో ఉత్సాహంగా....

చందమామ కథలు గురించి.... మర్యాదరామన్న నీతులు గురించి... అయోధ్యరామయ్య కష్టాల గురించి... తెనాలి రామలింగడి కథలు... అబ్దుల్ కలాం జీవితం..... ఇలా తనకి తెలిసిన వాటి గురించి వాళ్లతో చెప్పి అప్పటినుండే వాళ్లలో ఉన్నత ఆశయాలను నూరి పోసింది.

హోంవర్క్ లాగే పుస్తకాలు చదవటానికి కూడా కొంత టైం స కేటాయించి, వాళ్లు మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు మంచి పుస్తకాలను బహుమతిగా ఇచ్చి ప్రోత్సహించి, చదువుపట్ల వాళ్లకి ఆసక్తిని పెంచింది.

వాళ్లిద్దరు పోటీలు పడి చదువుతుంటే ప్రియభాందవికి సంతోషంగా వుంటుంది.

టెన్త్ క్లాస్‌లో మంచి మార్కులు తెచ్చుకున్నారు.

ఇంటర్ చదవటానికి ఇద్దర్ని ఒకే కాలేజిలో చేర్పించారు.

ఇంటర్ పూర్తయ్యాక కోచింగ్ టైంలో కూడా వాళ్లిద్దరి చదువు విషయంలో ప్రియబాంధవి స్పెషల్ కేర్ తీసుకొంది.



ఆయా సబ్జక్టుల ప్రిపరేషన్‌కు ప్రతి రోజు క్రమం తప్పకుండా ఒక్కొక్క సబ్జక్టుకు రెండు గంటలు కేటాయించి చదివించింది.

పరిక్ష సమీపిస్తున్న కొద్ది సిలబస్ ఒక క్రమ పద్ధతిలో విభజించి, రివిజన్ చేయించింది. టైం తక్కువగా వున్నప్పుడు ఎట్టి పరిస్థితిలో తెలియని కొత్త అంశాలను చదవకూడదని చెప్పింది. థీయరి బిట్స్ చదివితే స్కోరింగ్‌కే కాక సమయాన్ని కూడా ఆదా చేస్తాయని చెప్పింది.

"ముఖ్యంగా ఎంసెట్ కొశ్చన్ పేపర్లో చాయిస్ వుండదు. అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఏ మాత్రం సమయం వృధా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెలిసిన ప్రశ్నలన్నిటికి సమాధానాలు గుర్తించిన తర్వాతనే తెలియని వాటి విషయం ఆలోచించాలి. ముందుగా బయోలజీ, తర్వాత కెమిస్ట్రీ, ఆఖరుకు ఫిజిక్స్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం మంచిది. సమాధానాలను ఖచ్చితంగా గుర్తించాలి. త్వరగా గుర్తించాలి. ముందుగా థీయరీ బిట్లు, తేలిక ప్రశ్నలు పూర్తి చేసి ఆ తర్వాత కష్టమనిపించిన సుదీర్ఘమైన ప్రశ్నల విషయం చూడాలి. సమయాన్ని వృధా చేసుకోవద్దు. ప్రతి ప్రశ్నకూ ఒక 'కీవర్డ్' వుంటుంది. ఆ పదాన్ని సున్నితంగా గుర్తించాలి" అంటూ ఎగ్జామ్‌కి వెళ్లేముందు వాళ్లను బాగా ప్రిపేర్ చేసి అన్ని మెలుకువలు చెప్పి పంపింది ప్రియబాంధవి.

అనురాగ్, మన్విత ఎంసెట్ ఎగ్జామ్ బాగా రాశారు.

ఇద్దరి శ్రమ ఫలించింది.....

మెడిసిన్లో సీటొచ్చింది... హ్యాపి.... హ్యాపి...

* * * * *

మెడిసిన్ ఫస్టియర్లో... వుండగా....

మంచు తెరలు మెల్ల మెల్లగా విచ్చుకుంటున్న వేళ.

బాల భానుడు మబ్బుల మాటునుండి నులి వెచ్చని తొలి కిరణాలు ప్రసరిస్తున్న వేళ...

లోకమంతా నిద్రలేచింది....

మేడారంలో ఉత్సాహం పెల్లుబికింది.

లక్షల మంది ఎదురు చూస్తున్న రోజు రానే వచ్చింది.

దట్టమైన కీకారణ్యం... కొండ కోనల్లో కొలువు తీరిన సమ్మక్క - సారలమ్మ తల్లులను ప్రతి రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజుల్లో... పండుగలా జరుపుకునే సమ్మక్క జాతర అది.

ఆ జాతరకి సోమన్న తన భార్య పిల్లలతో ఎడ్ల బండిలో మేడారం చేరుకున్నాడు. ఆయన ప్రతిసారి తన కుటుంబ సభ్యులతో మేడారం వస్తుంటాడు. ఈసారి కూడా అలాగే వచ్చాడు. తన కూతురికి మెడిసిన్‌లో సీటు రావటానికి ఆ తల్లే కారణమని ఆయన నమ్మకం.

దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి పొందిన గిరిజన ఇలవేల్పులు సమ్మక్క -సారలమ్మలు కొలువు దీరిన మేడారం వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం ఊరట్టం అనే చిన్న కుగ్రామానికి శివారు పల్లె జాతర జరిగే ఈ సమయంలో మాత్రం అది ఒక మహానగరం. ముచ్చటగా ఈ మూడు రోజులు మహోత్సవమే.

దేశంలోనే మహాకుంభ మేళా తరువాత అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యేది ఈ మేడారం జాతరకే. ఈ జాతరకి సుమారు ఎనభై లక్షల మంది హాజరవుతారని అధికారుల అంచనా.

మహానగరాల్లా అక్కడ మేడలు, మిద్దెలు వుండవు. అడుగుకూడా ఖాళీ లేకుండా అంతకంటే కిక్కిరిసి వేనవేల గుడారాలతో, రకరకాల విద్యుత్తు కాంతులతో సర్వాలంకారమై దేదీప్యమానంగా శోభిల్లుతుంది. ఒకప్పుడు ఆదివాసీలకే పరిమితమైన ఈ జాతర ఇప్పుడు అన్ని వర్గాలవారిని ఆకర్షిస్తోంది.

చిలకల గుట్ట నుంచి సమ్మక్కను గద్దె పై ప్రతిష్ఠించే మహోజ్వల ఘట్టం ఆరంభమైన క్షణం దగ్గర పడగానే అడవి తల్లి పులకరించింది. నేల ఈనిందా... నింగి పొంగిందా అన్నట్లు ఎక్కడ చూసినా జనసందోహమే, చిలకల గుట్టలో సమ్మక్క బయలు దేరగానే భక్తుల చేతుల్లో వున్న పసుపు గాలిలో లేచి పచ్చని చెట్లు పసుపు వర్ణంలోకి మారాయి.



శివసత్తులు కేకలు ఒక్కసారిగా మిన్ను ముట్టాయి. ఎస్పీ 47 గన్‌తో గాలిలోకి కాల్పులు జరపగా అధికార యంత్రాంగం నడుమ భారీ బందోబస్తుతో ఆ తల్లి కుంకుమ భరిణె రూపంలో వచ్చి గద్దె చేరుకొంది.

రోడ్లన్నీ జన ప్రవాహంగా మారిపోయాయి. దాదాపు నాలుగైదు కి.మీ పొడవునా ఆధునికీకరించిన పన్నెండు రోడ్లు మొత్తం జనసమ్మర్థంతో నిండిపోయాయి.

గిరిజనులు తమ సాంప్రదాయ నృవిత్యరీతుల్లో డప్పులు, బూరలు, రకరకాల వేష దారణలతో గుంపులు, గుంపులుగా తల్లి దగ్గరికి వెళ్తున్నారు. జనంలో ఎక్కడ తప్పి పోతామోనని ఒక్కోగుంపు పొడువాటి వెదురుబొంగులతో ఆనవాలుగా గుడ్డలు, జెండాలు పట్టుకొని సమ్మక్క నామంతో ముందుకు సాగుతున్నారు. గిరిజనేతరులు మాత్రం అమ్మ వార్లను దర్శనం చేసుకొని వెళ్లి పోతున్నారు.

వరంగల్ ఏటూరునాగారం జాతీయరహదారిపై లెక్కలేనన్ని వాహనాలు పరుగులు తీస్తున్నాయి. గిరిజనులు బారులుతీరిన ఎడ్ల బండ్లపై అక్కడికి చేరుకుంటూనే వున్నారు.

గతంలో లాగ ఎక్కడా వాహనాల రాకపోకలకి అంతరాయం కలగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు.

ప్రియబాంధవి తన భర్తతో, అనురాగ్‌తో క్వాలిస్‌లో బయలుదేరి జాతరకి వచ్చింది. వాళ్లతో మన్వితను కూడా రమ్మంటే వచ్చింది. మన్విత జాతరకి రావటం ఇదే మెదటిసారి.

వాహనాలలో వచ్చిన వాళ్లు కొన్ని కిలోమీటర్ల దూరంలోనే తమ వాహనాలను ఆపుకొని నడుచుకుంటూ వస్తున్నారు.

జంపన్న వాగు దగ్గర స్నానాదికాలు ముగ్గించుకొని వెళ్లే వారు వెళ్తుంటే వచ్చే వారు వస్తున్నారు. ఆ వాగులో నాలుగు కిలోమీటర్ల దూరం వరకు భక్తుల రద్దీ విస్తరించింది. లక్షలాది మంది భక్తులు స్నానాలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. పిల్లలు లేని దంపతులు తమకు సంతాన ప్రాప్తి కలగాలని, అనుకున్న కోరికలు తీరాలని, పంటలు బాగా పండి

క్షేమంగా వుండాలని ఆ తల్లిని వేడుకుంటున్నారు. అక్కడ చెట్లు ముడుపులతో మునిగిపోయాయి.

శివ సత్తుల పూనకాలతో, మేళ తాళాలు, డప్పుల చప్పుళ్లతో భక్తుల నృత్యాలతో, మిన్నుముట్టే నినాదాలు, మనసులను కదిలించే పగడిద్దరాజు, సమ్మక్క - సారలమ్మ, జంపన్నల వీర గాథలు వినిపించే ఒగ్గు కథలు, గిరిజనేతర దేవతలను ఆరాధించే గిరిజన పూజారుల మంత్రోత్సరణతో, డోలిచప్పుళ్ళతో హోరెత్తి పోతున్న ఆ జాతర అనురాగ్‌ని, మన్వితను ఆనందోత్సాహాలతో ముంచెత్తి వేస్తోంది.

జంపన్న వాగు ఒడ్డున వున్న షవర్లు భక్తుల శరీరాలను తడుపుతున్నాయి.. ఎక్కడ చూసినా జనం... జనం...

దీక్షిత, ఇంకా కొంత మంది పెళ్లి కాని అమ్మాయిలు షవర్ క్రింది నిలబడి భక్తి పారవశ్యంతో తడుస్తూ 'జంపన్న వాగులో యింత హాయివుందా సమ్మక్క - రోజూ మనల్ని రానిస్తుందా' అని మనసులో అనుకంటూ కలిసి, మెలిసి సరిగంగ స్నానాలుచేస్తుంటే చూడటానికి మనోహరంగా పవిత్రంగా వుంది.

ఆ స్నాన ఘట్టాలను తిలకిస్తున్న మేఘాలు-భూమి, ఆకాశం కలిసే చోటు నుండి తాము కూడా స్నానానికి దిగుతున్నట్లు బారులు తీరి కదులుతున్నాయి.

ఆ షవర్ల క్రింద ఆడా, మగా తారతమ్యం లేకుండా తడుస్తున్నారు. కొత్తవాళ్లు రావటంతో షవర్ల క్రింది ఎక్కువ సేపు నిలబడేంత టైం లేక వెంట, వెంటనే కదులుతున్నారు.

జంపన్న వాగు అంచున నిలబడి వున్న అనురాగ్‌కి పట్టులంగా, ఓణిలో షవర్ క్రింద తడుస్తూ, కళ్లు గట్టిగా మూసుకొని రెండు చేతుల్ని ఎదకి దగ్గరగా ఆనించుకున్న దీక్షితను చూస్తుంటే 'ఈ హాయిని మళ్లీ, మళ్లీ ప్రసాదించు తల్లీ!' అని కోరుకుంటున్నట్లుగా వుంది.

కాబోయే డాక్టర్ దీక్షితలో ఇంత భక్తి వుందా? అని ఆశ్చర్య పోయాడు. దీక్షితను చూడటం అతనికి కొత్తేమీ కాకపోయినా ఈ రోజెందుకో కొత్తగా



కన్పిస్తోంది. మనుసును దోచేలా కన్పిస్తోంది హృదయాన్ని కొల్లగొట్టేలా అన్పిస్తోంది. అంతరంగంలో కల్లోలం సృష్టించి ఎప్పుడూ కలగని స్పందన కలిగేలా చేస్తోంది.

అంతేకాదు. ఈ రోజు దీక్షితలో...

అప్పుడెప్పుడో తాను చదివిన కాళిదాసు శకుంతల లాలిత్యం... ముక్కుతిమ్మన వర్ణించిన సత్య భామ ఠీవి... అల్లసానివారి వరూధిని సౌందర్యం... కన్పిస్తోంది. చూస్తుండగానే...

అతనిలో హృదయ స్పందన పెరిగి, మధుర భావనతో ఒక్క క్షణం అతని కనురెప్పలు ఆలోచనగా వాలడం గమనించింది మన్విత. అంత తన్మయత్వంతో అనురాగ్ ఏమి చూస్తున్నాడోనని అటు వెపు చూసింది మన్విత. అక్కడ దీక్షిత కన్పించింది. ఆమెను అలా చూస్తుంటే మన్వితకే మతిపోతుంటే... అనురాగ్ అలా ఫీలవ్వటంలో వింతేమీలేకపోయినా.... ఒక అమ్మాయిని చూసి అనురాగ్ అలా ఫీలవ్వటం ఇంతక ముందెప్పుడు మన్విత చూడలేదు. ఇదే తొలిసారి. అతని చూపుల్లోని అ మార్పు మన్వితను విభ్రాంతికి గురిచెయ్యటమే కాకుండా లోలోన కలవరపెట్టింది. అతనలా ఫీలవ్వటం ఆమెకు నచ్చలేదు.

"అనురాగ్ మీ డాడీ పిలుస్తున్నారు" అంటూ కావాలనే అనురాగ్‌ను డిస్టర్బ్ చేసింది.

అక్కడ వాళ్ల డాడీ లేకపోయినా మన్విత ఎందుకలా అన్నదో అర్థం కాక అక్కడ నుండి కదిలాడు అనురాగ్.

దీక్షిత పక్కన వున్న ఆమె తల్లి, తండ్రి, అన్నయ్య ఆమె చుట్టూ కోట గోడల్లా అన్పిస్తున్నారు. మమకారపు వర్షంలో ఆమెను తడిపేస్తున్నారు.

తడిసిన దీక్షిత పొడవైన జుట్టును ఆరబెడ్తున్నట్టు చేత్తో పైకి పట్టుకొని...

"పద దీక్షా! 'తల్లి' దగ్గరికి వెళ్లి మొక్కులు తీర్చుకొని వద్దాం" అంటూ ఆప్యాయంగా, మృదువుగా అంటున్న దీక్షిత తల్లి పై మన్విత దృష్టి ఆసక్తిగా నిలిచింది.

తమ పిల్లలలో ఆనందాన్ని చూడగలవాళ్లే నిజమైన సౌఖ్యవంతులు... ఉత్సాహకరమైన ఆలోచనలతో నిండిన వాళ్లే నిజమైన ఆనందాన్ని పొందగలరని వాళ్లను చూస్తుంటేనే అర్థమవుతోంది.

వెంటనే తన తల్లి గుర్తొచ్చింది మన్వితకి.

అదే తన తల్లి అయితే తను అలా తడిసిన బట్టల్లో వుంటే వూరుకుండేదా? అదో పెద్దనేరంలా భావించి – ఎదిగిన పిల్లవని, ఆడపిల్లవని క్షణక్షణం గుర్తు చేస్తూ తనలో వుండే సరదా ఫీలింగ్స్ నన్నిటిని చంపేసేది. ఆడపిల్లగా ఎందుకుపుట్టాను అని సిగ్గుతో చచ్చి పోయేలా చేసేది. అయిన తను చంపుకున్న సరదాలు ఒకటా, రెండా, ఎన్నో .. ఎన్నెన్నో.... గట్టిగా నవ్వొద్దంటే నవ్వటం మరచిపోయింది. పెద్దగా మాట్లాడవద్దంటే మాట్లాడటం మానేసింది. అయిన దానికి, కాని దానికి, బయట తిరక్కూడదంటే బయట కెళ్లటం మానేసింది. ఎలా పడితే అలా వుండకూడదంటే ఎలా వుండ కూడదో నేర్చుకుంది.

అడుగడుగున ఇలా ఆంక్షలు పెట్టటం నచ్చకపోయినా తల్లి మనస్సు నొప్పించటం యిష్టంలేక మౌనంగా వూరుకుంది.

ఇప్పుడు దీక్షతను చూస్తుంటే తనకి కూడా తడవాలని వున్నా తల్లికి తెలుస్తుందన్న భయంతో తడవలేక పోయింది.

... అంతా గద్దెల దగ్గరికి చేరుకున్నారు.

'మొక్కులు అందుకో సమ్మక్క తల్లి' అంటూ శుక్రవారం ముత్తయిదువులకి మంగళకరం కావటంతో ఆ తల్లులిద్దరికి వారి గద్దెల దగ్గర పూజలు జరిపి పసుపు, కుంకుమ, వాయినాలు, బంగారం (బెల్లం) భక్తి ప్రపత్తులతో సమర్పించారు.

బంగారం గుట్టలుగా వున్నా ఈగలు, చీమలు చేరకపోవటం అక్కడి విశేషం.

'ఆ వనదేవతల వన ప్రవేశం రోజు... మహిమగల ఈ దేవతలకి మనసారా వీడ్కోలు చెప్పి... భక్తులు ఇంటి ముఖం పట్టడంతో ఆ మహాజాతర ముగిసిపోయింది.

* * * * *



రోజులు గడుస్తున్నాయి.

జూలైలో ఫైనల్ ఎగ్జామ్స్ జరుగుతున్నట్లు గా యూనివర్శిటీ నుండి నోటిఫికేషన్ వచ్చింది. నిద్ర సరిగ్గా పోకుండా, ఎగ్జామ్స్ అంటే టెన్షన్ పెట్టుకొని, అప్పుడప్పుడు కంగారు పడి, మొత్తానికి కష్టపడి అంతా ప్రిపరేషన్‌లో పడ్డారు

ఆగస్ట్ వరకు ఎగ్జామ్స్ అయిపోయాయి.

రిజల్ట్స్ కోసం వెయిటింగ్...

అంతా ఎవరి ఊర్లకి వాళ్ళు వెళ్లి పోయారు.

* * * * *

సెప్టెంబర్ నెలాఖరులో రిజల్ట్స్ వచ్చాయి.

ఫస్టియర్లో... అనురాగ్, దీక్షిత, మన్విత ఫస్ట్ క్లాసులో పాసయ్యారు.

సెకండియర్ స్టార్ట్......

హేపి... హేపి.... హేపి...

ప్రతి క్షణం గడిచిన క్షణంతో పోటీ పడాలని కొత్త దనాలను చిందిస్తూ పరుగులు పెడ్తోంది.

క్లాసులు అయిపోవటంతో బయటకు రాగానే ఫ్రెండ్ కన్పిస్తే మాట్లాడి ఆ ఫ్రెండ్ వెళ్లాక లైబ్రరీ వెపు దారి తీసింది మన్విత.

ఆ లైబ్రరీలోకి అడుగు పెట్టగానే ఎదురుగా వున్న సరస్వతి విగ్రహ పీఠానికి క్రింది భాగాన...

'అసతోమ సద్గమయ, తమసోమా జ్యోతిర్గమయ

మృత్యోర్మా అమృతం గమయ' అనే వాక్యాలు స్పష్టంగా కన్పిస్తూ–మమ్మల్ని చదివి వెళ్ల మంటున్నట్లుగా అందరివైపు చూస్తుంటాయి.

వాటిని దాటుకొని చక, చక లోపల కెళ్లింది మన్విత. అక్కడ అనురాగ్, దీక్షిత క్లాస్ బుక్స్ రెఫర్ చేసుకుంటూ కూర్చుని వున్నారు. ఆమె చూపులు ఒక్క క్షణం వాళ్ల పై నిలిచి ఆగి పోయాయి.

వాళ్లు మన్వితను గమనించకుండా వాళ్ల పాటికి వాళ్లు సైలెంట్‌గా చదువుకుంటూ కూర్చుని వున్నారు.

ఈ మధ్యన ఎక్కడ చూసినా వాళ్లిద్దరే కన్పిస్తున్నట్లు అన్పిస్తోంది మన్వితకి. అది యాధృచ్ఛికమో లేక కావాలనే వాళ్లలా వుంటున్నారో అర్థం కావడం లేదు. మెడిసిన్ అన్న తర్వాత అది కామనేకావొచ్చు.

కానీ... జాతరలో దీక్షితను అతను చూసిన చూపుల్లో వేరే అర్థం కన్పించినప్పటి నుండి వాళ్లను ఎక్కడ చూసినా ఆమెలో చిత్రమైన కదలిక వచ్చి గుండెలోకి పదునైన శూలం దిగినట్లు అవుతోంది. ఆ నొప్పి, ఆ బాధ వర్ణనాతీతం.

అదేం విచిత్రమో ఎంత వద్దనుకున్నా, వాళ్లు కన్పించిన ప్రతిసారి ఆమె ఒళ్లంతా కళ్లు అయి. ఏ శబ్ధాన్ని తన చెవులకి సోకనీయకుండా అటెన్షన్‌గా నిలబడి పోయి వాళ్లనే పరిశీలిస్తోంది.

దీక్షితను అనురాగ్ ప్రేమిస్తున్నాడో తెలియదు. ప్రేమించటం లేదో తెలియదు. అది తెలుసుకోవడం కోసం తన ఒంట్లో వున్న శక్తి నంతా దార పోస్తున్న దానిలా తన కాన్సన్‌ట్రేషన్ అంతా వాళ్ల మీదనే పెడుతోంది. అయినా అర్థం కావడం లేదు.

ముఖ్యంగా అతనిలోని ఫీలింగ్స్‌ని పట్టుకోవడం కష్టంగా వుంది. దీక్షితనైతే మరీనూ...

ఒక వేళ అనురాగ్ దీక్షితను ప్రేమిస్తే?

ప్రేమంటేనే గాఢమైన అనుభూతులమయమట. భావాలన్నీ సమ్మిళితమైన ఒక ఉద్వేగమట. అంతే కాదు ప్రేమంటే మరో వ్యక్తి పై మనస్సు లగ్నమై పోవటం... ఆ మనిషితోనే గడపాలని మనస్సు గాఢంగా వాంఛించటం... ఆ మనిషి లేకపోతే తన ఉనికే వ్యర్థమనిపించడం... ఎప్పుడూ ఆ మనిషే తన ఆలోచనల్లో పరిభ్రమిస్తూ వుండటం... క్షణ కాలం వియోగం కూడా భరించలేక పోవటం.... దూరమైతే ఎప్పుడెప్పుడు కలుస్తానా, చూస్తానా అని మనసు ఆరాటపడటం... ఆ మనిషి సమక్షంలో మనసు శాంతితో, సంతోషంతో, సంతృప్తితో నిండిపోవడం... ఇదే ప్రేమంటే!

ఎప్పుడు చూసినా వాళ్లిద్దరు పక్కపక్కన కన్పించటం ఈ 'ప్రేమ' కోసమేనా? లేకుంటే వాళ్లు ఎందుకలా దగ్గరగా వుంటారు?



దీక్షితతో మాట్లాడకపోతే అతను ప్రశాంతంగా వుండలేకనే కదా! ఆమె తనను ఎక్కడ నిర్లక్ష్యం చేస్తుందోనన్న భయంతోనే కదా! ఆమె అతనకి సొంతం... ఆమె అతనికి కావాలి... అతనిలోని ప్రతి అణువణువులో ఆమె... నడిచే నడకలో... చూసే చూపులో... పూచే పువ్వులో... వీచే గాలిలో... అసలు ప్రపంచమే ఆమె... ఇలా ఆమె లేకుంటే ప్రపంచమే శూన్యంగా భావిస్తున్నాడేమో! దీన్ని బట్టి ఆమె అతని ప్రాణం... ఆమె అతని జీవితం.. ఆమె అతని లోకం... ఆమె అతని ఊపిరి... అయివుండొచ్చు .

మెడిసిన్ ఫస్టియర్... అంటే ఒక్క సంవత్సరం పరిచయానికే ఆమె అతని ఊపిరి అయితే మరి తనో...??

ఒక్కరోజా! రెండు రోజులా! ఎన్ని రోజులు... ఎన్ని నెలలు... ఎన్ని సంవత్సరాలు... అన్ని సంవత్సరాలు ఒకే చోట కూర్చుని కంభైన్డ్ స్టడీ చేశారు. ఒకే స్కూలు , ఒకే కాలేజిలో చదివారు. కలిసి తిన్నారు. కలిసి నవ్వుకున్నారు. కలిసి కబుర్లు చెప్పుకున్నారు. కలిసి ఆడుకున్నారు.

తన తల్లి తనను లోలోన ఎన్ని తిట్లు తిట్టుకుంటున్నా తను వాళ్ల ఇంటికి వెళ్లని రోజంటూ వుందా? అనురాగ్ కూడా తన మీద ఈగవాలనిచ్చేవాడు కాదు. మరిప్పుడెందుకిలా జరుగుతోంది. అనురాగ్ తనకి దూరమవుతున్నాడా?

ఆ ఊహకే వణుకు పుడ్తోంది.

కళ్లు కూడా తిరుగుతుంటే కంట్రోల్ చేసుకొంది.

ఆ ఊహే నిజమైతే!!

అనురాగ్ తనకి పూర్తిగా దూరమవుతాడు. తనతో మాట్లాడడు. తన గురించి ఆలోచించడు. తన సమస్యల్ని వినడు. తన భావాలను పంచుకోడు. అప్పుడు తను ఎవరూ లేని ఒంటరిదైపోతుంది. ఒక్కసారి అనురాగ్ పరిచయం కాకముందు జీవితం కళ్లముందు మెదులుతూ దేన్నో కోల్పోతున్న దానిలా, కలలో నడుస్తున్నట్లు నడుస్తూ వెళ్లి... అనురాగ్ టేబుల్ మీదవున్న బుక్‌ని విసురుగా తాకడంతో ఆ బుక్ క్రింద పడింది.

ఆ బుక్‌ని తియ్యటం కోసం అనురాగ్, దీక్షిత ఒకేసారి వంగటంతో ఇద్దరి తలలు గట్టిగా తాక్కున్నాయి.

ఆ ఇద్దరు ఒకేసారి 'సారి' అనుకోవడం తర్వాత 'ఇట్స్ ఓ.కే' అనుకోవటం చూసిన మన్విత...

'అయ్యో! తన వల్లనే కదా! వాళ్లు తలలు తాకిచ్చుకున్నది తన పరధ్యానం వల్ల ఎంత ప్రమాదం జరిగింది.' అని మనుసులో అనుకుంటూ బాధ పడింది.

అలా బాధపడ్తూ కూర్చుందే కాని బుక్స్ రీడింగ్ మాత్రం చెయ్యలేదు. కొద్ది సేపు అయ్యాక...

"ఓ.కే. నాకు టైం మయింది" అంటూ దీక్షిత అక్కడనుండి లేచి వెళ్లి పోయింది.

ఎటో చూస్తూ ఆలోచనగా... విప్పారిన నేత్రాలతో, నిశ్చలత్వాన్ని ఆపాదించుకొని, గంభీరంగా , దిగులుగా అందరికి దూరంగా కూర్చుని వున్న మన్వితను అక్కడ నుండే చూస్తూ...

"ఏంటి డా॥ మన్వితా! లైబ్రరీకి చదువుకోవాటానికి వచ్చావా? ఆలోచించటానికి వచ్చావా? ఏదెనా అర్థం కావడం లేదా బుక్స్‌లో" అని ఆప్యాయంగా అన్నాడు అనురాగ్.

అతను అప్పుడప్పుడు ఆమె పేరుకి ముందు డాక్టర్‌ని చేర్చి పిలుస్తుంటాడు... ఫ్రెండ్స్ తప్ప మిగతావాళ్లు డాక్టర్ అనే సంభోదిస్తుంటారు. అది కామన్.

'కానీ మీరు మాత్రం నేను డాక్టర్ అయ్యాకనే అలా పిలవండి.' అంటుంది సరదాగా...

"ఏం నమ్మకం లేదా? డాక్టర్ అవుతానని... అందరి కన్నా నువ్వే ముందు మెడిసిన్ పూర్తి చేస్తావు మన్వితా! అంత పట్టుదల వుంది నీలో..." అంటుంటాడు ఆమె ఎంసెట్ అప్పుడు ఎంత కష్టపడి చదివిందో గుర్తు చేసుకుంటూ...



అప్పటి దాకా వాల్చి వున్న కనురెప్పల్ని... కంటి నిండా నీటితో తెరిచి అనురాగ్ వైపు చూసింది.

"హే... వాట్ హేపెండ్ మన్వితా?" అంటూ వెంటనే తన చెయిర్లోంచి లేచి వెళ్లి, మన్విత చేయిపట్టుకున్నాడు.

"నాకేమీ అర్థం కావడం లేదు అనురాగ్! నేనేదో తప్పు చేస్తున్నానని పిస్తోంది. నా బాధను ఎవరు అర్థం చేసుకోవడం లేదు" అంటూ కళ్లనీళ్లు తుడుచుకుంటూ తలకిందకేసుకుంది.

"నువ్వేం చెబుతున్నావో నా కర్థం కావడం లేదు. ఏదెనా సబ్జెక్ట్ ప్రాబ్లమ్ అయితే నేనున్నాను కదా! లేక ఇంట్లో ప్రాబ్లమా? ప్రతి ప్రాబ్లమ్‌కి నేనున్నాను కదా! నాకు చెప్పొచ్చుకదా!' అన్నాడు.

మాట్లాడకుండా అలాగే అతనివైపు చూస్తున్న మన్విత పసిపిల్లలా అన్పిపించింది.

స్కూల్ యూనిఫాంలో, రెండు జడలతో, స్కూల్ బ్యాగ్ తగిలించుకొని ' అనురాగ్, అనురాగ్' అంటూ తన వెంటే తిరుగుతూ... ఎవరైనా ఏదైనా అన్నప్పుడు... 'అనురాగ్‌తో చెబుతా' అని వాళ్లను బెదిరిస్తూ 'చూడు అనురాగ్ వాళ్లు'... అంటూవాళ్లపై కంప్లైంట్ చేస్తూ... 'మన్విత జోలికి ఎవరైనా పోయారో... ' అని తను చేయి చూపినప్పుడు... ప్రపంచాన్ని జయించినట్లు నవ్వుకునే మన్విత గుర్తొస్తోంది.

"ఏం లేదు అనురాగ్! సబ్జెక్ట్ ప్రాబ్లమ్. ఈ సారి నిన్ను అడుగుతానులే." అంటూ అక్కడినుండి వెళ్లి పోయింది.

ఆమె నలా చూస్తుంటే ఏదో అంతుతెలియని అ భద్రతా భావంతో క్రుంగిపోతున్న దానిలా అన్పిస్తోంది.

* * * * *

ఉదయం తొమ్మిది గంటలకి రెడీ అయి ఎప్రాన్ వేసుకొని, స్టెత్ పట్టుకొని మెడికో స్టూడెంట్స్‌ంతా కాలేజి బస్‌లో ఎం.జి.ఎం హాస్పటల్‌కి వెళ్లారు.

అక్కడ పేషంట్ల సమస్యల్ని తెలుసుకున్నారు. వారికిచ్చే ట్రీట్మెం గురించి తెలుసుకున్నారు.

వారికి సహాయంగా - వారికొచ్చే డౌట్స్‌ని క్లారిఫై చెయ్యటాని అసిస్టెంట్ ప్రొఫెసర్స్ అండ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్టూడెంట్స్ వున్నారు.

పన్నెండు గంటలకి హాస్పటల్లో పోస్టింగ్స్ అయిపోవటంతో లం ముగించుకున్నారు.

సరిగ్గా 1 గంటకి ఫార్మ కాలేజి క్లాస్‌కి అటెండ్ అయ్యారు.

క్లాసు అయిపోయిన తర్వాత 2 గంటలకి మైక్రోబయోలజి లాబ్‌లో వచ్చారు.

ఆ ల్యాబ్ మొదలైనప్పటి నుండి - అనురాగ్, దీక్షిత పక్కపక్క నిలబడి ప్రయోగం చేస్తుంటే మన్విత మనసు బాధతో ముడుచుకుపోతోం

అనురాగ్ పక్కన దీక్షిత తప్ప యింకెవరున్నా ఆమె అ ఫీలవ్వటంలేదు .

ఎందుకంటే దీక్షిత అతని పక్కన వున్నప్పుడు వాల్చిన అత కనురెప్పల్లో దోబూచులాడే ఊహల వెన్నెలకిరణాలు బయటకు తొం చూస్తున్నాయి. ఆ వెలుగు ఆమె మనసులో దు:ఖాన్ని రేపుతోంది.

చరిత్రలో నిలిచిపోయే అద్భుతమైన ప్రేమకావ్యాలను చదివి అనుభవంతో వాళ్లను పోల్చుకుంటోంది మన్విత.

తను చదివిన షేక్స్‌పియర్ నాటకాలన్నీ ఇలాంటి ప్రేమికుల్ని చూ రాసుంటారని ఆమె భావన. ఆ భావన ఆమెకంటే ముందు మేల్కొని ఆ తర్వాత నిద్రపోతూ నిత్యం ఆమెతో ఆడుకుంటూవుంది.

మనసున మనసై ప్రేమించు కోవడం అనేది ఒక అద్భుతం... కొత్త ఊపిరి... రెండు హృదయాలలో అడక్కుండా ఏర్పడే ప్రతి స్పందన నీకు నేనున్నా ననే మానసిక మైన తృప్తి... బలీయమైన అనుభూతి... అంతుపట్టని రహస్యం... సమాధానం లేని ఓ అందమైన ప్రశ్న... ఆ ప్ర భాషకు, భావాలకు అందని అండపిండ బ్రహ్మాండం... మనసులోని దాహ తీర్చే అతి సహజమైన భావ ఉద్వేగం...



దు:ఖం మన్విత ఎదనిండి, గుండెనది పొంగి పొర్లి , కళ్లలోని కన్నీటి చుక్కలు చెక్కిలి మీదకి ప్రవహించాయి.

మన్వితా! ప్రయోగం చెయ్యకుండా ఏంటి! ఆలోచిస్తున్నావ్?" అంటూ ప్రొఫెసర్ మేడమ్ గారొచ్చి తిట్టారు.

ఆ తిట్లకి గతంలోంచి బయట కొచ్చిన మన్విత బాగా హర్టయింది.

ఇదంతా అనురాగ్ పై తనకి వున్న ప్రేమ వల్లనేగా అనుకుని కెమికల్స్ వున్న వైపు కదిలింది మన్విత.

అవసరమైన కెమికల్స్ తీసుకొని వస్తూ దీక్షిత భుజాన్ని విసురుగా తగిలింది. అది ఆమె కావాలని తగలకపోయినా గట్టిగానే తగిలింది.

దీక్షిత స్థిరంగా నిలబడి వుండటంతో అదృష్టవశాత్తూ మనిషి కదల్లేదు కాని, కదిలుంటే ప్రమాదమే జరిగుండేది. ఆతాకిడికి దీక్షిత చున్నీ మాత్రం వెంటనే కెరటంలా కిందకి జారింది.

దాన్ని చాలా క్యాజువల్‌గా తీసుకొని, చున్నీ సర్దుకొని తను చేస్తున్న ప్రయోగం మీదనే దృష్టి నిలిపింది దీక్షిత. అనురాగ్ కూడా అంతే....

అది చూసిన మన్విత మనసులో జ్వలనం మొదలైంది.

* * * * *

మనసుని కరిగిస్తూ , హిమసమూహంలా ఘనీభవించి, జీవితాలను మార్చివేస్తూ కాలం ఎన్నెన్నో చిత్రాలను చేస్తుంది.

ప్రపంచంతో పాటు తను కూడా నిద్ర లేచి రాసుకుంటూ కూర్చుంది దీక్షిత.

ఆ హాస్టల్లో రూంకి రెండు బెడ్స్ వుంటాయి.

దీక్షిత పక్క రూం అమ్మాయి మహతి వచ్చి దీక్షిత పక్క చెయిర్లో కూర్చుంటూ ఏం రాస్తుందోనని తొంగిచూసింది.

"నా గుండె లోపలి గాయాల బాధను
గేయాలుగా రచించే ఓ కవి!
బాధను వర్ణించకు...

గాయాల గతాన్ని బయటకులాగు!
ప్రతీకార జ్వాలను సమర్థించి రెచ్చగొట్టు!
చెత్తకవిగా కాక
చైతన్య కవిగా రాణించు!" అని ఓ కవిత రాస్తోంది దీక్షిత.

దీక్షిత రాసిన కవిత మహతికి నచ్చింది.

"కవితలు ఎలా రాస్తారు నీ కెలా వస్తుంది కవిత్వం?" అంటూ ఆసక్తిగా అడిగింది.

"నేను నా ఎయిత్ క్లాసునుండే కవితలు రాసేదాన్ని నేను చూసిన జీవితంలోంచే నా కవితలు పుడ్తున్నాయి." అంది దీక్షిత.

"మేము మాత్రం చూడలేదా జీవితాన్ని? మాలో పుట్టడం లేదే కవిత్వం?" అంది కుతూహలంగా మహతి.

"రాయాలన్న ఆసక్తి, తపన, సాధన, కృషి దానికి తగిన టైంతో పాటు ఊహకూడా బలంగా వుండాలిగా" . అంది దీక్షిత.

"ఇంత కష్టపడి రాస్తున్నావ్? ఈ కవితలన్నీ ప్రజల్లోకి పోతే బావుంటుందేమో కదా." అంది మహతి.

"అందరు అదే అంటున్నారు మహా! ఈ మధ్యన సాహితీ పత్రికల్లో వస్తున్న నా కవితల్ని చదివి ప్రముఖ కవి అద్దేపల్లి రామమోహన్‌రావుగారు నా కవితల్ని వెలుగులోకి తీసుకొస్తానని చెప్పారు. హ్యాపీగా వుంది" అంటూ లేచి తన పేపర్స్‌ని సర్దేసి చక చక రెడీ అయింది దీక్షిత.

మహతి, దీక్షిత సీనియర్. వాళ్లమధ్యన నువ్వు అనుకునే చనువుంది.

"నిన్న మన్విత లాబ్‌లో నిన్ను కావాలనే నెట్టిందని కొందరు చూసుకోకుండా తగిలిందని కొందరు అనుకుంటున్నారు. నీకేమనిపిస్తోంది?" అంది మహతి.

"నన్ను కావాలని నెట్టాల్సిన అవసరం మన్వితకి లేదు. అందుకే లైట్ తీసుకున్నా"...అంటూ క్లాసుకెళ్లబోతున్న దీక్షతను చూస్తూ...

"ఎందుకైనా మంచిది లాబ్‌లో జాగ్రత్తగా వుండు." అంటూ శ్రేయోభిలాషిలా ఓ మాట చెప్పి వెళ్లింది మహతి.



మధ్యాహ్నం...

ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్‌గారొచ్చి పోస్ట్ మార్టమ్ చూడటానికి మార్చురీకి తీసికెళ్లారు.

ఎమ్.జి.ఎమ్. ప్రధాన గేటు నుండి మార్చురీకి దూరం ఎక్కువగా వుండటంతో వైద్య విద్యార్థులంతా జెమిని యాడ్స్ లాబ్స్ టాకీస్ పక్క నుండి మార్చురీకి వెళ్లారు.

మార్చురీ రూంలోకి ఎంటర్ కాకముందే చనిపోయిన వాళ్ల బంధువులు చెట్లక్రింద కూర్చుని నుదుటిపై చేతులతో కొట్టుకుంటూ, హృదయ విదారకంగా ఏడుస్తున్నారు. వాళ్లను చూస్తూ...

దీక్షిత అడుగులు అక్కడే ఆగి పోయాయి.

మార్చురీకి వెళ్లాలంటేనే ఆమెకు భయంగా వుంది.

ఆ భయాన్ని పోగొట్టడం కోసం అనురాగ్ ధైర్యం చెబుతున్నాడు. అతనెంత ధైర్యం చెప్పినా లోపల కెళ్లటానికి ఆమె మనసు సంసిద్ధం కావడం లేదు.

మెడికో స్టూడెంట్స్‌ంతా ఎవరిలోకంలో వాళ్లుంటే... దీక్షిత ఆగిన వెంటనే అనురాగ్ ఆగి మాట్లడటం, తిరిగి మార్చురీ వైపు కదలటం గమనిస్తోంది మన్విత.

అనురాగ్ తనతో కూడా మాట్లాడతాడు నవ్వుతాడు. సబ్జక్ట్ గురించి చర్చిస్తాడు. ధైర్యం కూడా చెబుతాడు. కానీ... తనతో ఏది చేసినా దీక్షితతో చేసినట్లు చెయ్యడం లేదని ఆమె బాధ.

... ఫీలింగ్స్ కావాలి తనకి. దీక్షత పట్ల అతను ఎలా ఫీలవుతున్నాడో ఆ ఫీలింగ్స్ కావాలి. ఆ ఫీలింగ్స్ కూడా ఒక్క తన పట్ల తప్ప యింకెవరి పట్ల కలగ కూడదు.

నిజానికి అనురాగ్ తననెంత అభిమానంగా చూసేవాడు! వరంగల్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్నప్పుడు, స్కూల్ వదిలాక తను కాళ్లీడ్చుకుంటూ, చేతులూపుకుంటూ ఇంటికెళ్తుంటే 'రా మన్వితా! ' అంటూ కార్లో ఎక్కించుకునేవాడు....

ఒక సారి తల్లికి తెలియకుండా తన రెండు జడల్లో రెండు తెల్ల గులాబీలను వెట్ రిబ్బన్లలో కలసిపోయేలా పెట్టుకుంటే పోకిరీ వెదవ వాటిని లాగి నవ్వినప్పుడు అనురాగ్ చూసి వాడ్ని చితకబాదాడు... అప్పటి నుండి తనను ఎవరు కామెంట్ చేసినా అలాగే చేసేవాడు... ఇంట్లో తల్లి తిట్టినప్పుడు స్కూల్ కొచ్చి ఏడుస్తుంటే ఓదారుస్తూ జోక్స్ వేసి ఆ బాధను మరిపించి అప్పటి కప్పుడు ప్రక్కనే వున్న బేకరీకి తీసికెళ్లి తను అడిగింది కొనిచ్చే వాడు. తను తింటుంటే అతను కూడా తినేవాడు.

క్లాస్‌లో సార్ అడిగింది తను చెప్పలేనప్పుడు మధ్యలో అందించేవాడు... అసెన్‌మెంట్స్ అప్పుడు కూడా అలాగే చేసేవాడు... అతన్ని క్లాసులో లీడర్ని చేసినప్పుడు ముఖమంతా నవ్వునింపు కొని కంగ్రాట్స్ చెబితే షేక్ హేండ్ యిచ్చి ఆ చేతిని అలాగే పట్టుకున్నాడు. అప్పుడెంత గర్వపడిందో అనురాగ్ తన ఒక్కదానికే ఫ్రెండ్ అన్న ఆశతో. అనురాగ్ తన ఫ్రెండ్ కావడం ఓ ఎస్సెట్‌లా తన జోలికి ఎవరూ వచ్చేవాళ్లు కాదు.

"రా! మన్విత! అక్కడే ఆగి పోయావేం?" అంటూ అనురాగ్ పిలవడంతో కదిలింది మన్విత.

అప్పటికే అందరు మార్చురీ రూంలోకి వెళ్లారు. మార్చురీ రూంలోకి వెళ్లగానే...

అక్కడ నాలుగు శవాలు దేనికదే ఓ పక్కగా పడివున్నాయి.

భరించరాని వాసనతో అక్కడో క్షణం కూడా వుండలేక పోతున్నారు.

మగ పిల్లలు మాత్రం ఎంతయినా ధైర్యస్థుల కావడం వల్ల ఏ ఫీలింగ్ బయట పడనీయడం లేదు.

దీక్షతకు వెన్నులో జలదరింపు పుట్టి, ఎంత నిగ్రహించుకుందామన్నా లోలోపల సన్నగా వణుకు పుడ్తోంది.

మన్వితకు మాత్రం అలాంటివేం కలగడం లేదు.

ఆ శవాన్ని త్వరగా చూడాలన్న క్యూరియాసిటీతో వుంది.

కారణం శవంగా మారిన అమ్మాయి ఒక భగ్న ప్రేమికురాలు. ఫోరెన్సిక్ ప్రొఫెసర్ వచ్చి ముందుగా ఒక డెడ్ బాడీని తీసుకొని పోస్ట్ మార్టమ్ చేసే విధానాన్ని స్టూడెంట్స్‌కి వివరించాడు.



ఆ స్టూడెంట్స్ ముందు కాస్త భయపడ్డా, తర్వాత శవం వైపు చురుగ్గా చూస్తూ, ప్రొఫెసర్ చెప్పేది వింటూ కుతూహలాన్ని పెంచుకున్నారు. లెసన్ వింటున్నట్లే చూస్తున్నారు.

ధీక్షిత మాత్రం శవాన్ని చూడగానే మెల మెల్లగా అడుగులేస్తూ అనురాగ్ వెనక్కి చేరి అతని భుజం మీదుగా తలెత్తి భయ, భయంగా చూస్తూ ప్రొఫెసర్ చెప్పేది వింటోంది.

ఆ ' డెడ్ బాడీకి ' పోస్ట్ మార్టమ్ చేస్తున్నారు.

ఆ డెడ్ బాడీ సూసైడ్ చేసుకున్న ఒక పెళ్లి కాని అమ్మాయి...

ఆ డెడ్ బాడీని స్ట్రెచర్ మీద పడుకో బెట్టారు.

ఆ బాడీకి బాహ్యంగా దెబ్బలేమైనా తగిలాయా అని చూడటానికి ఆ మార్చురీలో పని చేసే వాళ్లు ఆ బాడీకున్న బట్టల్ని తొలిగించారు.

ఆ తర్వాత ప్రొఫెసర్ గారు ఒక కత్తి, ఒక సుత్తి తీసుకొని కపాలాన్ని పగలగొట్టారు.

మెదడు కేమైనా దెబ్బలు తగిలాయా? అక్కడేమైనా రక్తం గడ్డ కట్టిందా అని పరీక్షించారు.

ఆ మెదడును బయటకు తీసి విద్యార్థులవెపు చూపించాడు.

మెదడు ఎలా వుంటుంది? అది ఎలా పనిచేస్తుంది. ఎవరైన తలపై కొట్టినా, నీటిలో పడి చనిపోయినా, (Drowming) నుదిటిపై కాల్చినా బ్రెయిన్‌లో వచ్చే మార్పులు ఎలా వుంటాయో ప్రొఫెసర్ గారు విద్యార్థులకు వివరించారు.

ఒక సీజర్ లాంటిది (Cutter) తీసుకొని చాతి ఎముకను కట్ చేసి గుండెను ఊపిరితిత్తులను బయటకు తీశాడు.

గుండెలో, ఊపిరితిత్తుల్లో... విషం తీసుకున్నప్పుడు, పాముగాని, తేలుగాని, కరిచినప్పుడు, ఎవరైనా చాతిపై కత్తితో పొడిచినప్పుడు, గట్టిగా చాతిపై కొట్టడం వల్ల చనిపోయినప్పుడు వచ్చే మార్పుల్ని వివరించారు.

ప్రొఫెసర్ చేతిలో వున్న ఆ భగ్న ప్రేమికురాలి గుండెను చూస్తుంటే మన్వితకి కళ్లనీళ్లు వాటంతటవే కారిపోతున్నాయి.

గుండెను, ఊపిరితిత్తుల్ని కోస్తున్నప్పుడు అంత ధైర్యంగా ఎలా చూడగలిగిందో ఆమెకే అర్థం కావడంలేదు. ఆ గుండెలో అతను కన్పిస్తాడేమోనని, ఆ చిన్ని గుండె ఆ ప్రేమికుడ్ని ఎంత గుప్తంగా దాచుకుందోనని, ఎన్ని వేల సార్లు అతన్ని గుర్తు చేసుకుందోనని, ఎన్ని అనుభూతుల్ని, ఎన్ని కన్నీళ్లని, ఎన్ని జ్ఞాపకాలని దాచుకుందో చూడాలని... కళ్ల నీళ్లు చూపుకి ఇబ్బంది కల్గిస్తున్నా అలాగే చూస్తోంది మన్విత.

చనిపోక ముందు ఆ ప్రేమికుడి మొదటి స్పర్శ, మొదటి ముద్దుని మది మూలలో దాచుకొని ఆ పేమికురాలి గుండె ఎంత అనుభూతి చెంది వుంటుందో.... అతన్ని తలచుకుంటూ ఆ గుండె ఎన్నిసార్లు అమృతం నదిలో మునకేసి వుంటుందో... క్షణక్షణం అనురాగ మకరందాన్ని కురిపిస్తూ ఎంతటి ప్రేమ మాధుర్యాన్ని చవిచూసివుంటుందో... మంచుపూల వర్షంలో తడుస్తూ ప్రేమ అనే పదానికి ప్రాణం పోసుకుంటూ తియ్య దనాన్ని చిలిపితనాన్ని, ఆత్మీయతను కలబోసుకొని ఆ లేత అదరాలతో ఎంత ప్రేమామృతాన్ని గ్రోలి వుంటారో...

చనిపోయే ముందు ఆమె తన ప్రియుడ్ని చూడాలని ఎంతగా ఆక్రోశించి వుంటుందో... ఆ పిడికెడు గుండెలో ఎన్ని అనుభూతులో... ఎంత స్పందనో... ఎంత ప్రేమో... అర్థం చేసుకునే హృదయం కోసం ఎంతగా ఎదురు చూసి వుంటుందో.... ఒకరి కోసం ఒకరు ఎన్ని నిద్రరాని రాత్రుల్ని గడిపివుంటారో....

ఈ రోజు ఈ మార్చురీలో ఆమె చాతి ఎముకను కట్ చేసి గుండెను బయటకు తీసి మెడికల్ కాలేజి స్టూడెంట్స్‌కి పాఠాలుగా చెబుతారని ముందుగా తెలిసుంటే 'నా గుండెలో నువ్వు కన్పిస్తావు వెళ్లి చూడు' అని తన ప్రేమికునికి ఒక వుత్తరం రాసి వుండేదేమో...

గుండెను పిండుతున్నట్లై గట్టిగా కళ్లు మూసుకొంది మన్విత.

ఆ ప్రొఫెసర్ దృష్టి, చేతులు ఆడెడ్ బాడీపై ఒడుపుగా కదులుతున్నాయి. విద్యార్థులలో ఏకాగ్రత పెరిగింది.



ఆయన ఒక బ్లేడు తీసుకొని కడుపు కట్ చేశాడు. అందులో వున్న పేగులు, మూత్ర పిండాలు, మరియు జీర్ణాశయం వాటిలో వచ్చే మార్పుల్ని వివరించి.... పోస్ట్ మార్టమ్‌ని ముగించాడు.

క్లాసు ముగియగానే ఒక్కొక్క విద్యార్థి బయట కొచ్చి, చెట్ల క్రింద నిలబడి, జరిగిన క్లాసు గురించి కాసేపు చర్చించుకున్నారు.

అక్కడనుండి కదిలి అమ్మాయిలు, అబ్బాయిలు ఎవరి హాస్టల్‌కివాళ్ళు వెళ్లారు.

* * * * *

ప్రతి సంవత్సరం ఆగస్టులో జరిగే గణేష్ నవరాత్రులు ఈ సంవత్సరం అనురాగ్ వాళ్ల బ్యాచ్ వాళ్లు నిర్వహించాలని ప్రిన్సిపాల్ నోటీస్ పంపించారు.

అందుకు అనురాగ్ ఉత్సాహంగా ముందుకి వచ్చాడు. అతని ఫ్రెండ్స్ కూడా అతని వెనక వుండి అతన్ని ముందుకి నడిపారు. ఆ తొమ్మిది రోజులు గణేష్ నిమజ్జనం వైభవంగా జరపాలని జూనియర్స్ దగ్గర ,హాస్పిటల్ స్టాఫ్ దగ్గర, కాలేజీ స్టాఫ్ దగ్గర గణేష్ చందా కలక్ట్ చేశాడు అనురాగ్.

ముందుగా ఆడిటోరియంను అందంగా అలంకరించారు.

పదమూడు అడుగుల గణేష్ విగ్రహాన్ని ట్రాక్టర్ మీద ఎక్కించుకొని బ్యాండ్ మేళంతో తీసుకొచ్చి ఆడిటోరియంలో ప్రతిష్టించారు.

తొమ్మిది రోజులు తొమ్మిది రకాల పూజలు జరిపారు.

ప్రతి బ్యాచ్‌కి ఒక్కో రోజు చొప్పున పూజలు చేయించారు.

అదే విధంగా ఎగ్జామ్ గోయింగ్ బ్యాచ్ వాళ్లకి ప్రత్యేకమైన పూజలు చేయించారు.

ప్రతి రోజు కాలేజి ఆడిటోరియంలో గణేష్ విగ్రహం దగ్గర దీక్షిత తన ఫ్రెండ్స్‌తో వెళ్లి పూజలు చేయించుకొని, పూజారిగారు చెప్పే దేవుని కథలను శ్రద్ధగా వింటోంది.

గణేష్ దగ్గర మన్విత కన్పించగానే 'హాయ్' చెప్పింది దీక్షిత.

ఈ మధ్యన దీక్షితతో మన్విత మనస్ఫూర్తిగా మాట్లాడలేకపోతోంది. తన అంగీకారం లేకుండా తన వస్తువుని తీసుకుంటే పైకి చెప్పుకోలేక,

తిరిగి తీసుకోలేక సతమతమవుతోంది.... స్వతహాగా విభేధాలకి దూరంగా వుండే మన్విత లోలోన బాధ పడటం తప్ప ఏం చేయలేక పోతోంది. ఆ వస్తువు ఎంత విలువైందో మన్వితకి తెలుసు. అందుకే అంత బాధ. ఆ బాధలో తనేమై పోతుందో తనకే తెలియదు. పైకి మాత్రం దీక్షితను చూసి నవ్వుతూ ' హాయ్ ' చెప్పింది మన్విత.

ఆ రోజే గణేష్ నిమజ్జనం....

బ్యాండ్ మేళంతో - జూనియర్ అబ్బాయిలను తీసుకొచ్చి... వారి చేత డాన్సులు చేయించుకుంటూ, ఒక పండగ వాతావరణాన్ని తలపించే విధంగా గణేష్‌ని తీసికెళ్తున్నారు.

ఆ సందడి, ఆ కోలహలం చూస్తుంటే - సముద్రంలోని కెరటాలు పైకి లేచి దగ్గర్లో వున్న రాళ్లను తాకి ఆనందంగా కేక లేస్తున్నట్లు వుంది.

ఆ ఆది దేవుని, ఆ దేవ దేవుని ఆశీస్సులు పొందుతూ ఆనందంతో పరవశిస్తూ వరంగల్ సిటీ అంతా అలాగే వుంది.

అది చూస్తుంటే పరిస్థితులు మనిషిని సృష్టించటంలేదు. మనిషే పరిస్థితుల్ని సృష్టిస్తున్నాడనిపిస్తోంది.

ఒక్క మాటలో చెప్పాలంటే కాకతీయ వైద్య కళాశాల ఆవరణంలో అగ్ని హోత్రం లాంటి హుషారు, అగ్నిపర్వతం లాంటి ఉత్సాహం నిండి... కొండలు కూడా కదిలి నాట్య ం చేస్తున్నట్లు వుంది.

దారి మధ్యలో గణేష్‌ని ఆపుకుంటూ - తిరిగి కదులుతున్నారు.

'గణేష్ పప్ప మోరియా' అంటూ అబ్బాయిలందరు లేడిస్ హాస్టల్ వైపురాగానే... దేవున్ని ఆపుకొని అక్కడ డాన్సులు చేయడం ప్రారంభించారు.

అమ్మాయిలు వచ్చి కొబ్బరికాయలు కొట్టి, దేవునికి కర్పూరంతో హారతి యిస్తున్నారు.

అమ్మాయిల్లో కొంత మంది... బిల్డింగ్ పై కెళ్లి, వరుసగా నిలబడి అబ్బాయిల డాన్స్ చూస్తున్నారు.

అబ్బాయిలింకా ఉత్సాహంగా డాన్స్ చేస్తున్నారు.

బాణ సంచా కాలుస్తున్నారు. అలా కాలుస్తున్నప్పుడు...



నేల పై నుండి పైకి లేచిన తారాజువ్వలు ఆకాశాన్ని తాకి నక్షత్రాలను వెంట బెట్టుకొని వస్తునట్లు... భూమికి.. ఆకాశానికి మధ్య కళ్లు మిరమిట్లు గొలుపుతూ... తమ వైపే చూస్తున్న అబ్బాయిల్ని, అమ్మాయిల్ని చూసి 'హాయ్' చెబుతున్నట్లు... నెమ్మదిగా క్రిందకి రాలుతున్నాయి.

ఫ్రెండ్సంతా ఫోర్స్ చేసిలాగడంతో అనురాగ్ కూడా డాన్స్ చేస్తున్నాడు.

ఆ డాన్స్‌లో అతను దీక్షితకి ప్రత్యేకంగా కన్పిస్తున్నాడు. డాన్స్ చేస్తూ కూడా అప్పుడప్పుడు దీక్షితను చూస్తున్నాడు అనురాగ్.

దూరం నుండి అది గమనిస్తూ... నేలకి అతుక్కున్నట్లు, కర్రలా నిలబడ్డ మన్విత అందరిలా ఎంజాయ్ చేయలేక పోతోంది తను దేన్నో కోల్పోతున్న భావన ఎక్కువైంది.

హారతి ఇస్తున్న ఒక అమ్మాయి కర్పూరం వెలిగించి, అగ్గి పుల్లను క్రింద వెయ్యడంతో అది ఒక పేపర్ పై పడి - కింద జీరాడుతున్న దీక్షిత చున్నీకి అంటుకొంది. దీక్షిత దాన్ని గమనించుకోలేదు. అక్కడున్న అమ్మాయిల దృష్టి కూడా డాన్స్ మీద... గణేష్ మీద వుంది.

అప్పుడే అక్కడికి వచ్చిన మన్విత కాలుతున్న దీక్షిత చున్నీని చూసి అలాగే స్థంభించిపోయి నిల్చుంది.

బిత్తర పోయాడు అనురాగ్...మన్విత అప్పుడే అక్కడికి వచ్చిందన్న విషయం తెలియని అనురాగ్ గమనించలేదు.

నాలుగు అంగల్లో దీక్షితను చేరి కాలుతున్న చున్నీని పక్కకి విసిరాడు.

మన్విత వైపు కోపంగా చూశాడు. అదెలాంటికోపం అంటే మన్విత చెంపచెళ్లు మనిపించేంతటి కోపం. ఆ కోపాన్ని తట్టుకోలేక పోయింది మన్విత. అతనెందుకలా కోపంగా చూశాడో మన్వితకి అర్థం కాలేదు.

అనురాగ్ ఫ్రెండ్స్ అతని భుజాలమీద చేతులు వేసి నెమ్మదిగా తడుతూ డాన్స్ దగ్గరికి తీసుకు వెళ్లారు.

మళ్లీ డాన్స్ మొదలైంది.

అనురాగ్ కొట్టక పోయినా తన వైపు చూసిన చూపులకి భూమిలోకి క్రుంగి పోతున్న దానిలా అయి, వెంటనే లోపలి కెళ్లి బెడ్ మీద బోర్లా పడుకొంది మన్విత.

బోరున ఏడ్చింది మన్విత. కదిలి, కదిలి ఏడ్చింది. వెక్కి, వెక్కి ఏడ్చింది.

"నీ కేమైనా పిచ్చా. ఎందుకలా ఏడుస్తావ్?" అంటూ ఫ్రెండొచ్చి పలకరించింది. ఆ ఫ్రెండ్ పేరు సంజన.

అయినా అలాగే పడుకొని ఏడుస్తూ కదులుతోంది మన్విత.

"కూల్ మన్వితా! కూల్!" అంది సంజన మన్విత తలపై చేయివేసి నిమురుతూ

ఏడుపుతో ఎర్ర బడ్డ ముఖాన్ని దిండులో దాచుకుంటూ...

"అనురాగ్ చూడవే నా వైపు ఎలా చూశాడో. బాధగా వుంది. అసలు నేను చేసిన తప్పేంటి?" అంటూ తన మనసులో మాటని బయట పెట్టింది.

"పక్కనే వున్నావు కదా! దీక్షితను పక్కను లాగివుంటే ప్రాబ్లమ్ వుండేది కాదు." అంది సంజన.

"నేను గమనించ లేదు సంజనా! అప్పుడే వచ్చాను అక్కడికి. లేకుంటే దీక్షితను పక్కకి లాగేదాన్ని..." అంది మన్విత.

"అది అతనికి తెలియదు కదా! నువ్వు చూసి కూడా సేవ్ చెయ్యలేదని పొరబడ్డాడు. లైట్ తీసుకో మన్వితా! అతను రావటం క్షణం లేటయినా దీక్షిత ఈ పాటికి హాస్పిటల్లో వుండేది." అంది సంజన. అనురాగ్ తన వైపు కోపంగా చూసిన ఆ చూపులు మన్విత కళ్లలో మెదిలి... "చున్నీ కాలుతుంది. అంతేగా ప్రాణం పోతుందా?" అంది మన్విత.

మన్వితకి ఆ క్షణంలో ఏం మాట్లాడుతుందో అర్థం కాలేదు. ఒక్క అనురాగ్ తన వైపు చూసిన చూపు తప్ప! ఆచూపు పదునైన శూలాన్ని తనలో కసుక్కున దింపినంత బాధగా వుంది.

"ఎందుకలా...మాట్లాడుతున్నావ్?" అంది ఆశ్చర్యపోతూ సంజన

"అతని తొందర చూస్తుంటే నాకు అలాగే మాట్లాడాలనిపిస్తోంది." అంది మన్విత

"అతనికి తొందరే! ఆ తొందరే అతన్ని అన్నిటల్లో ముందుంచు తుంది. చదువులోనే కాక సోషల్ వర్క్‌లో కూడా... అంటే కాలేజిలో జరిగే



ప్రతివిషయంలో నిజాయితీగా, అలసట లేకుండా పరిశ్రమిస్తాడు అతనివి ఉన్నతమైన ఆలోచనలని, ఉదారమై ఆశయాలని, కాలేజిలో అందరూ చెప్పుకుంటున్నారు." అంది ఫ్రెండ్

"ఏమిటో అంత ఉన్నతం... ఉదారం.." అంది మన్విత వత్తి పలుకుతూ" అనురాగ్ తన మనసును అర్థ చేసుకోలేకపోతున్నాడన్న బాధతో.

ఆ బాధతో పాటు అనురాగ్ తనని మిస్ అండస్టాండ్ చేసుకున్నాడన్న వేదనకూడా వుంది.

"ఆరోజు... అబ్బాయిల హాస్టల్లో డిప్రెషన్‌కిలోనై ఒక అబ్బాయి చనిపోతే... ఎవరూ చూడకపోవడంతో, ఆ బాడీకి పురుగులొచ్చి , విపరీతమైన వాసనొచ్చి ఎవరూ దగ్గరకి వెళ్లలేనప్పుడు అనురాగే కదా సరైన ప్లాన్ చేసి అన్ని పనులు దగ్గరుండి జరిపించింది." అంది సంజన

"అవునవును... పోలీసులు, మీడియావాళ్లుకూడా వచ్చారు" అంది మన్విత ఒప్పుకుంటూ.

"అంతటితో ఆగకుండా... కాలేజీ సిబ్బందితో పాటు, ఓ యాభై మంది విద్యార్థులు, అంబులెన్స్ మరియు కాలేజి బస్‌లో బయలు దేరి వాళ్ల ఊరు వెళ్లి అంత్య క్రియలు జరిపించారు. తెల్లవారి... వాళ్ల ఎకనామికల్ పొజిషన్‌ని ప్రిన్సిపాల్ గారి దాక తీసి కెళ్లి, ఒక డొనేటెడ్ బాక్స్ కాలేజీలో ఏర్పాటు చేసి... వచ్చిన ఏభైవేల రూపాయలను తీసుకొని, ఇరవై ఐదు మంది విద్యార్థులతో కలిసి వెళ్లి అనురాగే కదా వాళ్ల తల్లి దండ్రులకి యిచ్చింది. ఇంత కన్నా ఉదారత్వం వుంటుందా? ఈ రోజు కూడా అతనిలోని మానవత్వమే దీక్షితను కాపాడింది. అందరిలా ఒళ్లు మరచి డాన్స్ చెయ్యకుండా, అతను అంతా గమనిస్తున్నాడు. తెలుసా?" అంది సంజన .

"అంతా కాదు. దీక్షితనే గమనిస్తున్నాడు." అనిమనసులో అనుకుంటూ పైకి అన లేక పోయింది. అంటే? ఫ్రెండ్‌తో వాగ్యుద్ధం మొదలవుతుంది.

... ఈ విషయంలో తనెందుకు అందరిలా ఫీలవ్వలేక పోతోంది.?

అతనిలోని మానవత్వాన్ని ఎందుకు ఒప్పుకోలేక పోతోంది?

నిజానికి ఈ రోజు తనీ మెడిసిన్ చదవటానికి కారణం అతనే కదా!

"దాన్ని చదివించటం ఆపి పెళ్లి చెయ్యండి! మన ఇళ్లలో ఇంటర్ కన్నా ఎక్కువ చదివిన ఆడ పిల్లలు లేరు. ఇంతవరకు చాలు" అని తల్లి అనటం గుర్తొచ్చింది మన్వితకి.

"మెడిసిన్లో సీటు రాకుంటే అలాగే చేసేవాణ్ని. అసలీ సీటు రావటమే గొప్ప విషయం. ఈ సీటు కోసం అదెంత కష్టపడి చదివిందో నాకు తెలుసు" అన్నాడు తండ్రి.

"అయితే దానికి పెళ్లి చెయ్యరా?" అనుమానంగా అడిగింది. కృష్ణవేణి

"చదివిస్తాను." స్థిరంగా అన్నాడు. విశ్వనాథ్

"చూడండీ! ఆడ పిల్లకి పెళ్లి చేస్తేనే మర్యాద. మా వదిన కొడుకు రెడీగా వున్నాడు. ఈ మధ్యన కరెంట్ పని కూడా నేర్చుకున్నాడట. అది పోతే అంత కన్నా మంచి సంబంధం రాదు." అంది.

"ఏది మంచి సంబంధమోనాకు తెలుసు. రేపు నాకూతురు డాక్టరైతే అది డాక్టర్నే  చేసుకుంటుంది. దానికి మొగుడు రాడన్న భయం నాకు లేదు." అన్నాడు విశ్వనాద్.

"అలాగే మీ కలల్లో మీరుండండి!"

"కల కాదు కృష్ణవేణీ! దాన్ని నిజంగానే ఎం.బి.బి.యస్ చదివిస్తాను" అన్నాడు.

"మీరు దాన్ని చదివిస్తే నేను ఉరిపోసుకొని చస్తాను". అంది

... ఆ మాటలకి భయపడి విశ్వనాద్ మాట్లాడలేదు.

బక్కెట నీళ్లు నెత్తిన కుమ్మరించినట్లు.. చల్లబడిపోయాడు.

ఇది తెలిసి ప్రియబాంధవి మేడమ్ని తన యింటికి పంపాడు అనురాగ్

ఆమె వాళ్లకి నచ్చచెప్పటానికి... వాళ్లని ఒప్పించటానికి... ఎంత కష్టపడిందో మన్వితకి తెలుసు.



ఇంట్లోనే వుండి డేస్కాలర్గా కాలేజీకి వెళ్లి చదువుకోవచ్చు కానీ ఇంట్లో వుండి చదివితే ఆ ఇంటి వాతావరణం ఎలా వుంటుందో తెలిసిన అనురాగ్ విశ్వనాదంతో మాట్లాడి తనను కాలేజిలోనే లేడీస్ హాస్టల్లో వుంచి చదివించే ఏర్పాటు చేశాడు.

ఈ విషయంలో అనురాగ్ ఋణం ఏ రూపంలో తీర్చుకున్నా తీరదు. అలా అని అతని ప్రేమలో దీక్షిత తడిసిపోతుంటే చూస్తూ తట్టుకోలేదు. ఎందుకంటే?

అనురాగ్ నిక్కర్లలో నుండి ప్యాంట్లలోకి మారి, వచ్చీ రాని నూనూగు మీసాలతో కన్పించటం మొదలైన క్షణం నుండి తన మనసులో ప్రేమ బీజం మొలకెత్తింది. అదెలా అంటే? గుండె భూమిని చీల్చుకుంటు మొలకెత్తే మొక్కలా... అతి సహజంగా మొలకెత్తింది. ఒక వైపు సీరియస్గా చదువుకుంటున్నా... కళ్లముందే వయసుకి మించి ఎదుగుతున్న అనురాగ్ తన గుండెను లాగటం మొదలు పెట్టాడు.

తనకి తెలియకుండానే తన హృదయాన్ని స్పశించి, సంతోషపు కల్లోలాన్ని సృష్టించాడు. అంతరాంతరాల్లోకి చొచ్చుకు పోయాడు. అనిర్వచనీయంగా, అవ్యక్తంగా తన గుండెలో అమరిపోయాడు. తన ప్రమేయం లేకుండానే కవ్విస్తూ, కదిలిస్తూ, మరిపిస్తూ, మురిపిస్తూ, స్పందించటం ఎలాగో తన గుండెకు నేర్పాడు. తన అణువణువును తట్టి చైతన్య పరిచాడు.

ఇంటర్ ఫస్ట్ ఇయర్ అయ్యాక - సెలవుల్లో ఇంటికెళ్లాక పరధ్యానం ఎక్కువైంది. ఒకసారి పిలిస్తే పలికేది కాదు. ఎక్కువసార్లు పిలిస్తే తపోభంగం కలిగినట్లు కోప్పడేది. ఎవరు ఫోన్ చేసినా తనకే అని పరిగెత్తేది-నిజానికి అనురాగ్ తనకి ఫోన్ చేస్తే ఎక్కువగా చదువు గురించే మాట్లాడతాడు. అతను ఏది మాట్లాడినా ఆ గొంతు వింటూ అమృతంలో మునకేసినట్లు మురిసిపోయేది. అందం మీద, అలంకరణ మీద ఆసక్తి పెరిగి అవసరం లేకున్నా ఒకటికి రెండు సార్లు ముఖం కడుగుతుంటే తల్లి చూసి ముఖం వాచేట్లు తిట్టేది. నానమ్మేమో దీనికి పిచ్చి పట్టింది అనుకునేది. సరిగా తినేది

కాదు. సమయానికి నిద్రపోయేది కాదు. అనురాగ్ గుర్తొచ్చినప్పుడు తనలో తాను నవ్వుకునేది. మరిచిపోయినప్పుడు గుర్తు చేసుకునేది. ఏదిలేనప్పుడు శూన్యంలోకి చూస్తూకూర్చునేది. ఒక్కోసారి ఉత్సాహం... అంతలోనే చెప్పలేని నీరసం..

అయినా కూడా.... అతని కోసం తనెప్పుడు లేడిస్ హాస్టల్ గోడ దూకలేదు. అతని పక్కన కూర్చొని రొమాంటిక్ సినిమాలు చూడలేదు. పార్క్‌లో, బేకరీల్లో, గంటలు, గంటలు కూర్చోలేదు. తెల్లవారే వరకు ఫోన్‌లో స్వీట్ నథింగ్స్ చెప్పుకోలేదు. వాలెంటైన్స్‌డే రోజు వర్ణనలతో కూడిన ఉత్తరాలు రాసుకోలేదు. మనసుతో చూసి, కళ్లతో అనుభవించి, గుండెలో నింపుకొంది.

కానీ ప్రేమించడంలోని మధురిమ స్వర్గాన్ని చూపిస్తే... ఆ ప్రేమను ఎలా గెలవాలో తెలియక ఇప్పుడు నరకాన్ని చూస్తోంది.

ఎలాగైనా అతన్ని గెలవాలి!

గెలవాలి అంటే తనేంటో అతనితో చెప్పాలి. తనలో ఏముందో చెప్పాలి. ఎవరూ చెప్పని, చెప్పలేనంత అపురూపంగా చెప్పాలి. అలా చెప్పేంత వరకే తనకీ ఒంటరితనం. ఆ తర్వాత అనురాగ్ పరిపూర్ణంగా తన మనిషి అయిపోతాడు.

ఇన్ని రోజులు చెబితే ఏమంటాడోనని చెప్పలేక పోయింది కాని, చెప్పక తప్పు చేశానేమోనని ఇప్పుడనిపిస్తోంది.

ఈ నిర్ణయానికి వచ్చాక మన్విత మనస్సు బయటకురిసే చల్లని వెన్నెల్లా హాయిగా అన్పించింది.

* * * * *

పదిరోజులు గడిచాక...

పల్స్ ప్రోగ్రాంకి రావలసిందిగా ఎయిమ్స్ (AIIMS) నుంచి ఆహ్వానం వచ్చింది.

ఈ ప్రోగ్రాం కోసం ప్రతి విద్యార్థి ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు.



దీక్షిత మాత్రం ఈ ప్రోగ్రాం పట్ల ఎలాంటి కలలు లేని దానిలా మౌనంగా వుండి పోయింది.

దీక్షిత ప్రోగ్రాంకి రాదన్న విషయం తెలిసి లోలోన సంబర పడింది మన్విత. అనురాగ్‌కి తన మనసు తెలుపుకోవాలన్నా, అతని మనసు గెలుచుకోవాలన్నా ఇదో మంచి అవకాశంలా భావించింది. ఇది అసూయకాదు. ఆశ. మన్విత కూడా అందరమ్మాయిల్లాగా తన ప్రేమకోసం ఆరాటపడ్తుంది. ఆ ఆరాటంలో కలిగిన చిన్న ఫీలింగే ఈ ఆనందం.

ఆ టూర్ లో దీక్షిత లేకుంటే... అనురాగ్‌కి దగ్గరగా తిరగొచ్చు మాట్లాడొచ్చు. మనుసులో వున్నది చెప్పుకోవచ్చు. ఇది ఆమె ఆశ.

ఇంత కన్నా ఏం కావాలి?

ఇప్పుడు... ప్రపంచం రంగురంగుల ఇంద్రధనస్సులా వుంది మన్వితకి.

అనురాగ్ వెళ్లి... ప్రోగ్రాం గురించి చెప్పి దీక్షితను రమ్మని చెప్పాడు. ఆమె ఒప్పుకోక పోయో సరికి - నిరాశగా ఫీలయ్యాడు.

ఎలాగైనా పల్స్ ప్రోగ్రాంకి దీక్షితను తీసికెళ్లాలని ఆమె ఫ్రెండ్స్ ద్వారా చెప్పించాడు.

ఫైనాన్స్ ప్రాబ్లమ్ వల్ల ఆమె రాలేనంటుందని ఫ్రెండ్స్ ద్వారా తెలుసుకున్నాడు.

ఆ డబ్బులు అతనే ప్రొవైడ్ చెయ్యాలనుకున్నాడు.

ఆమెకు అయ్యే ఖర్చులు వాళ్ల ఫ్రెండ్స్‌తో పంపించాడు.

ఫ్రెండ్సే యిస్తున్నట్లుగా యిచ్చి పంపించాడు.

దీక్షిత ఒప్పుకుంది. పల్స్ కెళ్లే విషయాన్ని వెంటనే పేరెంట్స్‌కి తెలియజేసింది... "ఫ్రెండ్ దగ్గర తీసుకున్న డబ్బుని మామయ్యని అడిగి తర్వాత పంపుతా" అని పేరెంట్స్ అన్నారు.

అనురాగ్ తక్షణమే ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్లి లెటర్ తీసుకొని రైల్వే స్టేషన్ కెళ్లి రెండు బోగీలను రిజర్వ్ చేయించాడు.

మరుసటి రోజు తొమ్మిది గంటలకి... మెడికో విద్యార్థులంతా కాజీపేట్‌లో ఏ.పి. ఎక్స్‌ప్రెస్ ట్రైనెక్కి బయలు దేరారు.

ట్రైన్‌లో... అబ్బాయిలు ఒక వైపు, అమ్మాయిలు ఒక వైపు కూర్చున్నారు. కిటికీ వెపు సీట్లో అనురాగ్ కూర్చున్నాడు. అతనికి ఎదురుగా దీక్షిత కూర్చుంది. దీక్షిత పక్కన సౌమ్య, సౌమ్మకి ఎదురుగా దినేష్. సౌమ్య పక్కన, సీటుకి చివరగా మన్విత. మన్వితకి ఎదురుగా ఆకాశ్ కూర్చున్నాడు.

ఎవరి సీట్లలో వాళ్లు కూర్చున్నాక... అమ్మాయిలు, అబ్బాయిలు కలసి టైంపాస్‌కి అంతాక్షరి ఆడుకున్నారు.

అంతాక్షరి అయ్యాక ఎవరికి నచ్చిన పాటలు వాళ్లు పాడాలనుకున్నారు. అనుకున్న వెంటనే పాడటం మొదలు పెట్టారు.

అద్భుతంగా పాడుతున్నారు.

అనురాగ్ వంతురాగానే గుండెలనిండా గాలి పీల్చుకొని దీక్షిత వైపు చూస్తూ....

"ఎదుట నిలిచింది చూడు.... జలతారు వెన్నెలేమో

ఎదను తడిపింది నేడు.... చినుకంటి చిన్నదేమో

మైమరచిపోయా మాయలో... ప్రాణమంత మీటుతుంటే, వానవీణలా...

ఎదుట నిలిచింది చూడూ....

నిజంలాంటి ఈ స్వప్నం ఎలా పట్టి ఆపాలి.... కలే అయితే, ఆ నిజం ..

ఎలా తట్టుకోవాలి....

అవునో..... కాదో..... అడగకంది నా మౌనం.

చెలివో.... శిలవో తెలియకుంది నీ రూపం

చెలిమి బంధమల్లుకుందే జన్మఖైదులా...

ఎదుట నిలిచింది చూడు..." అంటూ అనురాగ్ పాడుతుంటే అతని గొంతులోని మాధుర్యానికి మైమరిచిపోయారు.

మన్విత తలదించుకొని పాటలో లీనమై వింటోంది. అతను పాటలు బాగా పాడతాడని మన్వితకి తెలుసు.



తర్వాత దీక్షిత వంతురాగానే తనకు పాటలురావని గొంతు సవరించికుంటూ చెబుదామని అనుకొంది. కానీ అప్పటికే ర్యాగింగ్ టైంలో పాడిన అనుభవం వుండడం వల్ల, పాటలు పాడడం వల్ల వచ్చే ఆనందాన్ని రుచి చూసింది కాబట్టి పాడటానికి సిద్ధమైంది. అప్పటికే అనురాగ్ పాడిన పాట ఆమె నరనరంలో జీర్ణించుకు పోయింది.

దీక్షిత నెమ్మదిగా తన చేతి వేళ్ల వైపు చూసుకుంటూ...

"వెంట పడుతుంది చూడు.... కనపడని మంట ఏదో

బదులు అడిగింది నేడు.... వినపడని విన్నపమేదో

మది మునిగి పోయే మత్తులో...

మధురమెన యాతనేదో... బయట పడదిలా"... అని పాడుతుంటే అంతా షాకై విన్నారు. ఆ పాటపాడిన సింగరే వచ్చి వాళ్ల ముందు కూర్చుని పాడుతున్నట్లు ఫీలయ్యారు. అంత బాగా పాడింది దీక్షిత... అది గమనిస్తున్న మన్విత - అనురాగ్ పాడిన పాటని దీక్షిత కంటిన్యూ చేయడం వల్ల వాళ్ల ఆలోచనలు కూడా కలిసిపోయాయని ఒక్క క్షణం ఫీలయింది.

"సూపర్బ్... ఎలా పాడగలిగావు... ఇలా? వింటుంటే ప్రతి పదం హృదయాన్ని పిండుతున్నట్లే వుంది. నీ మనసుల్లో బయట పెట్టలేని బాధేమైనా వుందా?" అంది వెంటనే సౌమ్య దీక్షిత చేతిని తన చేతిలోకి తీసుకుంటూ...

"ఛ... ఛ... అలాంటిదేం లేదు.." అంటూ అనురాగ్ వైపు చూసింది దీక్షిత.

అనురాగ్ వెంటనే మన్విత వైపు చూస్తూ పాడమన్నాడు

తడబడింది మన్విత.

ఇప్పుడు తనేం పాడాలి?

తనకి పాటలు రావు.

అంటే? పూర్తిగా రావని కాదు.

స్కూల్లో చదువుతున్నప్పుడొకసారి ఫ్రెండ్స్‌తో బాల్కనీలో కూర్చుని పాటలు పాడుతుంటే తన తల్లి లోపలకి పిలిచి ఆ చెంపా, ఈ చెంపా వాయించి పెట్టింది. మళ్లీ పాడావంటే చంపేస్తానంది.

అప్పుడప్పుడు బుక్స్ సర్దుకుంటూనో, పౌడర్ పూసుకుంటూనో 'హమ్' చేస్తేచాలు.

"వెదవరాగాలు ఆపి పనిచూడు. ఎవరైనా వింటే పిచ్చను కుంటారు. పెళ్లీడు కొచ్చింది పెళ్లి చెయ్యి మంటారు. పిల్లనెలా పెంచాలో సరిగా నేర్చుకో అని నా ముఖం మీద తిడతారు. తల నేల కేసుకొని తిరగాలంటే నా వల్లకాదు". అనేది.

తల్లి అలా అన్నప్పుడు తల గోడకేసి కొట్టు కోవాలనిపించేది.

ఆ బాధలో వెళ్లి తల్లితో ఎదురుతిరిగి ఎలా గెలావాలో చెప్పమని నానమ్మను అడిగేది. అప్పుడు నానమ్మ...

"నాకేం తెలుసు మనవరాలా? నేను బాల్యంలో వున్నప్పుడు మా పెద్ద వాళ్లు చిన్న పిల్లవి నీకేంతెలియదు మాట్లాడకు" అనే వాళ్లు యవ్వనంలోకి వచ్చాక "మంచీ - చెడుతెలియదు నోరుమూసుకొని కూర్చో" అనేవాళ్లు. ఇప్పుడిక వృద్ధాప్యంలోకి వచ్చాక "ముసల్దానివి, ఇప్పటి సంగతులు నీకేం తెలుసని మాట్లాడతావ్! మాట్లాడకుండా కూర్చో!" అంటున్నారు నా పిల్లలు. పుట్టిబుద్దెరిగాక మాట్లాడే అవకాశమే రాని నా దగ్గర నీకు చెప్పేంతటి మాటలేముంటాయి. చెప్పు?" అనేది పాపం నానమ్మ . మరి తను?

"ఏం మన్వితా! ఆలోచిస్తున్నావ్? ఏం పాడాలి అని సెలక్ట్ చేసుకుంటున్నావా?" అన్నాడు నవ్వుతూ దినేష్.

"నాకు పాటలు రావు. ప్లీజ్! నన్ను వదిలెయ్" అన్నట్లుగా ఇబ్బందిగా రిక్వెస్ట్ చేస్తున్నట్లు చూసింది మన్విత.

అది గమనించి దినేష్ మన్వితను ఇబ్బంది పెట్టదలచు కోలేదు.

జీవిత ప్రయాణంలాగే ట్రైన్ ప్రయాణంలో కూడా అందరు కలసి ప్రయాణించాల్సిందే...

పాటల ప్రోగ్రాం అయిపోగానే... నంజన ధమ్ షరాడ్స్ ఆడుకుందామని అడిగింది.

ధమ్ షరాడ్స్ - అంటే మూగసైగలతో ఆడే ఆట ఆ ఆటనెంతో ఉత్సాహంగా ప్రారంభించారు. అది అయ్యాక...



సినిమాలో జోక్స్ చెప్పుకున్నారు.

ఆ తర్వాత...

ఆమ్‌రెజిలింగ్ ఆడారు. ఈ ఆట ఎదురుగా ఎవరుంటే వాళ్లతో ఆడారు. అదెవరెవరంటే? దీక్షిత - అనురాగ్, సౌమ్య - దినేష్, మన్విత - ఆకాశ్.

తనది అనురాగ్ ఎదురు సీటు కానందుకు జీవితంలో ఎప్పుడూ కానంతగా ఫీలయింది మన్విత. తన బ్రతుకంతా ఫీలవుతూ బ్రతకడమే అయినందుకు లోలోన కుమిలి పోయింది.

ఒక్క మన్విత తప్ప మిగతా అందరు ట్రైన్ జర్నీని హ్యాపీగా ఎంజాయ్ చేస్తూ వెళ్తున్నారు.

రాంగుండం రాగానే థర్మల్ పవర్ స్టేషన్‌ని, గోదావరి నది ప్రవహించటాన్ని తిలకిస్తూ ట్రైన్ లో టిఫిన్ తిని సిరిపూర్‌కాగజ్ నగర్ చేరుకున్నారు.

టైం పన్నెండు అయింది.

మహారాష్ట్రలో ట్రైన్ జర్నీ చెయ్యడం ఒక ప్రత్యేకమైన అనుభూతి అనే చెప్పవచ్చు.

చంద్రాపూర్, నాగాపూర్ దాటిన తర్వాత ట్రైన్ కొండల క్రిందనుండి వెళ్తుండడంతో ట్రైన్‌లో చీకటి అలుముకొని లైట్స్ ఆన్ అయ్యాయి.

అబ్బాయిలంతా ఒక్క సారి కేకలతో ఉత్సాహవంతమైన అరుపులతో ఎంజాయ్ చేసుకుంటూ సమయం తెలియకుండా ప్రయాణాన్ని సాగిస్తున్నారు.

రాత్రి తొమ్మిది, పది మధ్య డిన్నర్ ముగించుకొని, ఎవరి బెర్త్ మీద వాళ్లు నిద్రపోయారు.

* * * * *

ఉదయం లేచేసరికి ట్రైన్ మహారాష్ట్ర కొండల్ని దాటుతోంది.

కాలకృత్యాలు తీర్చుకొని, టిఫిన్ చేసి... మళ్లీ అదే సందడి వాతావరణాన్ని క్రియేట్ చేసుకుంటూ జర్నీని ఎంజాయ్ చేసుకుంటూ వెళ్తున్నారు.

ఇప్పుడు ఆడబోయే గేమ్‌లో... మెడిసిన్‌తో టచ్ లేని క్వొశ్చన్స్ వేసుకుంటూ ఆన్సర్స్ చెప్పుకోవాలనుకున్నారు.

"ఎందరో మహానుభావులు అందరికి వందనాలు అన్నది ఎవరు?" అని ప్రశ్నించాడు దినేష్.

అక్కడున్న వాళ్లెవరూ చెప్పలేకపోయారు.

"త్యాగరాజు" అంది దీక్షిత.

క్లాప్స్ కొట్టారు...

"మన జాతీయగీతం రచించిన కవి?" అడిగాడు అనురాగ్ మన్విత వైపు చూస్తూ. ఆమె చెప్పలేకపోయింది.

"రవీంద్రనాద్ ఠాగూర్" అంది దీక్షిత.

మళ్లీ క్లాప్స్...

"మహమ్మద్ ప్రవక్త ఏ తెగకు చెందిన వాడు?" అన్నాడు ఆకాశ్ సౌమ్య కాని, మన్విత కాని చెప్పలేక పోయారు.

"కురైష్ తెగకి చెందినవాడు". చెప్పింది దీక్షిత.

"వజ్రాలు ఏ ఎడారిలో దొరుకుతాయి?" అడిగాడు దినేష్.

సౌమ్య ఏదో చెప్పింది. అది తప్పు అయింది. మన్విత కూడా తప్పే చెప్పింది.

"కలహారి ఎడారిలో దొరుకుతాయి." అంటూ కరక్ట్ ఆన్సర్ చెప్పింది దీక్షిత.

"కూచిపూడి ఆంధ్రప్రదేశ్‌లోని ఏ గ్రామంలో అవతరించింది?" అడిగాడు అనురాగ్.

సౌమ్య ఆలోచిస్తుంటే, మన్విత నా వల్ల కాదన్నట్లుగా చూసింది.

వెంటనే "కుచేలపురం" అంటూ దీక్షిత చెప్పింది.

అనురాగ్ ముఖం అదోలా అయింది. "ఏమైంది మన్వితా నీకు? ఒక్క దానికి కూడా సమాధానం చెప్పలేక పోయావ్?" అన్నట్లుగా చూశాడు. అదేదో గ్రూప్స్ రాసి పోయినట్లుగా బాధపడ్డాడు. అతను దీక్షిత ఆన్సర్ చేసినందుకు సంతోషించకుండా, మన్విత చెయ్యలేనందుకు బాధ పడ్తున్నాడు



మన్విత అతని కళ్లకి యింకా స్కూల్లో చదువుతున్న రెండు జళ్ల అమ్మాయిలాగే వుంది.

సాయంత్రం ఐదు గంటలకి ఢిల్లీ చేరుకున్నారు.

ముందే మాట్లాడుకున్న టూర్స్ అండ్ ట్రావెల్స్ వారి రెండు బస్‌లు రైల్వే స్టేషన్‌కి దగ్గర్లో ఆగి వుండడంతో స్టూడెంట్స్ అందరు ఎక్కి పాయిల్ ట్రావెల్స్ వాళ్లు ఏర్పాటు చేసిన హోటల్లో బస చేశారు.

అబ్బాయిలకి, అమ్మాయిలకి ఎదురెదురు రూంలు ఇచ్చారు. ఆ రూమ్స్ చాలా హైలెట్‌గా ఉన్నాయి.

ఆ రూమ్స్‌లో వున్న ఫోన్ ద్వారా అమ్మాయిల రూమ్స్‌కి డయల్ చేసి వాళ్లను ఏడ్పించడం, నవ్వించడం చేశారు.

ఈ విధంగా రాత్రి పన్నెండు గంటలు అయింది.

అనురాగ్ మాత్రం వాళ్లందర్ని పల్స్‌లో రిజిస్ట్రేషన్ చేయించే పని మీద బిజీగా తిరిగి రాత్రి 2 గంటలకి వచ్చాడు. ఇదంతా దీక్షిత గమనిస్తోంది.

అతను కన్పించనప్పుడు ఆమెకేదో వెలితిగా వుంటోంది.

మన్విత అలిసిపోయిన దానిలా తినగానే పడుకొంది.

ఆ రోజు రాత్రి అలాగడచిపోయింది.

* * * * *

ఉదయం నాలుగు గంటలకి లేచి జైపూర్‌కి అదే పాయిల్ ట్రావెల్స్‌లో బయలు దేరారు.

మద్యాహ్నం 1కి జైపూర్ చేరుకున్నారు.

బస్‌లో కూడా అదే సందడి.

జైపూర్‌లో అంబర్‌కోట, పింక్ సీటీ, వాటర్ ప్యాలెస్, చూసి సాయంత్రం వరకు అక్కడే గడిపారు.

అక్కడే డిన్నర్ పూర్తి చేసుకొని, రాత్రి ఎనిమిది గంటలకి జైపూర్ నుండి ఆగ్రాకి బయలు దేరారు.

లాంగ్ జర్నీ కావటం వల్ల బస్‌లో బాటరీస్ వేడెక్కి ఒక్కసారిగా పొగలు కమ్ముకున్నాయి.

స్టూడెంట్స్‌లో అబ్బాయిలు మెలుకువతో వుండటంతో బస్‌ని ఆపి అందర్నీ క్రిందకి దించి, రోడ్డు మీద వున్న మట్టిని తెచ్చి నిప్పును ఆర్పారు.

అందరిలో భయాందోళన.

దీక్షిత భయంతో వణకటం గమనించాడు అనురాగ్.

ఆమెను తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

దీక్షిత అభ్యంతరం చెప్పకుండా అతని పక్కన కూర్చుంది.

ఆ రాత్రంతా అలాగే అతని భుజం మీద తలపెట్టుకొని పడుకొంది దీక్షిత.

మన్విత అటు, ఇటు చూసి ఆలోచిస్తున్నంతలోనే బస్ కదలడంతో ఎక్కికూర్చుని ఆకంగారులో, ఆభయంలో ఎవరెక్కడన్నారో చూసే ఓపిక లేనట్లు కళ్లుమూసుకొంది.

దీక్షితకి అనురాగ్ స్పర్శలో - ఆకులపచ్చదనంపై వెన్నెల కురుస్తున్న అనుభూతి, నిర్మలమైన నీటి సరస్సు పై తేలివస్తున్న గాలి ఒక్క ఉదుటన చుట్టు ముట్టిన హాయి... ఈ క్షణాలు ఇలాగే నిలిచిపోయి - ఎప్పటికి ఇదే ఆనందం శాశ్వతం అయితే బావుండన్న భావన. కలిగింది.

* * * * *

ఉదయం పది గంటలకి ఆగ్రా చేరుకున్నారు.

ట్రావెల్స్ వాళ్లు ఏర్పాటు చేసిన హోటల్లో వారి, వారి లగేజీలతో వెళ్లి రిలాక్స్ అయ్యారు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకి ఆగ్రా నుండి బయలుదేరి మధుర చేరుకున్నారు.

అక్కడ శ్రీకృష్ణ భగవానుని దర్శనం చేసుకొని మళ్లీ ఆగ్రాకు చేరుకున్నారు.

ఆగ్రాలో ముందుగా ఆగ్రా పోర్ట్ కెళ్లి షాజహాన్, ఔరంగ జేబు గురించి తెలుసుకుంటూ అక్కడున్న కోటను, ఆ నిర్మాణమును చూసుకుంటూ ముందుకెళ్తూ కోటపైకెక్కారు.



సూర్యాస్తమయం కావడంతో, ఎర్రని కాంతిలో యమునానది ఒడ్డున వున్న తాజ్‌మహల్ అందంగా కన్పిస్తోంది. తాజ్ మహల్‌ని ఆనుకొని ప్రవహించే యమునానది చూసేవాళ్లని కనువిందు చేస్తోంది. అక్కడి వాతావరణం వర్ణనాతీతంగా వుంది.

అదే కోటలో - ఉస్మానియా మెడికల్ కాలేజి, గాంధీ మెడికల్ కాలేజి, కర్నూల్ మెడికల్ కాలేజి నుండి వచ్చిన ఫ్రెండ్స్‌ని పలకరించి, తాజ్ మహల్ చూడటానికి అటునుండి అటే బయలు దేరారు. బస్ ప్రయాణం తాజ్ మహల్ పరిసరాల వరకు లేకపోవడంతో ఒంటెల మీద బయలు దేరారు.

* * * * *

తాజ్ మహల్‌కి వెళ్లగానే...

ఎంట్రీ లోంచి లోపలకి ప్రవేశించారు.

అక్కడికి వెళ్లే ముందు స్టూడెంట్స్ అంతా శాంతికి చిహ్నమైన తెలుపురంగు డ్రస్‌లు వేసుకున్నారు.

అమ్మాయిలు మాత్రం వైట్ సూట్స్ వేసుకొని, ఫోటోలు దిగి అందరిని అలరించారు.

లోపలకి వెళ్లాక ఆ అందాన్ని చూసి పరవశిస్తూ మొత్తం తిరిగి చూస్తున్నారు.

ఎదురుగా తాజ్‌మహల్... దానికి ఇరు వైపుల తాజ్ మహల్ కోటలు, దాన్ని ఆనుకునే యమునానది పరవళ్ళు...

తాజ్ మహల్ లోపల వున్న ముంతాజ్, షాజహాన్ సమాదుల దగ్గరికి వెళ్లి- ఒక్క నిముషం నిలబడి తిరిగి బయటకొచ్చారు.

తాజ్‌మహల్ వెనుక వైపునున్న యుమునానదిని తిలకిస్తూ-ఒంటరిగా నిలబడి వున్న దీక్షితను చేరుకున్నాడు అనురాగ్.

మృదు గంభీరస్వరూపిణిలా యమునవైపు చూస్తోంది దీక్షిత.

ఆమెనలా చూస్తుంటే - రాత్రి తన భుజం పై తల పెట్టుకొని భయపడ్తూ పడుకున్న దీక్షితేనా అన్పిస్తోంది.

ఇన్నాళ్లూ... ప్రేమగా పలకరించుకున్నారు. విలువైన అభిప్రాయాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఒకరి కోసం ఒకరు అభిప్రాయాలను మార్చుకున్న సందర్భాలు కూడా వున్నాయి. ఒకరంటే ఒకరికి పైకి వ్యక్తం చేసుకోలేని ప్రేమ కూడా వుంది. ఇంతకన్నా ఏం కావాలి? జీవితంలో ఒకరితో ఒకరు కలిసి బ్రతకటానికి?

ఆ వాతావరణంలో... ఆమెకి దగ్గరగా వెళ్లి ఆమె కళ్లలోకి చూస్తూ- తన మనసేంటో చెప్పాలనుకున్నాడు. చెప్పక ఎన్నాళ్లిలా? ఏదో ఒక రోజు చెప్పాల్సిందేగా అదేదో ఇప్పుడే ఆ తాజ్ మహల్ సాక్షిగా, యమున సమక్షంలో చెబితే అద్భుతంగా వుంటుందనుకున్నాడు.

దగ్గరగా వెళ్లి "హాయ్! దీక్షా!" అన్నాడు. ఎప్పుడో తప్ప అతను 'దీక్షా' అనడు. గమనించింది దీక్షిత.

'దీక్షితా! కమాన్!" అంటూ అరిచింది సౌమ్య. అక్కడ ఆమెకేదో వింత కన్పించినట్లుంది.... అది దీక్షితకి చూపించాలనే ఆ పిలుపు.

ఆ పిలుపువిని సౌమ్యనే చూస్తూ 'ఎక్స్ క్యూజ్ మీ' అని అనురాగ్‌తో చెప్పి, అతన్ని విడిచి వెళ్లాలని లేక పోయినా వెళ్లింది దీక్షిత.

ఒంటరిగా అలాగే యమునా నది వైపు చూస్తూ. నిలబడి పోయాడు అనురాగ్.

ఎప్పుడు చూసినా ఫ్రెండ్స్ తోనో, లేక ఏదో ఒక పని చేస్తూనో హుందాగా, బిజీగా తిరిగే అనురాగ్ అలా ఒంటరిగా కన్పించటంతో మన్విత పరిగెత్తుతున్నట్లే ఒక్క అంగలో అతన్ని చేరుకొంది.

అతన్నలా చూడగానే ఏవో ఊహలు ఆమెను చుట్టుముట్టి... అతనికి 'ఐ లవ్ యు' చెప్పమని తొందర చేశాయి.

చెబితే ఏమంటాడోనన్న సంశయంతో, ముందుకెళ్లి చెప్పకపోతే తనని తను మోసం చేసుకుంటానేమో అన్న భయంతో ముందుకెళ్లి ఒక్కసారి గుండెనిండా గాలిపీల్చుకొని తగినంత బలాన్ని కూడదీసుకొంది.

మన్వితను చూడగానే నవ్వుతూ పలకరించాడు అనురాగ్.

అతని పలకరింపు, అతని నవ్వు ఆమె మనసులోతుల్ని తాకి, తే విందు చేశాయి.



ఎవరి సమక్షమైతే ఆనందాన్ని యిస్తుందో, ఎవరి మాటలు వింటుంటే పులకింత పుడుతుందో వాళ్ల సహచర్యంలో బ్రతకాలని ఎవరికైనా వుంటుంది. ఇక ఆపుకోలేక ...

"అనురాగ్ నేను... ఎప్పటి నుండో..." అంటూ ఆమె మనసులోని మాటలు పెదవి దాటేలోపలే...

ఏదో పని మీద దినేష్ వచ్చి అనురాగ్‌ని తీసికెళ్లాడు.

అతనలా వెళ్లగానే అక్కడో క్షణం కూడా నిలబడాలనిపించక వచ్చేస్తుంటే...

"ఏంటి! మన్వితా! అప్పుడే వస్తున్నావ్? ఏదో చెప్పేదానిలా పరిగెత్తుకుంటూ అనురాగ్ దగ్గరికి వెళ్లావుగా! ఇంతకీ ఏం చెప్పాలని వెళ్లావ్?" అంటూ ఉడికించింది సౌమ్య.

"ఏం లేదు." అంది మన్విత అసహనాన్ని దాచుకుంటూ పొడిగా.

"ఏదోవుంది చెప్పి తీరాలి. నేను ఒప్పుకోను. నువ్వేదో చెప్పాలనే వెళ్లావు." అంది పట్టుదలగా, నీ మనసు నాకు తెలుసు అన్నట్లుగా.

"అవును చెప్పాలనే వెళ్లాను." అంది

ఉత్సుకత పెరిగింది సౌమ్యలో...

"భారత్‌కు ఒక జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని, జాతీయ పక్షిని, జాతీయ జంతువును, జాతీయ పుష్పాన్ని గుర్తించినట్లే 'భగవద్గీత'ను కూడా జాతీయ ధర్మ శాస్త్రంగా గుర్తించాలని అనుకుంటున్నారట. అది చెప్పాలని వెళ్లాను. ఈ లోపల దినేష్ వచ్చి అనురాగ్‌ని తీసికెళ్లాడు." అంటున్న మన్విత కళ్లలోని చెమరింపు... సౌమ్య హృదయాన్ని పిండింది.

* * * * *

ఆగ్రా నుండి ఢిల్లీకి చేరుకున్నారు.

ఆ రాత్రికి హోటల్లో ఫ్రెష్ అప్ అయిన తర్వాత...

"ఎయిమ్స్" అల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కి బయలు దేరారు.

అక్కడికి చేరుకోగానే ఆర్గనైజర్స్ ఐడింటిటి కార్డ్ ఇచ్చారు. ఆల్ ఇండియాలో ఎన్ని మెడికల్ కాలేజీలు వున్నాయో, ఆ కాలేజీల స్టూడెంట్స్‌ంతా వచ్చారు.

... వాళ్లంతా ఎయిమ్స్ ఆడిటోరియంలో జరుగుతున్న ప్రోగ్రాంకి వెళ్లారు. ఆడిటోరియంలోకి ప్రవేశించగానే...

అమ్మాయిలకు, అబ్బాయిలకు భుజాలు, చేతులు, వీపుమీద టాటూ (Tatto) మార్క్స్ వేస్తున్నారు. అక్కడ ఆ ఎన్విరాన్‌మెంట్ కొత్తగా అన్పించింది.

అక్కడ పద్మశ్రీ డా॥ ప్రకాశ్ కొఠారిగారి శిష్యులు ఒక టాపిక్ ఇచ్చి ఓన్లీ ఫ్యూచర్ టెన్స్‌లో ఎవరు ఎంత సేపు మాట్లాడతారో తోటి పాటిస్‌పెంట్స్ అబ్జక్షన్ చెప్పనంత వరకు మాట్లాడాలి. అలా పది టాపిక్స్ యిచ్చి వాటి మీద వివిధ రకాలైన సంభాషణలు జరిగి అక్కడ బాగా ఎంజాయ్ చేశారు

రాత్రి ఎనిమిది కావడంతో డిన్నర్ ముగించుకొని గ్రౌండ్స్‌కి బయలు దేరారు.

అక్కడ బాస్కెట్ బాల్, గేమ్స్ చూస్తూ, ఎంజాయ్ చేస్తూ తర్వాత మొదలవ్వబోయే ఫ్యాషన్ షో గురించి చర్చించుకుంటుండగానే... పదకొండు గంటలకి ఫ్యాషన్ షో స్టార్ట్ అయింది.

ఫ్యాషన్ షోలో ఫస్ట్ బ్లైజర్స్ రౌండ్ తర్వాత సినిమా రౌండ్... అలా ఒక్కో వెరైటీతో ఫ్యాషన్ షో కంటిన్యూ అవుతుంటే వాళ్లంతా ఎంజాయ్ చేస్తు నిలబడి చూస్తున్నారు.

అప్పటికి రాత్రి పన్నెండు అయింది.

డిస్కో స్టార్ట్ అవబోతుందని ఆర్గనైజర్స్ అనౌన్స్ చేశారు. అక్కడ బాగా ఎంజాయ్ చేశారు. ప్రొటక్షన్ కోసం ఆర్గనైజర్స్ డిస్కోలో తిరుగుతున్నారు.

అప్పటికి చాలా అలసిపోయి వుండడంతో హోటల్‌కి చేరుకున్నారు.

అబ్బాయిలకి, అమ్మాయిలకి, సపరేట్ రూమ్స్ యిచ్చారు.



అనురాగ్ రూమ్‌కి, దీక్షిత రూమ్ ఎదురుగా వుండడంతో ఆ రాత్రంతా మన్వితకి నిద్ర పట్టలేదు.

ఉదయాన్నే టిఫిన్ తిని షాపింగ్‌కి వెళ్లారు.

రాత్రికి హోటల్‌కి వచ్చారు. మళ్లీ వాళ్లు పల్స్ ప్రోగ్రాంకి బయలు దేరవలసిందిగా ఆర్గనైజర్స్ ఇన్‌ఫాం చేశారు.

ఆ రాత్రికి కూడా అవే ప్రోగ్రామ్స్ కంటిన్యూ అయ్యాయి.

ఒక పది మంది విద్యార్థులు ఉదయం ఏడు గంటల వరకు డిస్కోలోనే వుండటంతో సిమ్లాకు బయలు దేరటం ఆలస్యం అయింది.

ఉదయం ఎనిమిది గంటలకి సిమ్లాకి బయలు దేరారు.

రాత్రి పదకొండు గంటలకి సిమ్లాకి చేరుకున్నారు.

అక్కడ వాతావరణం చల్లగా అన్పిస్తూ, మంచుకురుస్తూ వాళ్లను వణికిస్తోంది.

డిన్నర్ ముగించుకున్నాక ట్రావెల్స్‌వాళ్లు క్యాంప్ ఫైర్ (Camp Fire) ఏర్పాటు చేశారు.

క్యాంప్‌ఫైర్‌కి అటువైపు అబ్బాయిలు ఇటు వైపు అమ్మాయిలు కూర్చుని... ఆ మంటతో చలికాచుకుంటూ అంతాక్షరి, ధమ్‌షరాడ్స్, సింగింగ్ చేస్తుంటే అబ్బాయిలు డాన్స్ చేస్తూ ఆ వాతావరణాన్ని ఉత్సాహంగా మార్చారు.

ఉదయాన్నే లేచి కొండలమీదున్న టెంపుల్‌కి గుర్రాల మీద బయలు దేరారు.

గుర్రాలపై వెళ్తున్నప్పుడు... దారిలో పొడవైన యూకలిప్టస్ చెట్లు ఆకాశాన్ని తాకుతూ కన్పించాయి. చలితో దట్టమైన మంచు భూమ్మీద తిరిగే మేఘాల్లా మనుషుల్ని తాకుతున్నాయి. అదోవింత అనుభూతిని కల్గించింది.

దైవ దర్శనం అయ్యాక... బయట కొచ్చి పక్కనే వున్న యాపిల్ తోటలో కూర్చుని, మంచు కొండల్ని చూస్తూ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేశారు. సౌమ్య జోకులు, దినేష్ అల్లరి అంతా, ఇంతా కాదు.

సాయంత్రం మూడు గంటలకి సిమ్లా నుండి డెహరాడూన్ పైగా ముస్సోరికి బయలు దేరారు.

84 కిలో మీటర్ల... ఘాట్ రోడ్ పై ప్రయాణిస్తూ మధ్య, మధ్యలో భయాన్ని దాచుకోవడం కోసం అరుపులు, కేకలు, మొదలు పెట్టారు.

సాయంత్రం ఆరు గంటలకి ముస్సోరి చేరుకున్నారు... స్నాక్స్ తిని, టీ త్రాగి షాపింగ్‌కి బయలు దేరారు.

రాత్రికి క్యాంప్‌ఫైర్ దగ్గర బాగ ఎంజాయ్ చేసి ఉదయాన్నే టిఫిన్ ముగించుకొని వాటర్ ఫాల్స్ చూడటానికి వెళ్లారు. అక్కడ 'రోప్‌వే' లో కూర్చుని ఒక కొండ పై నుండి ఇంకో కొండ పైకి వెళ్తూ వాటర్ ఫాల్స్ లోంచి పడ్డనీళ్లని స్విమ్మింగ్ ఫూల్‌లోకి ఎలా పంపుతున్నారో చూశారు. అక్కడ ఆ వాటర్ ఫాల్స్ క్రింద అబ్బాయిలు స్నానం చేస్తూ ఎంజాయ్ చేశారు.

లంచ్ ముగించుకొని కులుమనాలికి బయలుదేరారు.

బస్‌లోంచి చూస్తుంటే... అటు పక్క కొండలు, ఇటు పక్క కొండలు వున్నాయి. ఆ కొండలపైన వున్న మంచు కరిగి మధ్యలో ఓ నదిలా ప్రవహిస్తోంది.

ఇక్కడ కూడా ఘాట్ రోడ్డు ప్రయాణమే.

అక్కడ కళ్లకు కన్పిస్తున్న ప్రతి ప్రదేశం వర్ణనాతీతంగా వుంది.

నైట్ 'మనాలిఇన్' హోటల్లో బస చేశారు.

ఉదయాన్నే లేచి బయటకి రాగానే... సూర్యోదయం ఎర్రగ మెరుస్తూ కన్పిస్తూ కనువిందు చేస్తుంటే... అనురాగ్, దీక్షిత ఆ హోటల్ ముందు కూర్చుని ప్రవహిస్తున్న నీటిలో కాళ్లను పెట్టుకున్నారు వాళ్లద్దరికి ఆ హోటల్ చుట్టూ వున్న కొండల్లోంచి వస్తున్న ఆ నీటి పాయను చూస్తూ కబుర్లు చెప్పుకోవడం అద్భుతమైన అనుభూతిని కల్గిస్తోంది.

మధ్యాహ్నం పన్నెండు గంటలకి కులుమనాలి నుండి "రోతన్ పాస్" కి జీపుల్లో బయలు దేరారు.

మంచుకొండల్లో రెండుగంటలు ప్రయాణం చేసి 'రోతన్‌పాస్' చేరుకున్నారు.

అక్కడ దిగగానే చలికి తట్టుకోవటం కోసం ప్రత్యేకమైన దుస్తుల్ని గ్లౌజుల్ని రెంట్‌కి తీసుకున్నారు.



అబ్బాయిలందరు నడిచి మంచుకొండలపైకి ఎక్కారు. కొండపైకి వెళ్తున్న కొద్ది ఆక్సిజన్ సరిపోదు. కాబట్టి, ఆయాసం వస్తుందని అమ్మాయిల్ని గుర్రాల పై రమ్మన్నారు.

"నా వల్ల కాదు నేను పైకి రాను, ఇక్కడే వుంటాను." అంటూ మన్విత ఓ చోట కూర్చుంది. ఇంకా కొంత మంది అమ్మాయిలు కూడా అలాగే అన్నారు.

దీక్షిత మాత్రం పై కి వెళ్లింది.

అక్కడికెళ్లాక అబ్బాయిలు, అమ్మాయిలు మంచుగడ్డలతో ఆడుకున్నారు. క్లాస్‌మెట్స్ అయినందువల్ల వాళ్లలో ఎటువంటి నెగటివ్ ఫీలింగ్స్ లేనందువల్ల ఆ వాతావరణాన్ని చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నారు.

అనురాగ్ ఆ మంచుతో ఒక బొమ్మను చేసి, ఆ బొమ్మకి తన ఊపిరితో జీవం పోసి, ఆ బొమ్మ చేతిలో ఒక లవ్ సింబల్ పెట్టి ఆ సింబల్‌లో తన మనసును నింపి దీక్షితకి ఇచ్చి ప్రపోజ్ చేశాడు.

ప్రకృతిలో ప్రతి అణువు తమని ఆశీర్వదిస్తున్నట్లే అతని ఊహ...

దీక్షిత తన అందమైన కనుదోయిని ఆ బొమ్మ పై నిలిపి... ఇన్ని రోజులు తన తల్లి దండ్రులు... పిల్లల చదువులు ఒక దారికి రాలేదని బాధపడ్తుండటం వల్ల, అన్నయ్య మహధీర్ ఎం.బి.ఎ. పూర్తయ్యి జాబ్ సర్చింగ్‌లో వుండటం వల్ల తన ప్రేమ విషయం తెలిస్తే డిస్టర్బ్ అవుతారని ఎటూ తేల్చుకోలేక పోయింది. కానీ ఇప్పుడు మహధీర్‌కి వరంగల్ లోనే మంచి కంపెనీలో జాబ్ వచ్చింది. తల్లి దండ్రులు కూడా ఇప్పుడిప్పుడే కాస్త రిలీఫ్‌గా ఫీలవుతున్నారు. ఇంక తనకి అభ్యంతరం ఏముంటుంది?

అనురాగ్‌లో లేని క్వాలిటీ కానీ, తనకి నచ్చని హాబీస్ కాని ఏమున్నాయి? అంతా ఓ.కె.. అని తనలో తాను ఆలోచించు కుంటుంటే...

ఒక్క క్షణం అనురాగ్ కంగారు పడి...

"నీకు ఇష్టం లేక పోతే..." అంటూ బొమ్మ మీద చేయి వేశాడు.

తన విలువైన జీవితం ఎక్కడ చేయి జారిపోతుందోనని ఆత్రుతగా.... తనకి ఇష్టమే అన్నట్లుగా అతని చేయిమీద చేయివేస్తూ, ఈ అద్భుతమైన

క్షణాల కోసమే ఎదురుచూస్తున్న దానిలా అపూరూపంగా, అపూర్వంగా నవ్వింది.

ఆ చూపు, ఆ నవ్వు అనురాగ్‌కి జీవితంలో ఎప్పుడూ మరచిపోలేని విధంగా హత్తుకు పోయాయి.

గుప్పెడు అనుభూతికోసం హృదయాన్ని పోగొట్టుకునే ఏ క్షణమైనా మధురమైందే. ప్రతి క్షణం ఆ అనుభూతిలో మునగాలని ఎవరికైనా వుంటుంది. ఆ అనుభూతిని కోరుకుంటూ... ఆ బొమ్మను కరిగిపోకుండా జాగ్రత్తగా పట్టుకొన్నారు.

సాయంత్రం నాలుగుగంటలకి... ఇంట్రెస్ట్ వున్న వాళ్లు అక్కడే వున్న పారాషూట్ లను ఎక్కారు.

ఆరుగంటలకి హోటల్‌కి వచ్చాక కొంత మంది అబ్బాయిలు, అమ్మాయిలు రివర్ రాఫ్టింగ్ చేశారు.

తర్వాత పక్కనే వున్న 'ఇండో టిబెట్ జవాన్స్ ట్రెనింగ్ సెంటర్'ను చూసి...

ఉదయం ఆరుగంటలకి హరిద్వార్ చేరుకున్నారు.

హోటల్లో ప్రెష్అప్ అయి టెంపుల్‌కి బయలు దేరారు.

టెంపుల్‌కి వెళ్లేదారిలో... గంగానది పరవళ్ళు తొక్కుతూ తన మధ్యలో వున్న శివుని పాదాలను తాకుతూ, వేగంగా ప్రవహిస్తూ, ఆ టెంపుల్ వున్న కొండలోంచి వెళ్తోంది.

దైవదర్శనం కోసం 'రోప్‌వే' లో కొండ పైకి వెళ్లారు.

ఆ పుణ్యస్థలంలో ఉదయం వచ్చిన స్వాములు, భక్తులు సాయంత్రం ఆరుగంటలవరకు అక్కడే వుండి స్నాన గట్టాల్లో స్నానాలు ముగించుకొని 'దీపార్చన' కోసం అలాగే కూర్చున్నారు.

పూజారులు వచ్చి పెద్ద దీపాన్ని వెలిగించి గంగామాతకు పూజ చేసి, ఆ దీపాలను భక్తులకి చూపిస్తుంటే... ఆ దీపాల ప్రతి బింబాలు గంగానదిలో తిరిగి కన్పిస్తూ "న భూతో న భవిష్యతి" లా వుంది.



పెద్దవాళ్లు కాని, చిన్నవాళ్లుకాని... తన జీవితకాలంలో ఒక్కసారైనా చూడవలసిన పుణ్యక్షేత్ర మది.

రాత్రికి హరిద్వార్ లోనే హోటల్లో బస చేసి ఉదయాన్నే రిషికేష్ బయలుదేరారు.

రిషికేష్‌లో రెండు కొండల మధ్యన ప్రవహిస్తున్న గంగానది, ఆ రెండు కొండల్ని కలుపుతూ రామ్ లక్ష్మణ్ జులాలు వున్నాయి.

రామ్‌జులా పై నుంచి గంగానదిని దాటుతూ నది ఒడ్డున వున్న రామ్‌జులా (టెంపుల్)కి చేరుకున్నారు.

అందరు దేవుళ్లు వున్న ఆ టెంపుల్ని గుండ్రంగా ఎక్కి పైకి చేరుకున్నారు.

పైన వున్న టెంపుల్లో రాముడు కొలువైవున్నాడు.

తర్వాత లక్ష్మణ్‌జులా, చాముండేశ్వరి దేవిని దర్శించుకొని అక్కడనుండి అమృతసర్‌కి బయలు దేరారు.

అమృతసర్‌లో స్వర్ణదేవాలయాన్ని దర్శించుకోవడం కోసం సిక్కులు కట్టుకున్నట్లే తలకి ఓ గుడ్డ కట్టుకొని లోపలకి వెళ్లారు.

ఆ దేవాలయం సిక్కుల ఆరాధ్య దేవాలయం.

ఆ టెంపుల్ని దర్శిస్తున్నప్పుడు... ఆక్కడక్కడ సిక్కు మత గురువుల గురించి, వాళ్ల చరిత్ర గురించి రాయబడి వుండడం చూశారు.

అక్కడ నుండి జెలియన్ వాలాబాగ్ చూడటానికి వెళ్లారు. ఆ గార్డెన్‌లో... బ్రిటిష్ అధికారి 'డయ్యర్' కాల్పులు జరిపినప్పుడు చాలా మంది భారతీయులు ఆ కాల్పుల్ని తట్టుకోలేక దూకేసిన బావిని , గోడలపై బుల్లెట్ మార్క్‌ని, చనిపోయిన వాళ్ల పేర్లని రాసిన స్థూపాన్ని చూశారు.

అక్కడ నుండి ఇండియా పాకిస్థాన్ బార్డర్ (వాగ్ బార్డర్)కి చేరుకున్నారు. అక్కడ బార్డర్ చుట్టూ దట్టమైన పెన్సింగ్ వుంది. దానికి కరెంట్ సప్లై చేయబడివుంది.

సాయంత్రం నాలుగుగంటల నుండే అక్కడ వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వాళ్లు తమ, తమ సంస్కృతిని చాటుతూ ప్రదర్శనలిస్తున్నారు.

ఆడియన్స్ అందరు "భారత్ మాతాకీ జై" అంటూ తమ దేశ భక్తిని తెలియజేస్తున్నారు.

ఆ తర్వాత...

సాయంత్రం ఆరుగంటలకి బార్డర్ జవాన్స్ "మార్చ్‌పాస్ట్" చేసుకుంటూ వెళ్ళి బార్డర్ మధ్యలో వున్న గేటుని తీశారు. అదే సమయంలో అటు పాకిస్థాన్ సైనికులు కూడా వాళ్ల గేటుని తీశారు. తర్వాత మరో ఇద్దరు జవాన్లు మార్చ్‌పాస్ట్ చేసుకుంటూ జెండాకి సెల్యూట్ చేసి జెండాను తీసేశారు.

స్టూడెంట్స్ అంతా ఎవరి ఫీలింగ్‌లో వాళ్లు తిరుగుతూ ఎంజాయ్ చేస్తున్నారు.

మన్విత మాత్రం ఎవరితో మాట్లాడకుండ, ప్రతి ప్రదేశాన్ని అంతః చక్షువుతో ఆస్వాదిస్తున్నట్లు... అనురాగ్ ఎక్కడున్నాడో కూడా చూసుకోవడం లేదు.

రాత్రి ఏడు గంటల వరకు అక్కడే వుండి తర్వాత ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీలో... ఇండియాగేట్ కుతుబ్‌మినార్, లోటస్ టెంపుల్, పాల రాతితో కట్టిన అక్షర ధమ్, శ్రీ కృష్ణ టెంపుల్ చూసి...

ఆ తర్వాత ఎ.పి. ఎక్స్‌ప్రెస్ ట్రైనెక్కి వరంగల్ చేరుకున్నారు.

* * * * *

దసరా హాలిడేస్ అయ్యాక...

ఎం.జి.ఎం హెచ్ అండ్ కె.ఎం.సి గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్స్ సందర్భంగా మెడికల్ ఎగ్జిబిషన్‌కి ప్రిపేర్ కావలందిగా ప్రిన్సిపాల్ గారు నోటీస్ పంపారు.

నవంబర్ 11న ఎగ్జిబిషన్ మొదలైంది.

ఇనాగరేషన్‌ని ఆరోగ్య శాఖమంత్రి, భారీ నీటి పారుదల శాఖ మంత్రి ప్రారంభించారు.

కాకతీయ వైద్య కళాశాలలో వైద్య విజ్ఞాన ప్రదర్శన మొదలైన క్షణం నుండి జిల్లాలో వున్న అన్ని కళాశాలల (ఇంజనీరింగ్, బి.ఫార్మసి, పి.జి డిగ్రీ, ఇంటర్) విద్యార్థులు, స్కూల్ పిల్లలు, ఇంకా ఇంట్రస్ట్ వున్న స్థానికులు



వస్తున్నారు. వాళ్లతో పాటు అదే కాలేజిలో చదివిన వైద్య విదార్థులు కూడ చూడటానికి వచ్చారు అందరు వాటిని ఇంట్రస్ట్‌గా చూస్తున్న వైద్య విద్యార్థులు మాత్రం మళ్లీ వాటినే చూడాలా అన్నట్లుగా ఫీలయ్యారు వైద్య విద్యార్థులు అలా ఫీలవుతున్నా – సామాన్య ప్రజలు చూడాల్సిన ఆవశ్యకత వున్నందున అందరూ వస్తున్నారు. ఆ కాలేజి పెట్టి అప్పటికి ఏభై సంవత్సరాలు కావడంతో ఏర్పాటు చేసిన ప్రదర్శన అది.

కాలేజి గేటు నుండి మొదలైన 'క్యూ' కాలేజీ ఎంట్రన్స్ వరకు వుండడంతో ట్రాఫిక్ కంట్రోల్ చెయ్యటానికి సి.ఐ. ఎస్.ఐ ., ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఎస్.పి గారి పర్మిషన్‌తో నియమితులయ్యారు.

తరలివస్తున్న సందర్శకులకు వివరించేపనిలో వాలెంటీర్లగా వున్న వైద్య విద్యార్థులు మునిగిపోయారు.

అందువల్లనే... అనురాగ్ దీక్షితను కలుసుకునే అవకాశం లేకుండా అయింది. వీలు దొరికినప్పుడు ఫోన్లో మాట్లాడు కుంటున్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ చూడటానికి అనురాగ్ వాళ్ల పేరెంట్స్ వచ్చారు, కాలేజిలోకి తీసుకెళ్లాడు.

అనురాగ్ తన పేరెంట్స్‌ని గేటుదగ్గర రిసీవ్ చేసుకొని డైరెక్ట్‌గా కాలేజీలోపలకి వెళ్లగానే . దీక్షితకి కాల్ చేసి తన పేరెంట్స్ వచ్చినట్లు చెప్పి, త్వరగా రమ్మని పిలిచాడు అనురాగ్.

వెంటనే వచ్చింది దీక్షిత .

దీక్షిత రాగానే వాళ్ల పేరెంట్స్‌కి పరిచయం చేశాడు.

వాళ్లనలా పరిచయం చేస్తున్న టైంలో మన్విత చూసింది.

మన్వితకి ప్రియబాంధవి అంటే చాలా ఇష్టం. చూడక చాలా రోజులైంది. ఆమెవస్తున్నట్లు చిన్న ఇన్ఫర్మేషన్ కూడా ఇవ్వలేదు అనురాగ్. దీక్షితకి కాల్ చేసి రప్పించుకొని పరిచయం చేస్తుంటే కళ్లవెంట నీళ్లు తిరిగాయి. వెంటనే అక్కడ నుండి వెళ్లి పోతున్న మన్వితను అనురాగ్ చూడలేదు. ప్రియబాంధవి చూసింది.

"మన్విత నా దగ్గరకి రాకుండా, నన్ను చూసికూడా అలా వెళ్లిపోతుందేం? వెళ్లి పిలువు అనురాగ్." అంది ప్రియబాంధవి.

తల తిప్పి వెళ్లి పోతున్న మన్విత వైపు చూశాడు అనురాగ్

వెంటనే దీక్షిత వైపు చూస్తూ...

"మా పేరెంట్స్‌ని తీసికెళ్లి ఎగ్జిబిషన్ చూపించి, ఎక్స్ ప్లెయిన్ చెయ్యి దీక్షా! నేనిప్పుడేవస్తాను." అంటూ మన్విత వెళ్లిన వైపు వెళ్లాడు అనురాగ్.

అప్పటి వరకు తన ఎప్రాన్ జేబుల్లో చేతులు పెట్టుకొని నిలబడివున్న దీక్షిత 'సరే' అన్నట్లు తల వూపి చురుగ్గా కదిలి...

"రండి! ఆంటీ!" అంటూ ఉత్సాహంగా తన ఎర్రటి పెదవుల్ని నెమ్మదిగా విప్పి అందమైన తన చిరునవ్వుతో ఆహ్వానించింది. పై పెదవి విల్లులా సాగి ఆ నవ్వు అద్భుతంగా అన్పించింది ప్రియబాందవికి.

ఇలాంటి వాళ్లు తమ నవ్వుతోనే రోగాలను నయం చేస్తారనటంలో అతిశయోక్తి  లేదని మనసులో అనుకుంటూ తన భర్తతో కలిసి దీక్షిత వెంట నడిచింది ప్రియ బాందవి.

వాళ్లను అనాటమీ డిపార్ట్‌మెంట్ వెపు తీసికెళ్లింది దీక్షిత.

రూంలోకి ప్రవేశించగానే.. స్పెసిమెన్స్ దగ్గరికి తీసికెళ్లింది.

అక్కడ Triplets అంటే ముగ్గురు కవలలు, తర్వాత Twinsఅంటే కవలలు, Qudriplets  అంటే నలుగురు కవలలు, అదే విధంగా పిండం గర్భాశయంలో ఎలా పెరుగుతుంది. బేబి లోపల ఎలా డెవలప్ అవుతుంది. వాటి గురించి వివరించుకుంటూ...

తర్వాత అనాటమీ మ్యూజియంలోకి తీసికెళ్లింది.

అక్కడ... బాడీ మొత్తం ఎక్స్‌రే తీసిన ఒక ఫోటో... సరిగా పెరగని బేబీ స్పెసిమెన్స్... Dissection చెయ్యబడిన చేతులు, కాళ్లు, చాతి, వాటిలో కన్పించే నరాలు, రక్తనాళాలు, అవయవాలు, అవి పని చేసే విధానం వివరించుకుంటూ...

అనాటమీ డిసక్షన్ హాల్లోకి ప్రవేశించింది.



అందులో... డెడ్ బాడీస్ వున్నాయి. ఒక డెడ్ బాడిని Disscet చేయబడిన చాతి వైపు చూపిస్తూ అందులో వున్న అవయవాలు... ఊపిరితిత్తులు, గుండె, అవి పని చేసేవిధానం, మరియు ఆస్థమా, ఊపిరితిత్తుల కేన్సర్, టి.బి. గుండె పోటు, బి.పి. ఎలా వస్తాయో వివరించి...

ఆ పక్కనే వున్న బోన్స్ (ఎముకలు) దగ్గరకి తీసికెళ్లింది.

అక్కడ... బాడీలో వున్న బోన్స్ - తొడ ఎముక, కాలి ఎముకలు, చేతి ఎముకలు, పుర్రె, వెన్నెముక, వాటన్నిటి గురించి వివరించి...

క్రోమో జోమ్స్ గీయబడిన ఫోటో ప్లేట్ దగ్గరికి తీసికెళ్లి - క్రోమో జోమ్స్ రెండు రకాలు. ఇరవై రెండు జతల ఆటోజోమ్స్, ఒక జత అల్లో జోమ్స్ (Sex Chromosjomes) అంటారు. బేబిలో ఈ సెక్స్ క్రోమో జోమ్స్ యొక్క వైవిధ్యమైన కలయికవల్ల డౌన్ సింగ్రోమ్ 45  47   క్లైన్ ఫిల్టర్ సింగ్రోమ్ అనే బేబీస్ పుడుతారు.

అక్కడ నుండి OPHTHAMOLOGY డిపార్ట్‌మెంట్ రూం వైపు తీసికెళ్లి ఆప్తాల్‌మోస్కోపి అనే పరికరం గురించి, రే చీకటి గురించి, అందులో విటమిన్ ఎ యొక్క ప్రాముఖ్యత గురించి, శుక్లం  ఎలా వస్తుంది, చక్కర వ్యాధి వున్న వారు కంటి జబ్బులు రాకుండా తీసుకోవలసిన  జాగ్రత్తల గురించి వివరించి...

ఇ.ఎన్.టి (చెవి, ముక్కు, గొంతు) డిపార్ట్‌మెంట్‌లోకి తీసికెళ్లింది.

అక్కడ... స్వర పేటిక నిర్మాణము, టాన్సిల్స్, ముక్కులో డి.ఎన్.యస్, మరియు సైనసైటిస్ గురించి వివరించుకుంటూ...

లాప్రో స్కోపీ ద్వారా ఆపరేషన్ ఏ విధంగా చేస్తారో చూపించి...

ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్ వైపు తీసి కెళ్లింది

అక్కడ... ఎముకలు ఏ విధంగా తయారవుతాయో, ఎందుకు గట్టిగా వుంటాయో, వాటికి వచ్చే వ్యాధులేమిటో, ఎక్స్‌రేలో విరిగిన ఎముకలు ఏవిధంగా కన్పిస్తాయో చూపించి...

పెడియాట్రిక్స్ డిపార్ట్‌మెంట్ వైపు తీసికెళ్లింది.

అక్కడ... ఇంకు బెటర్స్‌లో ప్రిమెచ్యూర్ బేబీస్ ఎలా డెవలప్ అవుతారో...... పిల్లలు పుట్టిన తర్వాత వారికి తీసుకోవలసిన జాగ్రత్తలు, పిల్లలకి ఇవ్వవలసిన పోషక పదార్థాల గురించి చెప్పి...

ఆ తర్వాత... OBSTRATRICS & GYENACOLOGY డిపార్ట్‌మెంట్ లోకి తీసికెళ్లి

అక్కడ... గర్భవతి అయినప్పుడు తీసికోవలసిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పోషక పదార్థాలు చేయించుకొవాల్సిన పరీక్షలు అదే విధంగా సరైనా పోషక పదార్థాలు తీసుకోకుంటే బేబీ సరిగా డెవలప్ అవదు అని చెప్పి... నార్మల్ డెలవరీ, సిజేరియన్ ఏ విధంగా చేస్తారో వివరించి... ఆపరేషన్ చేసేటప్పుడు ఇవ్వవలసిన మత్తుమందు గురించి వివరించటానికి....

ఎనస్థిసియా డిపార్ట్‌మెంట్‌కి తీసికెళ్లింది.

ఆపరేషన్ చేసిన తర్వాత బి.పి., పల్స్‌రేటు, రెస్పిరేటరి రేటు స్క్రీన్ మీద టి.వి.లో ఎలా కన్పిస్తుందో చూపించి జనరల్ ఎనస్థిసియా మరియు సి.పి. ఆర్. ఎలా చేస్తారో వివరించి...

మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌కి తీసికెళ్లింది. మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌లో... వివిధ వ్యాధులలో దేహములో వున్న భాగాలలో వచ్చే వివిధ మార్పులను (ఊపిరితిత్తుల క్యాన్సర్, అమిబిక్ లివర్, లివర్ సిర్రోసిస్, గుండె జబ్బులు, బి.పి) గురించి వివరించి...

సర్జరీ డిపార్ట్‌మెంట్‌లోకి తీసికెళ్లింది.

అక్కడ... స్క్రీన్ మీద కన్పిస్తున్న ఆపరేషన్ విధానము చూపించింది.

తర్వాత అక్కడ నుండి బయోకెమిస్ట్రీ డిపార్ట్ మెంట్‌కి తీసికెళ్లింది.

అక్కడ... విటమిన్స్. కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, కొవ్వులు, ఏవిధంగా దేహానికి

ఉపయోగపడతాయో. అవి ఎక్కువయినా, తక్కువయినా ఎలాంటి వ్యాధులొస్తాయో వివరించి....

అదే విధంగా మూత్ర పరీక్ష, ఎలా చేస్తారో, రక్త పరీక్ష ఎలా చేస్తారో తెలియజేసి...



శరీర ధర్మ శాస్త్ర విభాగమునకు తీసికెళ్లింది.

అక్కడ... శరీరములో వున్న వివిధ భాగాలు ఏ విధంగా పని చేస్తాయో, కొన్ని కారణాలవల్ల అవి పనిచెయ్యటం ఆగిపోతే ఎలా వుంటుందో సెల్ అనేది ఏ విధంగా ఫాం అవుతుందో వివరించి....

ఎస్.పి.ఎమ్ (క్రమ్యూనిటీ మెడిసిన్స్) డిపార్ట్‌మెంట్ లోకి తీసికెళ్లింది. లోపలికి వెళ్లగానే PREVENTION IS BETTER THAN CURE అన్న స్లోగన్ కన్పించింది. అక్కడ... పిల్లలకు టీకాలు సరైన సమయంలో వేయించటం, భారతదేశంలో వచ్చే వివిధ రకాలైన వ్యాధులు... వాటిని ఎలా నయం చేస్తారో, వాటి నివారణ చర్యల గురించి వివరించి.

FORENSIC MEDICINE (న్యాయ వ్యాధి శాస్త్రం) డిపార్ట్‌మెంట్‌కి తీసికెళ్లింది. అక్కడ... అన్ని రకాలైన విషపూరిత పాములు, విషపదార్థాలు, బుల్లెట్ మార్క్సు గొడ్డలితో కొట్టినప్పుడు పగిలిపోయిన పుర్రె, చనిపోయిన చిన్న, చిన్న బేబిస్, చంపటానికి ఉపయోగించే ఆయుదాలు, ఉరి వేసుకోటానికి ఉపయోగించే అన్ని రకాల తాళ్లు చూపించి...

మాట్లాడే పుర్రె దగ్గరికి తీసుకొచ్చి కాసేపు పుర్రెతో ఘన్నీ గా మాట్లాడి...

సీనాప్ క్రైమ్ రూంలోకి తీసికెళ్లింది.

అక్కడ... ఒక శవాన్ని చూపించి గౌతమి ఎక్స్‌ప్రెస్ కాలిపోయిన విధానము, అందులో కాలిపోయిన వాళ్ల ఎముకలు మిగిలిపోయిన విధానము, పూడ్చిపెట్టిన తర్వాత బయటకు తీసిన డెడ్ బాడీస్ ఎలా వుంటాయో చూపించి....

బాంబ్ స్క్వాడ్స్ వున్న రూంకి తీసికెళ్లింది.

అక్కడ... పోలీస్ జాగిలాలు బాంబ్‌ని ఎలా డిటెక్ట్ చేస్తాయి, వాసన ఎలా పసిగడతాయి... అన్ని రకాల బాంబులు, వాటిని డిస్పోజల్ చేసే విధానము, అఫిషియల్స్ కార్ల క్రింద పెట్టే బాంబులు వాటిని ఎలా డిటెక్ట్ చేసి డిస్పోజల్ చేస్తారో అక్కడవున్న బాంబ్ స్క్వాడ్స్ వివరించగానే దీక్షిత వాళ్లను తీసుకొని ఫార్మా కాలేజి డిపార్ట్ మెంట్‌కి వెళ్లింది.

అక్కడ... డ్రగ్స్ (టాబ్లెట్స్) అవి పనిచేసే విధానము, వాటి వ
వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ గురించి వివరించి...

మైక్రోబయోలజీ డిపార్ట్‌మెంట్‌కి తీసికెళ్లింది అక్కడ... మల పరీక్ష రక్త పరీక్ష, తెమడ (ఉమ్ము) పరీక్ష, అదేవిధంగా మలేరియా రాకుండ మురికి నీటిలో పెంచే గంబూషియా చేపలు చూపించి వాటి గురించి చెప్పి మలేరియా నివారణ చర్యల గురించి వివరించి...

పెథాలజి డిపార్ట్‌మెంట్ దగ్గరికి తీసికెళ్లింది... పెథాలజీలో... థైరాయిడ్ గ్లాండ్‌లో వచ్చే వివిధ వ్యాధులు, ఊపిరితిత్తుల్లో వచ్చే వివిధ వ్యాధులు, గుండెలో వచ్చే వివిధ వ్యాధులు... ఈ విధంగా బాడీలో వున్న వివిధ ఆర్గాన్స్‌కి వచ్చే వ్యాధులు, వాటిలో వచ్చే మార్పులు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించి....

చివరగా సామాజిక స్పృహ... మూఢనమ్మకాలను నమ్మవద్దు అంటూ ఏర్పాటు చేసిన ఓ చిన్న సన్ని వేశాన్ని చూసి క్రిందకి వస్తుంటే అనురాగ్ కలిశాడు.

అతను మామూలుగా లేడు. ఏదోగా వున్నాడు. మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తూ

"ఓ.కె. మమ్మీ! అంతా చూశారా? దీక్షిత బాగా ఎక్స్‌ప్లెయిన్ చేసిందా?" అడిగాడు.

"చక్కగా చేసింది అనురాగ్! మా కాలేజీలో పిల్లలు ఈ మధ్య రోజు ఈ ఎగ్జిబిషన్ గురించి చెప్పుకుంటుంటే ఏమో అనుకున్నాను. ఇంత గొప్పగా వుంటుందనుకోలేదు. వీలుంటే మీ లాంటి విద్యార్థులేకాక మా లాంటి వాళ్లు కూడా చూడదగినది. చూసి తెలుసుకోదగినది ఈ ఎగ్జిబిషన్" అంది ప్రియబాంధవి.

ఎగ్జిబిషన్‌లో వాళ్లను బాగా ఆకట్టుకున్నవి, భయపెట్టినవి చెప్పుకుంటూ కారు వరకు నడుచుకుంటూ వచ్చారు.

కారెక్కాక... దీక్షిత వైపు చూస్తూ "వెళ్లొస్తాం దీక్షితా!" అంది ప్రియబాంధవి. ఆమె భర్త కూడా లోపల నుండి తొంగి చూస్తూ చేయి వూపి మరీ చెప్పాడు. "సరే! అంకుల్!" అంటూ నవ్వింది దీక్షిత.



అనురాగ్, దీక్షిత కాలేజీ లోపలకెళ్లారు.

'క్యూ' కదులుతున్న కొద్ది కొత్త వాళ్లొచ్చి చేరడంతో చేంతాడులా పెరిగిపోతోంది. అందుకేనేమో ఆ 'క్యూ' నత్త నడకలా కదులుతోంది.

మన్విత ఎర్ర బడిన ముఖంతో... లోలోన రగిలిపోతూ, కసిగా గోళ్లు కొరుకుతూ ఆలోచనగా, ఒంటరిగా నిలబడివుంది.

"కొంచెం దీక్షితను పిలుస్తారా?" అంటూ మన్విత పక్కన నిలబడ్డాడు ఒకబ్బాయి. అతను ఇప్పుడు ఎం.జి.ఎమ్ లో పి.జి చేస్తున్నాడు. అతన్ని సరిగ్గా చూడకుండానే దీక్షిత పేరు వినగానే... "చంపేస్తాను నిన్ను..." అంటూ అతని వైపు కోపంగా చూసింది మన్విత. ఆమెకి తన కోపాన్ని ఎవరి మీద చూపించాలో అర్థం కాక అతను కన్పించగానే అతని మీద చూపించింది.

కానీ... మన్విత తిరిగి చూడగా అతను తనని ఫస్ట్‌ఇయర్లో సరదాగా ర్యాగింగ్ చేసిన ధీరజ్.

షాకయ్యాడు ధీరజ్... తనేమన్నానని చంపేస్తాననంటోంది? దీక్షితను పిలవమన్నాడు. అంతేగా? ఆలోచనగా మన్వితనే చూస్తు అతను నిలబడ్డ తీరుకి తడబడింది మన్విత. వాళ్లంతా ఎం.జి.ఎమ్ పోస్టింగ్స్‌కి వెళ్లినప్పుడు అతనక్కడ కన్పిస్తుంటాడు. కానీ అతనితో పరిచయం లేదు. "సారీ" అంది ధీరజ్ వైపు చూస్తు....

అతను ఏ మాత్రం కదలలేదు. పైగా ఆమెకు అటు, ఇటు కదలటానికి వీలులేనట్లుగా నిలబడ్డాడు. నేలలోకి వూడలు దిగిన మర్రి చెట్టులా ఇంతై, అంతై అన్నట్లుగా నిలబడ్డాడు.

మన్విత తక్కువేం కాదు... ఐదున్నర అడుగుల ఎత్తుండి, ఇంపైన ఒంపు, సొంపులతో బలమైన బంగారు కడ్డీలా వుంటుంది. అయినా... అతని ఒడ్డు, పొడవు ముందు 'ఆఫ్ట్రాల్ నేనెంత?" అన్నట్లుగా అతని ముందు నిలబడక తప్పడం లేదు.

"డాక్టర్లు ప్రాణం పొయ్యాలి గాని, చంపడం ఏంటి? తప్పుకదా!" అంటూ ఆమె ముఖంలోకి కూల్‌గా చూశాడు.

అతన్నే చూస్తూ...

"మీరు కాస్త పక్కకి తప్పుకుంటే... నా కాళ్లకి బుద్ధి చెబుతా మహాప్రభో! నన్ను వదిలెయ్! ఏదో కోపంలో పొరపాటున అన్నాను". అన్నట్లుగా తన రెండు చేతుల్ని పైకి లేపి దండంపెడ్తున్నట్లు చప్పుడు వచ్చేలా కలిపి.... క్షణంలో అక్కడ నుండి తప్పుకొంది.

ధీరజ్‌కి అర్థం కాక, భృకుటి ముడిచి, వెళ్తున్న ఆమెనే చూస్తూ నిలబడ్డాడు.

సందర్శకులకు వివరించే పనిలో వున్న దీక్షిత... తన మొబైల్‌ని ఆఫ్ చేసి వుండడంతో... చాల సేపటి నుండి ఆమె మొబైల్‌కి కాల్ వెళ్లటం లేదు. దూరం నుండి ధీరజ్‌ని గమనించి, వచ్చింది దీక్షిత. ఎగ్జిబిషన్ చూడటానికి వచ్చిన తన పేరెంట్స్‌ని లోపలకి తీసికెళ్లి ఎక్స్‌ప్లెయిన్ చెయ్యమని దీక్షితతో చెప్పాడు ధీరజ్. వాళ్లను లోపలకి తీసికెళ్లింది దీక్షిత.... ధీరజ్, దీక్షిత ఒకే వూరి వాళ్లైనా మొదట్లో వాళ్లకి పరిచయం లేదు. ఒక రోజు మల్లారెడ్డి లెక్చరర్ ధీరజ్ తో "మీ వూరి అమ్మాయి దీక్షిత కె.ఎం.సి లోనే మెడిసిన్ చేస్తోంది ధీరజ్. ఆమె నా శిష్యురాలు. తనకి సబ్జక్ట్ పరంగా ఏదైనా అవసరమైతే హెల్ప్ చెయ్యి" అన్నాడు. అప్పటి నుండి హాస్పిటల్ దీక్షితకి ఏ. డౌట్ వచ్చినా క్లారిఫై చేస్తుంటాడు.

వెళ్తున్న ధీరజ్‌ని చూస్తూ....

"ఎవరే అతను? మన పి.జి కదూ! ఏంటంత స్పెషల్ గా మాట్లాడుతున్నాడు నీతో?" అంది సంజన. మన్విత మూడంతా అనురాగ్ మీదవుంది. మూడ్ అవుట్‌లో వున్న మన్విత వెంటనే మాట్లాడలేదు.

సంజనకి ఏదైనా అడిగినప్పుడు వెంటనే సమాధానం రావాలి. లేకుంటే వాళ్ల సమాధానం తన సమాధానం అన్నీ తనే మాట్లాడేస్తుంది. మన్విత మౌనాన్ని వేరే రకంగా అర్థం చేసుకొని..."నీ వాలకం చూస్తుంటే నిజంగా నాకు సంతోషంగా వుంది మన్వితా! ఎలాగైతే నేం! చూడటానికి చాలా స్ట్రాంగా, అవసరమైతే నలుగుర్ని కొట్టేలా, మళ్లీ , మళ్లీ చూడాలనిపించేంత స్మార్ట్‌గా వుండే మెడిసిన్ పి.జి. ని పట్టావ్. ఎంతయినా ఈ విషయంలో నువ్వు లక్కీ ఫెలోవి. ఎప్పటి నుండి ప్రేమిస్తున్నావ్?" అంది.



ఆ మాటలు వినగానే తన ప్రేమను అనురాగ్‌కి తప్ప ఇంకెవరికి పంచలేనన్నట్లుగా...

మన్విత చేత్తో తలకేసి కొట్టుకొని, ఉరిమిచూస్తూ, వేలు చూపించి...

"చంపేస్తా నిన్ను... ఆ మాట అన్నావంటే!" అంది ఈ రోజెందుకో ఎవరేం మాట్లాడినా చంపేయాలనిపిస్తోంది మన్వితకి.

"ఆ... నువ్వు ప్రేమించాలి నేను చచ్చిపోవాలి. ఈ లాజిక్కు బాగుంది" అంది సంజన.

"మతి లేని మాటలంటే ఇవే మరి. నేను ప్రేమించడంఏంటి? అతన్నినేనుందుకు ప్రేమిస్తాను? అతనెవరసలు?" అంది విసుగ్గా ఫీలవతూ మన్విత.

ముఖాన్ని క్వొశ్చన్ మార్క్‌లా పెట్టి...

"ఇదే ఫస్ట్ టైమా అతన్ని నువ్వు చూడటం? కానీ ఏదో మాట్లాడుతున్నట్లు అన్పిస్తే అడిగానులే..." అంది వ్యంగ్యాన్నిలోలోన దాచుకొని సంజన. అది గమనించి సంజన తనని వదిలేలా లేదనుకొని...

"అతనేదో డౌట్ అడిగితే క్లియర్ చేశాను సంజనా..." అంది మన్విత.

"ఏంటో ఆ డౌట్?" వెంటనే అడిగింది సంజన.

"నాయుడమ్మ పేరు విన్నావా?" అంది మన్విత.

"ఎందుకు వినలేదు? మనం గర్వపడే విఖ్యాత శాస్త్రవేత్త. కాశీ విశ్వవిద్యాలయం నుంచి పారిశ్రామిక రసాయన శాస్త్రంలో పట్టాపొందారు. తన పరిశోదనలు అంతర్జాతీయ ఖ్యాతిని కూడా అర్జించాయి. చివరకి కెనడాలో జరిగిన ఐడీఆర్‌సీ సదస్సుకు హాజరై కనిష్క విమానంలో తిరిగి వస్తుండగా అది కూలి చనిపోయారు. అయితే ఏంటి?" అంది సంజన.

"ఏంటంటే ఏముంది? నాయుడమ్మ అంటే మహిళ కాదు. మగవాడు అని అతన్ని ఒప్పించటానికి నా తల ప్రాణం తోకకొచ్చింది?" అంది మన్విత. అటు, ఇటు చూస్తోంది సంజన.

"ఏంటి వెతుకుతున్నావ్?" అంది మన్విత.

"ఇక్కడెక్కడైనా పూలుంటే చెవిలో పెట్టు కుందామని..."

"నాకు పెట్టవే దొరికితే... అందరు నాకే పెడ్తున్నారు . ఇంకా ఎవరెవరు పెడతారా అని చెవుల్ని చాటంత చేసుకొని ఎదురుచూస్తున్నా.." అంది మన్విత.

"నీ కెవ్వరు పెడతారు? పెడితే నువ్వే పెట్టాలిగాని..." అంటూ దినేష్ వాళ్ల పేరెంట్స్ వస్తుంటే అటు వెళ్లింది సంజన.

మన్వితకి ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా వుండాలని వుంది సంజన నాలుగు అడుగులు ముందుకెళ్లి, మన్విత రాక పోవడం చూసి తిరిగి వెనక్కొచ్చి, చెయ్యి పట్టుకొని లాక్కెళ్లింది.

* * * * *

మరుసటిరోజు...

ఎం.జి.ఎం హాస్పిటల నుండి నేరుగా ఇంటికి వచ్చాడు అనురాగ్ బైక్‌ని పార్క్ చేసి లోపలకినడిచి, తన గదిలోకి వెళ్లాడు.

అతను రోజులా లేడు. తీవ్రమైన టెన్షన్‌కి గురై, మన్విత ఇంత పని ఎందుకు చేసిందో అర్థం కాని స్థితిలో వున్నాడు. అతని మానసికస్థితి కూడా అస్థిమితంగా వుంది.

ప్రతి సంవత్సరం జనవరి ఫస్ట్‌న మన్విత తనకి యిచ్చిన గ్రీటింగ్స్‌ని గిఫ్ట్‌ని ఒక చోట చేర్చి, ఒకటి మార్చి ఒకటి చూస్తూ కూర్చున్నాడు. వాటినలా చూస్తుంటే... జవాబు దొరకని ప్రశ్నలు శూన్యంలో వేలాడుతూ, అతనిలో కలిగే అంతర్మదనం, భావసంచలనం వర్ణనాతీతంగా వుంది.

టూర్‌లో మన్విత ఎలా బిహేవ్ చేసిందో కళ్ల ముందు మెదిలి ఆమె చూపులకి అర్థమేమిటో ఇప్పుడు స్పష్టంగా తెలిసి మనసు విలవిల్లాడుతోంది. ఆ చూపుల్లో ఎంత ఆశ... ఎంత కోరిక... ఎంత తపన... ఎంత కలల తపస్సు దాగి వుందో ఆ చూపులు తనకి ఏదో చెప్పాలని ఎంతగా వెంటాడాయో...

ఎంత ఆరాటపడ్డాయో ఒక్క మాటలో చెప్పేది కాదు.



దీక్షిత, తను కలిసి కబుర్లు చెప్పుకుంటుంటే చూసి ఎంతగా బాధపడిందో... అది ఎంతటి భయంకరమైన జ్వాలో... ఆ జ్వాలలో ఎంతగా కాలిపోయిందో... వ్యక్తం చెయ్యలేని ఆ దారుణమైన హింసను ఎలా తట్టుకోగలిగిందో ఆ దేవునికే తెలియాలి. చివరకి ప్రాణ త్యాగం చెయ్యటానికి కూడా సిద్ధపడింది. అంటే ఆమె ఎంత అశాంతికి... ఎంత అలజడికి... ఎంత అసంతృప్తికి గురి అయివుంటుందో అర్థమవుతోంది. ఏది ఏమైనా ఈ తప్పు తనది కాదు.

ఎందుకంటే...

చంద్రుడ్ని చూసి పసిపాప అన్నం తిన్నా... తప్పతాగి ఓ తాగుబోతు చంద్రుడ్ని తిట్టినా... అదే చంద్రుడ్ని చూసి ఇద్దరు ప్రేమికులు పరవశించినా... ఒక సైంటిస్ట్ ఆ చంద్రుడి పై పరిశోధనలు చేసినా ఆ చంద్రునికి తెలియనట్లే మన్విత తనని ప్రేమించిన విషయం తనకి తెలియదు.

అయినా... తనని చూసి ఎవరెలా ఫీలవుతున్నారో తన కెలా తెలుస్తుంది. తనెప్పుడూ తనని చూసి అలా స్పందించమని కాని, ప్రేమించమని కాని మన్వితకి చెప్పలేదు. ప్రోత్సహించలేదు. ఒక్కరోజు కూడా అలాంటి ఆశల్ని కల్పించలేదు.

అలా తన మనసుకు తను నచ్చచెప్పుకుంటూ తనను తను ఓదార్చుకుంటుంటే...

కాలేజి నుండి ప్రియబాంధవి వచ్చింది.

రాగానే కాఫీ కలిపి, భర్తకో కప్పు యిచ్చి మిగిలిన రెండు కప్పుల్ని ట్రేలో పెట్టుకొని అనురాగ్ గదిలోకి వెళ్లింది.

గిఫ్ట్‌స్నీ ముందు పెట్టుకొని కూర్చుని వున్న కొడుకును చూసి ఆశ్చర్యపోయింది ప్రియబాందవి. ఆ గిఫ్ట్ మన్విత యిచ్చినవని తెలుసు. మన్వితే కాదు. అలాంటి గిఫ్ట్ చాలా మంది అమ్మాయిలు ఇచ్చారు అనురాగ్‌కి. కానీ మన్విత యిచ్చినవే సపరేట్ చేసి, అలా ఎందుకు కూర్చుని వున్నాడో అర్థం కాలేదు. తిన్నగా కొడుకు వైపు చూస్తూ... కాఫీకప్పు అందిస్తూ...

"అవన్నీ మన్విత యిచ్చినవి కదూ! బయట పెట్టావెందుకు? అడ్డంగా వున్నాయని ప్యాక్ చేసి పైన పెడ్తున్నావా?" అంది ప్రియబాంధవి కొడుకును గిఫ్ట్‌ని చూస్తూ...

ఒక్కక్షణం ఆమె వైపు మౌనంగా చూసి, కాఫీ కప్పు అందుకుంటుంటే అతని కళ్లు ఎర్రగా వుండడం గమనించి కలవరపడింది ప్రియబాంధవి.

'ఏంటి అనురాగ్ అలావున్నావ్?" ఆత్రుతగా ప్రశ్నించింది ప్రియబాంధవి.

"అనురాగ్ మాట్లాడలేదు తల్లికి ఏలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాడు." ఏం జరిగింది న్నాన్న అంటూ దగ్గరికి వెళ్లి తల నిమురుతూ ప్రేమగా అడిగింది.

"ఈ గిఫ్ట్‌లన్నీ మన్విత నాకు స్నేహంతో ఇచ్చిందనుకున్నా మమ్మీ! కాదట..." అన్నాడు.

"మరి..." అంది అర్థం కానట్లు ప్రియబాంధవి.

"ప్రేమట..."

"ప్రేమా?" షాక్ తిన్నది ప్రియబాంధవి.

గ్రీటింగ్స్ చెప్పి, గిఫ్ట్‌లు ఇస్తే ప్రేమ పుడుతుందా? ఒక చాక్‌లెట్ చేతిలో పెట్టి ' ప్లీజ్ నన్ను ప్రేమించవూ!" అనడం ఎంత సిల్లీగా వుంటుందో ఇది కూడా అలాగే అన్పించింది. రెండు జడలతో అమయాకంగా ముఖం పెట్టి, 'ఆంటీ! ఆంటీ! అంటూ తన చుట్టూ తిరిగిన మన్వితేనా ఇలా అడిగింది? ప్రేమంటే అంత తేలిగ్గా, ఈవినింగ్ గ్రౌండ్‌లో ఆడుకునే ఆట అనుకుంటుందేమో...

వెంటనే కొడుకు మీద అనుమానం వచ్చి...

"నువ్వు తననేమైనా ప్రేమిస్తున్నావా?" అడిగింది.

"వాళ్ల యింట్లో తనకి మనశ్శాంతి లేదని బాధపడ్తుంటే అభిమానంగా, స్నేహంగా చూసుకున్నానుకాని 'ప్రేమ' లేదు." అన్నాడు.

"మరి నువ్వు ఓపెన్‌గా చెప్పెయ్యి అనురాగ్!"



"చెప్పాను మమ్మీ! నాకీ విషయం నిన్ననే తెలిసింది. మీరు నిన్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో వున్నప్పుడు నన్ను ఎవరూ లేచి చోటుకి తీసికెళ్లి తన మనసులో మాట చెప్పింది. నేను కాదంటే బ్రతకనంది. తనలో లేంది దీక్షితలో ఏం కన్పించిందో చెప్పమంది. దీక్షితకి తనకి నేలకీ, ఆకాశానికి వున్నంత తేడా నేను చూపించాలట. అప్పుడే తను ఒప్పుకుంటుందట" అన్నాడు.

ప్రియబాంధవి ముఖంలోకి ఒక విధమైన వెలుగు ప్రవేశించింది. తన కొడుకు దీక్షితను ప్రేమిస్తున్నాడా? ఎంత తీయని వార్త! కొడుకు ఎదిగే కొద్దీ ఏ తల్లి అయినా రాబోయే కోడలి గురించి కొన్ని కలల్ని ఏర్పరచుకుంటుంది. ప్రస్తుతం తన కలల్లో ఎలాంటి కోడలు వుందో అలాగే వుంది దీక్షిత.

మౌనంగా వున్న తల్లి ముఖంలోకి చూడకుండా ఎటో చూస్తూ...

"ఎక్కడైనా ఒక్క గిన్నె నిండా మకరందాన్ని నింపి బలవంతంగా తాగమంటే తుమ్మెద తాగుతుందా మమ్మీ! ఎప్పటికీ తాగదు. తను ఎంచుకున్న పుష్పం పైనే వాలుతుంది. ఈ విషయం మన్విత అర్థం చేసుకోలేకపోతోంది?" అన్నాడు అనురాగ్.

దీన్ని అర్థం చేసుకోవాలంటే వాళ్లలో వుండే బాధని మనసుతో తాకాలి. అలా తాకినప్పుడే ఆ బాధలోని అర్థం, విలువ బయట పడ్తాయి.

అయినా తన కొడుక్కి ఈ బాధలేంటి? ఈ అమ్మాయి లేంటి? ఈ జ్ఞాపకాలను ముందేసుకొని కూర్చోవడమేంటి? దేన్నైనా భరించవచ్చుకాని ఈ హృదయ కల్లోలాన్ని తట్టుకోవటం అంత సులభం కాదు.

మాతృ వాత్సల్యంతో ఆలోచిస్తూ...

కొడుకును ఓదార్చటానికి ప్రయత్నిస్తూ...

"మన్విత నెమ్మదిగా అర్థం చేసుకుంటుందిలే అనురాగ్! చిన్న పిల్లకదా! మంచిగా నాలుగు మాటలు మాట్లాడితే అదే ప్రేమనుకుంటోంది," అంది ప్రియబాంధవి.

"ఆ నమ్మకం నాకు లేదు మమ్మీ! ఈ రోజు మన్విత మణికట్ల దగ్గర నరాలను బ్లేడుతో కోసుకొని చచ్చిపోవటానికి సిద్ధపడింది. నేనే హాస్పిటల్లో జాయిన్ చేసి ఇప్పటివరకు అక్కడే వుండి వచ్చాను." అన్నాడు.

అలా అంటున్నప్పుడు అతని కళ్లలో సన్నటి నీటి పొర కదిలింది.

అదిచూడగానే వణికింది ప్రియబాంధవి.

"అయ్యో! పిచ్చి పిల్ల అంత పని చేసిందా? ఎన్నో సార్లు తన దగ్గరికి వచ్చి "నా జీవితం ఎందుకిలా వుంది ఆంటీ? అన్ని కష్టాలు నాకే ఎందుకు వస్తున్నాయి. అందరిలా సంతోషంగా వుండలేక పోతున్నాను ఎందుకు? ఒక్క రోజు కూడా మమ్మీ నన్ను ప్రేమగా పిలవదు. దగ్గరకు తీసుకోదు. ఏ రోజు మెచ్చుకోదు. ఏది అడిగినా విసుక్కుంటుంది. కసురుకుంటుంది. ఇలా ఎన్ని రోజులు?" అంటూ బాధపడేది.

ఇంట్లో వాళ్లు తన టాలెంట్ని పట్టించు కోక పోయినా ఇతరుల అభినందనల్ని పొందటానికి ఎంతగానో ఆరాటపడి చదివేది. పోటీతత్వాన్ని పెంచుకునేది. ఇప్పుడా పోటీతత్వాన్ని చదువు మీద నుండి దీక్షిత మీదకి మళ్లించిందా? ఎలాగైనా 'ప్రేమ'ను సాధించుకోవాలని ప్రయత్నిస్తుందా? ఇప్పుడెలా?

అదోలాంటి షాక్లో వున్న తల్లిని చూస్తు...

"ఏంటీ మమ్మీ! అలా అయ్యావ్?" అన్నాడు అనురాగ్. తన తల్లికి మన్వితఅంటే ఎంత అభిమానమో అనురాగ్కి తెలుసు... మన్వితకి చదువుపట్ల వున్న ఆసక్తిని చూసి ఒక లెక్చరర్గా ముచ్చట పడేది. ఇంకా ప్రోత్సహించేది తనతో పాటు కూర్చోబెట్టి చదివించేది. తనకి పెట్టినట్లే తిండి పెట్టేది. జాగ్రత్తలు నేర్పేది. కన్న తల్లి కన్నా ఎక్కువగా చూసుకునేది.

ఈ వార్త విని కృష్ణవేణమ్మ కన్నా తన తల్లే ఎక్కువగా బాధ పడ్తుందని తెలుసు. అందుకే ముందు చెప్పొద్దనుకున్నాడు. కానీ... తప్పలేదు.

అంత వరకు శూన్యంలోకి చూస్తున్న ప్రియబాంధవి అనురాగ్ వైపు చూస్తూ...



"నేను వెంటనే మన్వితను చూడాలి. ఇప్పుడెక్కడుంది?" అంది.

తల్లి అలా అడుగుతుంటే అతనిలో కంగారు కన్నా భయమే ఎక్కువగా కల్గింది. ఎందుకంటే... మన్విత ప్రేమించింది తననే అని తెలిస్తే కృష్ణవేణమ్మ వూరుకోదు. అక్కడ ఎవరు వున్నా లెక్క చెయ్యకుండా....మమ్మీ పె తన నోటి ప్రతాపాన్ని చూపిస్తుంది. అసలే ఆమెకు 'ఆడపులి' అని వాళ్ల వీధిలో అవార్డ్ ఇచ్చినట్లు మన్విత ఒకసారి చెప్పింది.

"ఎం.జి.ఎం. హాస్పిటల్లో వుంది మమ్మీ! నిన్ను నేను తీసుకెళ్తాను. ఒక్కదానివి వెళ్లకు. అక్కడికి వచ్చే పేషంట్లని... ఆ వాతావరణాన్ని... నువ్వు చూస్తే భయపడతావు. ఎక్కువగా అక్కడికి యాక్సిడెంట్ల కేసులు, మందుతాగిన కేసులు వస్తుంటాయి. చూడటానికి భయంకరంగా వుంటుంది. రేపువెళ్దాం." అన్నాడు.

కొడుకు చెప్పేది కరక్ట్గా అన్పించినా... త్వరగా మన్వితను చూడాలని వుంది.

* * * * *

మన్వితను ఎం.జి.ఎం. హాస్పటల్కి తీసికెళ్లి ముందుగా క్యాజువాల్టి వార్డులో వుంచారు. ఆమె కండిషన్ చూసి ట్రీట్ మెంట్ యిచ్చారు. బ్లడ్ ఎక్కువగా పోవడంతో బ్లడ్ ఎక్కించారు. రక్తం బాగా పోవడం వల్ల వీక్గా వుందని రెండు రోజులు హాస్పటల్లో స్పెషల్ రూంలో వుంచమని చెప్పారు డాక్టర్. ఎందుకంటే ఆమె కూడా డాక్టరే అయినందువల్ల... కానీ... ఆమెను క్యాజువాల్టి వార్డు నుండి జనరల్ వార్డుకి షిఫ్ట్ చేశారు. కారణం రూం ఖాళీలేనందున జనరల్ వార్డులో వుండవలసి వచ్చింది.

ఆమెను చూడటానికి క్లోజ్ ఫ్రెండ్స్ వస్తున్నారు. అబ్బాయిలు మాత్రం పెద్దగా రావడం లేదు.

ఫ్రెండ్స్ వచ్చేటప్పుడు తెచ్చి ఇచ్చిన ఫ్రూట్స్, బొకేలు 'మన్విత చాలా ముఖ్యమైన వ్యక్తి' అన్నట్లు ఆమె బెడ్ దగ్గరకి రాగానే 'హాయ్' చెబుతున్నాయి.

మన్వితకి మాత్రం ఎంతో వెలితిగా అన్పిస్తూ, ఆ వెలితిని పోగొట్టుకునే శక్తి తనలో లేదన్నట్లు నిరాశగా చూస్తోంది. తనకి కావలసిందేమిటో తెలుసుకొని, దాన్ని పొందగలిగే ప్రయత్నం చేసి ఓడిపోయి, ఒంటరిగా దిగులుగా చూస్తోంది. అసలే ప్రేమరాహిత్యంలో వున్న ఆమెను ఆ ఒంటరితనం మరింత బాధిస్తోంది.

ఆమె మణికట్టు దగ్గర డాక్టర్లు కట్టిన కట్టు తెల్లగా, స్పష్టంగా కన్పిస్తూ 'ఏం తొందర వచ్చిందని ఇంత నిర్ధాక్షిణ్యంగా కోసుకున్నావు?' అన్నట్లు మన్విత వైపు చూస్తున్నా... మన్విత మాత్రం తన చేతి వైపు చూడకుండా అసలు తన శరీరం పై తనకి ఏ మాత్రం ఆసక్తి లేని దానిలా శూన్యంలోకి చూస్తోంది.

తల్లి ప్రేమ గుర్తొచ్చింది మన్వితకి. తనకి తెలియకుండానే తల్లి నుండి ఎంతో ప్రేమను ఆశించింది. కానీ తన తల్లి తమ్ముడి మీద చూపించే ప్రేమలో ఒక వంతు ప్రేమను కూడా తన మీద చూపేది కాదు. ఏది పెట్టినా ముందు వాడికే పెట్టేది. వాడు తిన్నాక ఏం మిగిలేది కాదు. ఏది చేసినా వాడ్ని దృష్టిలో పెట్టుకునే చేసేది. ముందుగా తింటే... వాడేం తినాలే, అంతా నువ్వే తినేస్తే... ఆడ పిల్లవి ఏది తిన్నా సరిపోతుంది కదా! అనేది. ఆడపిల్లకి ఒక తిండి మగపిల్లవాడికి యింకో తిండి అని వుంటుందా ఎక్కడైనా? తను మాత్రం బిడ్డకాదా? ఆమె కడుపున పుట్ట లేదా? తన కడుపులో ఆకల్ని తీర్చే బాధ్యత ఆమెకు లేదా? ఇలా ఏ భారతం, రామాయణంలోనైన వుందా?

తన ఫ్రెండ్స్ అంతా... పండగలని, పుట్టిన రోజులని, ఇలా సంవత్సరంలో అప్పుడప్పుడు కొత్త బట్టలు వేసుకుంటుంటే... తనేమో వేసుకున్న డ్రస్‌లే వేసుకుంటూ చిరిగి పోయేంత వరకు వేసుకునేది. ఎప్పుడైనా కొత్తవి కావాలని అడిగితే "ఉన్న డ్రస్‌లు చాలవా? అవన్నీ ఏం చేస్తావ్? అవి చిరిగిపోనియ్! తర్వాత చూద్దాం." అనేది ఎప్పుడైనా ఫ్రెండ్స్‌తో తిరిగినా, ఫ్రెండ్స్‌ని ఇంటికి తీసుకొచ్చినా... "నీకు స్నేహాలెందుకే? నువ్వుకూడా వాళ్లలాగే తయారవ్వటానికా? సినిమాలని, షికార్లని, చిరుతిండ్లని.... వాళ్లతో



తిరగడం మొదలు పెట్టావంటే కొంపలో డబ్బులు మిగలవు. నీ సరదాల పుణ్యమాఅని వాటికి నడకవచ్చి వెళ్లిపోతాయి. బయటకివెళ్లావంటే కాళ్లు విరగ్గొడతాను! ఏదో మీ నాన్న గారు చెప్పారు కాబట్టి అనురాగ్ వాళ్ల యింటికి వెళ్లు. ఇంకెక్కడికి వెళ్లకు..."అనేది.

"మమ్మీ! అక్క నాకు 'అక్కడ కన్పించింది. ఇక్కడ కన్పిచింది. బయట తిరుగుతుంది." అని తమ్ముడు కూడా తన మీద తల్లితో చెబుతాడే కానీ... "అక్క కూడా మనిషే... అన్ని అవసరాలు వుంటాయి... అక్కకి కూడా స్నేహితులు కావాలి... అవసరమైన చోటుకి వెళ్తుండాలి..." అని అనుకోడు తల్లి తన మీద మిలటరీ ఆఫీరసైతే, తమ్ముడేమో పోలీస్....

అమ్మంటే అమ్మే... అమ్మ పదమే కమ్మగా అన్పిస్తుంది ఆ కమ్మదనం తల్లిలో చూసుకోవాలిని.... ఆడ పిల్లగా తనకి తెలియని ఎన్నో విషయాలను తెలుసుకోవాలని ఆశించేది. ఒక్కరోజు కూడా ఆ ఆశతీరలేదు.

ప్రస్తుతం మన్విత మనసునిండా స్థబ్దత, నిశ్శబ్దత....

ఈ సారి ఎలా చావాలి? అన్నదే ఆమె ఆలోచన.... చచ్చేముందు ఎవరూ చూడకుండా - ఎవరూ అపలేని విధంగా ప్లాన్ చేసుకోవాలి. లేకుంటే ఇదిగో ఇలాగే బ్రతికిస్తారు.... బ్రతికితే? అనురాగ్ లేకుండా బ్రతకలేదు.... అతని మనసు, మాట, నవ్వు, కోపం, తాపం అన్నీ వేరెవరికో అప్పజెప్పి... తనేమీ కాని దానిలా వుండ లేదు. ఇన్ని రోజులు అతనే ప్రాణం, అతనే ప్రపంచం అన్నట్లు గా వూహించుకొని, ఇక ముందు అతనేమీ కాడు అన్న భావనతో, మానసిక వ్యధతో బ్రతకలేదు. అందుకే...!

"అనురాగ్! నువ్వు నాకు గుర్తొస్తే చాలు... నాలో ఏమీ వుండదు నీజ్ఞాపకం తప్ప... అప్పుడే నువ్వు నా పక్కన లేక పోయినా నీ జ్ఞాపకం తప్ప... నీ జ్ఞాపకాలు చాలనిపిస్తోంది... నీ జ్ఞాపకాలు నా పక్కన వుంటే నాలో నేనుండను. అంతా నువ్వే... ఇంత కన్నా ఏం చెప్పను నేను...?" అని మనసులో అనుకుంటున్న ఆమె కంటి చివరన కన్నీటి చుక్క వేదనతో జారుతుంటే...!

ధీరజ్ తన బెడ్ వైపు వస్తూ కన్పించాడు. ఇతనేంటి ప్రత్యేకించి తన బెడ్ వైపే వస్తున్నాడు?

హాస్పిటల్‌కి పోస్టింగ్స్‌కి వచ్చినప్పుడు... అసిస్టెంట్, ప్రొఫెసర్లతో వుండే పి.జి. లతో ఇతను కూడా కన్పిస్తుంటాడు... ఏప్రాన్ వేసుకొని డీసెంట్‌గా, డిగ్నిఫైడ్‌గా అన్పిస్తాడు. అతను కన్పించగానే ఓపిక వున్న రోగులు కూర్చుని నమస్కారం చేస్తుంటే, ఓపిక లేని వారు పడుకునే చేతులు జోడిస్తున్నారు.

నిన్న తనని క్యాజువాలిటీ నుండి జనరల్ వార్డుకి మార్చే ముందు- అమ్మాయిని ప్రైవేటు హాస్పిటల్‌కి తీసుకుపోదామని తండ్రి అంటుంటే 'ఏం! ఇక్కడుండే వాళ్లు డాక్టర్లు కాదా? ఇక్కడ మందులు లేవా?" అని తల్లి అనడం అంత బాధలో కూడా విన్పించింది మన్వితకి.

ప్రైవేటు హాస్పటల్‌కి వెళ్లకుండా ఇక్కడ వున్నందువల్ల తనకి తెలియని ప్రపంచాన్ని చూడగలుగుతోంది.

ఇన్ని రోజులు. ఈ హాస్పిటల్‌కి వచ్చి తనొక మెడిసిన్ స్టూడెంట్‌గా పోస్టింగ్స్ టైంలో పేషంట్లను మాత్రమే చూసి వెళ్తుండేది ఇప్పుడు తనుకూడా ఒక పేషంట్‌లా ఆ పేషంట్ల మధ్యన పడుకొని వాళ్ల బాధల్ని, ఇబ్బందుల్ని చూడగల్గుతోంది.

తన బాధేమో గాని... ప్రస్తుతం వాళ్ల బాధలు, వాళ్ల విచిత్ర మనస్వత్వాలు మన్విత మనసును హత్తుకుంటున్నాయి.

ఆ జనరల్ వార్డులో వుండే బెడ్స్ లో కొంత మంది పేషంట్లు ఎంత చూసిన రాని ఆత్మీయుల కోసం ఎదురు చూస్తుంటే... ఇంకొంత మంది ఇంటి కన్నా ఇది పదిలం అన్నట్లుగా లేని జబ్బుల్ని, బాధల్ని నటించి అక్కడ అడ్మిట్ అవుతున్నారు.... మరి కొంత మంది హాస్పటల్‌ని నరకంగా భావించి అక్కడ నుండి ఎప్పుడు బయటపడదామా అన్నట్లుగా చూస్తున్నారు.

ఒక వైపు ఒక రోగి కడుపులో నొప్పి అని అరగంటకోసారి గట్టిగా కేకలు పెడ్తుంటే... ఇంకో వైపు చనిపోయిన పేషంటు తాలుకు వాళ్లు శోకాలు పెట్టి ఏడుస్తున్నారు. అది చూస్తుంటే భూలోకంలో ఈ లోకం కూడా వుందా అన్పిస్తోంది.



అక్కడకొచ్చే డాక్టర్లతో అంటే చీఫ్, అసిస్టెంట్లు, హౌస్‌సర్జన్లు, పి.జి లతో - తమ బాధల్ని రకరకాలుగా మార్చి చెబుతుంటారు. అన్ని జబ్బులకి ఒకేసారి మందులు పడితే ప్యూచర్లో యింకేం రావన్న ఉద్దేశ్యం కావొచ్చు వాళ్లది. వాళ్లంతా పల్లెల నుండి వచ్చిన నిరక్షరాసులు.

కొంత మందికి ఇంజక్షన్ల పిచ్చి. చేతిలో సిరంజితో వున్న డాక్టర్ వంక ఆశగా చూస్తుంటారు. ఇంజక్షన్ పడితేనే గాని తమ జబ్బులు తగ్గవన్నదే వాళ్ల భావన.

ఒక హౌస్ సర్జన్ వచ్చి... ఒక పేషంట్‌కి ఇంజక్షన్ చేస్తున్నప్పుడు నీడిల్ బ్లాక్ అవడంతో అతను మళ్లీ ప్రయత్నించి ఇంజక్షన్ చేసి వెళ్లాడు. "పొడిచి, పొడిచి, చంపాడు. ఏం డాక్టరో ఏమో! కొత్త డాక్టర్ కన్నా పాతరోగి మేలన్నట్లు..... స్టెతస్కోపు మెళ్లో వేసుకోవడం కూడా సరిగ్గా రాని ఇలాంటి వాళ్లంతా డాక్టర్లేనా? నేను ఇక్కడ నుండి వెళ్లేలోపల పెద్ద డాక్టర్‌తో చెప్పే వెళ్తాను." అని పక్క ఊరి మాజీ సర్పంచి తన చేతి వైపు చూసుకుంటూ అంటుంటే మన్వితకి నవ్వొచ్చింది.

కొంత మంది కాస్త జబ్బుకే ఉలిక్కిపడి చిన్న దాన్ని పెద్దగా చేసి చెప్తుంటే... ఇంకొంత మంది ఎంత బాధ వున్నా ధైర్యంగా వుండి నోరెత్తకుండా పడుకున్నారు. మరికొంత మందేమో డాక్టరు కన్పించగానే మళ్లీ రేపటి వరకు కన్పిస్తారో లేదోన్నట్లు - ఆ రోజు వాళ్లకి ఎన్ని సార్లు కడుపు నొప్పి వచ్చిందో... ఎన్ని సార్లు వాంతులు అయ్యాయో... రాత్రి టైంలో నిద్రరాక ఎన్ని సార్లు మేల్కొన్నారో... టకటక చెప్పి 'హమ్మయ్యా' ఇక నా బాధలన్నీ తీరిపోతాయి అన్నట్లుగా డాక్టర్ వైపు చూస్తుంటే మన్విత వాళ్లనే చూస్తోంది.

కొంత మంది సెక్యూరిటీ వాళ్లు, వార్డ్ శుభ్రపరిచే బాయ్స్, బయట నుండి లోపలికి వచ్చే పేష్ంట్ అటెండర్స్ వద్ద మనీ లంచంగా వసూలు చేస్తున్నారు. హాస్పిటల్ లోపల ఒక అంటెడర్ మాత్రమే వుండాలన్న రూల్ వున్నా కూడా బంధువులు వాళ్ల ఆత్మీయుల పైన ప్రేమను చంపుకోలేక గుంపులుగా సెక్యూరిటీ వాళ్లకీ మనీ ఇచ్చి వార్డులోకి వస్తున్నారు. పేదవాళ్లకి ఇది కష్టమైనా ధనికులకు మాత్రం ఈ విధంగానైనా వాళ్ల ఆత్మీయులని

చూడనిస్తున్నారన్న ఆనందం కలుగుతుంది. వాళ్ళ ఆనందాన్ని చూసి ప్రేమ ఇంత గొప్పదా? అని ఫీలయింది ఆ ప్రేమ నాకు దొరకట్లేదు ఏమిటి? అని ఫీలయింది.

కొంత మంది డాక్టర్‌ని చూడగానే, లేచి కూర్చుని... ఆయనలా వెళ్లగానే... "ఈ డాక్టరు సారు చేతి వాసి చాలా మంచిది. మొన్న మా పిన్నికి క్షణంలో బాగు చేశాడు. వాళ్ల మామగారికి కూడా బాగయింది. ఆ గురితోనే ఏది బాగలేకున్నా ఇక్కడికే వస్తారు." అని అంటుంటే వెళ్తున్న డాక్టర్ వైపు గొప్ప స్వామిజీని చూసినట్లు చూస్తున్నారు మిగిలిన పేషంట్లు.

అంతలో స్టెతస్కోప్‌ని మన్విత ముఖానికి దగ్గరగా గాలిలో ఆడిస్తూ... 'హలో' అన్నాడు ధీరజ్ మన లోకంలోకి రండి. ఏమిటంత పరధ్యానం అన్నట్లుగా...

ధీరజ్‌ని చూడగానే... అసలే పెద్దవయిన ఆమెకళ్లు మరింత విచ్చుకున్నాయి.

"మొన్న మీకు సారీ చెప్పాను కదా! మళ్లీ ఎందుకొచ్చారు?" అంది తల ఎగరేసి, కుడి చేతిని పైకి లేపి, ఆ చేత్తో సైగ కూడా చేసింది. తెల్లగా కదులుతున్న ఆ చేతిని ఒక్క క్షణం అలాగే చూశాడు ధీరజ్ అందులో అత్మ విశ్వాసం, ఆత్మాభిమానం, అహంకారం తప్ప బేల తనం లేదు. ఇలాంటి ఈ అమ్మాయి ఇలా బెడ్ మీద ఎందుకుంది?

"నిన్న నేను డ్యూటీలో లేను. ఉదయం నేను ఓ.పి.లో వుండంగా... కె.ఎం.సి మెడికో అమ్మాయి జనరల్ వార్డ్‌లో వుందన్నారు. మీరనుకోలేదు. ఏం జరిగిందండి?" అన్నాడు ఆమె ముఖంలోకి ఆత్రుతగా చూస్తూ ధీరజ్

"ఏం జరిగితే ఇతనికెందుకో. చెప్పందే కదిలేలా లేడే!" అన్నట్లు చూస్తూ...

"కోసుకున్నా..." అంది సింపుల్‌గా .

ఉల్లి గడ్డ కోస్తుంటే తెగిందన్నంత తేలిగ్గా ఆమె చెబుతుంటే...

"మొన్న కన్పించినప్పుడు బాగానే వున్నావ్‌గా... ఇంత లోపలే..." అంటూ ఆగి పోయాడు.



"అంటే ఈ లోపల ఏం కాకూడదా? అయినా ఇవన్నీ మీకంత అవసరమా? మీదారిన మీరు వెళ్లండి ప్లీజ్" అంది సహనాన్ని కూడదీసుకుంటూ.... తను ఏదైతే మాట్లాడకూడదనుకుందో అతను అదే మాట్లాడుతుంటే బాధగా కూడా వుంది.

"ఎలా వెళ్తానండీ! ఇవాళనా ఓ.పి. అయ్యాక డ్యూటి ఇక్కడే... నన్ను చూస్తుంటే ఆ మాత్రం బాధ్యత లేని వాడిలా అన్పిస్తున్నానా? ఒక పి.జి గా నేనా పని చెయ్యలేను. అదీ కాక ఇలా ఒంటరిగా మిమ్మల్ని ఈ బెడ్ మీద చూస్తుంటే జాలిగా కూడా వుంది" అన్నాడు సిన్సియర్‌గా. ఆమెను చూస్తుంటే ఏదో దాస్తున్నట్లు అన్పించి, ఏందాస్తుందో తెలిసికోవాలని వుంది.

ఈ జాలి అనే పదాన్ని డిక్షనరీలో నుండి తీసి వెయ్యాలి. ఆ పదాన్ని చిన్నప్పటి నుండి విని, విని విసుగొస్తోంది. తనికి నచ్చని పద ప్రయోగాన్ని చేసినందుకు అతనంటే కోపంగా వుంది మన్వితకి.

ఆ కోపంలో..."ఒంటరిగా వున్నామని జాలిగా వుందా? అయితే మీరు కూడా ఇక్కడో బెడ్ వేయించుకోండి! ఇదిగో ఈ పక్కన కాస్త ప్లేస్ వుంది." అంది ఎమోషనల్‌గా మాట్లాడడంతో బాడీ కదిలి చెయ్యి నొప్పిగా అన్పించి "అబ్బా..." అంది.

ఆ నొప్పికి భయపడి - కదలకుండా బిగుసుకుపోయి... పడుకున్న శిల్పంలా అయింది.

"ఇక్కడ బెడ్ వేయించుకునే అదృష్టం నా కొద్దులే. ఏదో పేషెంట్‌లా బెడ్ మీద వున్నావని, వచ్చి పరామర్శించానంతే! చూస్తుంటే ఇదేదో సూసైడ్ కేస్‌లా వుందే... ఎందుకు చేసుకోబోయావు?" అంటూ ఆమె చెవికి దగ్గరగా వంగి రహస్యం అడుగుతున్నట్లు అడిగాడు.

ఉరిమి చూసింది మన్విత.

అప్పటికే వంగి వున్న ధీరజ్ మెల్లగా ఆమెకళ్ల వైపు చూస్తూ....

"అబ్బో...ఆ చూపేంటి? మరీ చిన్న పిల్లాడిని భయపెట్టినట్లు భయపెడ్తోంది. నీతో నాకెందుకులే గాని...నన్నెప్పుడు చంపుతావో చెప్పు?" అన్నాడు సరిగ్గా లేచినిలబడుతూ...

చచ్చీ, చెడి తనే సరిగ్గా చావలేకపోయింది. తనింకొకళ్లని చంపటమా? ఇంత సీరియస్ గా చనిపోవావలని ప్రయత్నించి హాస్పిటల్‌లో వుంటే - ఇతనేంటి ఇంత జోవియల్‌గా, ఎంతో కాలంగా పరిచయమున్న వ్యక్తిలా మాట్లాడుతున్నాడు?

ఆలోచనగా వున్న మన్విత వైపు ఒక్క క్షణం దీక్షగా చూశాడు ధీరజ్... మనిషి చూడబోతే బాగుంది. పైగా కాబోయే డాక్టరు. ఇలాంటి పరిస్థితి ఎందుకు తెచ్చుకుంది?.

"ఓ.కె. రెస్ట్ తీసుకో... తర్వాత కలుస్తా". అంటూ అక్కడి నుండి కదిలాడు.

ఏదో పని వుండి బయట కెళ్లి, అప్పుడే లోపలకి వచ్చిన సంజన... మన్వితతో మాట్లాడి వెళ్తున్న దీరజ్‌ని చూసి షాకయినదానిలా నిలబడింది. వెళ్తున్న అతని అడుగుల చప్పుడు నిశ్శబ్దంగా వున్న ఆ వార్డులో మృదువుగా, హుందాగా విన్పిస్తున్నాయి.

"నరాలు కోసుకుంటేనేగాని... ఇతగానికి ప్రియురాలి విలువ తెలియలేదు కాబోలు. నిన్నంతా ఎక్కడికెళ్లాడో..."? అనుకుంటూ మన్విత దగ్గరకి వెళ్లింది సంజన. నిన్నటి నుండి మన్వితకి తోడుగా హాస్పిటల్లోనే వుంది సంజన.

మన్విత ఇలా చేసుకోటానికి కారణం "లవ్ ఫెయిల్" అని కొందరు, "ఇంటి పరిస్థితులు" అని కొందరు అనుకుంటున్నారు. నిజంగా ఆమె ఎవర్ని ప్రేమించిందో అనురాగ్‌కి, అతని తల్లికి తప్ప ఎవరికి తెలియదు. అంతో, ఇంతో సౌమ్యకి తెలుసు. సౌమ్యకి పెండ్లై వెళ్లి పోయింది. సంజన మాత్రం నువ్వింత ప్రేమించింది ధీరజ్‌నే అని అనుకుంటోంది.

"ఏంటంత డల్‌గా వున్నావ్ మన్వి? లవ్వన్నాక ఇలాంటివి కామన్. మన్విత సీరియస్‌గా తీసుకొని మనసు పాడు చేసుకోకు. అతనొచ్చాడు కదా! ఇంకా ఎందుకింత ఆలోచన? ఇప్పటికైనా అతనేమంటున్నాడో చెప్పు?" అంది సంజన మన్విత బెడ్ పై కూర్చుంటూ...

ఒకసారి... తన చేతి వైపు చూసుకొని భారంగా శ్వాస తీసుకొంది మన్విత.



"చెప్పు? చెప్పు? అంటే ఏం చెప్పను సంజనా? అయినా... అతనెక్కడ దొరికాడేనీ కల?" అంది నీరసంగా చూస్తూ మన్విత.

"నీ కన్నా ముందు నాకు దొరికి వుంటే నీదాకా రానిచ్చే దాన్ని కాదులే...నేనే ట్రై చేసుకొని వుండే దాన్ని... ఇంతకీ ఏమన్నాడో చెప్పు... నిన్నటి నుండి టెన్షన్‌తో చచ్చిపోతున్నా... " అంది సంజన.

"ప్రఖ్యాత టైమ్ మ్యాగజైన్ 1931 సంవత్సరానికి 'మాన్ ఆఫ్ ద ఇయర్' అవార్డుకు మహాత్మాగాంధీని ఎంపిక చేసిందని చెప్పాడు... చిన్నతనంలో 'మిల్టన్' చర్చి పాదర్ కావాలనుకున్నాడట. అలా జరిగివుంటే ఈ భూ మండలం ఒక అద్భుతమైన కవిని కోల్పోయి వుండేదని చెప్పాడు... ఇంకా ఐన్ స్టీన్ నోబుల్ బహుమతి కింద తనకి వచ్చిన సొమ్ములో చాలావరకు తెలిసీ తెలియని పద్ధతుల్లో ఇన్వెస్ట్ చేసి పోగొట్టుకున్నాడట... అది కూడా చెప్పాడు." అంది మన్విత.

"అవునా! అలాగా! ప్రొటోజోవా నుండి వెర్టిబ్రేటా వరకు ఏ జాతితో పోల్చుకున్నా మనిషి అధముడేనట. అయినా ఈ సకల చరాచర జగత్తును ఏలుతున్నాడు అంటే అతని మెదడే కారణం. ఇది చెప్పలేదా?" అంది సంజన.

నీతో మాట్లాడి గెలిచే ఓపిక నాకు లేదు అన్నట్లుగా కళ్లు మూసుకొంది మన్విత

"పెళ్లెప్పుడట... నీ మెడిసిన్ పూర్తయి, హౌస్ సర్జన్ కూడా అయ్యాకనా? లేక..." అంటూ ఆమెకు కాస్త దగ్గరగా జరిగింది సంజన.

"ఇంకోసారి... ఆ ధీరజ్ గురించి నా ముందు ఎత్తావంటే నిజంగానే నిన్ను చంపేస్తాను ". అంది కోపంగా మన్విత.

"ఆ... చంపావ్ లే . ఏదో టైం బాగుండి అనురాగ్ వచ్చి నిన్ను హాస్పిటల్‌లో చేర్పించాడు. లేకుంటే ఈ పాటికి నీడెడ్ బాడీ ముందు కూర్చుని మేమంతా ఏడుస్తుండే వాళ్లం... ఎందుకైనా మంచిది మళ్లీ ఇలాంటి సీన్ రిపీట్ కాకుండా అతన్ని నీ గ్రిప్‌లో పెట్టుకో..." అంది సంజన.

పక్కనేదైనా చేతికి దొరికితే కొడదామన్నట్లుగా మన్విత అటూ, ఇటూ చూస్తుంటే...

"చూడండి! ఆంటీ! మన్వీ!" అంటూ... అదే వార్డులో పేషంటును పరామర్శిస్తు కూర్చుని వున్న కృష్ణవేణమ్మ దగ్గరికి వెళ్లింది సంజన .

ఆమె కంగారు పడ్తూ ' మళ్లీ ఏమైనా జరిగిందా? ' అన్నట్లుగా ఆత్రుతగా చూసింది.

"కంగారు పడకండి ఆంటీ! దానికేం కాదు. ఇప్పుడే అతనొచ్చి మాట్లాడి వెళ్లాడు." అంది సంజన.

'అ... నా బిడ్డనంత క్షోభ పెట్టిన వాడు మళ్లీ వచ్చాడా? ' అంటూ ఆమెలోని తల్లి పేగు కదిలినట్లై, వాడు కన్పిస్తే కొడతానన్నట్లుగా లేచింది కృష్ణవేణి. ఎంతయినా తల్లి కదా!

"అయ్యో! అతన్ని మీరేం అనకండి ఆంటీ! మన్విత మనకి బ్రతకాలి అంటే! అతనిప్పుడు మనకెంతో అవసరం..." అంది సంజన.

"చక్కని సలహా చెప్పావు సంజనా! లేకుంటే వాడ్ని నానోటి మాటల్తోనే చంపేసేదాన్ని ..." అంది కృష్ణవేణమ్మ.

"వాడు అనకండి ఆంటీ! కాబోయే అల్లుడు కదా?"

"సరే! అతన్ని నాకెందుకు చూపించలేదు?" అంది నిష్టురంగా.

"అతను ఇక్కడే పి.జి చేస్తున్నాడు ఆంటీ! తర్వాత చూపిస్తాను లే..." అంది సంజన తనకి తెలిసిన హౌస్ సర్జర్ కన్పించటంతో... 'హయ్' చెబుతూ అటు వెళ్లింది సంజన.

"అయ్యో! ఆ అబ్బాయిని చూడ లేక పోయానే" అని అనుకుంటూ..... తనింత ఉరుకులు, పరుగులు మీద హాస్పిటల్‌కి రావటానికి కారణం అతనేగా... తన కూతురు అతన్ని ప్రేమించి ఆ ప్రేమను పొందలేక యిలా చేసుకుందని తెలియగానే... అత్త గారి వైపు చూస్తూ...

"నీ మనవరాల్ని చదువుకోటానకి పంపారా? నరాలు తెగ్గోసుకోటానికి పంపారా? మాట్లాడలేం? నేను పెళ్లి చెయ్యమంటే చెయ్యకుండా చదువుకోటానికి పంపాడు నీ కొడుకు! ఇప్పుడు దానికేమైనా అయితే ఎవరు బాధ్యులు?" అంటూ అత్త గారి మీద కేక లేసి హాస్పటల్‌కి పరిగెత్తింది.



హాస్పిటల్లో - బెడ్ మీద ప్రాణంతో వున్న కూతుర్ని చూడగానే కాస్త స్తిమిత పడింది... ఈ పరిస్థితిలో కూతుర్ని తిడితే మళ్లీ చస్తుందన్న భయంతో మౌనంగా వుందే కాని... కూతురు చేసిన పని క్షమించ తగింది కాదు.

ప్రేమిస్తే చావాలా?

రోజు, రోజుకి - ప్రపంచం ఎంతో ముందుకి వెళ్తుంటే - డాక్టరు చదువు చదువుతూ బామ్మల కాలం నాటి ఆడపిల్లలా నరాలు కోసుకోవడం ఏమిటి? చచ్చి ఎవర్ని సాధించాలి? బ్రతికితే దేన్నైనా సాధించ వచ్చు.

పోనీలే... ఇప్పటికైనా ఆ అబ్బాయి మళ్లీ తన కూతుర్ని వెతుక్కుంటూ వచ్చాడు. ఇంతకన్నా ఏం కావాలి? ఒక వేళ అతను రాకపోయినా బ్రతకటానికి ప్రయత్నించాలి కాని చావడం దేనికి? తన జీవితంలో తనెంత కష్టపడలేదు. అలాగని చనిపోయిందా?

పెళ్లికి ముందు తను ఎన్ని కలలు కన్నది.

ఒక్క కలన్నా నిజమైందా?

దీనికి కారణం తన భర్త విశ్వనాథే...

భార్య మాట విన్నా , భార్య అభిప్రాయానికి విలువ ఇచ్చినా, నెత్తి నెక్కి కూర్చుంటుందని... వాళ్ల పెద్దవాళ్లు చెప్పిన మాటని వేదంలా విని, ఆ మాటల్ని నర, నరంలో జీర్ణించుకొని, తను ఏది అడిగినా కాదనే వాడు... ఏది చెప్పినా విననట్లే వుండే వాడు... మళ్లీ మళ్లీ రెట్టించి అడిగితే 'నేను చస్తే కాని నువ్వు నోరు మూసుకోవు' అని బెదిరించేవాడు... ఇంత కన్నా బలమైన ఆయుదం మరొకటి వుంటుందా భార్యను పొడవటానికి? ఆ మాటతో భయంవడి మననుకి పక్షవాతం వచ్చిన దానిలా మారిపోయింది...ఎంత మారినా గాని ఏ కాలక్షేపం లేకుండా శూన్యంలోకి చూస్తూ కూర్చోటానికి తనేమైన రచయిత్రియా? చిత్రకారిణియా? మామూలు స్త్రీ. అందుకే చుట్టు పక్కల వాళ్ల గొడవల్లో తల దూర్చి కాలక్షేపం చేస్తోంది. ఇంట్లో వున్న అత్తగారిని మాటలతో హింసించి తృప్తి పడ్తోంది. మనిషి

అన్నాక ఏదో ఒక తృప్తి వుండాలిగా... లేకుంటే గతం గీసిన గీత మీద కళ్లకి గుడ్డ కట్టుకొని ప్రయాణం చేయాలంటే సాధ్యమా! సాధ్యం కాకపోయినా చేయక తప్పని ప్రయాణం ఇది. చచ్చిపోతే ఎలా?

అంతలో - ప్రియబాంధవి, అనురాగ్ వస్తూ కన్పించారు.

వాళ్లకి ఎదురెళ్లింది కృష్ణవేణి.

"బాగున్నావా! అనురాగ్! నీ వల్లనే నా కూతురు నాకు దక్కింది. బయటంతా అదే చెప్పుకుంటున్నారు" అంటూ అనురాగ్‌ని పలకరించి...

ప్రియబాంధవిని కావలించుకొని ఏడ్చింది.

"మన్విత ఎలా చేసిందో చూడండి! ఒక వేళ జరగరానిది జరిగివుంటే మా పరిస్థితి ఏమయ్యేది. దాని చదువు మీద ఎంత డబ్బుపెట్టాం. ప్రేమించినంత మాత్రాన ప్రాణాలు తీసుకోవాలా? వాడేమైనా పై నుండి వూడిపడ్డాడా? మీరైనా చెప్పండి! లోకంలో మగవాళ్లకి కరువేమైనా వచ్చిందా?" అంటూ తన దోరణిలో తను కళ్ల నీళ్లు తుడుచుకొంది.

ప్రియబాంధవి మాట్లాడలేదు. మన్విత అనురాగ్‌ని ప్రేమించినట్లు కృష్ణవేణమ్మకి తెలిసినట్లు లేదు. తెలిసుంటే తనతో ఇలా వుండేది కాదు. ఎంతో భయపడ్తూ వచ్చిన ప్రియబాంధవికి ఇప్పుడా భయం తగ్గింది.

"మా వదిన కొడుకు ఇప్పటికీ దీని కోసం ఎదురు చూస్తు వున్నాడు. ఇస్తే పెళ్లి చేసుకుందామని..." అంది కృష్ణవేణమ్మ.

తనిప్పుడు మన్వితకి పెళ్లి చెయ్యమని చెప్పాలా? చదివించమని చెప్పాలా? మన్విత విషయంలో ఏది కరక్టో తేల్చుకోలేక పోతోంది ప్రియబాంధవి.

"అది కూడా నేనిప్పుడు అనటం లేదు. నా మనసు మార్చుకున్నాను. ఎందుకంటే దాన్ని ప్రేమించిన అబ్బాయి ఇంతకు ముందే వచ్చి దాంతో మాట్లాడి వెళ్లాడు." అంది కృష్ణవేణి.

ఆ మాటలు వింటూ తల్లీ , కొడుకు లోలోన షాకయ్యారు.



ఎవరా అజ్ఞాత వ్యక్తి? అని ఆలోచించసాగారు.

ఎంతకీ అర్థం కాక ఆ తర్వాత ఏం చెబుతుందా? అని అతి శ్రద్ధగా వినసాగారు.

కృష్ణవేణమ్మ ఇంకేం చెప్పకుండా... వరుసగా వున్న పేషంట్ల బెడ్ల వైపు వెళ్లింది. అక్కడ పేషంట్ల తాలూక బంధువులతో మాట్లాడుతూ కూర్చుంది.

అనురాగ్ - తల్లితో కలిసి మన్విత దగ్గర కెళ్లి కూర్చున్నాడు.

మన్వితను పలకరించి... ఎప్పటిలాగే ప్రేమగా తలనిమిరింది ప్రియబాంధవి.

మన్విత ఒక్క క్షణం చూసినా... ఆ చూపులు అనురాగ్ గుండెల్ని చీల్చి... "ప్లీజ్? అనురాగ్ ! ఇప్పటికైనా నన్ను నీ మనసులోకి రానియ్యవా?" అన్నట్లు అర్థిస్తున్నాయి. తన దగ్గర సమాధానం లేనట్లు అతని చూపులు నేలకి అతుక్కున్నాయి.

విషయం తెలియకపోతే... ఎలా వుండేదో కాని, ఇప్పుడు అనురాగ్ మనసులో దీక్షిత వున్నందుకు సంతోషించాలో - మన్విత మనసులో అనురాగ్ వున్నందుకు బాధ పడాలో అర్థం కాకుండా వుంది. ప్రియబాంధవికి...

... మాట్లాడకుండా మౌనంగా చూస్తున్న మన్వితది మామూలు జ్వలనం కాదు. నిశ్శబ్ద జ్వలనం అని గ్రహించింది ప్రియబాంధవి

* * * * *

తర్వాత రోజు...

ఎప్పటి లాగే స్టెతస్కోప్ పట్టుకొని ధీరజ్ వచ్చాడు. అతను నిన్నటి నుండి మన్వితకి శ్రద్ధగా ట్రీట్‌మెంట్ ఇస్తున్నాడు.

మన్వితకి స్నాక్స్ తినిపించి, పాలు తాగించి అక్కడే కూర్చుని వున్న సంజన - ధీరజ్‌ని చూడగానే లేచి బయట కెళ్తోంది.

అతనొస్తుంటే ఇది బయటకెళ్తుందేం? దీనికేమైనా తిక్కా?

"సంజనా! వుండవే! నువ్వెందుకెళ్తావ్?" అంది మన్విత.

సంజన అదేం విన్పించుకోకుండా... మన్విత వైపు సాఫ్ట్‌గా, ప్లజంట్‌గా చూస్తూ... తన పెన్సిల్  హై హీల్ శాండిల్స్‌ని స్మూత్‌గా నేలపై ఆనేలా నడుచుకుంటూ క్షణంలో బయటకెళ్లింది.

మన్విత చూస్తుండగానే సంజన ఖాళీ చేసి వెళ్లిన స్టూల్ మీద కూర్చున్నాడు ధీరజ్.

"ఎలా వున్నావ్? మందులు వేసుకున్నావా?" అన్నాడు దీరజ్

"వేసుకున్నాను సర్?" అంది మన్విత .

నిన్నా - మొన్నాలాగా కాకుండా కొత్త మన్విత కన్పించింది ధీరజ్‌కి.

"వెరీ గుడ్! నిన్నలా చూస్తుంటే నాకో కోరిక కల్గుతోంది." అన్నాడు.

కోరిక అనగానే అర్థం కాక ఆమె భృకుటిముడిపడింది.

"మీ డ్రీమ్స్, లైఫ్ డిజైన్ ఎక్సెట్రా తెలిసికోవాలిన్నదే నా కోరిక..." అన్నాడు కూల్‌గా చూస్తూ...

"చచ్చి పోవటం ఎలా అన్నదే నా డ్రీమ్!" అంది.

"ఆ డ్రీమ్‌కి పెద్ద కష్టపడనవసరం లేదు. బ్రతకాలంటేనే కష్టపడాలి... ప్లానింగ్స్ కావాలి. చదవాలి కెరీర్ పెంచుకోవాలి. మంచి ఫ్రెండ్స్‌ని సంపాయించుకోవాలి. వున్న టైంలోనే మన మనసుకి నచ్చినట్లు టైంని మెయిన్‌టెయిన్ చేసుకోవాలి. ఇలా... చాలా... చాలా..." అన్నాడు.

డాక్టర్- పేషంట్‌కి మధ్య వుండే రిలేషనే కాకుండా తనేంటో తెలుసుకోవాలనుకుంటున్న ధీరజ్ గురించి ఆలోచిస్తోంది మన్విత. తనకి స్పెషల్ ట్రీట్‌మెంట్ యివ్వటమే కాకుండా తన గురించి అతనిలా ఆలోచించటం గొప్ప విషయమే.

ఎందుకంటే... గత వారం రోజులుగా - తమ కాలేజీలో కొంతమంది అబ్బాయిలు అమ్మాయిల్ని పట్టించుకోవడం లేదు. కారణం కిట్స్ కాలేజీలో ఇంజనీరింగ్ చదివే ఇద్దరమ్మాయిలపై యాసిడ్ పోసిన ముగ్గురబ్బాయిల్ని ఎన్‌కౌంటర్ కింద పోలిసులు చంపేయటమే...



అప్పటి నుండి కొందరబ్బాయిలు అమ్మాయిల్ని పలకరించాలన్నా... అమ్మాయిలకి అవసరమైన హెల్ప్ చెయ్యాలన్నా... ముందుకు రావడం లేదు. 'మనకెందుకులే.... ఏ మాత్రం తేడా వచ్చినా పోలీసులు, జైళ్లూ, లేని పోని తల నొప్పులు' అని అనుకుంటున్నారు. అమ్మాయిలతో స్నేహంగా వుండడం కూడా ఇక ముందు టైం వేస్ట్ అనుకుంటున్నారు. అదే ఇంతకముందు... ఎక్కడ బడితే అక్కడ - సబ్జక్ట్ పరంగా నైతే నేమి, సమ్ ఫీలింగ్స్ పంచుకోవడంలోనైతే నేమి గంటలు, గంటలు మాట్లాడుకుంటూ గడిపేవాళ్ల.

ఇదిలా వున్నా... టివి నైన్ ఛానల్ వాళ్లు ప్రతి రోజు ఎక్కడో ఒక చోట 'అమ్మాయిల్ని టీజ్ చేస్తున్న అబ్బాయిల్ని అరెస్ట్ చేస్తున్న పోలీసులు' అన్న న్యూస్‌ని ప్రసారం చేస్తూనే వున్నారు. అబ్బాయిల్లో -అనుకున్న మార్పు ఆశిస్తూ ప్రజలు - ప్రభుత్వాలు ఘోషిస్తున్నా ఇదేనా మార్పు? అంటున్నాయి మహిళా సంఘాలు...

కానీ... మొన్నోక రోజు దినేష్ కన్పించి...' అర్థ రాత్రి ఆడపిల్ల ఒంటరిగా నడి రోడ్డు మీద నడిస్తే (ఎందుకు నడవాలో) స్వాతంత్ర్యం వచ్చినట్లు అని ఇన్ని రోజులు విన్నాను. కానీ... ఈ రోజు నుండి ఆ డైలాగు మా అబ్బాయిలకి వర్తిస్తోంది. అంటే మాకున్న స్వాతంత్ర్యం మీకొచ్చిందన్న మాట. నడిచే ముందు దగ్గర్లో అమ్మాయి లేకుండా నడుచుకోవాలి అని మేమంతా డిసైడ్ అయిపోయాం, ఎందుకంటే ఆకూ-ముళ్లూ సామెతలా అమ్మాయి వెళ్లి అబ్బాయికి సైటేసినా, అబ్బాయి వెళ్లి అమ్మాయికి సైటేసినా చివరకి తుపాకి తూటా దిగేది అబ్బాయి గుండెల్లోనే కదా!' అన్నాడు మా భయం మాకుంది అన్నట్లుగా...

అది గుర్తొచ్చి - నవ్వింది మన్విత.

"నన్నిక్కడే వుంచుకొని ఎటెళ్లావు మన్వితా?" ఆమె నవ్వునే చూస్తూ అన్నాడు ధీరజ్. అతని పిలుపులో ఆప్యాయత వుంది.

"దినేష్ మాటలు గుర్తొచ్చాయి." అంది మన్విత.

"అదీ... అలా నవ్వు తెప్పించే విషయాలను గుర్తుకి తెచ్చుకుంటూ నవ్వుతూ వుండాలి. ఇది ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది." అన్నాడు.

అతని మాటలు సరదాగా అన్పిస్తున్నాయి. అతని సమక్షం కూడా అనీజీగా లేదు. ఇప్పుడు అతని మీద కోపం కూడా రావడం లేదు. కానీ తన మనసే బాగలేదు. అతనితో హ్యాపీగా మాట్లాడగలిగేంత హాయిగా లేదు.

"మెడిసిన్ పూర్తయ్యాక ఏం చెయ్యాలనుకుంటున్నావు మన్వితా? ఐమీన్ ప్రాక్టీస్ పెట్టాలనుకుంటున్నావా? లేక హయ్యర్ స్టడీస్‌కి వెళ్లాలనుకుంటున్నావా?" అన్నాడు.

సడన్‌గా అతనలా అడిగే సరికి ఏం చెప్పాలో తెలియనట్లు తడబడింది. అయినా తనకి ఫ్యూచరేంటి? సంజన నిన్నటి నుండి ఎటూ పోకుండా కనిపెట్టుకొని సర్వీస్ చేస్తుంటే తనకి వీలు కావడం లేదు కాని, అదెప్పుడు తనని వదిలిపెడ్తుందా, చచ్చిపోదామ అని ఎదురు చూస్తోంది.

"నాకు బ్రతకాలని లేదు." అంది ఫ్రాంక్‌గా.

"ఎందుకని? అడిగి నిన్ను ఇబ్బంది పెట్టను. ఎందుకంటే ఏదో బాధ వుండబట్టే అలాంటి నిర్ణయానికి వచ్చావు. కానీ ఆ నిర్ణయం తప్పు." అన్నాడు.

"మరి... నా బాధ?" అంది

"ఈ జీవన సముద్రంలో... సమరంలో... అన్ని బాధలు కొట్టుకు పోతాయి . ఏ బాధా నిలవదు. అలా కొట్టుకు పోయే బాధల్లో ప్రస్తుతం నీ బాధ ఒకటి..." అన్నాడు.

"నాది అలాంటి బాధ కాదు...." అంది స్థిరంగా

"కావచ్చు... కానీ... అన్ని బాధలకన్నా జీవితం గొప్పది". అన్నాడు.

"నా జీవితం నేను కోరుకున్నది ఇవ్వడం లేదు." అంది

"పాజిబుల్‌గా వుండి... అందే దాన్నే కోరుకోవాలి." అన్నాడు.

"మీరనేది నాకు అర్థమైంది నేను ఆకాశానికి నిచ్చెనలు వెయ్యడం లేదు. అందుబాటులో వున్న దాన్నే ఆశిస్తున్నాను." అంది.



"అది దొరకనప్పుడు దాన్ని ఆకాశమే అనుకోవాలి. మనల్ని మనం దారి మళ్లించుకోవాలి." అన్నాడు.

అది సాధ్యం కాదు అన్నట్లుగా చూసింది మన్విత.

అదే ధ్యాసలో వున్న మన్విత మనసును దారి మళ్లించాలన్న ఉద్దేశ్యంతో....

"నీ కిప్పుడు జీవితం విలువ తెలియాలి మన్వితా! వేడి అన్నంలో పప్పు, నెయ్యి, అవకాయ వేసుకొని రెట్టింపయిన ఆకలితో తింటున్నప్పుడు ఒక్కో ముద్ద లోపలకి దిగుతుంటే - ఆ రుచికి ఎవరికైనా సంతోషం కలుగుతుంది ఆ రుచి లాంటి అద్భుతమైంది నీ జీవితం. నువ్వా రుచిని ఆస్వాదిస్తున్న సమయంలో నీ పంటి క్రింద రాయిపడి నీ ముఖంలో రంగులు మారుతున్నాయి. తింటున్న రుచిని మరిచి, ఆరాయి గురించే ఆలోచిస్తున్నావు. వండిన వాళ్ల శ్రమని, వడ్డించిన వాళ్ల ప్రేమని... అంటే తల్లి దండ్రుల్ని, సమాజాన్ని మరిచిపోయి పాడురాయి మీదనే దృష్టినిలిపి జీవితమనే వడ్డించిన ప్లేటుని పక్కకి నెట్టేస్తున్నావు. ఇది తప్పు. జీవితమనే అన్నం ముద్దలో ఆ రాయి చిన్న కష్టం లాంటిది. మనసును రాయి చేసుకొని జీవితమనే అన్నంలో వచ్చిన రాయిని పక్కన పెట్టి... నీ కోసం ఎదురు చూసే భవిష్యత్తు విందును ఇష్టంగా ఆరగించు...లైఫ్‌ని బ్యాలెన్స్ చేసుకో..." అన్నాడు. అవి అతను ఎక్కడో చదివిన వాక్యాలు. బాగా నచ్చడంతో మన్వితకి చెప్పాడు.

అతని మాటలు ఆమె మనసు మీద బాగా పని చేస్తున్నట్లు ఆమె ఫీలింగ్స్‌ని బట్టి తెలుస్తోంది ధీరజ్‌కి....

"ఓ.కె. మన్వితా! మళ్లీ కలుస్తా..." అంటూ స్టూల్ మీద నుండి లేచి క్యాజువాలిటీ వైపు నడిచాడు.

వెళ్తున్న ధీరజ్‌ని దూరాన్నుండి చూసి - మన్విత దగ్గరకి వచ్చింది సంజన.

"ఏమంటున్నాడే? మళ్లీవచ్చాడుగా...." అంది సంజన

"నువ్వు అనవసరంగా బయటకెళ్లి మిస్ అయ్యావు కాని... అతని మాటలు వింటుంటే ఓ రాజారాం మోహన్ రాయ్, ఓ గురజాడ లాంటి వాళ్లు గుర్తొస్తున్నారు..." అంది మన్విత.

"వాళ్లు సంఘ సంస్కర్తలు... వాళ్లెందుకొచ్చారు మీమధ్యలోకి?" అంది సంజన అర్థం కాక...

"కరక్ట్‌గా చెప్పడం రావడం లేదు సంజనా! అతని మాటలు వింటుంటే... అతనిలో..." అంటూ మాటల కోసం ఆగింది మన్విత.

"శ్రీ, శ్రీ , చలం, యండమూరి కన్పించారా?"

"నీ జోకులు పాడుగాను... నువ్వుండవే.... అతన్ని చూస్తుంటే...?"

"ఆ... ఈసారి సిద్ధార్థ, సచిన్ కన్పిస్తున్నారా?" అంది వస్తున్న నవ్వుని ఆపుకుంటూ ..

"కాదు... నువ్వలా నవ్వాపుకుంటుంటే సానియా మీర్జా కన్పిస్తోంది..." అంది మన్విత.

ఇంకేం మాట్లాడకుండా... ఫ్రూట్ జ్యూస్ తెచ్చి మన్విత చేత త్రాగించింది సంజన.

* * * * *

మన్వితను హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ చేశారు.

మూడీగా వున్న మన్వితను చూస్తుంటే సంజనకి ఏం అర్థం కాలేదు...

"మన్వితాను ఇంటికి తీసికెళ్లి, నాలుగురోజులు వుంచుకోండి ఆంటీ హాస్టల్లో వుంటే ఇదే సంఘటన గుర్తు తెచ్చుకొని బాధపడ్తుంది." అని చెప్పింది సంజన.

"అలాగే" అంటూ... కూతురి బట్టల్ని సర్దుతూ సంజనతో మాట్లాడుతోంది కృష్ణవేణి.



జీవితం చాలా రుచికరమైందని - దాన్ని ఆస్వాదిస్తూ అందులోని అర్థాన్ని తెలుసుకోమని ధీరజ్ చెప్పినప్పటి నుండి ఆలోచిస్తోంది మన్విత... సంజన చెప్పింది కూడా నిజమే . హాస్టల్‌కి వెళ్తే ఫ్రెండ్స్ ఏదో ఒకటి అంటూ తన మనసు గాయాన్ని కెలుకుతారు. ఇంటికెళ్లి మానసిక బలాన్ని తెచ్చుకోవాలనుకుంది.

కానీ... మన్విత ఇంటి కెళ్లాక ఆమె ఆశించిన వాతావరణం లేదక్కడ...

ఎప్పుడైనా ఇంట్లో... సోఫాలో కూర్చునో, మెట్ల మీద కూర్చునో పీస్ ఫుల్‌గా చదువుకునేది . డయాగ్రామ్స్ వేసుకునేది. రికార్డ్స్ రాసుకునేది. మన్వితను అలా చూసి - ఆ వీధిలో వాళ్లు కృష్ణవేణి కూతురు చదువుల సరస్వతి అనేవాళ్లు... విశ్వనాధం కన్నా ఆ వీధిలో కృష్ణవేణమ్మ అందరికి తెలుసు కాబట్టి మన్వితను కృష్ణవేణి కూతురుగానే పిలుస్తారు.

డ్రమ్స్ వాయించినట్లు కేకలు వేస్తుందనే గాని కృష్ణవేణమ్మ మనసు మంచిది పద్ధతైన మనిషి అనుకుంటారు. అందుకే ఆమె అంటే అందరికి అభిమానం... మన్విత అంటే గౌరవం.

"ఇంకొద్ది రోజుల్లో.... మన్విత డాక్టరై వస్తే అందరం ఆమె దగ్గరే చూపించుకోవాలి. వేరే డాక్టర్ దగ్గరికి వెళ్తే డబ్బులు గుంజుతారు. ఎక్కువ సేపు ఓ.పి.లో కూర్చోబెడ్తారు. ఈ లోపల కొత్త రోగాలు కూడా బయటపడ్తాయి అని కూడా అనుకునేవాళ్లు.

కానీ... ఈ ఒక్క సంఘటనతో అంతా ముక్కుమీద వేలేసుకున్నారు. ఒక్కరు కూడా ఎం.జి.ఎం. హాస్పిటల్‌కి వెళ్లి మన్వితను పరామర్శించలేదు. ఇంటికి వచ్చాక మాత్రం... కృష్ణవేణితో ఏ టైంలో ఏ అవసరం వస్తుందోనని మన్వితను పలకరించి వెళ్లారు.

మన్వితను చూసి పక్కకి వెళ్లాక....

"కృష్ణవేణమ్మకి ఇదేం పోయేకాలం? కూతురికి బుద్ధి చెప్పుకొని, పెంచుకోకుండా గాలికి వదిలేసింది... అలా వదిలేస్తే ఎవరైనా అలాగే చేస్తారు... తల్లి ఎప్పుడైనా... బిడ్డ ఎలా వుందో! ఏం చేస్తుందో! ఎక్కడ తిరుగుతుందో! చూసుకోవద్దా? కన్న కూతురు అక్కడెవర్నో ప్రేమించి, ప్రాణం తీసుకునే దాకా వస్తే! ఇక్కడ ఈవిడ గారు ఏం చేస్తున్నారో? తినడం, పడుకోవడం తప్ప మరో ధ్యాస లేనట్లుంది" అని ఆ వీధిలోని వాళ్లంతా తల్లిని కామెంట్ చేస్తుంటే... తన వల్ల తల్లికి మాటలొచ్చాయని మన్విత బాధపడింది.

"తన ప్రాణం మీదే తనకి తీపి లేక నరాలను అడ్డంగా కోసుకొంది. రేపొద్దున ఈ పిల్ల డాక్టరై మనల్నేం కాపాడుతుంది?" అని అన్న వాళ్లు లేక పోలేదు. వాళ్ల మాటలు చాలెంజ్‌గా మన్వితను తాకాయి.

కృష్ణ వేణమ్మ కూతురు ఇలా చేసింది... అలా చేసింది... అని అంటున్నారేకాని విశ్వనాధంని కాని, ఆయనతల్లి వర్ధనమ్మను కాని ఎవరు ఏమీ అనడం లేదు. ఏదైనా తల్లి పెంపకంలోనే వుంటుందని కూడా అంటున్నారు. ఆ మాటలు వింటుంటే కోసి కారం పెట్టనట్లుంది కృష్ణవేణమ్మకి.

ఇన్ని రోజులు ఇంట్లో మనుషుల్లా వున్న ఆ వీధిలో వాళ్లు వింత పక్షుల్లా అరుస్తున్నారని భర్తతో చెబితే ఆయన పెదవి కదపకుండా పిల్లలకి పాఠాలు చెప్పుకోటానికి 'బమ్మెర' వెళ్లాడు... 'నేను ఈ మాటలు పడలేకపోతున్నా కనీసం మీరైనా వాళ్లనోళ్లు మూయించండి!' అని అత్తగారితో చెబితే... చెవిటి వాడి ముందు శంఖం వూదినట్లు - స్వతగాహోగా నోరెత్తని వర్ధనమ్మకి కోడలకి ఏం సమాధానం చెప్పాలో తోచలేదు.

వర్ధనమ్మకి తెలిసి చాలా మంది ఏ మాత్రం అవకాశం దొరికినా... నిద్ర లేచినప్పటినుండి నీళ్లు తాగినంత సులభంగా ఇంట్లో వాళ్లకి, బంధువులకి, స్నేహితులకి, తెలిసినవాళ్లకి నీతులు చెబుతూనే వుంటారు.



అలా చెబుతున్నప్పుడు వాళ్లు వాళ్ల అర్హతల్ని కూడా మరిచి పోతుంటారు. మంచి చెబుతున్నామన్న ధ్యాసలోనే వుంటారు.

"నేనిక్కడ గొంతు ఇంత చేసుకొని మాట్లాడుతుంటే ఏమిటా పరధ్యానం అత్తయ్యా? మీధ్యాస మీదేనా? చచ్చింది చావక... మళ్లీ బ్రతికి నన్ను చంపుకుతింటోంది. నీ మనవరాలికి ఏ చదువు చదవాలో, ఏ తిండి తినాలో, ఏ బట్టకట్టాలో తెలిసినప్పుడు-ఎలా ప్రవర్తించాలో తెలియలేదా? నలుగురు నడిచే దారిని వదిలేసి 'ప్రేమ' అంటూ ఈ కొత్త దారులు ఎందుకు? ఈ మాటలెందుకు? వచ్చిన మాటలు పోతాయా? పోయిన పరువు వస్తుందా?" అంది కృష్ణవేణమ్మ హాస్పటల్లో వున్నప్పుడు కూతురు బ్రతికితే చాలనుకున్న ఆమెకు ఇప్పుడదేం గుర్తురావడం లేదు.

వీధిలో వాళ్ల మాటలేమో కాని తల్లి మాటలు బలంగా గాయ పరుస్తున్నాయి మన్వితను.

వర్ధనమ్మకి కోడలి మాటలు బాధగా అన్పించాయి. కొన్ని పనులకి శిక్ష పడటానికి పోలీస్ స్టేషన్లు, కోర్టులు వున్నట్లే, ఇలాంటి ప్రేమ వ్యవహారాలకి వీధిలో వాళ్లే జడ్జీలు... ఇంట్లో వాళ్లు పోలీసులు. వాళ్లకి భయపడే ఒకప్పుడు తన తండ్రి పెళ్లికి ముందు తనో ముస్లిం కుర్రాడిని ప్రేమించానని తెలిసి కూడా తెలియనట్లే నటించి పెళ్లిచేశాడు. అలాగని తను చనిపోయిందా?

కానీ... ప్రేమంటే జోక్ కాదు. ఈ ప్రేమలనేవి... పురాణ కాలం నుండి వున్నాయి. ఈ ప్రేమ వల్లే ప్రపంచ చరిత్రలో ఎన్నో యుద్ధాలు జరిగాయి. లక్షలమంది ఎగిరిపోయారు. చాల మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. హత్యలు చేశారు. సమాధి అయిపోయిన వాళ్లు కూడా వున్నారు. ఈ ప్రేమకి దేవతలు, దేవుళ్లు కూడా ఎక్సెప్షన్ కాదు. అలాంటి ప్రేమలో పడి తన మనవరాలు ఎంత మానసిక స్ట్రగుల్‌కి గురి అయివుంటుందో తను అర్థం చేసుకోగలదు. ఎంతయినా చనిపోవాలనుకోవడం తప్పు...

అయినా తన కోడలు - కన్న బిడ్డను కడుపులో పెట్టుకోవలసింది పోయి ఈ మాటలేంటి? ఈ వాదన ఏంటి?

"ఎవరేం అంటున్నా నోరు ఎత్తని బుద్ధిమంతులు మీరు? మరి నేను? రాళ్ల దెబ్బలు తినే చెట్టునా? మాట్లాడరేం అత్తయ్యా?" అంది

"ఏం మాట్లాడాలి కృష్ణవేణి? ఎన్ని దెబ్బలు తిన్నా కాయలున్నాయి కాబట్టి చెట్టులా తట్టుకోవాలి. ఒక్క రోజన్నా దాన్ని ప్రేమగా చూసుకున్నావా? కనీసం ఇప్పుడు కూడా.... చచ్చి బ్రతికి ఇంటికి వస్తే - లోకులేదో అంటున్నారని దానిమీద పడి ఏడ్వలేక నా మీద పడి ఏడుస్తున్నావు." అని అనాలనివున్నా... అసలే ఆవేశంగా వున్న కోడల్ని చూసి నోరు మెదపలేకపోతుంది. కారణం మొన్నా మధ్యన ఒక కోడలు తన బిడ్డను కొడ్తుంటే చూడలేని అత్త అడ్డం పోతే ఆ కోడలు అత్తను కొట్టిందట. సందర్భం రావాలేకాని తనకోడలు కూడా తక్కువేం కాదు అనుకొంది వర్ధనమ్మ.

ఇక లాభం లేదనుకొని...

"మీ కొడుకూ, మీరు మాట్లాడుకొని దానికి బుద్ధి చెప్పండి! నా మాటంటే దానికి మొదటి నుండి లెక్కలేదు. లెక్క వుంటే ఇలా చేసేది కాదు." అంది కృష్ణవేణమ్మ.

అప్పటికే కాలేజి బ్యాగ్‌లో తన బట్టల్ని పెట్టుకొని, ఆ బ్యాగ్‌ను భుజానికి తగిలించుకొంది మన్విత.

"నేను హాస్టల్‌కి వెళ్తున్నా నానమ్మా!" అంది గేటు వరకు వెళ్లి... అక్కడే వున్న తల్లితో మాట్లాడాలంటే మనస్కరించక తలవంచుకొని నిలబడింది.

కోపంలో వున్న కృష్ణవేణమ్మ మన్విత వైపు చూడలేదు. ఆమెకు బిడ్డంటే ప్రేమలేక కాదు. లోకుల మాటల్ని తట్టుకోలేక... వాళ్లను ఎదురించి, ఆ బిడ్డను కడుపులో పెట్టుకోలేక...



మనిషన్నాక... జీవితం అన్నాక... ఎన్నో జరుగుతుంటాయి అన్నిటికి సమాదానంగా, ధైర్యంగా నిలబడాలి కాని,... ఇలా ఎవరో, "కడుపులో ఉన్న బిడ్డ కొరుకుతుందని" చేబితే నమ్మి కడుపు చీల్చి ఆ బిడ్డను లాగి బయట వేస్తారా? మనవరాలు ఇప్పుడు హాస్టల్‌కి వెళ్లడం ఇష్టం లేని దానిలా మన్వితకి దగ్గరగా వెళ్లి...

"తొందరేముంది మన్వితా? రేపు వెళ్దువు గాన్లే!" అంది మనవరాల్ని దగ్గరకు తీసుకుంటూ... ఆమె కళ్లలోని బాధ కంఠంలో ఒలికింది. నానమ్మ లోని ప్రేమకి, దయకి కదిలిపోతూ... నానమ్మనే చూస్తూ నిలబడింది.

ఈ ప్రేమ కావాలి మన్వితకి... తన కోసం బాధపడే మనిషి కావాలి... తనకోసం ఒక్క క్షణమైనా ఎదుటివాళ్ల కళ్లు తడవాలి... ఆ ప్రేమను తనెంతగా కోరుకుంటుందో అంతగా దూరమవుతోంది.

"నాకేం కాదు నానమ్మా! నువ్వేం కంగారు పడకు. నీ భయం నాకు తెలుసు. నేనిలాంటి పని ఇంకెప్పుడు చెయ్యను." అంది నానమ్మ భుజాల చుట్టూ చేయివేసి దగ్గరకి తీసుకొని....

వర్ధనమ్మ కళ్లు తుడుచుకొంది.

మన్విత అక్కడ నుండి కదిలి... కొద్ది దూరం నడుచుకుంటూవెళ్లి, ఆటో ఎక్కి మెడికల్ కాలేజీ ముందు దిగింది.

అక్కడే వున్న సంజన ఆటో దిగుతున్న మన్వితను చూసి 'అప్పుడే వచ్చావేం?' అంటూ ప్రశ్నించి... మన్విత నవ్వుని సమాదానంగా తీసుకొని... ఇద్దరు మాట్లాడుకుంటూ హాస్టల్‌కి వెళ్లారు.

* * * * *

ఏ ఆప్యాయత లేకుండా, ఏ అనుభూతి లేకుండా ఎలా బ్రతకడం? తల్లి ప్రేమ లేక... అనురాగ్ ప్రేమ లేక... తనెప్పటికీ ఇంతేనా? మన్వితకి అనురాగ్ కన్పిస్తూన్నాడేకాని.... మాట్లాడే సందర్భాలు తక్కువగా వస్తున్నాయి.

కారణం అతని పక్కన కన్పించే దీక్షితే. ఉన్న టైమంతా ఆమెతోనే స్పెండ్ చేస్తున్నాడు.

ఒకప్పుడు అలా వుండే వాళ్లను 'ప్రేమికులు' అనుకునేవాళ్లు. ఇప్పుడలా అంటే ఒప్పుకోరు. సబ్జక్ట్ డిస్కర్షన్‌లో వున్నారు. అలా డిస్కర్షన్ చేసుకుంటూ కెరీర్‌లో ఎదిగాక కావాలంటే పెళ్లి చేసుకుంటారు. లేదంటే ఎవరిదారి వాళ్లది అని అనుకుంటారు. మెడిసిన్ చేసేవాళ్లలో తరుచుగా విన్పించే మాటలివి... కానీ వాళ్లిద్దరి మధ్యన 'ప్రేమ' నడుస్తుందని తెలిసినప్పటి నుండి అనురాగ్ ఎక్కడ కన్పించినా బాధగా వుంది అది ప్రేమ వల్లనో లేక దీక్షితను ప్రేమిస్తున్నాడన్న బాధ వల్లనో తెలియదు. అతను గుర్తురాని క్షణం లేదు.

మన్విత మనసు ఇలా పరిగెత్తి, పరిగెత్తి, అలసిపోయి ఒంటరిగా మారినప్పుడు సంజన స్నేహం తోడై... ఓదార్పుని, మనో బలాన్ని ఇచ్చి కొద్ది, కొద్దిగా మనిషిని చేస్తోంది.

సెకండియర్ పూర్తయి... థర్డ్ ఇయర్ లోకి వచ్చారు.

థర్డ్ ఇయర్‌లో ఆప్తాల్మాలజీ, ఇ.ఎన్.టి., కమ్యూనిటి మెడిసిన్ సబ్జక్ట్‌లు వున్నాయి.

అందరు అతి శ్రద్ధగా, కష్టపడి చదువుతున్నారు.

రోజులు క్షణాల్లా మారుతుంటే...!

థర్డ్ ఇయర్ పూర్తయి... ఫోర్త్ ఇయర్‌కి వచ్చారు.

* * * * *

ఫోర్త్ ఇయర్ లో... జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, పిడియాట్రిక్స్, గైనకాలజి, ఆప్స్‌ట్రెడిక్స్ సబ్జక్ట్‌లు వున్నాయి. కష్టపడి చదవకపోతే ఏ సబ్జక్ట్ ఫెయిల్ అయినా ఆరునెలలు గ్యాప్ అయినా వస్తుందన్న భయం అందరిలో వుంది. కానీ... అందరు ముందుకెళ్లలేరు.



మెడిసిన్ ఒక మహాసముద్రం... లోతు తెలియకుండా బయట నిలబడి చూస్తే చాలా తేలికనిపిస్తుంది కాని, దిగాక తెలుస్తుంది ఆ చదువు పూర్తికావటానికి ఎంత టైం కావాలో, ఎన్ని అవరోదాలను, ఎన్ని ఆటంకాలను తట్టుకోవాలో, ఎంత డబ్బు అవసరమవుతుందో ఎంత హార్డ్ వర్క్ చెయ్యాలో... లోగడ వాళ్లతో చదివిన వాళ్లు బి.టెక్ లు, డిగ్రీలు పూర్తి చేసి జాబ్స్‌లో సెటిల్ అయివున్నా... వీళ్లు మాత్రం మెడిసిన్ చదువుతూ - ఏ మాత్రం టాలెంట్ లేకపోయినా వెనకబడి చదివిందే చదువుతూ కాలాన్ని దుర్వినియోగం చేసుకుంటారు.

ఆ మహా సముద్రంలో ఈదేవాళ్లు ఈదుతుంటారు. బయట పడేవాళ్లు బయట పడ్తుంటారు.

అనురాగ్, దీక్షిత, మన్విత, సంజన ఫోర్త్ ఇయర్ పాసయ్యారు.

మిగిలిన వాళ్లలో కొంత మందికి కొన్ని సబ్జక్ట్స్ పోయి గ్యాప్ వచ్చింది.

* * * * *

ఫోర్త్ ఇయర్ పాస్ అయ్యాక...

టెంపరరీ ప్రొవిజనల్ సర్టిఫికేట్, మార్క్స్ మెమో తీసుకుని కాకతీయ మెడికల్ కాలేజీ నుండి బయట కొచ్చారు అనురాగ్, దీక్షిత, మన్విత, సంజన...

మెడిసిన్ లో భాగంగా హౌస్ సర్జన్ కోసం ఎం.జి.ఎం. హాస్పటల్ లో జాయిన్ అయ్యారు. అక్కడ జాయిన్ అయిన వెంటనే... అక్కడికి దగ్గర్లో- ప్రాంతీయ నేత్ర వైద్యాశాలకి ఎదురుగావున్న పి.జి & సర్జన్స్ హాస్టల్లో దీక్షిత, మన్విత, సంజన జాయిన్ అయ్యారు.

మన్విత, సంజన కింద ఫ్లోర్లో - రూం నెంబర్ 2 లో వుంటే, దీక్షిత మాత్రం పైన ఫ్లోర్లో రూం నెంబర్ 25 లో వుంటుంది. హౌస్ సర్జన్ లతో ఆ రూములన్నీ నిండిపోయాయి. రూంకి ఇద్దరుంటారు.

ఆ హాస్టల్ మొత్తం సెరామిక్ టైల్స్‌తో నీట్‌గా వుంటుంది. ఎంట్రన్స్ లోంచి లోపలకి వెళ్లగానే డైనింగ్ హాల్... అందులో డైనింగ్ టేబుల్స్ వాటి పక్కనే ఫైబర్ చెయిర్స్, గోడకి ఎల్.సి.డి టి.వి అందంగా దర్శనమిస్తాయి.

హౌస్ సర్జన్లు - డైనింగ్ హాల్లో వున్నంత సేపు చాలా ఉల్లాసంగా కబుర్లు చెప్పుకుంటూ.... జోక్‌లు వేసుకుంటూ ఆ రోజు డ్యూటి తాలుకు విషయాలను చర్చించుకుంటూ గడుపుతారు

* * * * *

ఆ హౌస్ సర్జన్లకి ఆ హాస్పటల్‌లో... డాక్టర్లు, పేషంట్లు, ఆపరేషన్లు కొత్త కాదు.

విద్యార్థులుగా వున్నప్పుడు... వాళ్లంతా ఎన్నో కేసుల్ని పరీక్ష చేసి ప్రొఫెసర్ ముందు సబ్‌మిట్ చేసివున్నారు. ఇప్పుడు ఇంకా తెలుసుకోవాలన్న ఆరాటంతో ఎవరికివాళ్లు ఉత్సాహంగా వున్నారు ఎన్నో సంఘటనలు, అనుభవాలు ఎదురువుతున్నాయి.

హాస్పటల్లో మొదట హౌస్ సర్జన్ రౌండ్స్ తర్వాత, అసిస్టెంట్ రౌండ్స్, పొంటి గంటకు చీఫ్ రౌండ్స్ వుంటాయి.

మన్వితలో - మెడిసిన్ మీద శ్రద్ధాసక్తి వున్నందువల్ల హౌస్ సర్జన్ పీరియడ్‌ని ముఖ్యమైనదిగా భావించి.... కొత్త కేసుల్ని చూడాలన్నా, వాటిని స్టడీ చేయాలన్నా ఉత్సాహం చూపుతోంది. హౌస్‌సర్జన్ రౌండ్స్‌లో పేషంట్లను బాగా గమనిస్తూ, వాళ్ల ప్రాబ్లమ్స్‌ని అవగాహన చేసుకుంటోంది.

కేవలం హౌస్ సర్జన్ స్టేజిలోనే అన్ని సబ్జక్ట్‌లలోని కేసులు డీల్ చేసే అవకాశం వుంటుంది. కానీ పి.జి (P.G) కి వచ్చాక ఏ పి.జి వచ్చిందో దానికి సంబంధించిన కేసులు మాత్రమే చూడాల్సి వస్తుంది. కాబట్టి మన్విత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకొంది. సందర్భం వచ్చినప్పుడు... తోటి సర్జన్లతో వాళ్ల వార్డులో ముఖ్యమైన కేసులు ఏమున్నాయో వాటి వివరాలు అడిగి తెలుసుకుంటుంది.



ఉదయాన్నే - టిఫిన్ చేసి మన్విత ఎం.జి.ఎం. హాస్పటల్‌కి వెళ్లింది. ఎప్పటిలాగే అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం పెట్టి ముందుగా పిల్లల వార్డులోకి వెళ్లింది. అక్కడ రౌండ్స్ అయ్యాక... ఎదా ప్రకారం పిల్లలకి ట్రీట్ మెంట్ ఇవ్వాల్సిన బాధ్యత ఆమెదే అవడంతో.... ఆమె డ్యూటీ మొదలైంది. ఒకరిద్దరికి ట్రీట్‌మెంట్ ఇచ్చిన తర్వాత మూడో బెడ్ దగ్గరికి వెళ్లగానే ఓ పిల్లాడు ఇంజక్షన్ వద్దని ఏడుస్తుంటే మన్విత ఓపిగ్గా బుజ్జగించి ఇంజక్షన్ వేసి ట్రీట్‌మెంట్ ఇచ్చింది. ఆ పిల్లాడి తల్లి కృతజ్ఞతాభావంతో చూస్తుంటే మృధువుగా నవ్వి అక్కడ నుండి కదిలింది మన్విత. "ఈ డాక్టరమ్మ చాలా నెమ్మదస్తురాలు. కోపమనేదేవుండదు." అనుకున్నారు ఆమె వెళ్తుంటే... ఆ మాటలు ఆమెకు విన్పిస్తున్నాయి. అలాంటి మాటలు రోజూ వింటూనే వుంది. అలా విన్నప్పుడు తన ఉనికికి ఓ అర్థం వున్నట్లు... తనని అందరు గుర్తిస్తున్నట్లు ఈజీగా తెలిసిపోతోంది.

మన్వితలో కాన్‌సన్‌ట్రేషన్ పెరిగింది. డిగ్నిటీ పెరిగింది.

ఇంకో బెడ్ దగ్గరికి వెళ్లగానే... ఆ బెడ్ మీద వుండే పిల్లాడికి ఊపిరందడం కష్టంగా వుంది. వార్డ్ బాయ్‌ని పిలిచేంత టైం కూడా లేనట్లు త్వరత్వరగా ఆక్సిజన్ స్టార్టు చేసింది. అక్కడే నిలబడి ట్రీట్ మెంట్ ఇచ్చింది. ఆ బిడ్డను బ్రతికించడం కోసం తన శక్తి కొద్ది పోరాడింది ట్రీట్‌మెంట్ ఇవ్వడంలో ఆమె ఏ మాత్రం జాప్యం చేసివున్నా ఆ బిడ్డ బ్రతికే వాడుకాదు.

విషయం తెలిసి... వెంటనే వచ్చి ఆమెను అభినందించాడు ధీరజ్. ఆశ వదులుకొని, రోదిస్తున్న ఆ తల్లి... బిడ్డ బ్రతగ్గానే మన్విత కాళ్ల మీద పడింది. నడుస్తున్న మన్విత ఆగి ఆమె తలపై చేయివేసి... "అయ్యో! నాదేముందమ్మా! నీకు ఆబిడ్డ మీదవున్న ఆశ, ప్రేమ బ్రతికించింది. అంతే!" అంది. ఆమెకు ఇంకా ఇద్దరు పిల్లలు వున్నా ఈ బిడ్డకోసం ఆ తల్లి పడ్డ ఆవేదన మన్విత కదలించింది. దేవుడు అన్ని చోట్ల వుండలేక 'అమ్మ' ను

సృష్టించాదంటారు. ఇలాంటి అమ్మల్ని చూసే కదా! పండ్లు , ఆట వస్తువులు, పుస్తకాలు, బట్టలు ఒకే ఇంట్లో వున్న పిల్లలు సమానంగా ఎలా పంచుకుంటారో... తల్లి కూడా తన ప్రేమను పిల్లలకి సమానంగా పంచుతుందంటారు. మరి తన తల్లి తన తమ్ముడిని, తనని సమానంగా చూసిందా...?

ఓ కేసు విషయం తన కేదో డిఫికల్ట్‌గా అన్పించి ధీరజ్‌ని వెతుక్కుంటూ క్యాజువాల్టీ దగ్గర ఆగింది మన్విత. అక్కడంతా సీరియస్ కేసులే వుంటాయి. అక్కడ కొంత మంది రోగుల్ని చూస్తుంటే... ఆ రోగాల బాధ భరించలేక, పేదరికం సమస్యలు తట్టుకోలేక, తాము బ్రతకడం వల్ల తమ కుటుంబానికి ఎలాంటి ప్రయోజనం లేదన్నట్లు కన్పిస్తారు.

కోడళ్లు సరిగ్గా చూడని అత్తలు... కొడుకులు పట్టించుకోని తండ్రులు, డబ్బులిచ్చే వాళ్లు లేక, అప్యాయత పంచేవాళ్లు లేక, అభద్రతా భావంతో సతమతమవుతున్నారు. చేతనైతే వాళ్లకేదైనా సహాయం చెయ్యాలని వుంది. ఏం చెయ్యగలదు...? ధనవంతులు - బెడ్ రూముల్లో దబ్బుల దుప్పట్లు కప్పుకొని హాయిగా నిద్రపోతుంటే ఇక్కడ వీళ్లు ఏ దుప్పటి లేక నేలపై పడుకొని వణుకుతున్నారు.

ధీరజ్‌ను కలిసింది మన్విత.

వాళ్లిద్దరు మాట్లాడుకూంటూ మెడిసిన్ వార్డు వైపు నడిచారు. ఆ రోజు తనకి క్యాజువాల్టీలో డ్యూటీ వుందని చెప్పి అటువైపు వెళ్లాడు ధీరజ్.

మన్విత, తర్వాత హాస్టల్‌కి వెళ్లింది. సంజన తన గైనిక్ డ్యూటీ అయిపోవడంతో తను కూడా హాస్టల్‌కి వచ్చింది... గైనిక్ వార్డులో తన అనుభవాలను మన్వితతో చెబుతోంది సంజన. చట్టపరంగానే అక్కడ జరిగే అబార్షన్లు తలుచుకుంటుంటే కళ్లు బైర్లు కమ్ముతున్నట్లు చెప్పింది. "భూమ్మీదకు రాక ముందే... కడుపులోనే మమ్మల్ని హత్య చేస్తున్నారు ఎందుకు? మేమేమైనా



హత్యలు చేశామా? అమ్మాయిల మీద యాసిడ్లు పోశామా? ఐ.టి. కంపెనీలు పెట్టి యువతరాన్ని ఫ్రాడ్ చేస్తున్నామా? పార్టీలు పెట్టి, పార్టీలు మార్చి ప్రజల్ని కన్‌ఫ్యూజ్ చేస్తున్నామా? అంటూ ఆనెత్తుటి ముద్దలన్నీ ఏకమై ఒక చోట నినాదాలు చేస్తున్నట్లు, ధర్నాలు చేస్తున్నట్లు, నిరాహార దీక్షలు చేస్తున్నట్లు, నా కళ్ల ముందు కదులుతున్నాయి మన్వీ! నన్నేం చేయమంటావు?" అంది సంజన

సంజన చెప్పేది నిజమే... అబార్షన్లనేవి దారుణమైన చర్య, నెత్తురుకి ఇచ్చే విలువ నెత్తుటిముద్దలకి ఇవ్వడం లేదు. సంజన భుజం పై చేయి వేసి 'కంట్రోల్ యువర్‌సెల్ఫ్' అన్నట్లుగా నిమిరింది మన్విత...

సంజన నేరుగ హాస్టల్ లోపలకి వెళ్లింది.

మన్విత గేటు దగ్గరకి వచ్చి - వాచ్‌మెన్‌కి , ఏదో తెమ్మని చెబుతూ... 'ఐ' హాస్పటల్ ముందున్న చెట్ల నీడలో నిలబడి వున్న అనురాగ్, దీక్షిత లను చూసింది.

వాళ్లిద్దరు ఏప్రాన్ వేసుకొని చేతిలో స్టెతస్కోప్‌ని పట్టుకొని దేని గురించో డీప్‌గా మాట్లాడుకుంటున్నారు.

ఆ నిశ్శబ్దవాతావరణంలో... ఆ చెట్ల ఆకులు మెల్లగా కదులుతూ ఏం చెబుతున్నాయి అంటే...? "అక్కడ రెండు మనసులు ఒక్కటిగా ప్రేమసాగరాన్ని మధిస్తున్నాయ్! అనుభూతుల్ని పంచుకుంటున్నాయ్! ఎవరూ అటు వెళ్లకండి!" అని... బరువుగా నిట్టూర్చింది మన్విత.

ఇప్పుడు మన్విత మనసులో ఏ భావం లేదు.

ప్రేమలో ఓడిపోయినా... ఆ ఓటమి నిరాశకు నాంది కాకుండా గెలుపుకి పునాది కావాలని, రోగుల మధ్యన అలసిపోవడంతో తృప్తిని పొందుతోంది. రోగులకోసం జీవించే జీవితంలో విలువల్ని వెతుక్కుంటోంది.

ప్రకాశవంతమైన ఆలోచనలు ఆమె మది గదిలోకి కొద్ది, కొద్దిగా ప్రవేశిస్తుంటే లోపలకి వెళ్లింది మన్విత. లోపలకి వెళ్లాక వెంటనే ఓ పేపర్ తీసుకొని దాని మీద...

"మనం ఏదైనా కావాలనుకున్నప్పుడు... అది మనకు అందుబాటులో వుందేదా? కాదా? అని చూసుకోవాలి... అందుబాటులో లేని దయినప్పుడు దానిని కోరుకోకూడదు... అలాగే మనం కోరుకునేది మనకు అవసరమో కాదో కూడా చూసుకోవాలి... అనవసరంగా అలా కోరుకోవడం వల్ల దు:ఖం మిగులుతుంది. అందుకే ఎప్పుడూ పరిస్థితులు తెలుసుకొని ప్రవర్తించడం మంచిది..." అనిరాసి ఆ పేపర్ని ఎవరు చూసినా చదువకోటానికి వీలుగా మిర్రర్ పక్కన అంటించి... ఎప్పటి లాగే తన దిన చర్యలో పడిపోయింది.

*    *    *    *    *

మన్విత పిల్లల వార్డులో 15 రోజులు వుండి తర్వాత ఇ.ఎన్.టి లో 15 రోజులు... ఆర్థో వార్డులో 15 రోజులు... ఆప్తల్ వార్డులో 15 రోజులు... ఎస్.పి.ఎమ్‌లో 2 నెలలు.. అంటే అక్కడ ఒక నెల ప్రాజెక్ట్ చేసి ఇంకో నెల పి. హెచ్.సిలో ఓ.పి.లు చూసింది. తర్వాత ఇంకో నెల ఆప్సనల్స్ కావడంతో తనకి ఇష్టమైన రేడియాలజీ, ఎనస్తీసియా పోస్టింగ్‌లకి అటెండ్ అయింది... తర్వాత సెంట్రల్ పోస్టింగ్స్ మొదలయ్యాయి. మొదటిగా జి.ఎమ్. హెచ్ హాస్పిటల్‌కి వెళ్లింది. అక్కడొక రెండు నెలలు ఓ.పి డ్యూటీల వార్డు పనులతో గడిచిపోయాయి.

అన్ని చికిత్సలకన్నా - మెటర్నిటీ పోస్టింగ్స్ సహజంగా వుండడంతో తనకి ఆసక్తి కలిగింది... తర్వాత ఆ పనితోనే కంటిన్యూ కావాలని కూడా సంకల్పించుకొంది. అలా రెండు నెలలు గడిచిపోయాయి.

రోజులు ఫాస్ట్, ఫాస్ట్‌గా గడచిపోతున్నాయి.

ఇంకో ఐదు నెలలు గడిస్తే తన హౌస్ సర్జన్‌సీ అయిపోతుంది.

అది కూడా 2 నెలలు మెడిసిన్... 2 నెలలు సర్జరీ... 1 నెల క్యాజువాలిటీ... అంతే!

ఈ 5 నెలలు గడిచిపోతే డాక్టరైపోతుంది.



నైట్ డ్యూటీలతో, డే డ్యూటీలతో టైం తెలియడం లేదు మన్వితకి... హౌస్ సర్జన్ పీరియడ్‌లో టైం గురించి ఆలోచించకూడదు. అందుకే డ్యూటీలో వున్నప్పుడెప్పుడు త్వరగా వెళ్లాలని చూడదు. ఒక్కోసారి మన్వితను చూసి... 'ఎందుకే అంత కష్టపడ్తావ్ నీకు రెస్ట్ అవసరం లేదా?' అంటుంది సంజన.

సంజన మనసులో ఏదీ దాచుకోదు. ' ఓ.పి.లో కూర్చున్నాక ఓ గంటలో ఇరవై మందిని చూసి చేతులు దులుపుకోవడం నాకు చేతకాదు సంజనా! అలాగే రౌండ్స్‌కి వెళ్లి హడావుడిగా నాలుగు వార్డులు తిరిగి రావడం కూడా నచ్చదు. పేషంట్లు మన మీద ఎంతో నమ్మకం పెట్టుకొని వుంటారు. మన ధర్మాన్ని మనం పాటించాలి...' అంటూ నవ్వేది మన్విత. 'మన్విత తన ఆత్మీయత తోనే రోగాల్ని తగ్గించగలదేమో' అని అప్పుడప్పుడు అనుకునేది సంజన...

ప్రస్తుతం క్యాజువాలిటీలో వుంది మన్విత.

అక్కడ పని పెరిగింది. కేసులు పెరిగాయి ఒకే టైంలో ఐదారు కేసులు కూడా వస్తున్నాయి. సీరియస్ కేసులన్నీ క్యాజువాలిటీకి వస్తుంటాయి ఆ వార్డులో క్యాజువాలిటీ డాక్టర్స్, సి.ఎమ్.ఒ.. డ్యూటీ డాక్టర్స్. వుంటారు.

రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగిన ఓ పాతికేళ్ల కుర్రాడిని ట్రాక్టర్‌లో ఎక్కించుకొని హాస్పటల్‌కి తీసుకొచ్చారు. పేషెంట్‌ను చూసి వెంటనే పేషెంట్ దగ్గరికి వచ్చింది మన్విత. ముందుగా ఓ.పి. స్లిప్‌లో రాసి... వైటల్స్ చూద్దామనేలోపలే అతను చనిపోయివున్నాడు. తాపత్రయం కొద్దీ, పేషంట్‌ని బ్రతికిద్దామన్నట్లుగా (సి.పి.ఆర్) కార్డియో పర్మనరీ రీసస్సైటేషన్ చేసింది. ఫలితం కన్పించలేదు.

ఆ కుర్రాడికి తోడుగా ఇద్దరు మాత్రమే వున్నారు. మిగతా వాళ్లంతా బయటనిలబడివున్నారు. వాళ్లది పాకాల.

'సారీ! అతను ఆల్ రెడీ చనిపోయాడు,' అంది మన్విత.

"అయ్యో! చూడండి డాక్టర్! ఇప్పటివరకు బ్రతికే వున్నాడు. మళ్లీ ఒకసారి చూడండి! చనిపోలేదు." అంటూ పేషంట్ తాలూకు వ్యక్తులు బ్రతిమాలారు. వాళ్లు కాళ్లా వేళ్లా పడ్తుంటే... వాళ్లను కాదనలేక, వాళ్ల సాటిస్‌ఫ్యాక్షన్ కోసం ఆ పేషంట్ గుండె పై అర చేతుల్ని పెట్టి గట్టిగా ప్రస్ చేసి చూసింది.

పాయిజన్ ఎఫ్‌క్ట్‌లని తట్టుకోలేక కొంత మంది డాక్టర్లు పాయిజనింగ్ కేసులని దూరం నుండే చూస్తారు. కానీ... మన్విత ధైర్యంగా దగ్గరికి వెళ్లి పేషంట్‌ని ట్రీట్ చేస్తోంది. ఆఖరికి....

"హి ఈజ్ డెడ్.... అంది మన్విత .

ఆ మాటల్ని తట్టుకోలేక పోయారు. వాళ్లలో ఒక వ్యక్తి బయటకెళ్లి వాళ్ల వాళ్లతో చెప్పాడు. అక్కడున్న వ్యక్తి మాత్రం...

"ఇప్పటి వరకు బ్రతికే వున్నాడు. మీరు సరిగ్గా చూడండి!" అంటూ పేషంటె వైపు చూడకుండా మన్వితనే చూస్తూ అర్థిస్తున్నాడు.

వాళ్లకెలా చెప్పాలో అర్థం కావడం లేదు. ఎన్ని సార్లు చూసినా చనిపోయినా మనిషి బ్రతికొస్తాడా?

ఈ లోపల బయట వున్న పేషంటు తాలూకు మనుషులు వచ్చి ఆమె చుట్టూ చేరారు.

"హాస్పిటల్‌కి వచ్చేంత వరకు బ్రతికే వున్నాడు... మీ చేతుల్లోనే చనిపోయాడు. ఇది దారుణం..." అన్నారు అంతా ఒకేసారి. "హాస్పిటల్‌కి వెళ్లేంత వరకు బ్రతికితే చాలు – ఆ తర్వాత తప్పకుండా బ్రతకుతాడు" అని వాళ్ల నమ్మకం. హాస్పిటల్ అంటే గుడిగా, డాక్టరంటే దేవుడుగా, భావిస్తారు వాళ్లు...

"మీకు చెప్తుంటే అర్థం కావడం లేదా? నేను చూడకముందే అతను చనిపోయాడు." అంది మన్విత.



"మేము అబద్ధం చెబుతామా? ట్రాక్టర్లో వస్తున్నంత సేపు కదులుతూనే వున్నాడు. ఇక్కడికి వచ్చేదాకా కాళ్లూ, చేతులు కొట్టుకుంటూనే వున్నాయి." అన్నారు.

విషయం అర్థమై... ఆ పేషంటు తాలూకు వాళ్లకి నచ్చ చెప్పటానికి ప్రయత్నించింది మన్విత. అయినా వాళ్లు వినడం లేదు. వార్డ్ బాయ్, నర్స్ టి.వి. చూస్తున్నట్లు అలాగే నిబడ్డారు.

"మీలాంటి డాక్టర్లు వుండబట్టే పేషంట్ల ప్రాణాలకి విలువ లేకుండా పోతోంది మా లాంటి పేదవాళ్ల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. నువ్వే చంపావ్ వాడ్ని... నీ మీద కేసేస్తాం... ఎలా తప్పించుకుంటావో చూస్తాం...." అన్నారు.

ఎంత చెప్పినా వినని మూర్ఖులకి బలం ఎక్కువ... అప్పటి వరకు ధైర్యంగా వున్న మన్విత శిల లాగ నిబడింది.

ఏం చేయాలో తోచడం లేదు. ఈ గొడవ ఎక్కడిదాకావెళ్తుందో అర్థం కావడం లేదు.

పోలీసుల్ని పిలుస్తాం... కేసు వేస్తాం... మీడియాను పిలుస్తాం... అని బెదించడమే కాకుండా – సిటీలో బాగా పరిచయమున్నా వ్యక్తి వాళ్లలో వుండటం వల్ల ఫోన్ చెయ్యడంతో క్షణంలో మీడియా, పోలీసులు వచ్చారు. అంతా క్షణాల్లో జరిగిపోయింది.

మన్వితను ఒకసారి కలిసిపోదామని అటువైపు వచ్చిన ధీరజ్‌కి ఆ గుంపులో మన్విత కన్పించడం లేదు. అక్కడున్న వాళ్లంతా వాళ్ల ఊరైన పాకాల వాళ్లే అయినందువల్ల విషయం కనుక్కొని.... వాళ్లను తప్పించుకుంటూ వెళ్లి, చనిపోయిన ఆ యువకుడ్ని చూశాడు. ఆశ్చర్యపోతూ....

వెంటనే మన్విత వైపు చూశాడు... ఒక రోజు తనని చంపుతానంది... తెల్లవారే తను చావాలనుకుంది... ఇప్పుడితన్ని నిజంగానే

చంపేసిందా? మన్వితలో తనకి తెలియని ప్రాబ్లమ్ ఏమైనా వుందా? నో... నో.... అటువంటి దేం మన్వితలో వుండి వుండదు. మందు తాగాక బ్రతకడమనేది అరుదు... మన్విత చాలా మంచి హౌస్ సర్జన్. పేషంట్ల విషయంలో చాలా సిన్సియర్‌గా వుంటుంది. డ్యూటీ విషయంలో కూడా డెడికేటెడ్ మైండ్‌లో వుంటుంది అని మనసులో అనుకుంటుండగా... మన్విత ఏ మాత్రం ధైర్యం కోల్పోకుండా....

"ఇందులో నా తప్పేం లేదు సర్! అతను ముందే చనిపోయి వున్నాడు." అంది ధీరజ్ నే చూస్తూ.... ఆమెనలా చూస్తుంటే ఆమె తప్పేమీ లేదని ధీరజ్‌కి అర్థమైంది.

ఆ యువకుని తల్లి ఏడుస్తోంది. ఆమెను చూస్తుంటే హృదయం కదిలేలా వుంది. ఎంత ఆపినా ఆగే శోకం కాదు అది. అతని ప్రియురాలు మాత్రం ఆ ఊర్లో ఏం చేస్తుందో ఏమో ఎవరికి తెలియదు. వాడైతే మందు తాగి చచ్చి... మన్విత పీకల మీదకి తెచ్చాడు.

ఆ శవం తాలూకు పెద్ద వాళ్లని పక్కకి తీసికెళ్లాడు ధీరజ్.

"ఒక్క సారి మీరు ఆలోచించండి! ఏ డాక్టరైనా పేషంట్‌ని చంపుకోవాలని చూడదు. ఆ డాక్టర్ మీ వాడ్ని సేవ్ చెయ్యాలనే వచ్చింది కదా! అప్పటికే చనిపోయిన వాడ్ని ఎలా బ్రతికించ గలుగుతుంది? అసలు అతనికి మందు తాగాల్సిన అవసరం ఏమొచ్చిందో,దాని గురించి ఆలోచించకుండా డాక్టర్ మీద పడితే ఏ డాక్టరైనా ఏం చేస్తారు?" అన్నాడు ధీరజ్.

"అది కాదు డాక్టర్! హాస్పటల్‌కి వచ్చేంత వరకు బ్రతికే వున్నాడు" అంటూ బోరున ఏడుస్తూ బాధగా ప్రక్కకి వెళ్లాడు ఆ యువకుని మేనమామ. అసలు ఇదంతా ఆయన చేస్తున్న గొడవే. తన పిల్లని పెళ్లి చేసుకోమని పట్టుబట్టడం వల్లనే అతను చనిపోయాడు. ఆయనికి ఎలాగైనా ఆ కుర్రాడ్ని



బతకించుకోవాలని వుంది... ఎలా బ్రతుకుతాడు? ఏడిస్తే బ్రతుకుతాడా? డాక్టర్ని తిడితే బ్రతుకుతాడా? డాక్టర్ పై కేసు వేస్తే బ్రతుకుతాడా?

"మనిషి ప్రాణం పోవటానికి ఒక్క క్షణం చాలదా? డాక్టర్‌ది తప్పులేనప్పుడు మీరు కేసు వేసినంత మాత్రాన ఆ కేసేమైనా నిలుస్తుందా? అతనేమైనా బ్రతికి వస్తాడా? అదీకాక డాక్టర్ కూడా లేటుగారాలేదని అందరు అంటున్నారు" అన్నాడు ధీరజ్.

"అది కాదు డాక్టర్! ఎలాగైనా కేసువేసి ఇలాంటి వాళ్లని బయటకి లాగాలి..." అన్నారు అందరు ఏక కంఠంతో... ఆ కుర్రాడి తండ్రి కూడా ఆ మాటలకి సపోర్ట్ చేస్తూ ధీరజ్ పక్కన నిలబడ్డాడు.

మీడియా వాళ్లు అక్కడ జరుగుతున్నదంతా టి.వి.లో లైవ్ ప్రసారం చేస్తున్నారు. ఇదంతా వినిలోపలవున్న డాక్టర్స్ సి.ఎం.ఓ., డి.ఎమ్.ఓ వచ్చి అక్కడ నిలబడ్డారు.

"చూడండీ! చనిపోయిన వ్యక్తిని... ఇంకా ప్రాణం వుంది. బ్రతికిస్తామని లోపలకి తీసికెళ్లి ట్రీట్‌మెంట్ ఇచ్చినట్లు నటించి... చివరకు చనిపోయాడు. మేమింతవరకు ఇచ్చిన ట్రీట్‌మెంట్‌కి బిల్ కట్టి బాడీని తీసికెళ్లమనే వాళ్లనైతే నమ్ముతారు కాని నిజాయితీగా వుండేవాళ్లను నమ్మరు. అసలు అతను విషం తాగే దాకా రావటానికి కారణం అతని మనసులో ఎవరున్నారో తెలుసుకోకుండా మీ బావ పెళ్లికి తొందర చెయ్యడమేగా... కేసు పెట్టడంలాంటి పనులు చేస్తే, తీగలాగితే డొంక కదుల్తుంది మరి." అన్నాడు దీరజ్. ఆ యువకుని తండ్రితో

ధీరజ్ సమయస్ఫూర్తి – ఆ వూరి వాళ్లకి తెలియంది కాదు.

కుర్రాడి తండ్రి, మేనమామ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అక్కడ నుండి కదిలి శవాన్ని తీసికెళ్లే ప్రయత్నం చేశారు.

అక్కడుండే డాక్టర్స్ ధీరజ్ భుజం తట్టారు.

ఆ సంఘటనతో మన్విత బాగా అప్‌సెట్ అయి, హాస్టల్‌కి వెళ్లకుండా ఇంటికెళ్లింది.

* * * * *

ఆటో దిగి ఇంటి వైపు నడుస్తోంది మన్విత...

ఇంకొద్ది దూరం నడిస్తే ఇల్లు వస్తుందనగా సన్నటి సందులాంటి ఆ వీధిలో నడుచుకుంటూ వస్తోంది నానమ్మ. 'ఈ టైంలో నానమ్మ ఎక్కడికి వెళ్తోంది?' అని మనసులో అనుకుంటుండగా... కళ్లనీళ్లు తుడుచుకుంటూ దగ్గరవుతున్న నానమ్మను చూసి దిగ్భ్రాంతి చెందింది మన్విత.

మన్వితను చూసి వర్ధనమ్మకూడా అలాగే అయింది.

"నానమ్మా! ఎక్కడి కెళ్తున్నావ్? ఏంటలా వున్నావ్? మమ్మీ ఏమైనా అన్నదా?" అంటున్న మనువరాలు ప్రశ్నలకి సమాధానంగా కళ్లు తుడుచుకుంటూ తలవంచుకొంది.

"ఏం జరిగింది నానమ్మా! చెప్పు?" అంటూ మెల్లగా నానమ్మ భుజం చూట్టూ చేయివేసి, గడ్డం పట్టుకొని పైకి లేపుతూ మృదువుగా ప్రశ్నించింది.

ఆమె మాట్లాడలేదు. మన్విత సహనానికి అదో పరీక్ష అయింది.

"పద! నానమ్మా! ఇంటికెళ్దాం!" అంటూ ఇంటి వైపు నడిపించబోయింది.

"నేను రాను... ఇప్పుడు నువ్వు కూడా వెళ్లొద్దు..." అంది. ఏదో భయంతో కూడిన ఆందోళనతో...

"ఏం! ఎందుకు?" అంది మన్విత అర్థం కాక...

"ఆ వీధిలో... మన ఇంట్లో... ప్రస్తుతం నీదే చర్చ. పక్కంటి పిల్లాడొచ్చి టి.వి.లో నువ్వోస్తున్నావని చెప్పగానే అందరం చూశాం... 'అయ్యో? నీ కూతురు మనుషుల్ని కూడా చంపుతుందా కృష్ణవేణీ! అంటూ వీధిలో వాళ్లంతా మన ఇంటి కొచ్చారు... మీ మమ్మీకి తలకొట్టేసినట్లై



ఎప్పటిలాగే నా మీదకి లేసింది. "దాన్నిందుకేనా మీరు చదివించేది?" అని... తెలిసీ తెలియకుండా నా మనవరాల్ని మాటలంటే నేనొప్పుకోను" అంటూ ఆ వీధిలో వాళ్లను కసురుకున్నాను.

దానితో మీ మమ్మీకి కోపం వచ్చింది. "దేనికైనా ముందు కొచ్చి నీకు మేమున్నామంటూ ధైర్యం చెప్పే వీధిలో వాళ్లపై కోప్పడతావా? తప్పంతా నీ మనవరాలి దగ్గర పెట్టుకొని మొన్నటికి మొన్న ప్రేమలో పడి నరాలు కోనుకుంది ఇప్పుడేమో ఒకతను చనిపోతుంటే చూస్తూ వూరుకొంది. ఇందుకేనా దాన్ని మీరు డాక్టర్ చదివించింది? మనుషుల్ని చంపి టి.విలో కన్పించటానికా? వీధిలో రేపొద్దున నేను తలెత్తుకు తిరగాలా వద్దా? నా మాటవిని పెళ్లిచేసి వుంటే ఎంత గౌరవంగా వుండేది?" అంటూ నిన్నూ, నన్నూ నానా మాటలు అంది.

"నన్నంటే అన్నావు కాని నా మనవరాల్ని అంటే నేను ఒప్పుకోను. అదిప్పుడు డాక్టరు. గౌరవనీయమైన హోదాలో వుంది." అన్నాను... "ఆ... పెద్ద హోదా! కన్పించిందిగా టి.వి.లో" అంది.

ఆ తర్వాత చిలికి, చిలికి గాలివాన అయింది. "అదొస్తే అన్ని నిజాలు తెలుస్తాయి ఇంకేంమాట్లాడకండి!" అన్నాను. "ఎక్కడ కొస్తుంది? నా గడప తొక్కితే దాన్ని కాళ్లు విరగ్గొడతాను." అంది. "నా మనవరాలు నా ఇంటికి రాక ఎక్కడికి వెళ్తుంది?" అన్నాను... దానితో రెచ్చిపోతూ... "ఎక్కడుంది నీ కిక్కడ ఇల్లు?" అంది కట్టెవిరిచినట్లు పెళ్లున మీ మమ్మి ఒక్కక్షణంకూడా ఆ ఇంట్లో వుండబుద్ధి కాలేదు..." అంది వర్ధనమ్మ జరిగింది మొత్తం వివరిస్తూ.... ఆమె కళ్లు వర్షిస్తూనేవున్నాయి.

... హాస్పిటల్లో జరిగిన సంఘటన నానమ్మను వీధిపాలు చేసిందా? ఎంత పని జరిగింది?

"ఈ కోపతాపాలు మామూలే నానమ్మా! అంత మాత్రాన ఇల్లు వదిలి వచ్చెయ్యడమేనా? మమ్మీ కోపం నీకు తెలియదా? పాల పొంగు... కాస్త

నీళ్లు చల్లితే తగ్గి పోతుంది. అయినా మమ్మీ అన్నంత మాత్రాన ఆ ఇల్లు నీది కాకుండా పోతుందా?" అంది మన్విత.

"నాదెలా అవుతుంది? ఆ ఇల్లు మానాన్న నాకివ్వ లేదు. నా భర్త కట్టించలేదు. పోనీ... నా కొడుకు సంపాదనతో కట్టింది కూడా కాదు. అది మీ మమ్మీకి వాళ్ల తల్లి,దండ్రులు పోతూ ఇచ్చింది. అది నా దని వాదించే అధికారం కూడా నాకులేదు...." అంది వర్ధనమ్మ.

అ మాటలకి మన్విత ఒళ్లు జలదరించింది.

సుదీర్ఘమైన ఆమె జీవన యాత్రలో...ఉండేందుకు సొంత ఇల్లుకూడా సంపాయించుకోకుండా... ఈజీవన సంధ్యాసమయంలో నీడను కోల్పోయింది. అందుకే అంటారు. మనిషి స్మశానానికి వెళ్లేంత వరకు కూడు, గుడ్డ, గూడు అవసరమని....

మారుతున్న కాలంలో వచ్చే మార్పులు, వ్యాపార దృష్టితో మారే బాంధవ్యాలు... వాటివల్ల వచ్చే ఇబ్బందులు వర్ధనమ్మను అయోమయంలోకి నెట్టి వేశాయి. ఆత్మాభిమానంతో, అవమానంతో ఆమె మనసు మిషన్‌లో పెట్టిన చెరుకు గడలా వుంది.

నానమ్మను అలా చూస్తుంటే మన్విత కరిగిపోయింది. మనిషి బ్రతకడం కోసం ఇంత అంతర్గత కుమ్ములాట, డిస్టబెన్సెస్ అవసరమా అన్పించింది.

నానమ్మ కన్నీళ్లు తుడుస్తూ.... ఒక్క క్షణం తన కళ్లెందుకు తడవటం లేదో ఆలోచించింది. నిజంగా తనకిప్పుడు... రావలసిన టైంకు కూడ కన్నీల్లు రావటం లేదు. బహుశా తనకి ఎదురైన పరస్థితులు తనని రాయిని చేసివుంటాయి. ఇంత చిన్నవయసులో.... ఇన్ని బాధలు, కష్టాలు, అవమానాలు ఎదురవుతుంటే వాటి నెలా జయించాలో అర్థం కావటం లేదు ఆశక్తులమైతేనే శక్తులమయ్యే సామర్థ్యం పెరుగుతుందంటారు. తనిప్పుడేం చేయాలి?



"మమ్మీకి నేను నచ్చ చెబుతాను నానమ్మా! నిన్నింకెప్పుడూ అలా అనొద్దని..." అంటూ నచ్చ చెప్పబోయింది మన్విత.

"నువ్వేం చెప్పినా నేను రాను..." అంది వర్ధనమ్మ.

"రాక... ఈ టైంలో ఎక్కడికి వెళ్తావు నానమ్మ?" అంది మన్విత.

"ఎక్కడికో వెళ్లాలని వుంటే కదా! టైం గురించి ఆలోచించేది." అంది.

ఈ మధ్యన ఎదుటి వాళ్ల బాధను అవలీలగా అర్థం చేసుకొనే శక్తి మన్విత సొంతమైందన్నట్లుగా నానమ్మ మానసిక స్థితిని వెంటనే అర్థం చేసుకోగలిగింది.

"సరే! రా! మా హాస్టల్‌కి వెళ్దాం!" అంది మన్విత.

"మీ హాస్టల్ కా! అమ్మో! నేనురాను. మీరంతా పిల్లలు... నేను వయసులో పెద్దదాన్ని... నన్ను చూసినవ్వుతారు. పైగా డాక్టర్లు..." అంటూ ఫీలయింది.

"ఏం కాదు నానమ్మా! నాతోటి హౌస్ సర్జన్లందరికి ఇంటి దగ్గర నీలాగే నానమ్మలుంటారు... మీరు లేకుండా మేమెలా వచ్చాం చెప్పు? నువ్వలాంటి భయాలేమీ పెట్టుకోకు..." అంటూ నానమ్మ చేయి పట్టు కొని ఆటో ఎక్కించి.... తన హాస్టల్‌కి తీసికెళ్లి... ఆ రాత్రికి తన రూంలో వుంచుకొంది మన్విత.

"నీకు నేనున్నా" నన్నట్లు నానమ్మ పై చేయివేసి... నిశ్చింతగా పడుకోమని చెప్పింది. మన్వితకి నిద్ర రావడం లేదు. నానమ్మ గురించే ఆలోచిస్తోంది.

ప్రస్తుతం నానమ్మకి - హౌస్‌సర్జన్ చేస్తున్న మనవరాలు వున్నా... బి.పి. షుగర్ లేనందువల్ల ఆరోగ్యంగా, హుషారుగా, వయసు కన్పించకుండా వుంటుంది. నిద్ర లేచినప్పటి నుండి అన్ని పనులు ఉత్సాహంగా చేసుకుంటుంది, కాకపోతే, ఇంట్లో కోడలు చర్యలవల్ల... తనపనికో గుర్తింపు

లేదని తెలిసిపోతూ, ఎప్పుడు చూసినా ఏదో పోగొట్టుకున్నట్లు డిప్రెషన్‌లో వుంటుంది. అంతే!

కానీ... నానమ్మని ఎక్కువ రోజులు హాస్టల్లో వుంచుకోవటానికి లేదు. మహా అయితే రెండు రోజులు వుంచుకోవచ్చు, ఆ తర్వాత... ఎక్కడ వుంచాలి? తండ్రి పట్టించుకోడు. ఆయన అదో టైపు.

ఈ మధ్యన తన గురించి కూడా ఆయన పట్టించుకోవడంలేదు. మెడిసిన్ నాలుగు సంవత్సరాలు అయిపోగానే తన బాధ్యత తీరినట్లు మౌనంగా వున్నాడు. అదీకాక. "దానిమీద ఇంకో పైసా పెట్టినా నేను ఒప్పుకోను... అదొక్కతే కాదు. పక్కన కొడుకున్నాడు. అసలే రేట్లు మండిపోతున్నాయి. వాడి చదువుకోసం కాస్త దాచండి!" అని తల్లి ఎప్పుడో తెగేసి చెప్పింది. ఇక తన గురించి వాళ్లు ఆలోచించరు. పిల్లల్తో తల్లిదండ్రుల రక్తసంబందానికి కూడా విలువలు తగ్గిపోతున్నాయి.

... అలాగే నానమ్మను కూడా బయటకి పంపించి వేశారు. తండ్రికి ఫోన్ చేసి నానమ్మని తీసికెళ్లమని చెప్పింది.

"తీసికెళ్తే... మీ మమ్మీ నన్ను ఇంట్లో వుంచదు. అర్థం చేసుకో మన్వితా! అన్నాడు విశ్వనాథ్. కనీసం ఆమెను ఓల్డేజ్ హోంలో వుంచాలన్న అలోచన కూడా ఆయనలో లేదు.

రేపు ఆయనకి కూడా ఓ కొడుకువున్నాడని... ఆ కొడుకు ఆలోచనలు కూడా ఆయన్ని మించి వుంటాయని... ఏరు దాటాకా తెప్పల్ని తగలేసుకుంటూ, ఎదురొచ్చేవాటిని దాటుకు పోవాలన్న వేగంలో కొట్టుకుపోతూ... అడ్డుగా వున్న తల్లిదండ్రుల్ని రైల్వే స్టేషన్‌లో, బస్టాండ్‌లలో వదిలేస్తాడని గ్రహించినట్లు లేదు. తను తన తల్లికి కల్పించలేని సెక్యూరిటీ, సౌకర్యం తన కొడుకు తనకి కల్పిస్తాడని... తను చాలా ప్రత్యేకమైన వ్యక్తి అని భ్రమపడ్తున్నాడు. తల్లితో అవసరం లేదనుకుంటున్నాడు.



కానీ... ఇప్పుడు నానమ్మని తను ఎలా పోషించాలి? తను వదిలేస్తే దిక్కుతోచక చనిపోతుంది. వదలకపోతే....?

హాస్పిటల్ వాళ్లు-హౌస్ సర్జన్లకి నెలకి 5.000/- రూపాయలు ఇస్తారు. ఆ డబ్బుతోనే తను హాస్టల్ బిల్లు, మిగతా ఖర్చులు సరిపెట్టుకుంటోంది. అటు వంటి పరిస్థితిలో వున్న తను నానమ్మను బయట వుంచి ఎలా పోషించగలదు? ఏ విధంగా చూసినా మన్విత ఆలోచనలు నానమ్మ విషయంలో ఓ కొలిక్కి రావటం లేదు.

"ఏమాలోచిస్తున్నావ్? నిద్రపోకుండా మన్వీ?" అంది సంజన. బహుశా మన్విత ధీరజ్ గురించే ధీర్ఘాలోచనలో వుందన్న అనమానంతో... సంజనకి ఎలాంటి డౌట్స్ వస్తుంటాయో మన్వితకి ముందే తెలుసు... నీ అనుమానం నిజం కాదని ఎంత చెప్పినా సంజన వినదు. అదీకాక ఈ రోజు హాస్పిటల్లో తనని సేవ్ చేసింది. దీరజ్ అని ఈ పాటికి అందరికి తెలిసే వుంటుంది. సంజనని ఇక ఆపలేం.... అందుకే!

"ఆయిల్ విషయంలో అమెరికాకి ఇరాక్‌కి మధ్య జరిగిన కోల్డ్‌వార్ గురించి ఆలోచిస్తున్నా సంజనా!" అంది మన్విత . సంజనను డైవర్ట్ చెయ్యడం కోసం...

"అవునా! అరవై ఆరు దేశాల్లో వెలిగిన సత్యం కంప్యూటర్స్ ఏడువేలఆరువందలకోట్ల కుంభకోణంలో చిక్కి చతికిల పడిందట... ప్రస్తుతం అందులో పని చేసే యాభైమూడువేల మంది ఉద్యోగుల గురించి కూడా ఆలోచించు. వాళ్లేం చేశారు పాపం!" అంటూ తను ఆశించిన సమాదానంరాలేదన్న నిరాశతో బ్లాంకెట్ నిండా కప్పుకొని పడుకొంది సంజన.

"హమ్మయ్యా! తెల్లారేంత వరకు ఇది లేవదు..." అనుకుంటూ కళ్ల మూసుకొంది మన్విత.

వెంటనే బ్లాంకెట్ లోంచి కాస్త బయటకొచ్చి...

"నానమ్మా! నానమ్మా!" అంటూ పిలిచింది సంజన.

అప్పటి వరకు నిద్రపోని వర్ధనమ్మ వెంటనే పలికింది.

"ఇవాళ మా హాస్పటల్‌లో ఒకతను మా నర్స్‌తో..." తల్లి పుట్టిల్లు మేనమామకు తెలియదా!" అన్నాడు. తల్లి పుట్టిల్లు తప్పకుండా మేనమామకు తెలుస్తుంది. ప్రత్యేకించి అలా అనటం దేనికి నానమ్మా? నాకేం అర్థం కాలేదు. మావాళ్లను కొంతమందిని అడిగాను... వాళ్లుకూడా నాలాగే అన్నారు. నీకు తెలిస్తే చెప్పవా?" అంది సంజన.

సంజన సందేహానికి ఆశ్చర్యపోలేదు. ఇలాంటి అమ్మాయిలు చాలామంది వున్నారు. ఇంకొద్ది రోజులు పోతే ఇలాంటి సామెతలు వినటమే కాని అర్థాలు తెలియక కనుమరుగై పోతాయి. ఎందుకంటే ఇలాంటి సామెతల్ని కాని, కథల్ని కాని ఇప్పటి పిల్లలకి ఓల్డేజ్ హోంలో వుండే అమ్మమ్మలు, నానమ్మలు విన్పంచలేరు కదా?

అందుకే కొంతమంది పిల్లలు కంప్యూటర్ గేమ్ సెంటర్లలో వుండే పెద్ద పెద్ద మానిటర్లు , ఆడియో - విజువల్ ఎఫెక్టులు, కొత్త కొత్త గేమ్స్, టెర్రరిస్టులను మట్టుపెట్టటం.... మిలటరీ సాహస కృత్యాలు ఆసక్తిగా చూస్తూ ఆకర్షితులవుతున్నారు. తనమనవడు పగలంతా అవి చూసి రాత్రి వేళల్లో కలవరిస్తూ సరిగ్గా చదువుకోవడం లేదని ఒక రోజు వాడ్ని అటువైపు వెళ్ల కుండా చేసింది వర్ధనమ్మ...

అదిప్పుడు గుర్తొచ్చి మెల్లగా నవ్వినా శబ్దం వచ్చేలా నవ్వింది వర్ధనమ్మ, నానమ్మ నవ్వటం చాల రోజుల తర్వాత విన్నది మన్విత.

సంజన సందేహన్ని తీర్చడం కోసం ఆమెవైపు తిరిగింది వర్ధనమ్మ.

"తనకంటే ఎక్కువ తెలిసిన వాళ్ల దగ్గరికి వెళ్లి తమకు తెలిసిన కొన్ని సంగతుల్ని గొప్పగా చెప్పేవాళ్లకి..." మన గురించి అన్నీ తెలిసిన



వాళ్ల దగ్గరికి వెళ్లి గొప్పలు చెప్పుకుంటూ బడాయిపోయేవాళ్లకి ఈ సామెత వర్తిస్తుంది. అదెలా అంటే మామయ్య దగ్గరకి వెళ్లి "మా అమ్మ చిన్నప్పుడు ఇలా చేసేదట, అలాచేసేదట..." అని కబుర్లు చెప్తే ఎలా వుంటుందో ఒక్కసారి ఊహించుకో... అమ్మ చిన్నప్పుడు చేసిన పనులు కేవలం మనం విన్నాం... కానీ మామయ్య నేరుగా చూసివుంటాడు. కొన్ని పనులు అమ్మతో కలిసి చేసి వుంటాడు. అంటే ఏదైనా... మాట్లడేటప్పుడు కాస్త విజ్ఞతతో వ్యవహరించాలని చెప్పేటప్పుడు ఈ సామెతను వాడుతారు మనవరాలా!" అంది నానమ్మ. అమె అలాపిలుస్తుంటే తనకి నానమ్మ లేని లోటు తీరినట్లైంది సంజనకి.

సంజనది హైదారాబాదు. ఇంగ్లీష్ మీడియం చదివింది. ఆసక్తిగా అన్పిస్తూంటే ఇంకా కొన్ని సామెతల్ని, కాశీమజిలీ కథల్ని నానమ్మతో చెప్పించుకొంది.

ఎప్పుడైనా వర్ధనమ్మ... ఎదుటివాళ్లు తన ద్వారా ఏదైనా తెలుసుకుంటారన్నా ఉపయోగం వుందన్నా... ఉత్సాహం చూపిస్తుంది. ఒక్కోసారి లేని హుషారు కూడా తెచ్చుకుంటుంది.

* * * * *

తెల్లవారింది...

హాస్పిటల్‌కి వెళ్లగానే ధీరజ్‌ను కలిసింది మన్విత.

"ఏం చేయాలో తెలియడం లేదు సర్! నానమ్మను చూస్తుంటే బాధగావుంది. ఆమెకు ఈ వయసులో రావలసిన కష్టం కాదిది. నేను పక్కకి వెళ్తేచాలు ఏడ్చుకుంటుంది. కనీసం నా ఈ హౌస్ సర్జన్ పూర్తి అయ్యేంత వరకు ఆమెకు ఎక్కడైనా షెల్టర్ దొరికితే బాగుండు..." అంటూ తన మమ్మీకి- నానమ్మకి మాటా, మాటా ఎలా పెరిగిందో ఆమె ఎలా బయట కొచ్చిందో చెప్పింది.

ఆలోచించాడు ధీరజ్.

నిన్న హాస్పిటల్లో జరిగిన గొడవకన్నా... నానమ్మ నిరాశ్రయురాలు కావటమే మన్వితను ఎక్కువగా బాధిస్తున్నట్లు గ్రహించాడు ధీరజ్.

"మీ నానమ్మను ప్రస్తుతం మా ఊరు తీసికెళ్లి మా ఇంట్లో వుంచుతాను. నువ్వేం బాధపడకు మన్వితా!" అంటూ ఆమెకు ధైర్యం చెప్పి, వర్ధనమ్మను పాకాల తీసికెళ్లాడు.

మన్వితకి పెద్ద సమస్య తీరినట్లైంది.

ప్రతి సమస్యకి ఏదో ఒక పరిష్కారం వుంటుందని చెప్పే ధీరజ్‌కి నానమ్మ విషయం చెబితే ఏదో ఒక సలహా యివ్వకపోతాడా అన్న ఆశతో చెప్పింది. కానీ... అతనంత గొప్ప బుద్ధితో తన ఇంటికి తీసికెళ్తాడనుకోలేదు. ధీరజ్ మాటల మనిషికాదు. చేతల మనిషి... అందులో సందేహం లేదు.

అతనిలో వయసుకి మించిన మెచ్యూరిటీ వుంది. అందరు యువకుల్లా తేలిగ్గా మాట్లాడటం... కోపం తెచ్చుకోవటం... అవసరంలేని జోకులు వెయ్యటం చెయ్యడు. అతని బాడీ లాంగ్వేజ్ కూడా ఉన్నతమైన వ్యక్తిత్వంతో కొంచెం సీరియస్‌గా, కొంచెం గంభీరంగా ఒక లెవెల్లో కన్పిస్తుంది.

అతను స్నేహంగా మాట్లాడే మాటలు... సబ్జక్ట్ రిలేటెడ్‌గా చేసే డిస్కషన్ వింటుంటే... బోధి వృక్షం నీడలో, జ్ఞాన దీపం వెలుగులో నిలబడిన అనుభూతి కలుగుతుంది. దాని వల్ల ఏదో బలమైన శక్తి ప్రవేశించినట్లై జీవితంలో మంచిపేరు, ఇండివిడ్యువాలిటీ సంపాయించుకోవాలన్న తహ తహ కలుగుతుంది. అందుకే మన్విత దృష్టి కెరీర్ మీద నుండి ఇంచైనా కదలడం లేదు.

* * * * *



ధీరజ్ తండ్రి వివేకానందరెడ్డి మంచి కాంట్రాక్టర్, ఆయన సతీమణి సత్యాదేవి, అయనకు తగిన ఇల్లాలు. ఆ భార్యా, భర్తలిద్దరిని ఈ మధ్యన ఒక దురదృష్టకరమైన సంఘటన మానసిక సంక్షోభానికి గురి చేసింది.

అదేమిటంటే? వివేకానందరెడ్డి తండ్రి బాపిరెడ్డి. ఆ ఊరిలో ఒక హాస్పటల్ కట్టించి, అందులో తన మనవడు ధీరజ్‌ను వుంచి, ఆ ఊరి ప్రజలకి మంచి వైద్య సదుపాయం కల్పించాలని ప్రయత్నిస్తూ...ఆ ప్రయత్నంలోనే ఓ రాత్రి నిద్రలోనే చనిపోయాడు.

సత్యాదేవి మామగారిని మరచి పోలేక పోతోంది. ఆయన ఆశల్ని ఆశయాలను మరిచిపోలేక పోతోంది . అటువంటి స్థితిలో... ఒంటరిగా ఫీలవుతున్న సత్యాదేవి వర్ధనమ్మను చూడగానే తనకో పెద్ద దిక్కు దొరికినట్లు మహదానందాన్ని వ్యక్తం చేసింది. ఆమెను తన ఇంట్లో మనిషిలాగే భావించి ప్రేమాభిమానాలని చూపించింది.

ఆ ఇంట్లో... వాళ్ల ఆప్యాయత నీడలో మనస్ఫూర్తిగా సేద తీరుతోంది వర్ధనమ్మ.

వర్ధనమ్మను కారులో కూర్చోబెట్టుకొని... వరంగల్ వెళ్లి ఆమెకు తగిన రంగులో కొన్ని గద్వాల్ చీరెలు తీసింది సత్యాదేవి.

తిరిగి పాకాలకి చేరుకున్నాక... తన ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలో సగం కట్టి ఆపేసిన ఒక బిల్డింగ్ ముందు కారాపి... ఆ భవన నిర్మాణం ఎందుకు ఆపేశారో చెప్పింది సత్యాదేవి.

శ్లాబ్ వరకు వచ్చి ఆగిపోయిన ఆబిల్డింగ్ మొత్తం తిరిగి చూసింది వర్ధనమ్మ.

అక్కడ ఒక గది చూపించి... ఆగదిలో వాళ్ల మామగారు రాత్రీ, పగలు వుండి - వర్కర్స్ తో ఎలా పని చేయించేవాడో చెప్పింది సత్యాదేవి.

పెద్దహాల్లో దక్షిణం వైపు సిమెంట్ బస్తాలు, ఇసుక, ఇటుక 'మమ్మల్నేం చేస్తారు?' అన్నట్లు చూస్తున్నాయి. బావి కున్న మోటర్‌కి వందగజాల పైపు

తగిలించి వుంది. దాన్నెవ్వరు పట్టించుకోనట్లు అడ్డదిడ్డంగా జీవం లేనట్లు పడివుంది. చెక్కపని చేస్తూ ఆగినట్లు .. అక్కడంతా చెక్కపొట్టు నిండి వుంది.

"గోడలకి నీళ్లు పడదాం! మోటర్ స్విచ్ ఎక్కడుంది?" అంటూ పైపును చేతిలోకి తీసుకొంది వర్ధనమ్మ ,

"గోడలకి నీళ్లు పడతారా? వద్దండి! మన ఇంటికెళ్దాం రండి!" అంది భయంగా చూస్తూ సత్యాదేవి.

వర్ధనమ్మ వినలేదు. అక్కడేవున్న స్విచ్ ఆన్ చేసి గోడలకి నీళ్లు పట్టసాగింది.

సత్యాదేవి మరింత కంగారుపడ్తూ... వర్ధనమ్మ చేయిపట్టుకొని ఆపింది.

"నా మాటవిని ఇంటికెళ్దాం రండి! ఇక్కడ మనం ఎక్కువ సేపు వుండొద్దు." అంది. అప్పటికే కారులో వుండే డ్రైవర్‌తో పాటు చుట్టుపక్కల ఇళ్లలో వాళ్లు వర్ధనమ్మను వింతగా చూస్తున్నారు. ఈమె ఈ ఊరికి కొత్తనా అన్నట్లువున్నాయి వాళ్ల చూపులు...

"నేను రాను సత్యా! నువ్వెళ్లు... గోడలకి, స్లాబ్‌కి నీళ్లు పట్టి, నెమ్మదిగా వస్తాను." అంది వర్ధనమ్మా తన చేతిని మెల్లగా విడిపించుకుంటూ...

"ఎంత చెప్పినా అర్థం చేసుకోకుండా ఏమిటీ మొండి పట్టు...?" అంది ఆ బిల్డింగ్ వైపు అయిష్టంగా చూస్తు సత్యాదేవి.

"నీ మాటల్ని బట్టీ... అదిగో చుట్టు పక్కల వాళ్ల చూపుల్ని బట్టీ నాకంతా అర్థమైంది. ఇక నువ్వు నాకేం చెప్పొద్దు... ఈ బిల్డింగ్ ఆపేది లేదు. రేపటి నుండి నేను ఇక్కడే వుంటాను. మళ్లీ పని మొదలు పెడదాం..." అంది.

"బ్రతుకుమీద ఆశ వుండే మాట్లాడుతున్నావా?" అంది సత్యాదేవి.

"ఆశ... నా బ్రతుకు మీద కాదు. ఇదిగో ఈ బిల్డింగ్ మీద... ఎందుకంటే...? ధీరజ్ ఏ పరిస్థితిలో నన్ను యిక్కడికి తీసుకొచ్చాడో నాకు



తెలుసు. అలాంటి నేను ధీరజ్ కోసం... అతని భవిష్యత్ కోసం ఏమైనా చేస్తాను. ఈ బిల్డింగ్‌ని వాళ్ల తాతయ్య ధీరజ్ కోసం ఏ ఆశయంతో కట్టదలిచాడో, ఆ ఆశయాన్ని నేను నెరవేరుస్తాను." అంది స్థిరంగా...

"ఇక్కడ దెయ్యాలు వున్నాయని అందరు అనుకుంటున్నారు. అవి తొక్కడం వల్లనే మా మామగారు రాత్రికి రాత్రే చనిపోయారని ఊరంతా అంటున్నారు. మీ పట్టుదలకి అర్థం లేదు... మీకేమైనా జరిగితే తర్వాత ఆలోచించటానికి ఏమీ వుండదు." అంది అదే తన భయం అన్నట్లుగా...

... దెయ్యాలున్నాయని ప్రచారం చెయ్యడం భూగోళం వేడెక్కినంత ప్రమాదకరమైన చర్య... ఎందుకంటే భూమి వేడెక్కితే సముద్ర జలాలు వేడెక్కుతాయి. నీటి ధర్మాలలో మార్పులు వచ్చి రుతుపవనాలు గతి తప్పుతాయి. తరుచూ తుఫాన్లు వస్తాయి. రాకూడని సమయాల్లో వర్షాలు వచ్చి ఎన్నో దుష్ఫలితాలు కలుగుతాయి. ఈ కారణాల వల్ల పంటలు దెబ్బతిని ఆహార భద్రతకు ముప్పు వస్తుంది...

అలాగే - లేని దెయ్యాల భయం వల్ల పునాదులు వెయ్యక ముందే భవనాలు ఆగిపోతాయి, ఇంకాస్త ముందుకు వెళ్లి గోడలు కట్టాక ఆగుతాయి, కొన్ని స్లాబ్‌లు వేశాక ఆగుతాయి. అలాగేకొన్ని మొండి గోడలుగా మిగిలి పాడుబడిపోతాయి. అందులో చివరకి అందరూ అనుకునే దెయ్యాలకి బదులు జూదగాళ్లు, తాగుబోతులు స్థావరం ఏర్పరచుకుంటారు... ఈ బిల్డింగ్ విషయంలో ఇలా జరక్కుండా వుండాలంటే...

"మీకా భయం వద్దు... నా గురించి ఆలోచించేవాళ్లెవరూ లేరు. కనీసం నా వల్ల ఈ మంచి పని జరిగితే - భగవంతుడు నాకీ గొప్ప అవకాశాన్నిచ్చాడనుకుంటాను. ఇదిలా పాడుబడి పోకుండా ఇక్కడో మంచి హాస్పటల్ వెలిసి ఎందరో ప్రాణాలని కాపాడాలి... ఇది నా కల." అంది వర్ధనమ్మ.

ఆమె చిన్న పిల్లకాదు ఆషామాషీగా మాట్లాడటానికి. అందుకే సత్యాదేవి ఇంకేం మాట్లాడలేదు.

వెంటనే హైదరాబాదులో వున్న భర్తకి ఫోన్ చేసి వర్ధనమ్మ 'కల' గురించి సత్యాదేవి చెప్పింది. భార్య మాటలు విని వివేకానందరెడ్డి ఆశ్చర్యపోయారు. ఇది నిజమా? అన్నట్లు ఆసక్తిగా అడిగాడు. నిజమేనని చెప్పింది సత్యాదేవి.

వివేకానందరెడ్డి ఎక్కువగా రోడ్డు కాంట్రాక్ట్ వర్క్ కోసం హైదరాబాద్‌లోనే గడుపుతుంటాడు . ఇక్కడికి వచ్చే వీలు కాదు. అదే విషయం వర్ధనమ్మకి ఫోన్లో చెప్పాడు. ఏదైనా తనతో ఫోన్లో చెబితే చాలని... అన్ని పనులు దగ్గరుండి చేపిస్తానని హామీ ఇచ్చింది వర్ధనమ్మ.

వివేకానందరెడ్డి మేస్త్రీకి ఫోన్ చేసి... బిల్డింగ్ పని ఎప్పటిలా మొదలు పెట్టమని చెప్పాడు. అక్కడ నాన్న గారి ప్లేస్‌లో వర్ధనమ్మ వుంటుందని కూడా చెప్పాడు. ఆమె ఉత్సాహం చూస్తుంటే వివేకానందరెడ్డికి తండ్రి గుర్తొచ్చాడు.

* * * * *

వర్ధనమ్మ పర్యవేక్షణలో... బిల్డింగ్ నిర్మాణం యుద్ధ ప్రాతిపదికలా సాగుతోంది.

ఆమె తన చిన్న తనంలో... తండ్రి పొలంలో పనివాళ్ల చేత ఎలా పనులు చేయించే వాడో దగ్గరుండి చూసిన అనుభవం వల్ల ఇప్పుడు ఇక్కడ పనివాళ్లతో అతి నేర్పుగా పనులు చేయిస్తోంది. రాత్రీ, పగలు అక్కడే గడుపుతోంది.

అదమరిస్తే చాలు - ఇటుకలు, సిమెంట్, ఇసుకను దొంగతనం చెయ్యాలను కునే వాళ్లు... ఇంటికెళ్లే ముందు వైరును చొక్కాలోపల పెట్టుకెళ్లే ఎలక్ట్రీషియన్లు ఆమెకు అక్కడ రెడ్‌హేండెడ్‌గా పట్టుబడ్తున్నారుకాని...



అందరు ప్రచారం చేసినట్లు దెయ్యాలు కాని, బాపిరెడ్డి ఆత్మకాని ఆ చుట్టు పక్కలెక్కడా కన్పించడం లేదు. ఒక వేళ దెయ్యాలు, ఆత్మలు వున్నా... ఈ దొంగల కన్నా ప్రమాదకరమైనవి కావేమో!!

ఎప్పటికప్పుడు మన్వితతో, ధీరజ్‌తో ఫోన్లో మాట్లాడుతూ ఏ పని ఎంత వరకు వచ్చిందో చెబుతూనే వుంది వర్ధనమ్మ. నానమ్మ చేస్తున్న పనిపట్ల వాళ్లిద్దరు అత్యంత ఉత్సాహం చూపిస్తున్నారు.

బాపిరెడ్డి వేయించిన ఆ బిల్డింగ్ ప్లానింగ్ కూడా చాలా బావుంది. అదెలా వుందంటే? ఎంటర్ కాగానే ఓ.పి. రూం, దానికి ఎదురుగా పేషంట్లు కూర్చోటానికి పెద్దహాల్. అక్కడే స్లిప్‌లిచ్చేక్యాబిన్... దాని పక్కన మెడికల్ షాపుకి అనుకూలంగా ఓ గది దానికి కాస్త దూరంలో ల్యాబ్.. అది దాటగానే పేషంట్లు కోసం వరుసగా పదిగదులు. ఆగదుల్ని ఆనుకొని బాత్‌రూలు ఎక్సెట్రా...

ఇన్ని రోజులు వర్ధనమ్మ వ్యక్తిత్వం... తండ్రి, భర్త, కొడుకు నీడలో నిర్ధారించబడ్తూ... ఏ చిన్న సంఘటన ఎదురైనా అది తన తప్పు వల్లనే, కావొచ్చు అనుకొని సర్దుకుపోతూ తండ్రికి, భర్తకి , కొడుక్కే కాకుండా చివరకి కోడలికి కూడ భయపడ్తూ బ్రతికింది. కారణం ఇంతకాలం తను చేసిన పనికి గుర్తింపు కాని, విలువకాని లేవు. కన్పించని బాధ మనుసు లోతుల్లో వుండై సలుపుతుంటే... పైన అనుబంధపు పూతను పులుముకొని, ఉపశమనం పొందిన రోజులు కూడా వున్నాయి.

కానీ...ఇప్పుడు పాకాలకి వచ్చిన క్షణం నుండి ఆమె అనుభవించే అనుభూతి అక్షరాలకి అందనిది... దాటిపోయిన జీవితంలో తను బాధపడ్తూ గడపిన క్షణాలన్నీ ఇప్పుడు తిరిగొస్తే-ఇలాంటి మంచి పనులకి వాడుకునే దాన్ని కదా అనుకుంటుంది... ప్రస్తుతం చేస్తున్న పనిలో అలసిపోయినట్లు

అన్పించినా... ఇన్నేళ్లు కాళ్లు అరిగేల తిరిగి చేసిన పనుల కన్నా ఈ పనుల వల్ల అలసిపోవడంలో తృప్తివుంది.

* * * * *

కాలం... ముంగిలి బుగ్గగిల్లే సంక్రాంతి ముగ్గులా సాగుతోంది.

ధీరజ్ తన పోస్ట్ గ్రాడ్యుయేషన్ అయిపోగానే హైదరాబాద్ వెళ్లాడు. ఎక్స్‌పీరియన్స్ కోసం అక్కడో మంచి డాక్టర్ దగ్గర వున్నాడు. అక్కడ నుండి రాగానే అతను పాకాలలో ప్రాక్టీస్ పెడతాడు. హాస్పటల్ కోసం కడుతున్న బిల్డింగ్ నిర్మాణం కూడా పూర్తి కావొస్తుంది.

అనురాగ్ హౌస్‌సర్జన్ అయిన వెంటనే పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చెయ్యటానికి స్టేట్స్ వెళ్లాలనుకుంటున్నాడు.

దీక్షితకి ఏదో వెలితిగా అన్పిస్తోంది. ఐదుసంవత్సరాల నుండి అనురాగ్, తను కలిసి, మెలిసి స్నేహంగా, ప్రేమగా తిరిగారు. భావాలను పంచుకున్నారు. ఆశల్ని పెంచుకున్నారు. ఒకర్ని విడిచి ఒకరు వుండలేని స్థితికి వచ్చారు. ఇప్పుడతని ఎడబాటును వూహించుకొని తట్టుకోలేక పోతోంది.

హౌస్‌సర్జన్ టైమ్ అయిపోయింది. హాస్టల్ వెకేట్ చేసి ఇళ్లకెళ్లిపోతున్నారు...

దీక్షిత, అనురాగ్-మెడికల్ కాలేజీకి దగ్గర్లో వుండే సిటీగ్రాండ్ హోటల్‌కెళ్లి... సెకెండ్ ఫ్లోర్లో వాళ్లిద్దరు అప్పుడప్పుడు ఇష్టంగా కూర్చునే ఓ మూలన వున్న సోఫాలో కూర్చున్నారు. ముందు టేబుల్ పై వున్న దీక్షిత చేయిపై చేయివేసి మాట్లాడుతున్నాడు అనురాగ్. అంత సన్నిహితంగా కూర్చోవడం వాళ్లకి కొత్తకాదు. కానీ అక్కడ వాళ్లను చూసే వాళ్లకు మాత్రం వింత...

"ఇక్కడే పి.జి. చెయ్యండి! నేను కూడా మీకు దగ్గర్లో జూనియర్ డాక్టర్‌గా వుంటాను. మీవీలును బట్టి పెళ్లి చేసుకుందాం!" అంది దీక్షిత.



ఎంత చదివినా, ఎంత ఎదిగినా, నిత్యం పేషంట్లతో మునిగితేలినా... పెళ్లి, భర్తా, పిల్లలు, వంటపని, పిల్లలపని, భర్తతో సంతోషం కావాలని వూహించుకునే సగటు అమ్మాయిల్లాగే దీక్షిత కూడా ఆలోచిస్తోంది. అనురాగ్ స్టేట్స్ వెళ్తే తనకి దూరమవుతాడేమోనన్న అనుమానం కూడా ఆమెలో వుంది. దూరమంటే వేరే రకంగా కాదు. ఒక్కరోజుకూడా అతన్ని చూడకుండా వుండలేని దూరం...

దీక్షితను అర్థం చేసుకున్నాడు అనురాగ్.

"డాక్టర్లుగా మనం సమర్థులం అయినంత మాత్రాన తెలివిగల వాళ్లమయినంత మాత్రాన, రాత్రింబవళ్లు శ్రమించినంత మాత్రాన సరిపోదు. తగినంత సమాచారాన్ని సేకరించుకోవాలి. అందుకే నేను స్టేట్స్‌కి వెళ్తానంటున్నాను. అక్కడ చదివి గొప్ప అనుభవాన్ని సంపాయించుకోవాలి. ఎంతో తెలుసుకోవాలి. ఏదో సాధించాలి. ఇక్కడే వుంటే నా ఆశయం, ఆవేశం తీరవు. మెడిసిన్ ఎంత అభివృద్ధిలోకి వస్తున్నా అంతులేని సమస్యలు పరిష్కారాల కోసం ఎదురుచూస్తున్నాయి. వాటిల్లో కొన్నైనా తెలుసుకోవాలి." అన్నాడు అనురాగ్.

"తెలుసుకోవాలి. శ్రమించాలి. అధిరోహించాలి. కాదనను. మీరు సంపాయించుకునే అనుభవం కాని, సేకరించే వైద్య విజ్ఞానం కాని డబ్బుకోసమేగా! ఉన్న దేశానికి, తల్లి దండ్రులకి దూరంగా పోయి, తిరిగొచ్చి సంపాయించే ఆ డబ్బు ఎవరికోసం? హైటెక్ సిటీలో వుండే సాఫ్ట్‌వేర్లు కూడ రోడ్డు మీద బండ్ల ముందు నిలబడి బిర్యానీ తింటూ డబ్బు సంపాయిస్తున్నారు. పనికి, డబ్బుకి అంకితమై పోతున్నారు... ఇంతకీ వాళ్లలో వుండే ఆ డెడికేషన్ అంతా బిర్యానీ కోసమా లేక అందులో యింకేమైనా పరమార్థం వుందా?" అంది దీక్షిత.

మృధువుగా నవ్వి, ఆమె చేతిని సున్నితంగా నొక్కాడు.

"ఐనో దీక్షా! నాకు దూరంగా వుండలేక దానికి, దీనికి లింక్ పెట్టి మాట్లాడుతున్నావు. అయినా నేను వెళ్లేది డబ్బుకోసం అధికారం కోసం, కీర్తి కండూతి కోసం కాదు. పేషంట్ల కోసం... ఆ పేషంట్లలో కన్పిస్తున్న అంతుపట్టని రోగాలకి ట్రీట్‌మెంట్ కనుక్కోవడం కోసం ఏ ట్రీట్‌మెంట్ యివ్వాలో తెలియక అర్థాంతరంగా చనిపోయే వాళ్లని బతికించడం కోసం... నువ్వు కూడా నాతో వచ్చి పి.జి చెయ్యి. ఎకనామికల్‌గా అవసరమైతే నేను ఏర్పాటు చేస్తాను. నాక్కూడా నిన్ను విడిచివుండాలని లేదు." అన్నాడు అనురాగ్.

అతనా మాటల్ని ప్రేమతో అంటున్నాడని తెలుసు. కానీ...

"ఇప్పటికే మా అన్నయ్య చదువుకి మల్లారెడ్డి సార్ హెల్ప్‌తో 3 రూపాయాల వడ్డికి అప్పుచేశాం. నా చదువుకి మామయ్యవాళ్ల పొలం అమ్మాం. అది చాలక ఇంకా నా చదువుకి ఎంత అవసరమైతే అంత వాళ్లేయిచ్చారు. వాళ్లిప్పుడు ఢిల్లీలో వుంటున్నారు. ఇంకెవరి దగ్గర చేయి చాచాలని లేదు. నన్నిలా వుండ నివ్వండి!" అంటూ అతని చేతిలో వున్న తన చేతిని మృధువుగా విడిపించుకొని, రెండు చేతుల్ని టేబుల్‌పై పెట్టి నిటారుగా కూర్చుంది.

ఆమెలోని స్వాభిమానాన్ని అర్థం చేసుకున్నట్లు ఆమె చేతిని తిరిగి తన చేతిలోకి తీసుకున్నాడు.

"దీక్షా! మన సూపర్ సీనియర్ డా॥ ధీరజ్ రెడ్డి మీ ఊరిలో హాస్పిటల్ పెట్టబోతున్నాడు. నువ్వా డాక్టర్ దగ్గర జూనియర్ డాక్టర్‌గా వుండు. నేనిక్కడ లేని ఫీలింగ్ నీకు రానివ్వకుండా నీకు కాల్ చేసిమాట్లాడుతుంటాను. నా పి.జి. అయిపోగానే పెళ్లి చేసుకుందాం. ఇప్పుడైతే నేను వెళ్లక తప్పదు. ఏం చేద్దాం చెప్పు! కొన్ని కావాలనుకున్నప్పుడు కొన్ని వదులుకోకతప్పదు." అన్నాడు. ఆ మాటలు క్యాజువల్‌గా అందామనుకున్నా బాధగానే బయటకి వచ్చాయి.



"నేనూ అదే అనుకుంటున్నాను. మల్లారెడ్డిసార్ కూడా డా॥ ధీరజ్ రెడ్డితో మాట్లాడతానన్నారు. డా॥ ధీరజ్‌రెడ్డి ఎవరోకాదు. మల్లారెడ్డిసార్ తోడల్లుడి కొడుకు." అంది దీక్షిత.

అనురాగ్ నిశ్చింతగా ఫీలయ్యాడు.

వాళ్లు ఆర్డర్ ఇచ్చిన ఐటమ్ వచ్చింది.

తింటూ మాట్లాడుకుంటున్నారు. ఆ మాటలకి, స్వీట్ నథింగ్స్‌కి అంతంలేదు. వాళ్లిప్పుడు డాక్టర్లు కాదు. ప్రేమికులు.

* * * * *

రోజులు గడుస్తున్నాయి.

పాకాలలో డా॥ ధీరజ్ రెడ్డి పెట్టిన హెల్త్‌కేర్ మల్టిస్పెషాలిటి హాస్పటల్... వచ్చే పేషంట్లకి, వెళ్లే పేషంట్లకి తెరిపి లేకుండా ఎందరో పేషంట్లకి ఉపశాంతిని కల్గిస్తోంది. ఆ చుట్టు పక్కల పల్లెవాసులు ఏ ఆపద వచ్చినా గతంలో వెళ్లినట్లు సిటీకి వెళ్లకుండా ధీరజ్ రెడ్డి హాస్పిటల్‌కే వస్తున్నారు. అతి తక్కువ టైంలోనే ఆ హాస్పిటల్‌కి మంచి పేరు వచ్చింది కారణం ఆయన చదివింది జనరల్ మెడిసిన్.

మన్విత హౌస్‌సర్జన్ పూర్తయిన వెంటనే డా॥ ధీరజ్ రెడ్డి, దగ్గర జూనియర్ డాక్టర్‌గా వుంది. హాస్పిటల్లోనే అప్‌స్టెయిర్లో వుండే గదిలో నానమ్మతో వుంటుంది. రాత్రి, పగలు వాళ్లిద్దరు హాస్పటల్లోనే వుంటారు. ధీరజ్ మాత్రం ఇంటికెళ్లి టైం ప్రకారం హాస్పిటల్‌కి వస్తాడు. డా॥ దీక్షిత కూడా అంతే!

హాస్పిటల్ ముందుగాని, లోపలగాని - వర్ధనమ్మ నాటిన మొక్కలు రోజు, రోజుకి ఎదిగి పచ్చదనాన్ని పంచుతున్నాయి. ఆమె రోజు ఆ చెట్లకి నీళ్లు పోస్తూ వాటిని ప్రాణంగా చూసుకుంటుంది.

ఆమె మెట్లు దిగి క్రిందికి రాగానే డా॥ మన్విత గారి నానమ్మగా ఆమెకెంతో గౌరవం ఇస్తుంటారు పేషంట్లు. వాళ్ల తాలూకు బంధువులు

కొందరు ఆమెతో మాట్లాడకుండా వెళ్లరు. అది చూస్తూ... అంత గొప్ప మనవరాలు తనకి వున్నందుకు వర్ధనమ్మ గర్వపడని రోజు లేదు. పైకి కనబడకుండా మురిసి పోని క్షణం లేదు. కానీ...

ఒకప్పుడు క్యాజువాల్టిలో... ఆ డెత్ సంఘటన జరిగాక మన్విత మీద ఎలాంటి విమర్శలు వచ్చాయో వర్ధనమ్మకి తెలుసు.

"రాజు గారి నోట్లో తాటి చెట్టు మొలిచిందట." అన్న సామెతలా పుకార్లు షికార్లు చేసి అవి చిలవలు,ల పలవలుగా మారి... తమకు తెలిసిన దాన్ని పదిమందికి చెప్పాలన్నట్లు దానికి మరికాస్త జోడించి, ఒకరి నుండి ఒకరికి చేరవేస్తూ చివరకు దాని రూపాన్నే మార్చి "మన్విత చేతిలో మనుషులు పోతున్నారటగా..." అన్న దాకా వచ్చింది.

ఆ మాటలు మన్వితకు ఇబ్బంది కల్గించినా... కెరీర్ విషయంలో అవే మైలు రాళ్లు అయ్యాయి.

ఆ మాటల్నే ఇప్పుడు ఛాలెంజ్‌గా తీసుకొని, మనోస్థైర్యాన్ని పెంచుకొంది. పాజిటివ్ ఆటిట్యూడ్ అలవాటు చేసుకొంది. ఇప్పుడు తన గురించి తను పూర్తిగా అర్థం చేసుకొని బ్యాలెన్స్‌డ్‌గా వ్యవహరిస్తోంది. ఏదో సాధించాలని, గుర్తింపు పొందాలని, దానికోసం ఎంతయినా పనిచేయాలని, అందరి అభినందనలు పొందాలని, దానివల్ల మనసుకి అద్భుతమైన శాంతి దొరుకుతుందని ప్రయత్నిస్తోంది.

ఉదయం పదిగంటల నుండి హాస్పటల్‌లో ఓ.పి. నడుస్తోంది. ఒకే గదిలో ఎదురెదురుగా కూర్చుని డా॥ మన్విత, డా॥ దీక్షిత పేషంట్లని చూస్తున్నారు. వాళ్లిద్దరు డాక్టర్ల రూపంలో ఉన్న ఐదున్నర అడుగుల తెల్లని హంసల్లా వున్నారు. వాళ్లనలా చూస్తుంటే డాక్టర్లంటే ఇలా వుంటారు! ఇలా వుంటేనే డాక్టర్లేమో అనిపిస్తుంది.

మన్విత పేషంట్ హిస్టరీ తీసుకుంటుండగా... దీక్షిత మొబైల్‌కి కాల్ వచ్చింది. వెంటనే మన్విత వైపు చూస్తూ...



"ఎక్స్ క్యూజ్‌మీ డాక్టర్! డా॥ అనురాగ్ కాల్ చేశాడు."అంటూ పక్కకెళ్లింది దీక్షిత.

అతని కాల్ కోసం... ఓ.పి లో వున్నా కూడా స్విచ్ ఆఫ్ చేసుకోకుండా వెయిట్ చేస్తుంది దీక్షిత. స్టేట్స్‌లో వున్నాడు కదా ఆ మాత్రం ఆతృత వుంటుంది. కానీ... బాధ్యత గల ఒక డాక్టరై వుండి పేషంట్లను వదిలి అలా పక్కకెళ్లి ప్రియునితో మాట్లాడడం మన్వితకి నచ్చలేదు... ఎందుకంటే డాక్టర్లు, సైంటిస్ట్‌లు, రచయితలు, సైనికులు, ఇంజనీర్లు, వ్యాపారస్తులు తమ బాధ్యతల్ని విస్మరించి ఇలాంటి కాల్ కోసం వెయిట్ చేసి గంటలు, గంటలు ఫీలింగ్స్ పంచుకోవటం వల్ల దేశానికి అంతో ఇంతో నష్టమే కాని లాభం వుండదు. మొదటిసారిగా ఇలాంటి ఫీలింగ్స్ మీద విముఖత కల్గింది. మన్వితకి...

ఒకప్పుడు వాళ్లిద్దరలా మాట్లాడుకుంటుంటే ఎర్రగా కాల్చిన ఇనుమును నెత్తిన పెట్టినట్లుండేది. ఇప్పుడలాలేదు. ఎందుకంటే...

ప్రేమంటే ఏదో తెలియని భయం, బాధ, ఇన్‌సెక్యూర్ ఫీలింగ్ కాదు. ప్రేమంటే గొప్ప రిలీఫ్. అది పంచేకొద్ది పెరగాలి. మరిచిపోవడంలో ప్రేమలేదు. గుర్తుంచుకోవడంలో ప్రేమవుంది. అదెలా అంటే జీవితాన్ని గుర్తుంచుకోవాలి. జీవితంలోని బాధ్యతల్ని గుర్తుంచుకోవాలి. అపకీర్తి, అవమానాలు, ఇంట్లోవాళ్లు అసహ్యించుకొని తలుపులు మూసుకున్న క్షణాలను గుర్తుంచుకోవాలి. స్వాభిమానం కోల్పోకుండా బ్రతకడం ఎలాగో నేర్చుకోవాలి. అనుకొంది మన్విత.

... జీవితాన్ని చూస్తున్న కొద్ది ప్రేమను మరో కోణంలో చూసిన మన్విత దృష్టంతా ప్రస్తుతం రోగుల మీద వుంది.

వెంటనే పేషంట్ వైపు తిరిగి...

"నీ పేరేమిటి? వయసెంత? బాధేమిటి?" అంటూ పేషంటుని అడిగింది మన్విత.

మన్విత అడిగిందానికి పేషంట్ సమాధానం చెబుతోంది. దాన్ని ఓ స్లిప్ మీద రాస్తూ...

"పెళ్లయిందా? పిల్లలెందరు? ఏదీ నాలిక చూపించు..." అంటూ ఆమె ముఖంలోకి చూసింది.

ఆ తర్వాత ఆమెను స్క్రీన్ వెనక్కి తీసికెళ్లి పరీక్ష చేసింది. అన్నిటెస్ట్‌లు అయిన వెంటనే ఆమెను డా॥ ధీరజ్ రెడ్డి దగ్గరికి పంపింది.

'నెక్స్ట్' అనగానే ఒక పేషంట్ వచ్చి స్టూల్ మీద కూర్చున్నాడు. అతన్ని చూసి ఆశ్చర్యపోయింది. అతనిలో వచ్చిన మార్పు చూసి అతనేనా అనుకొంది.

ఒక రోజు తప్పతాగి చేతకాని స్థితిలో వున్న అతన్ని అతని తల్లి, భార్య, నాలుగేళ్ల కూతురు హాస్పటల్‌కి తీసుకొచ్చి, బిక్కు బిక్కు మంటూ బాధపడ్తుంటే... డా॥ ధీరజ్ రెడ్డి అతనికి ట్రీట్ మెంట్ ఇచ్చి, తర్వాత కౌన్సిలింగ్ ఇచ్చాడు. అతని తల్లితో, భార్యతో కూడా మాట్లాడాడు. ఆ సన్నివేశాన్ని గుర్తు చేసుకుంటూ - అతన్నే చూస్తూ...

"ఎలావుందిప్పుడు?" అని అడిగింది మన్విత.

అతను సమాధానం చెబుతుంటే... స్టెతస్కోప్ ని వీపు మీద పెట్టి గట్టిగా గాలి పీల్చమని చెప్పింది.

ఆమె టెస్ట్ చెయ్యడం పూర్తయ్యాక... ఆమె వైపు చూస్తూ, తాగుడు మానాక, మందులు వాడాక, ఎన్ని అవస్థలు తగ్గాయో మన్వితతో చెప్పాడు.

ఇప్పుడు తన భార్య, తన తల్లి తను కలిసి - పనులకి వెళ్తున్నామని, డబ్బులకి ఇబ్బంది లేకుండా బ్రతుకుతున్నామని తన కూతుర్ని స్కూలుకి పంపుతున్నామని చెప్పాడు. అదెంతో సంతోషించ తగ్గ విషయం... ఎందుకంటే అతను రోజూ తాగి ఇంటికి రావడం, అత్తా, కోడళ్లిద్దరు అతనెప్పుడు మారతాడా అని ఎదురు చూస్తూ... ఏ పనీ లేకుండా కేవలం



అతన్ని మారుమనటమే పనిగా పెట్టుకోవడం... ఇన్నాళ్లు జరిగేది. ఇప్పుడా దరిద్రం నుండి బయట పడ్డారు.

అతన్ని ధీరజ్ రెడ్డి దగ్గరికి పంపాక...

అప్పటి వరకు ఫోన్లో మాట్లాడిన దీక్షిత వచ్చి తన సీట్లో కూర్చుంది.

దీక్షిత కూడా తన దగ్గరకి వచ్చిన పేషంట్ హిస్టరీ చూసి, బ్లెడ్ ప్రెషర్ చూసి ఇన్వెస్ట్‌గేషన్స్ రాసి చేయించుకు రమ్మని చెబుతోంది.

రిపోర్టులు రాగానే డా॥ ధీరజ్ రెడ్డి దగ్గరికి పంపుతోంది.

అక్కడికి వచ్చే పేషంట్లు చెప్పుకునే కంప్లెయింట్స్‌లో ఎక్కువగా నీరసం, కాళ్లు పీకడం, గుండె దడ, ఆయాసం, జ్వరాలు, దగ్గులు, పాము కరవటాలు, కుక్కలు కరవటాలు.

ఇవి కాక కాన్పుల కేసులు ఎక్కువగా వస్తుంటాయి. వీటిని మన్విత చక్కగా చేస్తుంది. ఆమెనంతా "కాన్పుల తల్లి, చల్లని తల్లి" అని పిలుస్తుంటారు.

ఓ.పి అయ్యాక మన్విత, దీక్షిత పైకెళ్లి వర్ధనమ్మ ఇచ్చిన టీ, బిస్కెట్స్ తీసుకొని కాస్త రిలాక్స్ అయ్యారు.

హాస్పటల్ అభివృద్ధి చూస్తుంటే తన తాతగారి ఆశయం నెరవేరినట్లు అన్పించింది డా॥ ధీరజ్ రెడ్డికి.

* * * * *

దీక్షిత హాస్పటల్ నుండి ఇంటి కెళ్లగానే... ఢిల్లీ నుండి వచ్చిన శాంభవిని చూడగానే ఆశ్చర్యానందాన్ని కళ్లలో నింపుకొని, చేతిలో వున్న స్టెతస్కోప్‌ని పక్కన పెట్టాలన్న ధ్యాస కూడా లేని దానిలా అలాగే వెళ్లి ఆమెను కావలించుకొని...

"ఎప్పుడొచ్చారు అత్తయ్యా? మామయ్య రాలేదా? అందరు బాగున్నారా?" అంది దీక్షిత.

"బాగున్నారు! నేనొక్కదాన్నే వచ్చాను." అంటూ ఆప్యాయంగా దీక్షిత వైపు చూసింది.

దీక్షితను చూస్తున్న ఆమెకళ్లలో వింత మెరుపు... చూసి చాలా రోజులైందన్న అర్థం కూడా వుందా చూపులో...

దీక్షిత తల్లి రామలక్ష్మి, శారద - వదినా, మరదళ్లే కాక, మంచి స్నేహితురాళ్లు... ఏ అవసరం వచ్చినా ఇద్దరు ఒకరికొకరు చెప్పుకుంటారు.

శారద ఎప్పుడొచ్చినా ఆ ఇంట్లో సందడి వాతావరణం కన్పిస్తుంది. అందరు సంతోషంగా కన్పిస్తారు. ఆమెను గొప్పగా చూస్తూ, దేవతే తన ఇంటికి వచ్చినట్లు భావిస్తారు. కారణం దీక్షిత డాక్టర్ అయిందంటే శారద గొప్పమనసు. చేసిన ఆర్థిక సహాయం.

ఆ రాత్రికి అందరు బోజనాలు చేసి పడుకున్నారు.

అర్థరాత్రి నిద్రలేచి బాత్‌రూం కెళ్లాలని బయటకి రాగానే... అక్కడ తనతల్లి రామలక్ష్మి, అత్తయ్య శారద దొండ తీగల పందిరి కింద కూర్చుని వుండడం చూసి... అర్థం కానట్లు ఆగిపోయింది దీక్షిత.

ఆకుల సందుల్లోంచి వెన్నెల వాళ్లమీదపడి "ఏమిటి మీ వాగ్యుద్ధం"? అన్నట్లు చూస్తోంది.

అలికిడి అయితే వాళ్లు తమ వైపు చూస్తారని... ఈ టైంలో వాళ్లేం మాట్లాడుకుంటున్నారో వినాలని కుతూహలం ఆపుకోలేక... బాత్‌రూం పక్కనే తెల్లగాతోమి బోర్లించిన ఇత్తడి బిందెమీద కూర్చుంది దీక్షిత.

అక్కడ పాదుల్లో వున్న - బీర, సొర, గుమ్మడి, సన్నజాజి తీగలు సాగి వచ్చదనాన్ని చాటుతూ... ఇక్కడ మాకు తెలియని విశ్వరహస్యామిలేవన్నట్లు మౌనంగా చూస్తూ గాలితాకిడికి అప్పుడప్పుడు ఎండిన ఆకుల్ని, మందార పూలని రాలుస్తున్నాయి.

ఆ నిశ్శబ్దంలో ఆకులు రాలిన చప్పుడు సైతం స్పష్టంగా విన్పిస్తోంది.



"దీక్షితను ఓ మాట అడగాలంటున్నావు. ఇన్ని రోజులు ఈ విషయం దీక్షితతో చెప్పలేదా? ఎందుకు? నువ్విచ్చిన మాట కాలగర్భంలో కలిసి మరిచిపోతాననా? లేక మాట మార్చి నన్ను మోసం చేద్దామనా? ఎందుకు చెప్పలేదు దీక్షితతో..." అంటూ నెమ్మదిగా మాట్లాడుతున్నా తీవ్రంగా వున్నాయి శారద మాటలు.

"అంత పెద్ద మాట లెందుకు వదినా! నాకు అలాంటి ఉద్దేశాలేమిలేవు. అదెప్పుడు చూసినా చదువు ద్యాసలో వుండటంతో ఈ మాట లెప్పుడు దాని దగ్గర తీసుకురాలేదు." అంది రామలక్ష్మి

"చదువుకునే పిల్లల దగ్గర పెళ్లి ప్రసక్తి తెచ్చి వాళ్లను డిస్టర్బ్ చెయ్యటం మంచి పద్ధతి కాదు. నువ్వు చేసింది కరక్టే... ఇప్పుడు హౌస్ సర్జన్స్ అయిపోయి డాక్టరయింది. ఇంకేమిటి నీసంశయం...?" అంది శారద.

మాట్లాడలేదు రామలక్ష్మి.

"దీక్షిత ఒప్పుకోదనా? చదువుకోమని కట్టలు, కట్టలు డబ్బులు పంపితే ఆర్థిక బాధలు తెలియకుండా చదువుకుంటారు కాని... ఇలాంటి విషయాలల్లో నిర్ణయాలు తీసుకోవడం వాళ్లకేం తెలుస్తుంది? మంచి - చెడు... పది కాలాల పాటు కలిసి మెలిసి వుండటం లాంటి లెక్కలన్నీ పెద్దవాళ్లుగా మనం చూసుకోవాలి. అయినా దీక్షిత మన మాట కాదనదనుకో... దానికి నేనంటే ప్రాణం కూడా..." అంది శారద.

ఇంతకీ వీళ్లు తనని ఏం అడగబోతున్నారు? పెళ్లి ప్రసక్తి అంటున్నారు. తన బావ విజయేంద్రను పెళ్లి చేసుకోమని అడుగుతారా? ఆ ఊహకే దీక్షిత గుండెల్లో విస్ఫోటనం పేలినట్లైంది అనురాగ్ గుర్తొచ్చి...

"నువ్వు చెప్పేది నిజమే వదినా! నువ్వంటే దానికి ప్రాణం, గౌరవం... దాని చదువు విషయంలో మీరు చేసిన సహాయం అపారమైంది. దాన్ని తీర్చాలన్నా ఇప్పటికిప్పుడు మా వల్ల అయ్యే పని కూడా కాదు. కేవలం కృతజ్ఞత మాత్రమే చూపగలం..." అంది రామలక్ష్మి.

"మరింకేంటి అభ్యంతరం? పెళ్లి పనులు ప్రారంభించాక..."

"ఎంతయినా దానికోమాట చెప్పాకనేపెళ్లి ఏర్పాట్లు చేద్దాం వదినా! ఎందుకంటే..." అంటూ ఆగిపోయింది.

"ఆ... చెప్పు? ఆగిపోయావేం? ఎప్పటికైనా దీక్షిత నీ కోడలు. దాన్ని నువ్వు చదివించుకో వదినా అన్న రోజు దీక్షిత లేదా? దానికో మాట చెప్పాకనే నాకు మాట ఇవ్వాల్సింది. ఈ తేడా మాటలే నాకు నచ్చవు..." అంది శారద. దీక్షితకి ఓ మాట చెప్పాలనటం శారదకి నచ్చటం లేదు. తనొచ్చి అడగ్గానే పెళ్లి ప్రయత్నాలు చేస్తారనుకొంది.

షాక్ తిన్నది దీక్షిత.

తనకి మెడిసిన్ చదవాలని వుందన్న కోరికను తీర్చటం కోసం... అమ్మ, అత్తయ్యకి మాట ఇచ్చిందా? అలా మాట ఇచ్చే అధికారం తల్లిగా ఆమె కుంది. కానీ...ఇప్పుడు తనతో ఎందుకు చెప్పాలను కుంటోంది? తనో డాక్టరై, తనకో వ్యక్తిత్వం వచ్చిందనా? లేక అనురాగ్‌ని ప్రేమించి, నట్లేమైనా తెలిసిందా? అలాతెలిసే అవకాశం లేదు. ఏది ఏమైనా తన ఇంటి కల్చర్ తెలిసి, ఆర్థిక పరిస్థితి తెలిసి అనురాగ్‌ని ప్రేమించి తప్పు చేసిందేమో...

"నేనంత తేడాగా ఏం మాట్లాడటం లేదు వదినా! దీక్షిత మనసులో ఏముందో తెలియదు కదా! ఎందుకంటే పెద్ద చదువులు చదివిన పిల్లల మనసు అర్థం చేసుకోటానికి నేనేమైనా చదువుకున్నానా? దాని మనసు నొప్పించటం నా వల్లకాదు." అంది రామలక్ష్మి.

తన మనసుకి ప్రాధాన్యత ఇస్తూ అత్తయ్యతో అన్ని మాటలు పడ్తున్న తల్లిని చూస్తుంటే జాలిగా వుంది.

"మేము చదివించక ముందు ఈ ఆలోచన ఏమైంది?" అంటూ నిలదీసింది శారద.



ఒక్కక్షణం ఏం చేయాలో తోచనట్లు, నిస్సహాయంగా చూస్తూ...

"ఒక వేళ అది వద్దంటే మాత్రం మీడబ్బు మొత్తం పైసలతో సహా చెల్లు బెడతాం... కాస్త టైమివ్వండి వదినా!" అంది రామలక్ష్మి.

"ఎవరిక్కావాలి మీ డబ్బు... దానం చేశామని సరిపెట్టుకుంటాను. నువ్వు, మాట మీద నిలబడటంలేదే... అదినాకు నచ్చటం లేదు. నువ్విలాంటిదానివని తెలియక దీక్షిత హౌస్‌సర్జన్స్ అయిన వెంటనే విజయేంద్రతో చెప్పాను. దీక్షితను పెళ్లి చేసుకోమని...'సరే' అన్నాడు. వాడేమైనా అనామకుడా? మిలటరీ ఆఫీసర్. పెళ్లయ్యాక దీక్షిత అక్కడే ప్రాక్టీస్ పెట్టేటట్లు ఏర్పాటుకూడా చేస్తున్నాడు. ఇప్పుడు వాడికి నేనేం సమాధానం చెప్పాలి?" అంది శారద.

మాట్లాడలేదు రామలక్ష్మి

మౌనంగా వున్న రామలక్ష్మి వైపు ప్రశాంతంగా చూస్తూ...

"దీక్షిత మనసులో ఏముందోననేగా నీ అనుమానం? ఏముంటుంది మనసులో... ఇన్నాళ్లు చదివిన మెడిసిన్ చదువు వుంటుంది. అంతేగా! అంతకు మించిన అద్భుతం ఇంకేమైనా వుంటే రేపు అడిగి తెలుసుకుందాంలే... నువ్వింకేం ఆలోచించకు... రా! వెళ్లి పడు కుందాం!"అంటూ చాలా క్యాజువల్‌గా లోపలికి దారి తీసింది ఆమెవెంట రామలక్ష్మి కదలకపోవడంతో విసుగ్గాచూస్తూ...

"నాకు మాట తప్పే వాళ్లంటే అసహ్యం... మాట వల్ల ఎన్ని లాభాలున్నాయో, అదితప్పడం వల్ల అన్ని అనర్థాలుంటాయి. నువ్వేమైనా చిన్నపిల్లవా? అప్పుడోమాట, ఇప్పుడోమాట చెప్పటానికి?" అంది నిలదీస్తున్నట్లుగా...

ఆ మాటలతో రామలక్ష్మి ఆత్మాభిమానం దెబ్బతిన్నది.

"నేను చావనైనా చస్తాను కాని మాట తప్పను వదినా! దీక్షితతో ఒక మాట చెప్పి 'ఈ పెళ్లి నాకు ఇష్టమే ' అని ఒక మాట దాని నోటవెంట వినాలన్నదే నా కోరిక. అది కాదంటుందని కూడా కాదు. ఎలాగైనా నా మాట నిలబెట్టుకుంటాను. సరేనా?" అంది ఆమెవెంట లోపలకి నడుస్తూ రామలక్ష్మి.

అనురాగ్‌ని తను ప్రేమించినట్లు తెలియక పోతేనే ఇలా వుంది. తెలిస్తే! ఏ ఆయుధం వాడకుండా మాటలతోనే చంపేస్తుంది శారద అత్తయ్య. ఈ ప్రమాదం నుండి తల్లి నెలా తప్పించాలి?

ఒంట్లో శక్తి లేని దానిలా అక్కడ నుండి లేవలేక అలాగే కూర్చుంది.

ఇప్పుడేంటి తన పరిస్థితి?

తల్లి చనిపోతే తండ్రి బ్రతుకుతాడా?

వాళ్లిద్దరు తననెంత ప్రేమగా పెంచుకున్నారు... ఫారిన్ నుండి నెయిల్ పాలిష్ తెప్పించి తన గోళ్లకి పెట్టకపోయినా, పెరట్లో గోరింటాకు తండ్రి తెంపుకొస్తే తల్లి నూరి పెట్టేది. తినకుండా నిద్రపోతే ఏదో ఒక టైంలో నిద్రలేపి తినిపించేవాళ్లు...వాళ్ల కళ్లలో ప్రాణం తనే అయినట్లు అడుగడుగున అన్ని జాగ్రత్తలు చెప్పుకుంటూ తను కరెక్ట్‌గా వున్నానని తెలిసి మురిసిపోయేవాళ్లు అలాంటి వాళ్లను పోగొట్టుకొని అనురాగ్‌ని పొంది తను సుఖపడగలదా?

అలా అని అనురాగ్‌ని మరచిపోవటానికి అతనేమైనా పీడ కలా? ఇంట్లో తనకి ఏ ఆప్యాయత లేకనో, లేక తన ఎమోషనల్ కండిషన్ వీక్‌గా వుండటం వల్లనో అతన్ని తను కావాలనుకోలేదు. తగినంత మెచ్యూరిటీ వచ్చాకనే అతన్ని సెలక్ట్ చేసుకొంది.

కానీ... తన తల్లి ఇచ్చిన మాటకి కట్టుబడే మనిషి... ఇప్పుడు తనేం చేయాలి?



దీక్షిత చెక్కిళ్లమీద నుండి నీళ్లు కారి గుండెల్ని తడుపుతుంటే అప్పుడనుకొంది. తను ఏడుస్తున్నానని... అనురాగ్ పరిచయం అయ్యాక ఏడవటం ఇదే మొదటి సారి. కానీ ఇప్పుడెలా?

అనురాగ్‌ని పెళ్లి చేసుకొని తల్లిదండ్రులను చంపుకోవటమా? లేక తల్లిదండ్రుల్ని బ్రతికించుకొని అనురాగ్‌ని వదులుకోవటమా? అనురాగ్‌ది ఐదుసంవత్సరాల బంధమైతే తల్లిదండ్రులది ఇరవైఐదు సంవత్సరాల బంధం... పేదరికంలో పుట్టి లోగడ ఎన్నో పరీక్షల్ని తట్టుకొంది కానీ...

ఈ పరీక్ష మనసుకి సంబందించింది దీన్ని తట్టుకోవాలంటే మానసిక స్పందనని హత్య చేసుకోవాలి... అలా హత్య చేసుకొని "కొన్ని జీవితాలు ఇంతే!" అనుకొని బ్రతికే కన్నా ఈ బ్రతుకే వద్దనుకుంటే?

ఎలా వద్దనుకుంటుంది?

ఇన్నేళ్ల తన కల, తన ఆశయం నిజమై అనుభవించే సమయంలో తనని తను చంపుకోవాలా? ఇంత కష్టపడి మెడిసిన్ చేసింది చనిపోవటానికా? కాదు తను బ్రతకి పదిమందిని బ్రతికించాలి. ప్రశంసలు పొందాలి... కానీ... తనను తను మోసం చేసుకొని పొందే ప్రశంసలతో హాయిగా వుండగలదా? ఇవే చాలనుకొని సుఖంగా బ్రతుకగలదా?

ఇన్నాళ్లు ఎన్ని కష్టాలు వచ్చినా చావాలి అన్న ఆలోచనరాని తనకి ఈ రోజు వస్తుంటే అనురాగ్ తన హృదయంలో ఎంతగా నిండిపోయాడో అర్థమవుతోంది. అంటే అతను లేందే ఇక ముందు ఏ పనీ చేయలేదా? ఈ ఐదేండ్లలో అతనికి ఇంతగా అలవాటు పడిపోయిందా?

రేపు అనురాగ్ వచ్చి నన్నెందుకు మోసం చేశావని అడిగితే తనేం చెప్పాలి.?

ఇంత మందిని మోసం చేసి, బాధ పెట్టి...సృజన లేని పెయింటింగ్‌లా జీవితాన్ని మార్చుకొని ఎలా బ్రతకాలి?

అంటే తనను తను చంపుకోవటమే దీనికి పరిష్కారమా? ఎన్ని ప్రశ్నలకి ఎన్ని సమాధానాలు వెతికినా చివరకు తనను తన చంపుకోవడమే సరైనా సమాదానంలా వుంది.

కానీ... తను చావకూడదు...

క్షణికావేశంలో నిర్ణయాలు, తీసుకునే వయసులో లేదు. మరి... ఇన్ని ప్రశ్నలకి సమాధానం చెప్పుకుని భరించే స్థాయికి తను ఎదిగి తనను తను కాపాడుకోవాలంటే ఇప్పుడు తనేం చేయాలి? అనుకొంది దీక్షిత.

* * * * *

ఉదయం పదిగంటలయింది.

హాస్పిటల్‌కి వెళ్లింది దీక్షిత.

"ఏంటి దీక్షితా! అలా వున్నావ్?" అంది మన్విత ఓ.పి. అయ్యాక...

"మనసు బాగలేదు మన్వితా!" అంది దీక్షిత. ఒక్క రోజుకే దీక్షిత చెక్కిళ్లు లోతుకిపోయి, కళ్ల కింద వలయాలు ఏర్పడి, ముఖం చిక్కిపోయి ఎన్నో రోజులుగా తిండి, నిద్ర, నీళ్లు లేని మనిషిలా అన్పిస్తోంది.

"ఏనీ ప్రాబ్లమ్! అనురాగ్ కాల్ చెయ్యట్లేదా?" అంది వెంటనే మన్విత.

"అదేం లేదు మన్వితా! మా అత్తయ్య నన్ను మా బావ విజయేంద్రకి చేసుకుంటాననంటోంది .అతను ఢిల్లీలో మిలటరీ ఆఫీసర్‌గా వున్నాడు... నేను 'ఎంసెట్ లాంగ్ టర్మ్' ఇప్పించమని మా పేరెంట్స్‌ని అడిగినప్పుడు అత్తయ్యతో వాళ్లేం మాట్లాడారో నాకు తెలియదు. అప్పటి నుండి నా చదువుకి ఎంత అవరసమైతే అంత డబ్బు అత్తయ్యవాళ్లే ఇచ్చారు. దానికి కారణం వాళ్ల అబ్బాయికి నన్ను ఇస్తామని మా పేరెంట్స్ మాట ఇవ్వడమేనని రాత్రి అమ్మ, అత్తయ్య మాట్లాడుకుంటుంటే విని తెలుసుకున్నాను. ఆ మాట ప్రకారం వాళ్లు కూడా నా చదువు అయ్యేంత వరకు ఆగి ఇప్పుడు అడుగుతున్నారు. ఇందులో వాళ్ల తప్పేం లేదు." అంటూ ఒక్కక్షణం ఆగింది దీక్షిత.



భూమి కంపించినట్లు ఫీలయింది మన్విత.

"మీ ఫ్యామిలీ ఎకనామికల్ పొజిషన్ తెలుసుకోకుండా అనురాగ్‌ని ఎందుకు ప్రేమించావని నేను అడగను. అది నీ ఇష్టం... కానీ అతను నిన్ను ప్రేమించేదాకా ఎందుకు తెచ్చుకున్నావ్? ప్రేమంటే మెకానికల్ మైండ్‌తో ఆడే ఆట కాదుగా... ఎంతయినా ఈ గేమ్ నాకు నచ్చటం లేదు దీక్షితా!" అంది మన్విత.

కాల్చిన చువ్వతో వాతపెట్టినట్లు విలవిల్లాడింది దీక్షిత మనసు...

"అనురాగ్‌తో నా ప్రేమను 'గేమ్' గా అనుకోవటం లేదు మన్వితా! కానీ... కన్న పిల్లల్ని సైతం పట్టించుకోకుండా వారి, వారి పనుల్లో బిజీగా వుండే కొందరు తల్లి దండ్రులున్న ఈ రోజుల్లో... మా అమ్మ, నాన్న నన్ను మా ఇంటి వెనకాల వుండే పెరట్లో కురిసే వెన్నెల్లో కూర్చో బెట్టుకొని నీతి కథలు, సూక్తుల్లాంటి మంచి మాటల్ని చెప్పి, నైతిక విలువల్ని నేర్పుకున్నారు. నేను నేర్చుకున్న ఆ నైతికత నా తల్లి, దండ్రుల్ని చంపుకోటానికి ఉపయోగ పడితే నన్ను నేను క్షమించుకోలేను... ఈ విషయంలో ఎన్నో ప్రశ్నలు, ఎన్నో సమాధానాలు నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి." అంది నిస్సహాయు రాలిలా తన చూపుల్ని ఎక్కడో నిలిపి దీక్షిత.

"ఏ ప్రశ్నకైనా సమాధానం వుంటుంది కానీ... సమాధానం లేని ప్రశ్నంటూ వుంటే ఒక్క ప్రేమనే... అది దొరకనప్పుడు బాహ్య ప్రపంచం వేరు ఆంతరంగిక ప్రపంచం వేరు అన్నట్లుగా వుంటుంది. అలా అని కన్న వాళ్ల ఆప్యాయతల బొడ్డుతాడును తెంచుకొని బోరున ఏడుస్తూ కృతిమ శ్వాసను పీల్చుకుని బ్రతకమని ఎవరూ చెప్పరు... కానీ అనురాగ్‌కి ఏం సమాధానం చెబుతావ్?" అంది మన్విత.

అర్థం కానట్లు పెదవిని ముడిచి ఆలోచిస్తోంది దీక్షిత.

"లేకుంటే ఒక పని చెయ్యి దీక్షితా! వాళ్లకి మీరు ఇవ్వవలసిన డబ్బు మొత్తం అనురాగ్‌తో చెప్పి ఇప్పించు... ఈ సమస్యకి ఇదే సరైన పరిష్కారం..." అంది మన్విత.

"వాళ్ళ డబ్బు గురించి మాట్లాడటం లేదు మన్వితా! 'దానం చేశామని అనుకుంటాం 'అంటున్నారు. కానీ... 'మాట' మాట ఇచ్చినందుకు కొశ్చన్ చేస్తున్నారు. అమ్మ మాట తప్పే మనిషి కాదు. 'నేను మాట తప్పాల్సి వచ్చినప్పుడు చావనైనా చస్తాను, కానీ... నా కూతురు ఈ పెళ్లికి ఇష్టంగా ఒప్పుకోవాలన్నదే నా కోరిక. అందుకే దాన్నే మాట అడగాలి" అని అమ్మ రాత్రి అత్తయ్యతో చెప్పింది. అమ్మంటే నాకు ప్రాణం మన్వితా! నన్ను ప్రాణంగా పెంచుకొంది. అమ్మను బ్రతికించుకోవాలి. అమ్మ కోసం ఏమైనా చెయ్యాలి..." అంది దీక్షిత.

మన్విత మాట్లాడలేదు.

కొన్ని ప్రేమలకి విలువలు పెరగాలన్నా, పడిపోవాలన్నా వాళ్ల అనుభవాల పునాదులే సాక్ష్యం... అనుబంధాలను కొలిచే యంత్రాలు వున్నాయో లేవో తెలియదు కాని దీక్షిత హృదయం ముందు ఏ యంత్రం పనికి రాదు.

మౌనంగా వున్న మన్విత వైపు చూస్తూ...

"మన్వితా! ఒక వేళ నేను అనురాగ్‌ని వదిలి బ్రతకలేక... ఎంగిలి పడిన మనసుతో మింగిలి కాలేక నేను చనిపోతే... ఎవరితో తిరిగి చనిపోయిందోనని లోకం కోడైకూసి నా తల్లి దండ్రుల్ని చంపేస్తుంది వాళ్లను బ్రతికించుకోవటం కోసమైనా నేను నా మనసును చంపుకొని అనురాగ్‌ని వదులుకోవాలి .. ఇలా ప్రేమించిన వాళ్లను వదులుకోవాలంటే బాధగా వుంది." అంది దీక్షిత బాధగా.

దీక్షిత ఇప్పుడు వడ్తున్న బాధంతా మన్విత ఒకప్పుడు అనుభవించిందే... ఈ బాధకి వాళ్లూ, వీళ్లూ అనే తారతమ్యం వుండదు. ఏ గుండెనైనా ఒకే దృష్టితో చూస్తుంది. ఒకే జ్వాలతో రగిలిస్తుంది.



దీక్షిత చేతిమీద చేయివేసి మెల్లగా తట్టింది మన్విత. ఆ స్పర్శలో... "నువ్వు డాక్టర్‌వి...ఏది ఎలా చెయ్యాలో నువ్వు తెలుసుకోగలవు. దేన్ని కోల్పోయినా ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకూడదు" అన్న అర్థం స్ఫురించింది దీక్షితకి.

అందుకే ఇంకేం మాట్లాడలేదు దీక్షిత.

"మరి అనురాగ్ కాల్ చేస్తే ఏంచెబుతావు దీక్షితా?" అంది మన్విత.

"అదే ఆలోచిస్తున్నా... ఇది చెబితే అతను తట్టుకోలేడు. అతను చేస్తున్న రీసెర్చి పట్ల కాన్‌సన్‌ట్రేషన్ దెబ్బతింటుంది. అతను ఏ ఎయిమ్‌తో అంత దూరం వెళ్లాడో నాకు తెలుసు. కనీసం అతని కల అయినా ఫలించాలి. రేపు నా మొబైల్‌కి వున్నా సిమ్ తీసేస్తాను." అంది దీక్షిత.

మౌనంగా వింటూ ఇంకా ఏం చెబుతుందా అని ఎదురు చూస్తోంది మన్విత.

"నా నుండి రెస్పాన్స్ లేకపోతే వెంటనే మీనెంబర్‌కి కాల్ చేస్తాడు. అప్పుడు మీరిక్కడ పని చెయ్యట్లేదని చెప్పండి! డా॥ ధీరజ్ రెడ్డి హెల్ప్‌కూడా తీసుకుందాం... అయన ఎలాగోల మేనేజ్ చేస్తారు. ఇలా కొద్ది రోజులు జరిగితే... అలాగే అలవాటై కాల్ చెయ్యటం మరిచిపోతాడు. ఇంతకన్నా దీనికింకో సొల్యూషన్ లేదు. ఏంచేద్దాం చెప్పు? ఒకటి కావాలనుకున్నప్పుడు ఇంకొకటి వదులుకోక తప్పదు కదా!" అంది దీక్షిత.

మన్విత ఆశ్చర్యపోలేదు. దిగ్భ్రాంతి చెందలేదు. జీవితాన్ని చూస్తోంది. ప్రపంచాన్నే ఓ కొలిక్కి తెస్తున్న లెవల్లో ప్రేమించుకున్న వాళ్లు కూడా చివరికిలా చల్లబడి ఎందుకు కాంప్రమైజ్ అవుతారో ఇప్పుడర్థమైంది మన్వితకి...వీళ్ల బాధ ముందు నా బాధ ఎంత అనుకొంది. కానీ అలా అనుకోటానికి లేదు. ఎందుకంటే ప్రేమ ప్రేమే! అది గుడిసెలో వుండే వాళ్ల గుండెలో ఎలా పుడ్తుందో అపార్ట్‌మెంట్స్‌లో వుండేవాళ్ల గుండెలో కూడా

అలాగే పుడ్తుంది పేదవాడికో బాధ, ఉన్నవాడికో బాధ అనేది లేదు. ఏ గుండె బాధ ఆ గుండెది. ఏ గుండె సంతోషం ఆ గుండెది... దీన్ని తేలిక చేసి మాట్లాడే అధికారం ఎవరికి లేదు. అదొక అగ్ని, అంటుకోమంటే అంటుకోదు. ఆరిపోమంటే ఆరిపోదు. అదెంత దూరంలో వున్నా వేడిగా, వాడిగా బాణాలను వేస్తూ గాయపరుస్తూనే వుంటుంది.

ఎప్పుడైనా దేవుని దగ్గర... "ఈ సంతోషాన్ని నా కింత వరకే ఇవ్వు... అలాగే ఈ బాధను కూడా ఇంత వరకే యివ్వు..." అని ఎవ్వరూకోరుకోరు. ఏది ఎంత వరకు ఇవ్వాలో ఆ దేవునికి తెలిసే జరుగుతుంది. అందుకే ఆ దేవుడు ఏగాయాన్నైనా ఎక్కువసేపు సలపనివ్వకుండా కాలం అనే డాక్టర్ చేత మరిచిపోవడం అనే వైద్యం చేయిస్తుంటాడు.

* * * * *

సూర్యోదయం అవుతుండగా...

మొబైల్‌కి మెసేజ్ వచ్చిన చప్పుడువిని కళ్లు విప్పింది దీక్షిత. ఎప్పటిలాగే తన అరచేతుల్ని కళ్లకి అద్దుకొని, మొబైల్ అందుకొని మెసేజ్ చూసింది. ఆ మెసేజ్ అనురాగ్‌ది.

"దీక్షితా! నీ ఆలోచనలతో నిద్రరాని నేను నా కళ్ల ఎర్రదనాన్ని సూర్యుని తొలికిరణాలకి ఇచ్చి... నీకు శుభోదయం చెప్పమన్నాను. అందిందా" అని పంపాడు.

మళ్లీ వెంటనే ఇంకో మెసేజ్ పంపాడు. అదెలావుందంటే?

"తొలకరి చినుకులను పుడమితల్లి ఎంత సంతోషంగా ఇముడ్చుకుంటుందో అలా నువ్వూ, నీ జ్ఞాపకాలు నాలో నిండిపోయాయి... నీ అనురాగ్." అని వుంది.

ఎప్పుడైనా అతని మెసేజ్‌లు చదువుతుంటే కనుపు, కనుపుకి చిప్పిల్లే మదురరసం తాగినట్లు, ఉరకలై గోదావరి పురికి, పురికి మది నిండినట్లు,



కొండ లోయల్లోకి దుమికే జలపాతం క్రింద స్నానం చేసినట్లు, ఆ తర్వాత అతని ప్రేమటవల్‌తో ఒళ్లంతా తుడుచుకున్నట్లు అనుభూతి చెందేది.

ఇప్పుడు అలాంటి భావాలేం కలగటంలేదు. మనసుని అలా ప్రిపేర్ చేసుకొంది అదెలా అంటే?

ఎప్పుడైనా మెసేజ్‌లనేవి ఫ్రెండ్స్ అని కొడ్తే అన్ని మొబైల్స్‌కి వెళ్లినట్లే ఇప్పుడీ మెసేజ్‌లను కూడా లవర్సెవరో పంపుకుంటుంటే ఆన్‌లైన్‌లో చూసి అనురాగ్ కూడా తన మొబైల్‌కి పంపివుంటాడు. అంతే! ఇందులో తన కంటూ ప్రత్యేకం ఏం లేదు. తన కోసమే పంపినట్లు ఫీలవనవసరం లేదు అని అనుకొని వెంటనే సిమ్ ఛేంజ్ చేసింది దీక్షిత.

కాలం ఎంత మారినా మానవునికి అంతు చిక్కని రహస్యాలు ఎన్నోవున్నట్లు... ఎందరో పరిశోధకులు విజృంబించి పరిశోదనలు జరుపుతున్నారు కానీ... మనసులోతుల్ని శోధించే పరిశోధకులు లేరు. ఒక వేళ వుంటే...?

ఎన్నో అద్భుతాలను సృష్టించి సమాజంలో గుర్తింపు తెచ్చుకుంటున్న కొంతమంది సైంటిస్టులు, రచయితలు, సైనికులు, డాక్టర్లు, ఇంజనీర్లు తమ మనసులో వుండే గదుల్లో ఓ గదిని రహస్యంగా వుంచుకొని, తలుపు తెరవకుండా లాక్ చేసిపెట్టుకొని వుంటారని ఆ గదిలో ప్రేమకి సంబందించిన అందమైన డైరి వుంటుందని... ఆ డైరీని బయటకి తీసి పరిశోధన జరపాలని చూసే వాళ్లేమో...

దీక్షిత స్నానం చేశాక - తల్లి దగ్గరకికి వెళ్లి... జడవెయ్యమన్నట్లు తల్లి చేతిలో దువ్వెన పెట్టి జుట్టు ముడి విప్పింది. ఒక్కసారిగా జుట్టంతా జారి దట్టమైనా చెట్టు పొదలా నడుం దాటింది.

ఆ జుట్టుని పాయలుగా విడిదీసి - నెమ్మదిగా దువ్వుతూ

"దీక్షితా!" అంటూ ప్రేమగా పిలిచింది రామలక్ష్మి.

'ఊ... ' అంటూ పలికింది దీక్షిత.

"కార్పొరేట్ కాలేజిలో కోచింగ్ ఇప్పించండి నాన్నా! అని నువ్వు అడిగినప్పుడు ఏం చేయాలో నాకూ - మీ నాన్నకి తోచలేదు. ఏదీ అడగని నువ్వు... డాక్టర్ని కావాలని ఎంత బలంగా వుంటే అడిగావోనని మేము అర్థం చేసుకున్నాం. నీ కోరిక తీర్చడం కోసం శారద వదినకి వాళ్లబ్బాయికి నిన్నిస్తామని మాటిచ్చాం. అలా అని విజయేంద్ర నీకు తగిన భర్త కాదని కాదు. కానీ... నీకు తెలియకుండా మాట ఇచ్చామని..." అంటున్న తల్లి వైపు తిరిగి, చప్పును ఆమె నోటిపై చేయిపెట్టింది దీక్షిత.

"ఇంకెప్పుడూ అలా అనొద్దమ్మా! మీరేది చేసినా నా మంచికే చేస్తారు. మీరప్పుడలా మాట ఇవ్వక పోయి వుంటే నా చదువు ఇంటర్‌లోనే ఆగిపోయివుండేది... ఇదే ఊరిలో పొలం పనులు చేసుకుంటుండే దాన్ని... డాక్టర్ని అయ్యేదాన్ని కాదు. మనం నడిచే దారిలో ఎన్నో ఎదురుపుతుంటాయి. దాటుకొని ఎలా వెళ్తుంటామో అలాంటిదే ఈ జీవన ప్రయాణం కూడా... మీరు మాట ఇచ్చి మంచి పనే చేశారు. తప్పు చెయ్య లేదు." అంది దీక్షిత.

ఆ మాటలకి తేలికైన మనసుతో - దీక్షిత బుగ్గమీద ముద్దు పెట్టుకొంది రామలక్ష్మి తల్లికి పిల్లలెప్పుడూ పసిపిల్లలే...

ఆడపిల్లలకి వుండే పరిదుల్ని దాటి తల్లి దండ్రుల్ని దూరం చేసుకోని వాళ్లలో దీక్షిత ఒకటి.

దీక్షిత చదువు ఇంటర్‌తో ఆగిపోయి వుంటే అనురాగ్ అనే వ్యక్తి వున్నాడని ఆమెకు తెలిసివుండేది కాదు. అందుకే తన తల్లి దండ్రుల మీద ఆమెకున్న ప్రేమను కాపాడుకోవాలని... పాకాల ప్రజలకి తన తల్లి దండ్రులపై గౌరవం తగ్గకుండా వుండాలని... అన్నయ్య తలెత్తుకొని తిరిగాలని... తను మెడిసిన్ చదవకుండా ఇంటర్ తోనే ఆగిపోయానని మనసును మభ్య పెట్టుకుంది దీక్షిత.



దీక్షితకి జడ అల్లడం పూర్తి చేసింది రామలక్ష్మి

వెంటనే అక్కడ నుండి కదిలి శారద దగ్గరకి వెళ్లింది దీక్షిత.

"నాకు విజయేంద్రబావను చేసుకోవడం ఇష్టమే అత్తయ్యా..." అంది దీక్షిత.

దీక్షిత నుదుటిపై ముద్దు పెట్టుకొంది శారద.

* * * * *

ఓ శుభ ముహూర్తాన...

విజయేంద్రతో దీక్షిత పెళ్లి జరిగింది.

సోమన్న, రామలక్ష్మి, మహధీర్‌ల ఆనందానికి ఆకాశమే హద్దు అయింది.

పాకాలలో పుట్టిన ఆడపిల్లల పెళ్లిళ్లు అయ్యాక... ఏ విధంగా అత్తవారింటికి వెళ్తారో... అదే విధంగా దీక్షిత కూడా చీరె, సారె, పసుపు, కుంకుమలతో, విజయేంద్ర చేయి అందుకొని... అత్తగారి ఊరైన ఢిల్లీ వెళ్లింది.

ఆమె వెళ్తున్నప్పుడు ఆమెతో వాళ్లబంధువులు అతి ఘనంగా, గౌరవంగా కదిలారు... బస్ వరకు.

* * * * *

కాలం నిరంతరం పనిచేస్తూ అరిగిపోని యంత్రంలా తిరుగుతోంది.

పెళ్లయ్యాక ఢిల్లీకి వెళ్లిన దీక్షితకి మంచం మీద బోర్లా పడుకొని, మోచేతి వంపులో ముఖం దాచుకొని పడుకునేంత తీరిక, గతంలోకి వెళ్లి జరిగింది గుర్తు చేసుకునేంత ఓపిక కూడా లేకుండా అయింది.

కారణం... ఢిల్లీలో ఒక పేరున్న డాక్టర్ దగ్గర జూనియర్ డాక్టర్‌గా వుండి తన జీవితాశయాన్ని నెరవేర్చుకుంటోంది.

ఆమె భర్త విజయేంద్ర బాధ్యత గల మిలటరీ ఆఫీసర్. ఇంటా, బయట ఆయనంటే గౌరవమూ, భయము, ఇంట్లో కూడా డిసిప్లిన్

వాతావరణంలో ఒక రకమైనా ప్రశాంతత అన్పిస్తుంది. అతను మిగతాటైంలో ఎంత గంభీరంగా వున్నా... భార్య దీక్షిత దగ్గర మాత్రం చిన్న పిల్లాడైపోతాడు. అనుక్షణం ఆమెకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తూ ఆమె సంతోషంలో తన సంతోషాన్ని వెతుక్కుంటూ చైతన్య స్రవంతిలా వుంటాడు.

ఇకపోతే అత్త, మామల అప్యాయత, ఆదరణ గొప్పగా వుంది.

తన జీవితం ఇంత గొప్పగా వుంటుందని ఊహించని దీక్షిత ప్రతి రోజు తల్లి దండ్రులకి కాల్ చేసి తనెలావుందో చెప్పి వాళ్ల ఆనందంలో తన జీవితాన్ని తడుపుకుంటోంది.

* * * * *

అర్ధరాత్రి హాస్పిటల్ ముందు గోల గోలగా విన్పిస్తున్న అరుపులకి, ఏడుపులకి - లోపల పడుకొని వున్న నర్స్‌కి నిద్రా భంగం కలిగింది. వెంటనే లేచి, నిద్రకళ్లతోనే ఏం జరిగిందన్నట్లుగా వెళ్లి గేటు తీసింది.

రోడ్డు మీద నిలబడి వున్న ట్రాక్టర్ లోంచి రక్తసిక్తమైవున్న ఆడవాళ్లను దింపుతుంటే నిద్ర మత్తు ఎగిరిపోయి కంగారుగా చూస్తూ ...

"ఏం జరిగింది?" అని అడిగింది నర్స్."

పెళ్లికి వెళ్తున్న జీపుకి నర్సంపేట దాటుతుండగా యాక్సిడెంట్ అయిందని చెప్పారు.

వాళ్లని లోపలకి తీసుకు రావటానికి వీలుగా గేటును పూర్తిగా తెరిచి, వెంటనే డా॥మన్విత కోసం పై కెళ్లి కాలింగ్ బెల్ నొక్కింది నర్స్.

గాఢ నిద్రలో వున్న వర్ధనమ్మ దిగ్గున లేచి తలుపు తీసింది. వర్ధనమ్మను చూడగానే...

"యాక్సిడెంట్ కేసమ్మా! పరిస్థితి చాలా ఘోరంగా వుంది." అంటూ నర్స్ చెప్పడంతో

"అయ్యో!" అనుకుంటూ వెళ్లి మన్వితను నిద్రలేపింది వర్ధనమ్మ.



విషయం వినగానే మన్విత లేచి కిందకి దిగింది. మన్విత వెనకాల వర్ధనమ్మ కూడా దిగింది.

అప్పటికే డ్రైవర్ సాయంతో ఐదుమంది ఆడవాళ్లను లోపలకి చేర వేసింది నర్స్.

ఒళ్లంతా గాయాల వల్ల రక్తంతో తడిసి ఎవరు, ఏంటో అర్థం కాకుండా వుంది.

గాయాల బాధను ఓర్చుకోలేక - మూలుగులు, అరుపులు హాస్పిటలంతా దద్దరిల్లుతోంది. ఒకరిద్దరు స్పృహకోల్పోయి వున్నారు.

డా॥ ధీరజ్ రెడ్డి ఇంటికి కాల్‌చేసి విషయం చెప్పి, ఆయన్ని వెంటనే రమ్మంది మన్విత.

నర్స్ సాయంతో ట్రీట్‌మెంట్ మొదలు పెట్టింది

వాళ్లలో కొంత మందికి దెబ్బలు బాగా తగిలాయి. కాళ్లూ, చేతులు, విరిగాయి. ఒంటి మీద వున్న బట్టలు మట్టితో, రక్తంతో ఏకమై చూడటానికి భయంకరంగా కన్పిస్తున్నారు.

పెళ్లి కెళ్తూ పట్టు చీరల్లో వున్న వాళ్లు అంతలోపలే ఇలా మారటం విధి వైపరీత్యం కాకపోతే ఇంకేమిటి అన్నట్లు చూస్తోంది వర్ధనమ్మ.

దారిన పోయే వాళ్లకి దాహార్తిని తీర్చే సలివేంద్రంలా ఎందరో రోగులకి ప్రాణదాత అయిన ఆ హాస్పిటల్ ఏడ్చే పిల్లల్ని ఓదార్చే తల్లిలా వాళ్లని తన ఒడిలోకి చేర్చుకొంది.

అప్పటి వరకు ఆ క్షతగాత్రులకి వైద్యం చేస్తున్న మన్విత

"నానమ్మా!" అంటూ గట్టిగా పిలిచింది.

అది పిలుపుకాదు అరుపు.

ఆ అరుపు విని కంగారు పడ్తూ మనవరాలి వైపు వెళ్లింది.

"ఏంటి మన్వితా?" అంది మనవరాలినే చూస్తూ...

"ఈ ముఖం ఎవరిదో చూడు. మమ్మీ లాగుంది కదూ!" అంది.

కృష్ణవేణమ్మ స్పృహలో లేదు. కాటన్‌తో తల్లి ముఖాన్ని తుడుస్తుంటే మన్విత చేయివణికింది. వెంటనే మనవరాలి చేయిపట్టుకుంటూ...

"ఏదీ చూడనీ..." అంటూ కోడల్ని చూసి ఆశ్చర్యపోతూ అవేదన ఆపుకోలేక...

"ఆ... ఎంతపని జరిగింది? నా కోడలికి ఇన్ని దెబ్బలా? స్పృహకూడా లేనట్లుందే , ఇప్పుడెలా?" అంటూ ఉద్వేగంతో ఒళ్లంతా తడిమి కళ్ల నీళ్లు పెట్టుకొంది వర్ధనమ్మ.

నానమ్మ ముఖంలో భయాందోళన చూసి ధైర్యం చెబుతున్నట్లు వీపు మీద చేయి వేసి నిమిరింది.

డా॥ ధీరజ్ రెడ్డి వచ్చాడు.

ఆయన రాగానే సీరియస్‌గా వున్న ఒకర్ని ఎం.జి.ఎమ్ హాస్పటల్‌కి పంపాడు.

నలుగురికి ట్రీట్‌మెంట్ జరుగుతోంది.

వాళ్లలో - కృష్ణవేణమ్మ తలకి పెద్ద గాయమై రక్తం పోవటంతో రక్తం ఎక్కించాల్సి వచ్చింది.

ఆమె గ్రూప్ రక్తం స్టోర్‌లో లేకపోవడంతో కంగారు పడ్డారు.

ఆమె తన తల్లి అని డా॥ ధీరజ్ రెడ్డితో చెప్పింది మన్విత.

"మరి నీ బ్లెడ్ సరిపోతుందేమో చూద్దాం..." అన్నాడు ధీరజ్ వెంటనే మన్విత బ్లెడ్ టెస్ట్ చేసి, ఇద్దరి బ్లెడ్ గ్రూప్ ఒకటే కావడంతో వెంటనే మన్విత బ్లెడ్‌ని కృష్ణవేణమ్మకి ఎక్కించారు.

సమయానికి రక్తం ఎక్కించకపోయివుంటే కృష్ణవేణి బ్రతికి వుండేది కాదు.

తండ్రికి ఫోన్ చెయ్యడంతో రాత్రికి రాత్రే వచ్చాడు.



తమ్ముడికి ఫోన్ చేద్దామని... చేస్తే కంగారు పడ్తాడని ఆగింది. హైదరాబాదులో నారాయణ కాలేజిలో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. వరంగల్‌లో ఆ చదువు లేదా అని అందరు అంటే వినకుండా తన కొడుకు ఐ.ఐ.టి కొట్టాలి అని భర్తతో పోరు పెట్టుకొని అక్కడ చేర్చుకొంది. డబ్బులు సరిపోవని భర్త అంటే రక్తం ధారపోసైనా చదివిస్తానంది. ఏదో ఆవేశంలో అలా అన్నదే కాని, ఇప్పటి చదువులు రక్తం ధారపోసి కొనగలిగే చదువులా?

తల్లికి రక్తం ఇస్తున్న కూతుర్ని చూసి విశ్వనాథ్ మనసు సిగ్గుతో చితికి పోయింది.

ఎప్పుడైనా కొడుకును బాగా చూసుకోవాలి కాని కూతుర్ని ఎంత చూసినా, ఎంత చదివించినా... బురదలో పోసిన పన్నీరులా ఏమిటి ప్రయోజనం? అత్తగారింటికి పోయి అణకువగా గిన్నెలు తోముతుంటే వచ్చే గౌరవం ఇలాంటి చదువులు ఎన్ని చదివితే వస్తుంది అని పెదవి విరిచి వ్యాఖ్యానించబడిన ఆ కూతురే డాక్టర్ రూపంలో వుండి కూడా రక్త దానం చేస్తుంటే చాటుకెళ్లి మౌనంగా రోదిస్తూ తలబాదుకున్నాడు విశ్వనాద్.

కృష్ణవేణమ్మకి బాధతెలియకుండా మందులు వాడుతున్నారు. ఆమె ఇంకా స్పృహలోకి రాలేదు.

కాలు విరిగి నడవ లేని స్థితిలో వున్న కోడలి అవసరాలను దగ్గరుండి చూసుకుంటోంది వర్ధనమ్మ.

పక్కవున్న రోగులకి వాళ్ల బంధువులొచ్చి చూసుకుంటున్నారు.

అక్కడ రోగులకి ఒకరు మంచి నీళ్లు యిస్తే, ఒకరు టాబ్లెట్ ఇవ్వటం... 'ఇప్పుడెలావుంది?' అంటూ ఐదునిముషాలకోసారి పరామర్శించుకోవటం చూస్తుంటే అది హాస్పిటల్లా కాకుండా అందమైనా ఇల్లులా అన్పిస్తుంది. రోగుల మధ్య అనుబంధాలు, రోగులకి - రోగులకి మధ్య ఆత్మీయతలు అక్కడ చూడాలేకాని వర్ణించలేం...

గండం గడిచి పిండం బయటపడ్డట్లు వైద్యం చెయ్యగా, చెయ్యగా ప్రాణాపాయ స్థితి నుండి బయటపడింది కృష్ణవేణి.

కృష్ణవేణి స్పృహలోకి రాగానే అత్తగారిని, మన్వితని చూసి షాకై శతృరాజ్యంలోకి వచ్చినట్లు విలవిల్లాడింది.

యాక్సిడెంట్‌లో తనతో పాటే గాయాల పాలైనా తన వీధిలోని ఆడవాళ్లు విషయం మొత్తం ఏడుస్తూ చెప్పారు.

అత్యవసర పరిస్థితిలో మన్విత బ్లెడ్ ఇచ్చిందని కూడా చెప్పారు. నోట మాట రాని దానిలా అయింది కృష్ణవేణి.

మానవత్వంతో కూడిన ఆ సహాయాన్ని చూస్తుంటే ఇన్నాళ్లు కూతురిపట్ల తను చూపిన నిరాదరణ గుర్తొచ్చి కుంచించుకు పోయింది.

వర్థనమ్మ వంట చెయ్యడం పూర్తవగానే... ముందుగా రోగులుండే రూముల్లో వున్న కోడలికి పెట్టి, ఆమె తినడం అయ్యాక అక్కడే కూర్చుని వున్న విశ్వనాద్‌ని పైకి తీసికెళ్లి ఆయనకి కూడా అన్నం పెట్టింది వర్థనమ్మ.

అన్నం ముందు కూర్చున్న విశ్వనాథ్‌కి అది మింగుడు పడక చాలా సేపు కష్టపడ్డాడు. కారణం మన్విత ఒకప్పుడు తనకి కాల్‌చేసి మాట్లాడిన మాటలు గుర్తుకొచ్చాయి.

"నాన్నా! ఇక్కడ మా హౌస్ సర్జన్ల హాస్టల్లో నానమ్మని ఎక్కువ రోజులు వుంచుకోవటానికి లేదు... నువ్వు తప్ప నానమ్మకి ఎవరున్నారు చెప్పు! మమ్మీని ఆ మాత్రం కన్విన్స్ చెయ్యలేవా? నానమ్మేమైనా టెర్రరిస్టా మీకు హాని చేస్తుందని భయపడటానికి? చిన్న, చిన్న సమస్యల్ని పెద్దవిగా భావించి వున్న నలుగురం ఇలా శత్రువుల్లా భేధాలు పెంచుకోవడం దేనికి? మానవ సంబంధాలను ఇంత తేలిగ్గా వదిలించుకొంటే మనశ్శాంతిగా ఎలా వుండగలగుతాం? ప్లీజ్! నాన్నా! నువ్వొచ్చి నానమ్మను తీసుకెళ్లు... లేకుంటే చచ్చిపోతుంది." అన్న కూతురు మాటలు సూదులై పొడుస్తున్నాయి.



కన్న తల్లి చచ్చిపోతుందని తెలిసినా బాధ్యత వదులుతుందని రాయిలా వున్నాడే కాని మమకారంతో ఆలోచించి తల్లిని ఇంటికి తీసికెళ్లలేదు.

అలాంటి తనకి 'అమ్మా' అని పిలిచే అర్హత కాని, అమ్మ చేతి తిండి తినే యోగ్యత కాని వున్నాయా? కన్నీళ్లు కన్పించకుండా చేయి అడ్డుపెట్టుకున్నాడు.

"కంట్లో నలక పడితే తీసుకోవాలి కాని నలపకూడదు. కన్ను పోతుంది విశ్వనాథం. ఏదీ చూడనీ..." అంటూ కంటి వైపు చూడబోయింది వర్థనమ్మ

"అమ్మా!" అంటూ ఏడ్చాడు విశ్వనాథం.

* * * * *

హాస్పిటల్‌ని డా ॥ మన్వితకి వదిలి హైదారాబాద్ వెళ్లాడు డా॥ ధీరజ్ రెడ్డి ఆయన ఎక్కువగా ఈ మధ్యన హైదరాబాదులోనే గడుపుతున్నాడు. అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు వచ్చి వెళ్తున్నాడు.

అతనికి మన్విత సిన్సియారిటి, డెడికేషన్ మీద నమ్మకం ఎక్కువ.

మన్విత ఇచ్చే ట్రీట్‌మెంట్‌తో, అత్తగారు చూపే ఆదరణతో కృష్ణవేణి కొద్దికొద్దిగా కోలుకుంటోంది.

వాళ్ల వీధిలోని ఆడవాళ్లు కూడా కోలుకుంటున్నారు.

డా॥ మన్విత కన్పించినప్పుడల్లా రెండు చేతులెత్తి దండం పెట్టి,కళ్లనీళ్లు తుడుచుకుంటున్నారు. కృతజ్ఞతగా చూస్తున్నారు. "ఈ దేవతనా తాము అన్ని మాటలు అని బాధపెట్టింది" అని బాధపడ్తున్నారు.

వాళ్ల చూపుల్ని, వాళ్లు పడే బాధని గమనించే స్థితిలో లేదు మన్విత. ఆమె పేషంట్ల బిజీలో ఆమె వుంది.

గదులన్నీ పేషంట్లతో నిండి వున్నాయి.

ఎవరి బంధువులు వాళ్లని కనిపెట్టుకొని వున్నారు.

ఏ అవసరం వచ్చినా క్యాబిన్ దగ్గరికి వెళ్లి నర్స్‌తో చెబుతున్నారు

అక్కడ ఇద్దరు నర్స్‌లు వుంటారు.

ఒకరికి నైట్ డ్యూటీ వుంటే - ఒకరికి డే డ్యూటీ వుంటుంది.

పేషంట్లకి పెట్టిన సెలైన్ బాటిల్స్‌ని, చూసుకోవడం, అవసరమైన ఇంజక్షన్స్‌ని వెయ్యటం ఓ.పి.లో వున్న పేషంట్లని డాక్టర్ దగ్గరికి పంపటం చేస్తుంటారు. ఎప్పుడు చూసినా హడావుడిగా తిరుగుతూనే వుంటారు.

కృష్ణవేణి బాత్‌రూంకి వెళ్లాలని ప్రయత్నం చేస్తూ-మంచం దిగి నడవలేక చాలా సేపటి నుండి ఇబ్బంది పడ్తోంది.

నర్స్‌ని పిలుద్దామంటే అక్కడెవరూలేరు. ఏంచేయాలో తోచక పక్కబట్టల్ని పాడు చేసుకోలేక అటు వైపే వస్తున్న వర్ధనమ్మని చూసి ప్రాణం లేచివచ్చినట్లై...

"అత్తయ్యా!" అంటూ పిలిచింది కృష్ణవేణి.

"ఏమిటి కృష్ణవేణి!" అంటూ వచ్చింది వర్ధనమ్మ

"ఒకసారి నర్స్‌ని పిలుస్తారా? అర్జంట్!" అంది

అర్థం చేసుకొంది వర్ధనమ్మ.

ఆ చుట్టు పక్కలెక్కడ నర్స్ లేదు.

కోడలి వాలకం చూస్తుంటే ఎమర్జంట్‌లా వుంది.

ఇప్పుడెలా అనుకుంటూ...

పక్కన వున్న 'పాన్' ని చేతిలోకి తీసుకొని కృష్ణవేణమ్మ అవసరం తీర్చి... దాన్ని తీసికెళ్లి టాయిలెట్‌లో పోసి, దాన్ని మళ్లీ కడిగి తీసుకొచ్చి కృష్ణవేణమ్మ బెడ్ పక్కన పెట్టింది వర్ధనమ్మ.

ఇంకేమైనా అవసరం వుంటే చెప్పు అన్నట్లుగా కోడలి వైపు చూసింది.

అత్తగారి ముఖంలోకి చూసి...ఆమె కాళ్లను తన చేతులతో తాకాలని కిందకి వంగే ప్రయత్నంలో బ్యాలెన్స్ తప్పి చూస్తుండగానే కిందకి జారి దబ్బున పడింది కృష్ణవేణి.



తృటిలో జరిగిన ఆ చర్యకి వర్ధనమ్మ గుండె జల్లు మంది. వెంటనే క్రిందకి వంగి కోడల్ని బెడ్ పై పడుకో బెట్టే ప్రయత్నం చేసింది. ఆమె ప్రయత్నం ఫలించక నిస్సహాయంగా అటు, ఇటూ చూసింది. అక్కడెవరూ కన్పించలేదు. నర్స్ కూడా కన్పించలేదు.

వెంటనే మన్వితను పిలిచింది వర్ధనమ్మ.

నానమ్మ పిలుపు వినగానే మన్విత కృష్ణవేణమ్మ దగ్గరికి వస్తుంటే అది గమనించిన నర్స్ డాక్టర్ కన్నా ముందు వెళ్లి కృష్ణవేణమ్మను లేపి బెడ్ పై పడుకో బెట్టింది.

తల్లిలో కాల్షియం లోపం ఎక్కువగా వున్నందు వల్ల జాగ్రత్తగా వుండటం మంచిదని ఒక డాక్టర్‌గా మన్విత గమనించింది.

అదే విషయం తల్లితో చెప్పింది.

కూతురు మాట్లాడుతుంటే మాటలు కరువైన దానిలా తడినిండిన కళ్లతో చూడటం తప్ప ఇంకేం చెయ్యలేక పోతోంది కృష్ణవేణి

మన్విత వెళ్లిపోతుంటే-తన బిడ్డ ఇంకా కొద్ది సేపు తనతో మాట్లాడితే బావుండని ఆశించింది. కానీ... ఆమె ఇప్పుడు తన ఒక్కదానికే బిడ్డకాదు. ఎందరో తల్లులకి సేద దీర్చే బిడ్డ... ఎందరో బిడ్డల్ని అక్కున చేర్చుకునే తల్లి...

ఇప్పుడు అర్థమైంది మన్విత అంటే ఏమిటో కృష్ణవేణికి.

కూతురి ఔనత్యానికి గర్వంగా ఫీలయింది.

* * * * *

పాకాలకి వెళ్లగానే కారుని నేరుగా హాస్పిటల్ వైపు పోనిచ్చాడు అనురాగ్.

కారుని ఓ పక్కకి పార్క్ చేసి, దిగి హాస్పిటల్లోకి ప్రవేశించాడు.

నేరుగా ఓ.పి. రూంలోకి వెళ్లాడు.

అక్కడో క్షణం నిలబడి చుట్టూ చూశాడు.

అక్కడున్న కుర్చీల నిండా పేషంట్లు కూర్చుని వున్నారు.

చిన్నా, పెద్దా, ముసలీ, ముతక అనే తేడా లేకుండా, పేద, ధనిక అన్న వ్యత్యాసం లేకుండా అందరు అక్కడ కుర్చీలలో కూర్చుని తమ నెంబరు ఎప్పుడు పిలిస్తే అప్పుడు లోపలకి వెళ్లటానికి సిద్ధంగా వున్నారు. వాళ్లలో ఎక్కువగా గర్భవతులు వున్నారు.

డా॥ మన్విత అన్న నేమ్ బోర్డుకి కాస్త ఎడంగా ఒక పక్షి తన నోటితో మేతను తెచ్చి పిల్ల పక్షుల నోట్లో పెడ్తున్న సీనరీ వుంది. ఆ సీనరీ అద్భుతంగా అన్పించింది అనురాగ్‌కి.

దాని పక్కన ఓ ఫొటో ఫ్రేమ్‌లో 'ప్రార్థన' అని వుంది ఆ ఫొటో ఫ్రేమ్‌లో వున్న ప్రార్థన పై నిలిచాయి.

"ఓ భగవంతుడా!"

ఇతరుల అనారోగ్య పరిస్థితుల పై నా వృత్తి, అభివృద్ధి ఆధారపడి వుండడం నాకు చాలా విచారకరం... అయితే వారిని ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దే బృహత్కరమైన అవకాశాన్ని నాకు ప్రసాదించావు. ఇది నీవు నా పై వుంచిన బాధ్యతగా స్వీకరించాను.

ఈ బాధ్యతను పరిపూర్ణంగా నిర్వహించగల శక్తిని నాకు ప్రసాదించు.

మధ్యవర్తిగా నాకు నీవు ఈ బాధ్యతను అప్పగించినా అన్ని పరిస్థితులను చక్కదిద్దే ఆది దేవుడవు నీవే... నీ పై నా విశ్వాసము ఇలాగే వుండునట్లు ఆశీర్వదించు.

నా దగ్గరకు వచ్చే రోగులకు ఆయురారోగ్యాలు ప్రసాదించు." అని వున్న ఆ ఫోటో ఫ్రేమ్ వైపు చూస్తూ అలాగే నిలబడ్డాడు.

అక్కడా గదిలో రాజు, బంటు తేడా లేదు. ఒకరిని చూడగానే లేచి తన సీటు ఇచ్చి నిలబడే మర్యాదలు వుండవు. ఎవరి బాధలు వాళ్లవి. ఎవరి ఆత్రుత వాళ్లది.



కొన్ని హాస్పిటల్స్‌లో రిప్రజంటేటివ్‌లు, నర్సుల దయాదాక్షిణ్యాల మీద డాక్టర్ దగ్గరికి వెళ్లినట్లు అక్కడ కూడా కొద్ది సేపు వెయిట్ చేసి లోపలకి వెళ్తున్నారు.

రిప్రజంటేటివ్‌ను లోపలకి పంపిన నర్స్ తలతిప్పి అక్కడ నిలబడి వున్న అనురాగ్ వైపు చూసింది.

వెంటనే అనురాగ్...

"డా॥ ధీరజ్ రెడ్డిని కలవాలి... ఇదిగోండి నా విజిటింగ్ కార్డు..." అంటూ చేయి చాపి విజిటింగ్ కార్డు ఇవ్వబోయాడు.

ఆ మాత్రం రెస్పెక్ట్ ఇచ్చి మాట్లాడకపోతే నర్సుల రెస్పాన్స్ ఏ విధంగా వుంటుందో హౌస్‌సర్జన్ పీరియడ్‌లో దగ్గరుండి చూశాడు.

"ఆ డాక్టరు గారు లేరు సర్! హైదరాబాదు వెళ్లారు. డా॥ మన్వితా మేడమ్ గారున్నారు." అంది వినయంగా

"డా॥ దీక్షిత లేరా?" అన్నాడు వెంటనే...

"లేరు..." అంది.

దీక్షితను చూడాలని వుంది.

"మరి మన్విత ఒక్కతే ఇంత ఓ.పి.ని మెయిన్‌టెయిన్ చేస్తుందా? ఇంత డెడికేషన్ మన్వితలో ఎలా వచ్చింది?" అని మనసులో అనుకుంటూ... దీక్షిత ఎందుకు రాలేదో అడుగుదామనుకునే లోపలే...

"డా॥ మన్వితా మేడమ్ గారిని కలవాలంటే ఇంకా కాస్త టైం పడ్తుంది. లోపలున్న పేషంటు బయటకి రాగానే రెండు అర్జంట్ కేసులు వెయిట్ చేస్తున్నాయి." అని ఆ నర్స్ అంటుంటే...

కోడలున్న గదిలోంచి బయట కొచ్చిన వర్ధనమ్మ ఓ.పి. రూమ్‌లో వున్న అనురాగ్‌ని చూసింది.

"ఎప్పుడొచ్చావు అనురాగ్! బాగున్నావా?" అంటూ ఆప్యాయంగా అనురాగ్ దగ్గరికి వచ్చి పలకరించింది.

వర్ధనమ్మను చూడగానే సొంత ఇంట్లో వున్న ఫీలింగ్ కలిగినట్లు ఆమె ప్రశ్నలకి చిరునవ్వుతో సమాధానం చెప్పాడు.

"రా! అనురాగ్! ఇక్కడే నా కోడలు కూడా వుంది. చూద్దువు గాని..." అంటూ పక్కగదిలోకి తీసికెళ్లింది.

ఆ గదిలోకి వెళ్లగానే కృష్ణవేణమ్మను చూసి షాక్ తిన్నాడు.

"కూర్చో అనురాగ్!" అంటూ అక్కడున్న కుర్చీ పై చేతులు వేసి అతనికి దగ్గరగా జరిపింది వర్ధనమ్మ.

"ఆంటికి ఏమైంది మామ్మా?" అంటూ కృష్ణవేణమ్మనే చూస్తూ కుర్చీలో కూర్చున్నాడు.

పాకాల వచ్చాక మన్విత అభ్యున్నతి చూసి ఒకరకంగా షాకయితే ఇప్పుడు కృష్ణవేణిని చూసి ఇంకోరకంగా షాకయ్యాడు అనురాగ్.

"పెళ్లికి వెళ్తుంటే యాక్సిడెంట్ అయింది అనురాగ్! అంతా మా వీధిలో వాళ్లే... అందరి పరిస్థితి ఇంచుమించు ఇలాగే వుంది. ఒకరు చనిపోయారు. ఆ డ్రైవర్‌దే తప్పుఅట సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తూ ఇంతమందిని వికలాంగుల్ని చేశాడు. వాడు చావలేదు కాబట్టి అలాంటి వాళ్లను ఏ కోర్టులు, ఏ పోలీస్ స్టేషన్లు శిక్షిస్తాయో తెలియదుకాని... నా కోడలికైతే ఒక కాలు తీసి వేసి రాడ్ వేస్తారట..." అంది బాధగా వర్ధనమ్మ.

కృష్ణవేణమ్మ కాలు వైపు చూశాడు

అప్పట్లో ఎప్పుడు చూసినా మన్విత మీద కేకలేస్తూ... మన్విత కోసం వెళ్లే పిల్లల్ని సైతం భయపెడ్తూ 'మా పిల్ల వెంట తిరుగుతూ, మా పిల్లను కూడా తిప్పుతారు. మీకు ఇల్లూ -వాకిలీ లేదా? వెళ్లండి! వెళ్లండి ' అంటూ అరిచేది 'అమ్మో! మన్విత వాళ్ల మమ్మీ అంటే మాకు భయం. ఇంట్లో ఆడనివ్వదు, ఎండలో ఆడనివ్వదు, వెన్నెల్లో ఆడనివ్వదు. కాళ్లకి, చేతులకి తాళ్లు కట్టుకొని కూర్చోవాలట... ఏం తోచక ఒక రోజు వీడియో గేమ్స్ ఆడుతుంటే దాన్ని విరగ్గొట్టేసింది. పైగా మన్వితను ఎప్పుడు చూసినా కొడుతుంది - తిడుతుంది. వాళ్ల మమ్మీ అంటే దానికి చచ్చేంత భయం... సరదాగా తిరగాలన్న భయమే. ఆడుకోవాలన్నా భయం..." అని అనేవాళ్ల.



ఆ కృష్ణవేణమ్మ ఈ రోజు తను ఏనాడు ప్రేమగా చూసుకోని కూతురున్న హాస్పిటల్లో వుండి, ఆ కూతురందిస్తున్న వైద్య సేవలో కోలుకుంటుంటే జీవితం ఇంత చిన్నదా అన్పిస్తోంది అనురాగ్‌కి.

అంతే కాక... ఒకసారి మన్విత

"కడుపులో బిడ్డ పెరగాల్సినతంత పెరిగాక పుట్టక తప్పదు కాబట్టి పుట్టాను కాని... పుట్టాక ఇంత ప్రేమ రాహిత్యంతో పెరుగుతానని ముందు తెలిసుంటే నేను మా అమ్మకడుపులో వున్నప్పుడే నన్ను నేను ఆత్మహత్య చేసుకొని వుండే దాన్నేమో అనురాగ్..." అన్న మాటలు గుర్తొచ్చాయి.

గుర్తు రావటమే కాదు... అలాంటి మన్వితకు ఈ ఎదుగుదల, ఈ మనుగడ ఒక్క రోజులో వచ్చింది కాదు. దాని వెనుక ఎంతో మానసిక సంఘర్షణ, గందరగోళం, ఆత్మ విశ్వాసం వున్నాయి... నిన్నటి గురించి ఆలోచించకుండా రేపటి గురించి మదన పడకుండా, ఏ యంత్రమూ పనిచేయనంత గొప్పగా పనిచేస్తున్నా అ సాధారణ వ్యక్తామె. దీన్ని బట్టి చూస్తుంటే ప్రేమతో తను అనుకున్న లక్ష్యాన్ని సాధించి, జీవితాన్ని ప్రేమించటం ఎలాగో మన్వితకి చేతనైనంతగా ఎవరికి చేతకాదేమో అనిపిస్తోంది అనురాగ్‌కి.

కృష్ణవేణమ్మ ఎప్పుడు కళ్లు విప్పిందో తెలియదు. అనురాగ్‌ని చూడగానే బోరున ఏడ్చింది.

"చూశావా అనురాగ్! నా పరిస్థితి ఎలా మారిపోయిందో! నా అత్తగారి మీద, ఆడపడుచుల మీద, నా భర్త మీద నా కున్న కోపాన్ని నా కడుపున పుట్టిన మన్విత మీద తీర్చుకుంటూ, కొడుకు తప్ప కూతురు పనికిరాదని మన్వితను చిన్న చూపు చూసిన 'పాపమే' నన్నిలా కష్టపెడ్తుందేమో

ననిపిస్తోంది." అంటూ ఏడుపు గొంతుతో చెబుతున్న కృష్ణవేణి వైపు జాలిగా చూశాడు అనురాగ్.

"ఏడవకండి ఆంటీ! మీకేం కాదు. యాక్సిడెంటల్‌గా జరిగేవన్నీ 'మన పాపాలే' అనుకొని బాధపడ్తే ఎలా? ఎన్నో జరుగుతుంటాయి. అవన్నీ దేవునికి తెలియకుండా జరిగేవికావు. అన్నీ ఆయనే చూసుకుంటాడు. బాధపడకండి!"అంటూ ఓదార్చాడు.

"ప్రశ్చాత్తాపమనే ముళ్ళు పొడుస్తోంది అనురాగ్! అంతే! ఇంక వేరే రకమైన బాధలేం లేవు. ఎందుకంటే ఇప్పుడు నాకు నా కూతురు వుంది. ఖరీదైన మందులు వాడి నన్ను బ్రతికించింది. నా అత్తగారేమో నేను ఊహించని దయతో నాకు సేవలు చేస్తోంది. వీళ్ల అభిమానాన్ని, మానవత్వాన్ని తట్టుకోలేక పోతున్నాను... వీళ్లను చూస్తుంటే కొత్త ప్రపంచాన్ని చూస్తున్నట్లనిపిస్తోంది..." అంటూ ఆగింది కృష్ణవేణి.

ఇంకా ఏం చెబుతుందోనని శ్రద్ధగా చూస్తున్నాడు అనురాగ్.

"ప్రేమలు ఆవిరైపోతున్నాయని, అనుబంధాలు అంతరించి పోతున్నాయని ఇప్పుడు ఎవరన్నా నేను ఒప్పుకోను...నాకు ఇప్పుడు అన్ని విలువలు తెలుస్తున్నాయి. ఏది ప్రేమో, ఏది కాదో అర్థమవుతోంది. మానవ సంస్కారం మృగ్యమైపోతున్న ఈ రోజుల్లో నా కూతురు, నా అత్తలాంటివాళ్ల చాలా అవసరం... నా కూతురు మూర్తీభవించిన సంస్కారంలా, కదులుతున్న మణిలా తిరుగుతుంటే నా దిష్టే తగిలేలా వుంది. ఇంతకన్నా తృప్తి, గౌరవం ఏ తల్లికైనా వుంటుందా?" అంది కృష్ణవేణి

ఆమెతో మాట్లాడుతూ అక్కడే కూర్చున్న అనురాగ్‌కి దీక్షితను త్వరగా చూడాలని వుంది. తను వచ్చినట్లు కాల్ చెయ్యకుండా దీక్షితను సర్‌ప్రయిజ్ చెయ్యాలని కూడా వుంది.

"నా దొక్కటే కోరిక అనురాగ్!" అంది ఏడ్వటం ఆగిపోయి, ముక్కుతుడుచుకుంటూ.



"ఏమిటో చెప్పండి ఆంటీ!" అన్నాడు వినయంగా, మృదువుగా...

"ఇక్కడుండే పెద్ద డాక్టరు తెలుసుగా నీకు?" అంది.

"తెలుసు. డా॥ ధీరజ్ రెడ్డి..." అన్నాడు.

"ఆ డాక్టరు వల్లనే నా కూతురు ఇన్ని మెట్లు ఎక్కగలిగింది. ఇంకా సంతోషించతగ్గ విషయం ఏమిటంటే వాళ్లిద్దరు ప్రేమించుకున్నారు. వాళ్ల ప్రేమగురించి నాకు చాలా కాలంగా తెలుసు. ఇంకా ఆలస్యం చెయ్యకుండా వాళ్లు పెళ్లి చేసుకోవాలన్నదేనా కోరిక... కానీ ఎందుకో మౌనంగా వున్నారు. ఆ డాక్టరేమో హైదరాబాద్‌లో ఓ హాస్పిటల్ పెట్టి ఎక్కువగా అటే వుంటున్నారు..." అంది కృష్ణవేణి.

కొత్త విషయాన్ని వింటున్నట్లు అన్పించినా... విన్న విషయం మాత్రం అనురాగ్‌కి సంతోషం కల్గించినట్లు అతని ముఖం వెలిగింది.

"తప్పకుండా... మీ కోరిక నేరవేరుతుంది ఆంటీ! మీరేం వర్రీ కాకండి!" అన్నాడు అనురాగ్.

హాయిగా ఫీలయింది కృష్ణవేణి. ఆమెకిప్పుడు ఓదార్పేకాదు, ఆనందం కూడా కావాలి... తాను అనుకున్నది జరిగితే ఎవరికైనా ఆనందంగా వుంటుంది. అలా జరిగితే బాగుండని చూసే చూపే-ఎదురు చూపు...

ఓ.పి. అయిపోవడంతో నేరుగా పై కెళ్లింది డా॥ మన్విత. ఈవినింగ్ రౌండ్సప్పుడు తప్ప మిగతా టైంలో ఆమె పేషంట్ల గదుల్లోకి వెళ్లదు. ఏదైనా అర్జంట్ అయితే మాత్రం ఓ.పి లో వున్నా కూడా వెళ్లి చూస్తుంది.

ఆ విషయం వర్ధనమ్మకు తెలుసు. అందుకే కోడలు దగ్గర కూర్చుని వున్న అనురాగ్ దగ్గరికి వెళ్లి మన్విత పైకి వెళ్లినట్లు చెప్పింది.

వెంటనే దీక్షిత గుర్తొచ్చింది అనురాగ్‌కి. ఇక ఎక్కువ సేపు ఆగలేక... తను మన్విత దగ్గర వున్నానని వెంటనే వచ్చి కలవమని చెబుదామని దీక్షితకి కాల్ చేశాడు. దీక్షిత సెల్‌కి కాల్ వెళ్లలేదు. ఎప్పటిలాగే 'కూ' అంటూ కట్ అయింది.

ఇంకోసారి చేశాడు. అలాగే అయింది.

వర్ధనమ్మతో కలిసి పైకెళ్లటానికి మెట్లెక్కుతూ మొబైల్‌ని పాకెట్‌లో పెట్టుకుంటూ...

మన్విత గదిలోకి అడుగుపెట్టాడు.

అనురాగ్‌ని చూడగానే మన్విత షాక్ తిన్నది.

అనురాగ్ ఈ టైంలో ఇండియా రావటం ఏమిటి? దీక్షితకి పెళ్లి అయినట్లు తెలిసి వచ్చాడా? లేక క్యాజువల్‌గా వచ్చాడా? అసలు తను చూస్తున్నది అనురాగ్‌నేనా? అర్థం కాక అలాగే చూస్తోంది మన్విత.

"ఏంటా చూపు మన్వితా! నేను, అనురాగ్‌ని..." అన్నాడు ఆమెనే చూస్తూ నవ్వుతూ...

అతని చూపు, నవ్వు చూస్తుంటే దీక్షితకి పెళ్లి అయినట్లు అతనికింకా తెలియలేదని తెలిసిపోయింది మన్వితకి.

"కూర్చోండి అనురాగ్? ఎప్పుడొచ్చారు? ఎలా వున్నారు?" అంది తను కూడా నవ్వుతూ మన్వితా...

అదే నవ్వుతో ఆమె ప్రశ్నలన్నిటికి సమాధానాలు చెబుతూ సోఫాలో రిలాక్స్‌గా కూర్చుని...

"మీ హాస్పిటల్లో ఓ.పి. చూస్తుంటే సిటీలో హాస్పటల్స్‌ని మించి కన్పిస్తోంది. ఇక్కడ ఇంత బాగా ప్రాక్టీస్ నడుస్తుందని మొదట్లో నేను ఎక్స్‌పెక్ట్ చెయ్యలేదు... బహూశా చుట్టు పక్కల పల్లెల వాళ్లంతా ఇటే వస్తున్నట్లున్నారు..." అన్నాడు అనురాగ్.

"అవును! కానీ... డా॥ ధీరజ్ ఇక్కడ వుండట్లేదు అనురాగ్!అయన లేక పోవటం వల్ల ఫ్యూచర్లో ఈ హాస్పిటల్‌కి ఎఫెక్ట్ పడొచ్చు. ఇప్పటికే ఆయన లేని టైంలో కొన్ని క్రిటికల్ కేసుల్ని హైదరాబాదు, వరంగల్ పంపుతున్నాను. వాళ్లనలా పంపుతుంటే... నా పొజిషన్ బాగలేక నేను పి.జి చెయ్యనందుకు బాధపడుతున్నాను..." అంది మన్విత.



ఆమె ముఖంలోని బాధను చూడలేక...

"ఆయన ఈ హాస్పిటల్‌ని వాళ్ల తాతగారి ఆశయాలతో పెట్టి, ఎక్కువ ఆసక్తిని చూపిస్తున్నారని విన్నాను..." అన్నాడు అనురాగ్.

"మీరు విన్నది కరక్టే! ఆ ఉద్దేశంతోనే ఈ హాస్పిటల్‌ని నాకు అప్పజెప్పారు. ఆయన హైదరాబాదులో హాస్పిటల్ పెట్టారు. అది బాగా నడుస్తోంది..."

దీన్ని బట్టి చూస్తుంటే... మెడిసిన్ చదివిన చాలా మంది మొదట్లో ఎలా వున్నా తర్వాత మాత్రం వ్యాపార దృక్పదంతో ఆలోచిస్తారని అర్థమవుతోంది. ప్రస్తుతం వీళ్లిద్దరి బిజినెస్ కాని, ఆలోచనలు కాని బాగున్నాయి... బహూశా పెళ్లయ్యాక ఈ హాస్పిటల్‌ని ఎవరికైనా అప్ప జెప్పి మన్విత కూడా హైదారాబాదు వెళ్తుందేమో... ఏది ఏమైనా కృష్ణవేణి ఆంటీ కోరిక త్వరగా నెరవేరబోతోంది. అని మనుసులో అనుకుంటూ...

"దీక్షిత ఎలా వుంది మన్వితా? బాగుందా? తన మొబైల్‌కి ఎందుకో కాల్ వెళ్లటం లేదు... ఈ మధ్యన చాలా సార్లు ట్రై చేశాను. ఇప్పుడు కూడా వెళ్లలేదు..." అన్నాడు.

మన్విత మాట్లాడలేదు.

ఆమె మాట్లాడకపోవటాన్ని చాలా క్యాజువల్‌గా తీసుకుంటూ...

"మమ్మీకి ఈ మధ్యన హార్ట్ స్ట్రోక్ వచ్చింది మన్వితా! తెలియగానే బయలు దేరి వచ్చాను. ఇప్పుడు ఓ.కే. షి ఈజ్ ఆల్ రైట్." అన్నాడు అనురాగ్.

మన్వితలో ఎలాంటి ఎక్స్‌ప్రెషన్స్ లేవు.

రోగుల్ని ప్రతి రోజు చూసి, చూసి రోగాలు రావటం, పోవటం అతి సహజం అన్నట్లుగా వుంది.

కాకపోతే మందుల కంపెనీల వాళ్లు మందుల రేట్లు పెంచటం వల్ల సామాన్య మానవులకి రోగాలు తగ్గే అవకాశం తగ్గుతోంది. కల్తీ మందుల

వల్ల, కల్తీ వైద్యం వల్ల ఎటొచ్చీ పేదవాళ్లే బలైపోతున్నారు. ప్రియ బాంధవిలాంటి వాళ్లకి అలాంటి ఇబ్బందులేం వుండవు. ఖరీదైన హాస్పిటల్స్, ఖరీదైన మందులు, వాళ్లు పిలవగానే పలికే అధునిక వైద్యం దొరుకుతుంది. భయపడాల్సిందేమీలేదు.

కానీ... ప్రియాబాంధవి ఆంటీతో ఒకప్పుడు తనకున్న దగ్గరితనం గుర్తొచ్చి అలాంటి మంచి మనిషికి హార్ట్ ఎటాక్ రావటం "ఎమిటి అన్నట్లుగా బాధతో మనసుకి నొప్పి అన్పించింది మన్వితకి...

"ఏమిటి మన్వితా ఆలోచిస్తున్నావ్?" అన్నాడు డా॥ అనురాగ్.

"ఏం లేదు అనురాగ్! ఆంటీ గురించి... ఇప్పుడెలా వుంది?" అంది.

"బాగుంది. మొన్నటి వరకు హైదరాబాదు 'ఉషాముళ్లపూడి' హాస్పిటల్లో వున్నది. నేనొచ్చాక నిన్ననే. వరంగల్ తీసుకొచ్చాం..." అన్నాడు అనురాగ్.

మన్విత వింటోంది.

మన్విత వైపు చూస్తూ...

"దీక్షిత మొబైల్‌కి కాల్ వెళ్లటం లేదు. నేనొచ్చినట్లు చెప్పి వాళ్ల ఇంటికి ఎవరినైన మనిషిని పంపగలవా మన్వితా! తను వచ్చాక తనతో కలిసి నేను వాళ్ల ఇంటికి వెళ్తాను..." అన్నాడు అనురాగ్ నేరుగా వాళ్లఇంటికి వెళ్లాలంటే మొహమాట పడ్తున్నవాడిలా....

మన్విత మాట్లాడలేదు.

దీక్షిత గురించి అనురాగ్‌కి చెప్పాలని లేదు మన్వితకి .

చెబితే అతనెంత డిస్టర్బ్ అవుతాడో... కోలుకోటానికి ఎంత టైం పడ్తుందో ఆమెకు తెలుసు. అసలా బాధ నుండి కోలుకోవటం కూడా అంత సులభం కాదని తెలుసు. అందుకే ఊరెల్లిందని చెబితే నమ్మి ఎప్పటిలాగే అతను స్టేట్స్ వెళ్లి పోతాడని, ఆ తర్వాత రొటిన్‌లో పడి మరచిపోతాడను కొంది.

ప్రస్తుతం తను ఒక డాక్టర్‌గా మనుషుల్నే కాదు... మనసుల్ని కూడా రక్షించాల్సిన అవసరం ఎంతైనా వుంది.



"నీకు తెలియదా అనురాగ్! దీక్షితకి పెళ్లై ఢిల్లీ వెళ్లింది." అంది టక్కున అక్కడే వున్న వర్ధనమ్మ... ఏమిటో దీక్షిత అయినా అంత కార్డు ముక్క వెయ్యొచ్చుగా... స్టేట్స్ వెళ్లిన వాళ్లతో డబ్బు రిలేషన్ వుంటేనే గుర్తుంచుకుంటున్నారు. లేకుంటే వాళ్లలా ఫ్లైట్ ఎక్కగానే మరిచిపోతున్నారు అనుకొంది వర్ధనమ్మ మనసులో...

ఇది నిజమా అన్నట్లుగా షాకై మన్విత వైపు తిరిగాడు అనురాగ్.

మాటలు రాని దానిలా... అతని కళ్లలోని భావాన్ని భరించలేక నేల వైపు చూడసాగింది. ఆమె కళ్ళెత్తి పైకి చూసే లోపలే అతనక్కడ నుండి లేచి చక చక కిందకి దిగాడు.

మన్విత తేరుకొని, బయటకొచ్చి కిందకి తొంగి చూసే లోపలే అతని కారు కదిలి మలుపు తిరిగింది. మెరుపులాంటి ఆ వేగానికి మన్విత కళ్లు తిరిగాయి.

ఇదేమీ తెలియని వర్ధనమ్మ కోడలికి అన్నం పెట్టాలని, ఒక బాక్స్‌లో పెట్టుకొని నెమ్మదిగా కిందకి దిగింది.

అనురాగ్ అలా వెళ్లి పోవటంతో మన్వితకి ఏం చేయాలో తోచలేదు. మనసు మనసులో లేదు.

అనురాగ్‌కి వచ్చిన కష్టం మాటలతో తీరేది కాదు.

డబ్బు చూపిస్తే తృప్తి పడి పారిపోయేది కాదు.

అదొక ఆకలి. దావానలంలాంటి ఆకలి.

ఎంతో కష్టపడి వండుకున్న ఆహార పదార్థాన్ని తిందామని కూర్చునే లోపలే దాన్ని వేరెవరో లాక్కుని తింటుంటే ఆ ఆకలిని ఎలా భరించాలి? మళ్లీ సిద్ధం చేసుకునేంతవరకు ఆ ఆకలి తట్టుకుంటుందా? తట్టుకో లేకనే కదా ఈ చావులు!

అంటే? దీక్షిత తనకి దక్కలేదన్న బాధలో అనురాగ్ ఏమైనా చేసుకుంటాడా?

ఆశ్చర్యపోనవసరం లేదు. ఆ బాధ అలాంటిది.

ఎంత తలవిదిలించి మరిచిపోదామన్నా...వున్న చోట వుండనివ్వదు.

ఉదయించే సూర్యునిలా, ఉదయాన్నే పలకరించే చిరునవ్వులా, ఆత్మీయమైన చేతి స్పర్శలా గుండెలోతుల్ని తడుతూనే వుంటుంది.

గుర్తొచ్చినప్పుడు తృప్తి పడటం, భావావేశం కలిగినప్పుడు కలవరించటం, భావోద్వేగం కలిగినప్పుడు విలవిల్లాడటం... మాట్లాడక పోయినా, కన్పించకపోయినా పాదాలకి కళ్లొచ్చినట్లు వెతుక్కోవటం...

అలా ఇన్నాళ్లూ-కోపంలో, ఆనందంలో, దు:ఖంలో, ఏకాంతంలో కలిసిపోయిన వాళ్లు ఇక మన వాళ్లు కాదని తెలిశాక ఆ అనుభూతుల్ని, భావాలని, మనసు తలుపుల చాటున ఓ చిలక్కొయ్యకి తగిలించి... ఏమీ కానట్టు మిగిలి పోవాలంటే సాధ్యం కాదు.

అనురాగ్‌ని తనిప్పుడెలా కాపాడాలి?

మన్విత మనసంతా మహాసముద్రం అయింది.

జీవితమంటే... సుఖం, దు:ఖం, ప్రేమ, అనురాగం, క్రోధం, శాంతం, ఆరోగ్యం, అనారోగ్యం, ధనం, దరిద్రం, ఆపదలు... వీటి కలయికే జీవితం. వీటిల్లో ఏదో ఒకటే జీవితం అనుకుంటే ఎలా?

ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు వాటిని ఓడించి జీవితంలో గెలవాలి... జీవించటం కానీ, జీవితాన్ని ప్రేమించటం కాని, కొన్ని సందర్భాల్లో ఎవరూ ఎవరికి నేర్పరు. ఎవరికి వాళ్ళే నేర్చుకోవాలి.

అందుకే భగవద్గీతలో... ప్రతి వ్యక్తిని తన ధర్మాన్ని నిర్వర్తించి ఫలితం కై నిశ్చింతగా వుండమంటారు.

కానీ... ప్రతి చోట 'ఫలితానికే' ప్రాధాన్యత ఇస్తూ ఆశించింది, ప్రేమించింది దొరకకపోతే క్రుంగిపోతుంటారు 'ప్రేమ' పేరుతో మానసికంగా కుమిలి కృశించి పోతుంటారు.

కాళిదాసు 'కుమార సంభవం' లో ఒకచోట



"వికారా హౌతౌ నతి విక్రయన్తే"

యేషాంన చేతాంసి తన ఏవధీరా : అని అంటాడు.

అంటే వికారాన్ని పెంపొందించే కారణాలు ఎన్ని వున్నా... వాటి మధ్య ఎవరు వికారాన్ని పొందరో వారే ధీరలు అని.

అనురాగ్‌కి ఇప్పుడు చాలా ధైర్యం కావాలి. మనోనిబ్బరం కావాలి. మనో వికారాన్ని జయించే ఆత్మ స్థయిర్యం కావాలి.

కోడలకి అన్నం తినిపించి పైకి వచ్చింది వర్ధనమ్మ.

నానమ్మను చూడగానే...

"నానమ్మా! నేను వరంగల్ వెళ్తున్నా... ప్రియాబాంధవి ఆంటీకి ఆరోగ్యం బాగలేదని అనురాగ్ చెప్పాడు కదా! వెళ్లి చూసి వస్తాను." అంది మన్విత.

"మరి హాస్పిటల్ ఎవరు చూస్తారు?" అంది వర్ధనమ్మ

"డా॥ ధీరజ్ రెడ్డి ఇంకో గంటలో హైదరాబాదు నుండి వస్తున్నారు. కాల్ చేశారు. నేవెళ్లొస్తా... జాగ్రత్త..." అంటూ చక, చక మెట్లు దిగింది మన్విత.

అంతలో... ఆమె మొబైల్‌కి కాల్ రావడంతో - స్క్రీన్ మీద పేరు చూసి వెంటనే ఆన్ చేసింది.

"హలో చెప్పు సంజనా!" అంది మన్విత.

"నీతో మాట్లాడాలి మన్వితా? ఎక్కడున్నావ్?" అంది సంజన.

"వరంగల్ వెళ్తున్నా... ' వే ' లో వున్నా... అంది మన్విత.

"వరంగల్ దేనికి?" అంది సంజన

"డా॥ అనురాగ్ వాళ్ల మమ్మీకి 'హార్ట్‌అటాక్' వచ్చిందట. అది తెలిసి స్టేట్స్ నుండి అనురాగ్ వచ్చాడు. నేను ఆంటీని చూడటానికి వెళ్తున్నా..." అంది మన్విత.

సంజన మాట్లాడకుండా మౌనంగా వుంది.

"మాట్లాడు సంజనా! ఆగిపోయావేం?" అంది మన్విత.

"అక్కడ కొచ్చాక అన్ని విషయాలు నీతో మాట్లాడతాను. ఫోన్లో వీలుకాదు..." అంటూ కాల్ కట్ చేసింది సంజన.

"దీని బొంద ఏం మాట్లాడుతుంది నాతో... ఉస్మానియాలో చేస్తున్నా ఆ పి.జి మానేసి నా దగ్గర కొచ్చి కూర్చుని ఓ.పి. చూస్తానని మాట్లాడదు కదా!" అని తన జోక్‌కి తనే నవ్వుకుంటూ...

బస్ దిగి ఆటో ఎక్కింది మన్విత.

ఆటో దిగి, ఆటో అతనికి డబ్బులిచ్చి... గేటు తీసుకొని, లోపలకి వెళ్లింది.

అక్కడ అంత పెద్ద ఇంట్లో...హాలు కాని, కిచెన్ కాని, మిగతా రూములు కాని నిర్మానుష్యంగా అన్పిస్తున్నాయి. చాలామంది ఇళ్లు ఇలాగే అన్పిస్తాయి.

ఒక ప్రియబాంధవి రూంలో మాత్రం... ఫ్యాన్ గాలికి కర్టన్ కదులుతూ మనిషి వున్నట్లు సైగ చేసింది.

నేరుగా లోపలకి వెళ్లి ప్రియబాంధవిని నవ్వుతూ పలకరించింది మన్విత.

పాలనురగలాంటి తెల్లని బెడ్ మధ్యలో రెండు దిండ్ల సపోర్ట్‌తో వెనక్కి వాలి కూర్చుని... వాల్మీకి రామాయాణం పుస్తకంలోకి చూస్తున్న ప్రియబాందవి తల తిప్పి మన్వితను చూసింది.

మన్వితను చూడగానే ప్రేమారా ఆహ్వానిస్తున్నట్లు కనురెప్పల్ని కదలించి...

"కూర్చో మన్వితా!" అంది ప్రియబాంధవి. కూర్చుంది మన్విత.

ప్రియబాందవికి మన్విత పట్ల ఇప్పుడెలాంటి వ్యతిరేకమైన భావం కాని, భయంకాని లేవు. అనురాగ్ ప్రేమకోసం వచ్చిందేమోనన్న అనుమానం కూడా లేదు.



కారణం మన్వితను డా॥ ధీరజ్ ప్రేమిస్తున్నాడని, అందుకే ఆమెను చేరదీశాడని లోక ప్రచారం... అది ఆనోటా, ఈనోటా పాకి ప్రియబాంధవి చెవిని సోకింది.

మన్విత ప్రక్కకి తప్పుకుంటే దీక్షిత తన కోడలై పోతుందని అనుకొంది. అలా అని మన్విత అంటే చిన్న చూపేమిలేదు. ఆమె దగ్గర మన్వితకి వుండే మర్యాద మన్వితకి వుంది.

"ధీరజ్‌రెడ్డి , మీ నానమ్మ బావున్నారా?" అంటూ కుశల ప్రశ్నలు వేసింది ప్రియ బాంధవి.

"బావున్నారు ఆంటీ! మీ ఆరోగ్యం ఎలా వుంది?" అంటూ అభిమానంగా చూసింది మన్విత.

"ఏ టైంలో ఏమో అన్నట్లుగా భయంగా వుంది మన్వితా!" అంది తన కొచ్చిన స్ట్రోక్‌ని గుర్తు చేసుకుంటూ ప్రియబాంధవి. అప్పటికప్పుడే ఆమె ముఖంలో దిగులు ప్రవేశించటం గమనించింది మన్విత.

"అలాంటి భయాలేమి పెట్టుకోకండి ఆంటీ! ఇలాంటి గొప్ప, గొప్ప పుస్తకాలను చదువుతున్నారు. ఇంకా మీకు భయమేంటి?" అంది నవ్వుతూ ఆమె భయాన్ని తేలిగ్గా తీసేస్తూ మన్విత.

వెంటనే పుస్తకం వైపు చూసింది ప్రియబాంధవి.

"ఇది నిజంగా గొప్ప పుస్తకమే మన్వితా! ఇందులో సకల సుగుణాభిరాముడైన ఆ శ్రీరామచంద్రుని పేరు వినగానే శత్రువుల గుండెలు భయంతో వక్కలవుతాయి. ఆయన పాలనలో ధర్మం నాలుగు పాదాలమీద నడిచింది. అంతే కాక... అన్న అడుగు జాడలలో తమ్ములు ఎలా నడవాలో, తమ్ములపై ఎంతటి ప్రేమానురాగాలు అనకువ వుంటాయో, పితృవాక్యాన్ని ఎలా పాలించాలో, పరాక్రమాన్ని ఎవరితో, ఎక్కడ, ఏ విధంగా చూపించాలో, భార్యాభర్తలు ఎలా వుండాలో, నమ్మిన బంటు ఎలా వుంటాడో, స్నేహధర్మాన్ని ఎలా నిర్వర్తించాలో, సకల ఐశ్వర్యాలు, సమస్త సద్గుణాలు వున్న ఒక

మహాపరాక్రమశాలిని, అదిషడ్వర్గాలు ఎలా అణచివేస్తాయో చెప్పిన మనోవైజ్ఞానిక శాస్త్రం... ఈ వాల్మీకి రామాయణం..." అంటూ తన్మయత్వంతో, భక్తి భావంతో చెప్పింది ప్రియబాందవి.

ఆమెను ఏ మాత్రం డిస్టర్బ్ చెయ్యకుండా విన్నది మన్విత.

ఆమె చెప్పేది వింటున్నా... మధ్యలో అనురాగ్ గుర్తొస్తున్నాడు.

వెంటనే అనురాగ్‌ని చూడాలని వుంది మన్వితకి...

ఎందుకు చూడాలనివుందో ఆమెకే అర్థంకానిస్థితి అది.

అనురాగ్ గురించి ప్రియాబాంధవిని అడిగింది మన్విత.

అనురాగ్ పేరు వినగానే ప్రియబాంధవి ముఖంలో మార్పు కన్పించింది.

"అనురాగ్ పాకాల వెళ్లి వచ్చినప్పటి నుండి అదోలా వున్నాడు మన్వితా! ఆ గదిలోంచి బయటకి రావటం లేదు. ఏం జరిగిందో తెలియదు. నేను కూడా అడగలేదు. ఎందుకంటే..." అంటూ ఆగి పోయింది ఆలోచనగా...

ఏం చెబుతుందోనని ఎదురు చూస్తోంది మన్విత.

మన్వితకి అనురాగ్ విషయం టెన్షన్ గా వుంది.

"అనురాగ్ చిన్న పిల్లాడు కాదుగా... అన్నం కలిపి, ముద్దలు పెట్టి, నిద్రపోయేదాక పక్కనే కూర్చుని వీలైతే ఓ మంచి కథో, ఆలోచనో చెప్పి వాడి మనసులో మాట కనుక్కోటానికి..." అంది నిష్ఠూరంగా, తన కొడుకు తనతో ఏం చెప్పటం లేదన్న బాధను లోలోన దాచుకుంటూ...

దీక్షిత అంటే ప్రియబాంధవికి ప్రాణమని తెలుసు మన్వితకి, కోడలు స్థానంలో దీక్షితనే వూహించుకొందామె.

ఒక్కోసారి వాస్తవం కన్నా ఊహనే మనిషికి వూరట కల్గిస్తుంది. ఆమెను ఆ వూహలోనే వుండనీ... ఇప్పుడీ చేదు వార్త విన్పిస్తే తట్టుకోలేక మళ్లీ స్ట్రోక్ రావొచ్చు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం గురించి కూడా ఆలోచించటం తన బాధ్యత అనుకొంది మన్విత.



"చెప్పు మన్వితా? అక్కడేమైనా జరిగిందా?" అంది ఆందోళనగా...

మన్వితకి తెలియకుండా అక్కడేం జరగదని ఆమె నమ్మకం. ఎందుకంటే దీక్షిత , మన్విత ఒకే హాస్పిటల్లో వుంటారు కాబట్టి...

"అక్కడేం జరగలేదాంటీ! ఇంత సేపు మేము పాకాల సరస్సు దగ్గరికి వెళ్లాం... అక్కడంతా బాగా తిరిగాం. పచ్చని చెట్లు, చుట్టూ గుట్టలు, మధ్యలో నీటితో ప్రకృతినంతా తన ఒడిలో నింపుకున్నట్లు అక్కడ ఎంతసేపు తిరిగిన ఇంకా తిరగాలనిపించి, ఎక్కువ సేపు అక్కడే గడిపాం..." అంది మన్విత ఏదో ఒకటి చెప్పి ఆమెను సమాదాన పరచాలన్న ఉద్ధేశ్వంతో...

"అంత బాగుంటుందా అక్కడ?" అంది ఆసక్తిగా ముందుకి వంగి ప్రియబాంధవి.

"అవు నాంటీ! 1213 సంవత్సరంలో కాకతీయ రాజు గణపతి దేవుడు దాన్ని నిర్మించిన నాటి నుండి దినదినాభివృద్ధి చెందుతూ ప్రకృతి అందాలతో గొప్పగా ఆకర్షిస్తోంది. 3500 ఎకరాల అటవీ ప్రాంతమైన అక్కడ ఎన్నో సుగంద ఔషద లక్షణాలు గల మొక్కలున్నాయి... ఇతర రాష్ట్రాల నుండి ప్రతి వేసవిలో ఆయుర్వేద నిపుణులు వచ్చి మొక్కలు తీసికెళ్తారు. అంతేకాక... ఆ పరిసర అటవీ ప్రాంతంలో రకరకాల వన్య ప్రాణులు రక్షణ పొందుతున్నాయి. అక్కడికి కొంతమంది ప్రతి నిధులు, విదేశీయులుతో పాటు వివిధ రాష్ట్రాలకి చెందిన వేలాదిమంది పర్యాటకులు వచ్చి ఆ ప్రాంతంలోని దృశ్యాలను తమ కెమెరాల్లో బందిస్తుంటారు. అలాగే పాకాలమీద వున్న మమకారంతో అనురాగ్ ఒక్కటి కూడా మిస్ కాకుండా తన కెమెరాలో బందించుకున్నాడు." అంటూ పాకాల సరస్సు హిస్టరీ చెప్పి...

అనురాగ్ ఎందుకలా వున్నాడో 'నిజం' తెలియకుండా చేసింది మన్విత.

"అవునా!!" అన్నట్లు శ్రద్ధగా విన్నది ప్రియబాంధవి.

"బహుశా అనురాగ్ అలిసిపోయివుంటాడు ఆంటీ! నేను వెళ్లి కలుస్తాను. మీరు రెస్ట్ తీసుకోండి!" అంటూ ఆ గదిలోంచి బయటకి నడిచి... మెట్లెక్కి పైనున్న అనురాగ్ గది వైపు వెళ్లి తలుపు తట్టింది.

తలుపు తీసి ఎదురుగా వున్న మన్వితను చూసి షాక్ తిన్నాడు అనురాగ్.

ఎందుకొచ్చింది మన్విత?

"అంత సడన్‌గా వచ్చేస్తే నేనేమనుకోవాలి అనురాగ్! ఎంత కంగారు పడ్డానో తెలుసా? ఆ తొందరలో నువ్వేమైపోతావోనని వెంటనే బయలు దేరి వచ్చాను." అంటూ తన మనసులో ఎంత కంగారు పడిందో పైకి వ్యక్తం చేస్తూ, అతన్ని దాటుకుంటూ వెళ్లి, లోపల కుర్చీలో కూర్చుంది.

ఆమె చొరవ, కాలుమీద కాలు వేసుకొని కూర్చున్న తీరు నేను అన్నిటల్లో అధికురాలిని, ఆత్మవిశ్వాసమే నా ఆయుధం అన్నట్లుంది.

ఆమెకి ఎదురుగా కూర్చున్నాడు అనురాగ్.

ఆమె మాట్లాడుతున్నా పరధ్యానంగా వున్నాడు...

"ఇలా గదిలో ఒంటరిగా కూర్చోవటం, పలకరిస్తున్నా స్పందించకుండా వుండటం, జీవితం శూన్యమైనట్లు భావించటం, ఎవరికి రాని కష్టం నీకే వచ్చినట్లు ఏమిటీ వాతావరణం? మనసు గాయపడ్డ వాళ్లు, జీవితంలో దెబ్బతిన్నవాళ్లు ఇలాగే వుంటున్నారా?" అంది మన్విత.

"దీక్షిత నాకు చెప్పకుండా పెళ్లి చేసుకోవటం నీకు న్యాయంగా అన్పించిందా?" అని మాత్రం అన్నాడు అనురాగ్.

అప్పుడు చూసింది అతని కళ్లలోకి...

అతని కళ్లు బాగా ఏడ్చినట్లు ఎర్రగా వున్నాయి.

ఆశ్చర్యపోతూ ఒక్క క్షణం అతని కళ్లలోకి చూసింది.

అనురాగ్ ఏడ్చాడా! ఇది నిజమా! అనురాగ్ కూడా ఏడుస్తాడా? దేని కోసం ఏడ్చాడు? ప్రేమ కోసమేగా? ప్రేమ అనే ఆయుధం ఆడా, మగా తేడా లేకుండా ఏడిపిస్తుందా? బాధిస్తుందా? ఆబాధముందు ఎవరైనా చిన్న వాళ్లేనా?



సడన్‌గా అర చేతుల్లో ముఖాన్ని దాచుకొని, కదిలి, కదిలి ఏడవటం మొదలు పెట్టాడు అనురాగ్.

ఆ ఏడుపు చూస్తుంటే మరింత నిశ్చేష్టయై అలాగే చూస్తోంది మన్విత.

ఆ ఏడుపు మెల్లగా కదిలే మందాకినిలా లేదు.

ఉధృతంగా ఉరికే సెలయేరులా వుంది.

అది కదలి ప్రవాహంలా మారింది.

మన్విత కూర్చున్న చోటు నుండి ఒక్క ఇంచైనా కదలలేదు.

అలాగే కూర్చుని అనురాగ్‌ని చూస్తోంది.

పోటెత్తిన వరదగోదారికి - అనురాగ్‌కి పెద్ద తేడా ఏం కన్పించలేదు.

"బాధ పడ్తున్నావా అనురాగ్?" అంది మెల్లగా మన్విత

అతను మాట్లాడ లేదు.

బాధను దాచుకోలేని పసి పిల్లాడిలా అతని భుజాలు, వీపు బలమైనా గాలికి కదిలే చెట్టు మొదలులా కదులుతున్నాయి.

మనసులో ఏర్పడ్డ వాయుగుండం తీరం దాటి, తుఫానుగా మారి కుండపోత వర్షం కురిసినట్లు అతని మనసు బోరున ఏడుస్తోంది

"మగవాడివి నువ్వే ఇంత బాధ పడ్తే దీక్షిత ఇంకెంత బాధ పడాలి?"

"బాధ వుంటే ఇలా చేస్తుందా?" అన్నాడు తలెత్తి సూటిగా మన్వితనే చూస్తూ...

"బాధపడే మనసు నీ ఒక్కడికే వుందనుకోకు అనురాగ్! తను కూడా బాధ పడింది! కానీ...ఈ పెళ్లి నిన్ను మోసం చెయ్యాలనో, నువ్వంటే ప్రేమ లేకనో, నిన్ను మించిన వాడు దొరకడం వల్లనో చేసుకోలేదు. పరిస్థితులకి తలవంచి, తప్పని పరిస్థితులు ఎదురై నిన్ను వదులు కొంది." అంది మన్విత.

"ఏమిటా పరిస్థితులు?" అడిగాడు వెంటనే.

జరిగింది మొత్తం చెప్పింది మన్విత.

మాటలతో వ్యక్తం చెయ్యలేని బాధ అతని ముఖంలో కన్పించింది.

"ప్రతి ఒక్కరు అంతే అనురాగ్! కావాలని ఎవరూ దేన్ని వదులుకోరు. ముఖ్యంగా తప్పదనుకుంటేనే ప్రేమను వదులు కుంటారు. నీకు తెలుసో లేదో ఒకరిని ఇష్టపడి వేరొకర్ని పెళ్లిళ్లు చేసుకునే అమ్మాయిలు కాని, అబ్బాయిలు కాని కోకొల్లలుగా వున్నారంటే దానికి కారణాలు అంత పెద్దవేం కాదు. అతి చిన్నవి, అతి సున్నితమైనవే వుంటాయి. అందుకే ఒకరి కోసం ఒకరు అంతంత టైం వేస్ట్ చేసుకొని, ఆలోచనలను, భావాలను షేర్ చేసుకొని ఈ మనిషి నా మనిషి అన్న ఫీలింగ్‌ని పెంచుకొని కూడా చివరకి ఏమీ కానట్లు విడిపోతున్నారు. కానీ... అవే జీవితాలను ఒక్కోసారి ఎక్కువగా డిస్టర్బ్ చేస్తాయి..." అంది నెమ్మదిగా జ్ఞానిలా మన్విత.

"కానీ... దీక్షితను నేనెలా మరిచిపోవాలి?" అన్నాడు.

"మరిచిపోవటం అంత కష్టమా? నిన్ను నేను మరచిపోలేదా?" అంది.

వూహించని ఆ మాటలకి దిమ్మతిరిగింది అనురాగ్‌కి...

సలసల కాగుతున్న నూనె వచ్చి ఒంటి మీద పడ్డట్లు ఫీలయ్యాడు. వెంటనే తేరుకొని...

"దీన్ని బట్టి చూస్తుంటే లైఫ్‌ని డిస్టర్బ్ చేసుకోవాలని ఎవరికీ వుండదని తెలిసి పోయింది... దీక్షిత లాగే నువ్వెందుకు పెళ్లి చేసుకోలేదు మన్వితా?" అన్నాడు.

అంత బాధలో కూడా అతను తన బాధను పక్కన పెట్టి అలా అడుగుతుంటే నవ్వొచ్చింది మన్వితకి.

మన్విత నవ్వుతుంటే...

"నవ్వకు మన్వితా! ఇప్పుడు నేను అనుభవిస్తున్న బాధలో ఒకప్పుడు నువ్వు పడిన బాధకన్పిస్తోంది. ఇంత బాధను నువ్వెలా తట్టుకున్నావు?" అన్నాడు.



"నువ్వు కూడా తట్టుకుంటావు... నీలో వుండే ఎనర్జీకి ఈ ప్రేమ గోల్ కాకూడదు...బాధలో జీవించటం మరిచిపోయి...మరోగోల్‌ని సృష్టించుకో... ఆ గోల్‌ని అచీవ్ చేయటానికి ఫోకస్డ్‌గా పని చెయ్యి. అప్పుడు స్టేట్స్‌లో నీకు కొత్త స్నేహితులు, కొత్త అభిరుచులు పెరుగుతాయి. ముఖ్యంగా ఈ వయసులో విరహం వుండకూడదు. మనలో వున్న ఎనర్జీనంతా ఆ విరహంతో వేస్ట్ చేసుకోకూడదు. ఏది సాధించాలన్నా ఎనర్జీ అవసరం. కుమిలి పోతూ, కుళ్లి పోతూ మేధస్సును నాశనం చేసుకోకూడదు. ప్రేమ, క్షమ ఎంతో శక్తి వంతమైనవి అనురాగ్! అని ఎప్పుడూ మనతో వుండాలి..." అంది మన్విత.

అనురాగ్ మాట్లాడలేదు.

"కాలం, కెరటం ఎవరికోసం ఆగవు అనురాగ్! వాటి పని అవి చేసుకుపోతుంటాయి. ఎప్పుడైనా మనం అపార్థం చేసుకున్నంత బాగా అర్థం చేసుకోలేం... పైగా అర్థం చేసుకోవటం ఎదుటివారి బాధ్యతగా అనుకుంటాం. అపార్థం అనర్థం... అర్థం ఆనందం... బాధలో వున్నా ప్రశాంతంగా ఆలోచించాలి. అప్పుడే మనమేంటో మనకో క్లారిటీ దొరుకుతుంది. ప్రేమనేది ఎక్కడో లేదు. ఒక 'పని' పట్ల మన ప్రయత్నంలో వుంది. పట్టుదలలో వుంది. గెలుపులో వుంది..." అంటూ ఆగింది.

ఎందుకు ఆగిందా అని తలెత్తి ఆమెవైపుచూశాడు

"ఒకప్పుడు నన్నందరు ప్రేమిస్తే బావుండని ఆ ప్రేమకోసం ఎదుటి వాళ్ల మీద ఆధారపడేదాన్ని... నన్నెవరూ ప్రేమించలేదు. ప్రేమనేది ఆశిస్తే, అడిగితే, లాక్కుంటే దొరికేది కాదని తెలుసుకోటానికి నాకు చాలా టైం పట్టింది. అది తెలిశాక ఆశించటం మరిచిపోయి అందించటం అలవాటు చేసుకున్నాను. ఇప్పుడు నా ప్రేమను అందరికి పంచుతున్నాను. ఒకప్పుడు ఎవరికీ అవసరం లేని నేను ఇప్పుడు అందరికి అవసరమయ్యాను. నన్ను చూడగానే ఆరోగుల కళ్లలో కన్పించే చెమ్మలోని ఆత్మీయత, వాళ్ల మాటల

స్పర్శలో పుట్టే ప్రేమ ఒకప్పుడు నేను ఆశించిన దానికన్నా ఎక్కువ తృప్తిని ఇస్తున్నాయి...” అంది.

ఆమెలో సంతోషం కన్నా త్యాగం, తెగింపు, పట్టుదల వున్నాయి. ముఖ్యంగా సాటివారి జీవితంలో వెలుగునింపే చైతన్యం వుంది.

అంతలో తన మొబైల్ మోగడంతో...

“ఎక్స్‌క్యూజ్‌మీ...” అంటూ డా॥ధీరజ్ రెడ్డి కాల్‌ని రిసీవ్ చేసుకొంది.

కాల్ మాట్లాడాక... అనురాగ్ వైపు చూస్తూ...

“డా॥ ధీరజ్ ఇప్పుడే పాకాల వచ్చారట... ఓ.పి లో కూర్చుంటూ నాకు కాల్ చేశారు...” అంది మన్విత.

ప్రియబాంధవి పంపిన కాఫీ తెచ్చి అక్కడ పెట్టి వెళ్లింది పని మనిషి.

కొద్దిసేపు వాళ్లిద్దరి మధ్యన నిశ్శబ్దం ఆవరించింది.

మన్విత తన చేతి వేళ్ల వైపు దీక్షగా చూసుకుంటూ, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ...

“డా॥ ధీరజ్ రెడ్డి ఇక ముందు పాకాలలో వుంటాడన్న నమ్మకం లేదు అనురాగ్! అతని అవసరం పాకాలలో చాలా వుంది. ఎందుకంటే చుట్టు పక్కల ప్రజలంతా రకరకాల వ్యాధులతో వస్తున్నారు. అతను లేకుంటే వాళ్లను సిటీకి పంపాల్సి వస్తుంది. అలా పంపే ప్రాసెస్‌లో దారి మధ్యలో వాళ్లకేమైనా జరిగే సందర్భాలు కూడా వున్నాయి. అదే నా బాధ...” అంది మన్విత

ఆ హాస్పిటల్, ఆ రోగులు మన్విత ఆలోచనలలో ఎంతగా కలిసి పోయారో... క్షణం కూడా ఆమెను విడిపోకుండా ఎంతగా ఆక్రమించు కున్నారో అర్థమవుతోంది అనురాగ్‌కి...

కింద ప్రియబాంధవిని పరామర్శించి అప్పుడే పైకొచ్చింది సంజన.

సంజనను చూడగానే నవ్వుతూ రిసీవ్ చేసుకొని...

“కూర్చో సంజనా!” అంది మన్విత.



అనురాగ్‌ని విష్ చేస్తూ కూర్చుంది సంజన.

కూర్చున్న వెంటనే మన్విత వైపు తిరిగి...

“ఇక్కడ తీరిగ్గా నువ్వు కూర్చుంటే... అక్కడ పాకాల హాస్పిటల్లో నీ ఓ.పి... ఓ.పి...” అంది చేయి చాపి దూరంగా చూపిస్తూ... వర్షం పడ్తుంది వడియాలు ఎత్తుపో అన్నట్లు...

నవ్వింది మన్విత వెన్నెల్లో తడుస్తూ, పిల్ల గాలికి కదిలే తెల్ల గులాబిలా....

సంజన చేతి వైపు, ముఖం వైపు చూసి అనురాగ్ కూడా నవ్వాడు.

“మీరు వెళ్లి ఫేస్ వాష్ చేసుకొని రండి! కాఫీ తాగుదాం!” అంది మన్విత, అనురాగ్‌ను ఉద్దేశించి...

అనురాగ్ లేచి బాల్కనీలో వున్న వాష్ బేసిన్ దగ్గర నిలబడి ఫేస్ వాష్ చేసుకుంటున్నాడు.

వాళ్లకి అనురాగ్ ట్యాప్ తిప్పినట్లు నీళ్ల చప్పుడు స్పష్టంగా విన్పిస్తోంది.

మౌనంగా కూర్చుని వున్న మన్విత వైపు చూస్తూ... “వెనకటికెవరో మజ్జిగ పోయించుకోటానికి పోయి గేదెను బేరం చేసినట్టు డా॥ధీరజ్ రెడ్డి మా నాన్న గారి దగ్గరికి ఎక్స్‌పీరియన్స్ కోసం వచ్చి, డాక్టర్ వృత్తిలో మెలకువల్ని నేర్చుకుని అంతటితో ఆగకుండా ఇంకా ఆశ ఎక్కువై, ఆయన కూతుర్ని అయిన నన్నే పెళ్లి చేసుకుంటాననంటున్నాడు...” అంది సంజన.

అయితే తప్పేంటి అన్నట్లుగా చూసింది మన్విత

“ప్రయోజనం పొందిన వారి పట్ల కృతజ్ఞత చూపాలి కాని, నిన్ను ప్రేమించి, నన్ను పెళ్లి చేసుకుంటానని చెప్పి... ఇలా మనిద్దర్ని మోసం చెయ్యొచ్చా? ఆ ధీరజ్ రెడ్డికి ఇది తగునా...” అంది సంజన ఎంత నెమ్మదిగా మాట్లాడదామనుకున్నా ఆవేశంలో వున్న ఆమె గొంతు గట్టిగా విన్పించింది.

“ధీరజ్ రెడ్డి నన్ను ప్రేమించడమేంటి సంజనా? ఎంత చెప్పినా వినకుండా నువ్వు నన్ను మిస్ అండర్ స్టాండ్ చేసుకుంటున్నావు. నీకు నువ్వు అలా వూహించుకుంటే సరిపోతుందా? అబద్ధం నిజమవుతుందా?

ఇంకెప్పుడూ ఇలా మాట్లాడకు... ఎందుకంటే ధీరజ్‌రెడ్డి నాకు మంచి గైడ్. ఆయన గైడెన్సీలో నన్ను నేను మలుచుకున్నాను. ఒక డాక్టర్‌గా ఎదిగాను. ఒక రకంగా చెప్పాలంటే ఈ లైఫ్ నాకు ఆయన ఇచ్చిందే..." అంది డా॥ మన్విత.

అంతేనా అన్నట్లుగా చూసి, అయినా నేను నమ్మను అన్నట్లుగా ముఖాన్ని పక్కకి తిప్పుకొంది.

"నువ్వు నమ్మినా నమ్మక పోయినా మా ఇద్దరి మధ్యన వున్న రిలేషన్ అదే"అన్నట్లు మౌన గంభీరంగా కూర్చుంది మన్విత.

"మరి నువ్వు డా॥ ధీరజ్ రెడ్డిని ప్రేమించలేదా?" అంటూ తలతిప్పి మన్విత వైపు చూసింది సంజన.

ఒక రకంగా నవ్వింది మన్విత. ఆ నవ్వు చాలా పేలవంగా వుంది.

ఇప్పుడెందుకో... మన్వితకి విశ్వజనీనమైన ప్రేమ గురించి తప్ప మామూలు ప్రేమ గురించి ఎవరు మాట్లాడినా విన బుద్ధి కావటం లేదు. అంత ఎదిగింది ఆమె...

ప్రేమలో విశాలత్వం కాదు. వెరైటీ కాదు. ఇన్‌టెన్సిటీ ముఖ్యం అంటాడు చలం... అలాంటి ప్రేమ దొరకటం చాలా కష్టం. దొరికినా అది ఒక అగ్ని. అది ఒక తపస్సు. ప్రేమను జీవితం నుండి పొంది తిరిగి అదే ప్రేమను జీవితానికి అందించటానికి సాహసం కావాలి. అది ఎవరి వల్ల కాదు.

"ఏమిటి మన్విత మాట్లాడవు" అన్నట్లుగా ' హలో ' అంటూ ఆమె భుజాన్ని తట్టింది సంజన.

అప్పటి వరకు మౌనంగా వున్న మన్విత ఉలిక్కిపడ్డట్లై...

"నేను అనురాగ్‌ని ప్రేమించాను సంజనా!" అంది మన్విత ఈ వాస్తవాన్ని చెప్పక పోతే సంజన ధీరజ్‌రెడ్డిని భర్తగా స్వీకరించదని, చెప్పాలని పించకపోయినా చెప్పింది మన్విత.



సంజన ఏదో మాట్లాడే లోపలే... టవల్‌తో తుడుచుకుంటూ వచ్చాడు అనురాగ్.

సంజన ఇంకేం మాట్లాడు లేదు.

అనురాగ్ వచ్చి కూర్చుంటూ...

ఫ్లాస్కులో వున్న కాఫీని కప్పుల్లో పోసి వాళ్లిద్దరికి ఇచ్చి, తనొకటి తీసుకున్నాడు.

కాఫీ తాగుతూ ప్రియబాంధవి తీసుకుంటున్న మందుల గురించి, ట్రీట్ మెంట్ గురించి, కేర్ గురించి చెప్పాడు అనురాగ్.

వాళ్లిద్దరు వింటూ కూర్చున్నారు.

"ఇక మేము వెళ్లొస్తాము అనురాగ్!" అంటూ ఇద్దరు ఒకే సారి లేచి కిందికి దిగారు.

"నిన్ను నా కార్లో... పాకాలలో డ్రాప్ చేసి నేను హైదరాబాదు వెళ్తాను." అంది సంజన.

"సరే!" అంటూ కారెక్కింది మన్విత.

' డ్రైవర్ పాకాల పోనియ్' అంటూ కార్లో కూర్చుని సంజన చెప్పగానే కారు కదిలింది.

వాళ్లిద్దరు మాట్లాడుకుంటుండగానే పాకాల వచ్చింది.

కారు వెళ్లి హాస్పిటల్ ముందు ఆగింది

మన్విత కారు దిగి సంజన వైపు చూస్తూ...

"ధీరజ్‌రెడ్డితో మాట్లాడి వెళ్లు సంజనా! ఎలాగూ ఇంత వరకు వచ్చావు కదా!" అంది.

"నేను దిగను... రేపు మా ఎంగేజ్‌మెంట్ కోసం ధీరజ్ వాళ్లు హైదరాబాద్ వస్తున్నారు. ఇప్పుడు నేను పెళ్లి కూతుర్ని... ఈ చుట్టు పక్కల కన్పించకూడదు. బై..." అంది సంజన.

వెంటనే కారు కదిలింది.

* * * * *

కాలం అనంతంగా కదిలి సాగుతోంది.

డా॥ ధీరజ్ రెడ్డి - డా॥ సంజనను పెళ్లి చేసుకొని హైదరాబాదులో సెటిలయ్యాడు.

పాకాలలో వుండే హాస్పిటల్‌ని డా॥ మన్విత చూసుకుంటోంది.

డా॥ దీక్షిత ఢిల్లీలో హ్యాపీగా వుంది.

డా॥ అనురాగ్ స్టేట్స్‌లో తన చదువు పూర్తి చేసుకొని వచ్చి, గత పదిరోజులుగా ఇండియాలోనే వున్నాడు.

* * * * *

తలస్నానం చేశాక... జుట్టు తడిని తుడుచుకుంటూ వెళ్లి టవల్‌ని తీగపై ఆర వేసి ముందున్న బాల్కనీలో కూర్చుంది మన్విత.

రాత్రంతా సముద్రం పై కురిసిన వెన్నెల్ని కెరటాలు నెమరేసుకుని తిరిగి ఆ వెన్నెల్ని తెల్లని నురగ రూపంలో ఒడ్డుకి చేర్చినట్లు... మన్విత తనలో నురగలై పొంగుతున్న ఆలోచనల్ని అదిగమిస్తూ మనసు అంచులకి వాటిని చేరవేస్తుండగా...

ఆమె మొబైల్ రింగయింది.

రింగవుతున్న మొబైల్‌ని అందుకొని ఆన్ చేసి...

"హలో... చెప్పు సంజనా?" అంది మన్విత.

"రేపు నా కొడుకు పుట్టిన రోజు మన్వితా! వీలు చూసుకొని తప్పకుండా రా! కారు పంపుతా!" అంది సంజన.

"సరే!" అంది మన్విత.

"రోజులు ఎంత త్వరగా గడచిపోతున్నాయి మన్వితా! దీక్షితకి కవల పిల్లలు పుట్టారట. వాళ్లను చూసుకుంటూ దీక్షిత వాళ్ల అమ్మా, నాన్నా ఢిల్లీలో వున్నారట... అన్నట్లు! అనురాగ్ ఇండియా వచ్చాడు తెలుసా?" అంది డా॥ సంజన.

"ప్రొద్దున లేచి రోగుల్ని చూసుకుంటూ - అలిసిపోయి నిద్ర పోవటం తప్ప ఇంకేం తెలియటం లేదు సంజనా!" అంది మన్విత.



"మరీ అంత ఇదవ్వకు... నా కంతా తెలుసు." అంది సంజన.

"ఏం తెలుసు నీకు?" అంది ఒక చేత్తో సెల్ పట్టుకొని, ఇంకో చేతి వేళ్లతో జుట్టుని పాయలుగా విడదీస్తూ...

"అనురాగ్ నాతో మాట్లాడాడు మన్వితా! మీ ఇద్దరు వరంగల్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్నప్పటి నుండి ఫ్రెండ్సట కదా! ఎలా ఫ్రెండ్సయ్యారో, ఆ తర్వాత ఏం జరిగిందో అంతా చెప్పాడు. అను బంధాలు, ఆత్మీయతలు జన్మాంతర బంధాలు. ఏది ఎవరితో ఎంత వరకు కొనసాగాలో అంతవరకు కొనసాగుతుంది."

హైజంప్ చెయ్యాలన్నా , లాంగ్ జంప్ చెయ్యాలన్నా వున్న చోటు నుండి సాధ్యం కాదు. కొంత దూరం వెనక్కి వెళ్లాల్సిందే అలాగే నువ్వు కూడా నీ మనసును ఒక్కసారి వెనక్కి నడిపించుకొని ఆలోచించు...." అంది సంజన.

సంజన చెప్పినట్లు ఒక్కసారి తన మనసును వెనక్కి నడిపిస్తే?

అక్కడ తన 'ప్రేమ'...

గులాబి రెమ్మను, వెన్నెల కొమ్మను కలిపి, ప్రకృతి చిత్రకారుడు ప్రాణం పోసిన అపూరూప చిత్రంలా ప్రత్యక్షం కావటానికి... అదేమైనా యండమూరి లాంటివాళ్లు ఒక నక్షత్రం ఓరగా భూమ్మిదకి వంగి రహస్యం చెబుతున్న వేళ ఒంటరిగా తన గదిలో మేల్కొని... బయట వెన్నెల్లో ఆడుకునే అక్షరాలను తన కలంలో బంధించి, వాటిని కాగితాలపై ఒక్కొక్కటిగా పేర్చుకుంటూ భావుకత్వమూ, సెంటిమెంటూ, కవిత్వమూ కలగలిపి రాసిన మధురకావ్యమా?

"ఏముంది సంజనా ఆలోచించటానికి?" అంది మన్విత.

"దీక్షిత వల్ల అతనెంతబాధ పడ్డాడో అతని వల్ల నువ్వు కూడా అంతే బాధపడి వుంటావని అతని బాధ. ఈ బాధే అతన్నెక్కువగా క్రుంగ దీస్తోంది... నువ్వు అంగీకరిస్తే అతను నిన్ను పెళ్లి చేసుకుంటానంటున్నాడు. అతను కూడా నీతో మాట్లాడతాడట..." అంది సంజన.

"నేను ఒకప్పుడు అతన్ని ప్రేమించానేకాని ఇప్పుడు పెళ్లి చేసుకోటానికి సిద్ధంగా లేను... నువ్వన్నట్లు నా మనసుని వెనక్కి నడిపించుకొని ఆలోచించాలంటే నాకు ఏకాంతం కావాలి... అది ఎలాంటి ఏకాంతమంటే నాలోకి నేను చూసుకోగలిగేంత ఏకాంతం... నాకంత తీరిక ఎక్కడుంది?" అంది మన్విత.

"అలాంటప్పుడు ఎందుకు ప్రేమించావ్?" అంది కోపంగా సంజన

"నీ కెలా చెప్పాలో నాకర్థం కావటం లేదు సంజనా? చరిత్రలో ప్రేమించిన వాళ్లంతా పెళ్లిళ్లు చేసుకున్నారా? చేసుకోవాలనేమైనా రూలుందా? అయినా టైె వేస్ట్ చేసుకుంటూ... మానసికంగా ఆధారపడ్తూ, మనసును చిద్రం చేసుకునే ఆ 'ప్రేమ' గురించి ఆలోచించేంత ఆసక్తి ఇప్పుడు నాకు లేదు. నాదృష్టి అంతా పేషంట్ల మీదనే వుంది. వాళ్లకి నేను కావాలి... అదే నాకు కావాలి... నేను ఆశించేది కూడా అదే..." అంది మన్విత.

"చూడు మన్వితా! మనిషిని గెలుపు వరించినంత సులభంగా 'ప్రేమ' వరించదు. అది వరించాలంటే దాని ముందు మోకరిల్లాలి... ప్రాధేయపడాలి... నిరీక్షించాలి... ఏ మాత్రం అవకాశం దొరికినా దాన్ని గెలుచుకోవాలే కాని... తృణీ కరించ కూడదు. సృష్టి రహస్యమంతా దాని చుట్టే తిరుగుతోంది. బైదిబై అతని మెంటల్ కండిషన్ కూడా నీ స్థాయిలోనే ఎదిగి వుంది కాబట్టి నీ పేషంట్లకి వచ్చే నష్టమేం లేదు... ఆ సేవేదో ఇద్దరు కలిసి చేయండి!" అంది సంజన.

"ప్లీజ్! సంజనా! నా అభిప్రాయాలు, నీ అభిప్రాయాలు ఇప్పట్లో కలవ్వు... ఈ టాపిక్‌ని ఇంతటితో వదిలేద్దాం..." అంది మన్విత

"మరి తోడు లేకుండా ఈ వయసులో... ఎంత కాలం ఇలా ఈ ఒంటరి ప్రయాణం? మేమంతా ఇలా వుంటే నువ్విలా వుండటం మాకు బాధగా వుంది." అంది సంజన.



"వివేకానందుడు, మదర్‌థెరిస్సా అలా అనుకోలేదేమో సంజనా! అందుకే ఒంటరి వాళ్లమన్న ఆలోచన వాళ్లకి వచ్చి వుండదు." అంది మన్విత.

ఆ మాటతో... నిజంగానే తమ అభిప్రాయాలు కలవ్వేమో ననిపించి 'బై' చెప్పి కాల్ కట్ చేసింది సంజన

* * * * *

వివేకానందరెడ్డి పాకాలలో వున్న ఆస్తుల్ని అమ్ముకొని, భార్యతో సహా హైదరాబాద్ చేరుకున్నాడు.

పల్లెటూర్లలో బోర్ కొట్టి సిటీకెళ్లిన వాళ్లలో వాళ్లొకరు.

ఇక ఆయనకి పాకాలలో మిగిలింది ఆ హాస్పిటల్ ఒక్కటే.

అది కూడా అమ్మే ఆలోచనలో వున్నాడు.

పెద్దవాళ్ల ఆశయాలకు తిలోదకాలు ఇవ్వాలని కాకపోయినా తను చేయబోయే పనులకి కొంత డబ్బు కావలిసి రావటంతో అతనా నిర్ణయం తీసుకున్నాడు.

డా॥ ధీరజ్‌రెడ్డి సిటీకి వెళ్లాక అక్కడ పేషంట్ల బిజీలో పడిపోయాడు. డా॥ సంజన పరిస్థితి కూడా అలాగే వుంది.

అందుకే వాళ్లు పాకాలలో వుండే హాస్పిటల్‌ని వివేకానందరెడ్డి ఇష్టానికే వదిలేశారు.

మన్వితకి విషయం తెలిసి ఏం చేయాలో అర్థం కాని స్థితిలో వుంది.

వర్ధనమ్మ కూడా అయోమయంలో పడిపోయింది.

ఇన్నాళ్లూ... వాళ్లు పేషంట్లకు దయను పంచారే కాని, ధనార్జనను లక్ష్యంగా పెట్టుకోలేదు.

మనిషికి ధనం కన్నా విలువైనవి ఎన్నో వున్నాయి. అయితే వాటిల్లో దేనిని అందుకోవాలన్నా మనిషికి కావలసింది ధనమే అని అర్థమై బాధ పడ్డారు.

జీవితం మళ్లీ వాళ్లను భయ పెట్టడం మొదలు పెట్టింది.

* * * * *

డాక్టర్స్ అసోసియేషన్ వాళ్లు ఓ కాన్ఫరెన్స్ పెట్టడంతో ఆ సందర్భంగా డా॥ మన్విత హైదరాబాదు వెళ్లింది.

కాన్ఫరెన్స్ అయిన వెంటనే డా॥ మన్వితను డా॥సంజన తన కార్లో తన ఇంటికి తీసికెళ్లింది.

"నెక్స్ట్ ఏం చేయాలనుకుంటున్నావు మన్వితా! హైదరాబాద్ వచ్చెయ్య రాదూ! అందరం ఒకే చోట వుండొచ్చు... మా హాస్పిటల్లో నీకో సీటు ఎప్పటికి వుంటుంది..." అంది డా॥ సంజన.

అక్కడే కూర్చుని బాబుని ఆడిస్తున్న సత్యాదేవికి కోడలి మాటలు సమంజసంగా అన్పించాయి.

మాట్లాడలేదు డా ॥ మన్విత.

బయట కారు దిగిన వివేకానందరెడ్డి, డా॥ అనురాగ్ మాట్లాడుకుంటూ నేరుగా లోపలకి వచ్చారు.

"సత్యా! పాకాలలో వుండే మన హాస్పిటల్‌ని డా॥ అనురాగ్ కొన్నారు. రిజిస్ట్రేషన్ కూడా చేయించారు. ఎవరి పేరు మీదనో తెలుసా? డా॥ మన్విత పేరు మీద..." అన్నాడు వివేకానందరెడ్డి

షాక్ తిన్నది డా॥ సంజనతోపాటు డా॥ మన్విత

షాక్‌లోంచి మన్విత తేరుకునే లోపలే ఆమెను చదవాలని చూస్తున్నాడు అనురాగ్.

నన్ను చదివే చాన్స్ నేనెవరికి ఇవ్వను అన్నట్లుగా వుందామె ఫేస్ చూస్తుంటే... నిండు గోదావరికి ఆమెకి పెద్ద తేడా కన్పించటం లేదు. నిశ్చలమైన, ప్రశాంతమైన మనస్సే మనిషికి గొప్ప భాగ్యమేమోనని ఆమె నలా చూస్తుంటే అన్పిస్తోంది.

డా॥ అనురాగ్‌కి మాత్రం ఇప్పుడు చాలా తృప్తిగా వుంది.

ఎంతసారవంతమైన భూమినైనా దున్నక పోతే ముళ్ల పొదలే మొలుస్తాయి. మనసు కూడా అంతే! అందులో దయ అనే బీజాన్ని వేసి



దాన్ని బ్రతికించుకోవాలి... వ్యక్తి ఔన్నత్యానికి కొలబద్ద మేదస్సు కాదు. దయగల హృదయం... అది డా॥ అనురాగ్‌లో కన్పిస్తూ అక్కడున్న అందర్నీ కదిలించింది.

వివేకానందరెడ్డి తన ఆఫీసు రూంలోకి వెళ్లాడు.

డా॥ అనురాగ్ కార్లో ఏదో మరచిపోయి అప్పుడే గుర్తొచ్చినట్లు కారు దగ్గరకి వెళ్లాడు అతనలా వెళ్లగానే...

"నాకిదేం నచ్చలేదు సంజనా!" అంది మన్విత సీరియస్‌గా. అర్థం కానట్లు చూసింది సంజన.

"అంత పెద్ద ప్రాపర్టీని అతను నా పేరు మీద కొనటం ఏమిటి? ఇది మీకెలా అన్పిస్తుందోకాని నాకయితే నచ్చలేదు. ఇలాంటివి ఎక్కడైనా తల్లి పేరుతో, భార్య, పిల్లల పేరుతో చేస్తారు..." అంది మన్విత.

"అది నీ పేరుతో కొనటమే బాగుంది. ఎందుకంటే ఫ్యూచర్లో డా॥ అనురాగ్ కూడా ధీరజ్ లాగే బయటకెళ్లిపోవచ్చు... అప్పుడు ఈ ప్రాబ్లమ్ మళ్లీ మొదటికి వస్తుంది. అలా జరక్కూడదన్న మంచి ఉద్దేశ్యంతోనే అతను నీ పేరుతో పెట్టాడు. వ్యాధిగ్రస్తులైన పల్లె ప్రజల పట్ల నీ సిన్సియారిటీని, డెడికేషన్ని అందరు అర్థం చేసుకుంటారు. కానీ... దానివల్ల ఉపయోగం లేదు. దాన్ని బ్రతికించాలని చూస్తున్నాడు అనురాగ్. దాన్ని నువ్వు అర్థం చేసుకో... చరిత్రలో ప్రేమ పేరుతో సమాదులు కట్టించిన వాళ్లున్నారు... ఇలా హాస్పిటల్‌ని బహుమతిగా ఇచ్చిన వాళ్లు లేరు..." అంది సంజన.

డా॥ అనురాగ్ లోపలకి వచ్చాడు.

రాగానే హాస్పిటల్‌కి సంబందించిన డాక్యుమెంట్స్‌ని డా॥ మన్విత చేతిలో వుంచుతూ..."డా॥ ధీరజ్ లేక పోవడం వల్ల నీలో కలిగిన బాధను నేను అర్థం చేసుకున్నాను. ఈ క్షణం నుండి ఆయన ప్లేసులో నేనుంటున్నాను." అన్నాడు డా॥ అనురాగ్.

కదిలిపోయింది డా॥ మన్విత డా॥అనురాగ్ వ్యక్తిత్వం ఆమెకు ఎంతో ఎత్తులో కన్పించింది.

అమూల్యమైన వస్తువుని చూసినట్లు ఆ డాక్యుమెంట్స్‌ని చూస్తున్న ఆమెకు అందులో డా॥ అనురాగ్ అభిమానంతోపాటు ఎందరో పేషంట్ల శారీరక అవస్థల్ని తీర్చే ధన్వంతరి కన్పించింది... అనురాగ్‌కి మాత్రం ఆమె కళ్లలోని సన్నటి కన్నీటి చెమ్మ కన్పించింది.

జీవితాన్ని మృధువుగా నిమిరే చాతుర్యం గల డా॥ అనురాగ్ తను ఏ ఉద్దేశ్యంతో స్టేట్స్ వెళ్లి చదివాడో... ఆ చదువుకి సార్థకత దొరికినట్లు డా॥ మన్విత వైపు చూశాడు.

ఒక్కక్షణం..."తానోడినేగెలిచానా లేక నేనోడి తను గెలిచిందా!" అని మనసులో అనుకుంటూ... ఇద్దరి గెలుపు పేషంట్లలో చూసుకోవాలనుకొని...

"రండి డా॥మన్వితా! పాకాల వెళ్దాం..." అంటూ కారు వైపున నడిచాడు. అనురాగ్

"ఓ.కె...బై ఆంటీ! బై సంజనా!" అంటూ అక్కడే ఆడుతున్న బాబు బుగ్గ గిల్లి –డా॥ అనురాగ్‌ని ఫాలో అయింది డా॥ మన్విత.

*-: అయిపోయింది :-*